
రామాయణం

# రామాయణ తరంగిణి-2



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

# శ్రీరామాయణ తరంగిణి

విష్ణుతీర్థాది పంచకము
రెండవ భాగము


రచయిత:

**పోలూరి హనుమజ్జానకీరామ శర్మ** B. A. (Hons)

ప్రాచ్యభాషా విభాగాధ్యక్షుడు

శ్రీ వేంకటగిరిరాజ కళాశాల, నెల్లూరు.



1984 జులై    మూల్యము: రూ. 15/-

ప్రథమ ప్రకాశనము : జులై 1984.

ప్రతులు : 1000

ప్రకాశకులు :

శ్రీ రామకృష్ణ సేవా సమితి (రిజిస్టర్డు)

కాసుఖేలవారి యగ్రహారము

నెల్లూరు - 524 001.

ప్రతులు దొరకు చోట్లు :

**(1) శ్రీ శంకర్ పబ్లిషింగ్ హవుస్**

బుక్ సెల్లర్సు అండ్ స్టేషనర్సు

నవాబుపేట, నెల్లూరు - 524 002.

ఫోన్ : నెం. 3962

**(2) శ్రీ వివేకానంద విద్యాలయము**

4/120 ముకుందపురము

నవాబుపేట, నెల్లూరు - 524 002

కమలాంబిక ప్రెస్ - నెల్లూరు.

# విషయ సూచిక

## శ్రీరామాయణ తరంగిణి

## రెండవ భాగము


| | | పుటలు |
|---|---|---|
| 2. విష్ణు తీర్థము | — — | 1—39 |
| 1. ఋష్యశృంగ ఘట్టము | — — | 1—18 |
| 2. శ్రీరామాది జననఘట్టము | — — | 18—39 |
| 3. యజ్ఞతీర్థము | — — | 39—75 |
| 1. తాటకా సంహార ఘట్టము | — — | 38—64 |
| 2. యజ్ఞరక్షణ ఘట్టము | — — | 64—75 |
| 4. కళ్యాణ తీర్థము | — — | 75—141 |
| 1. కుశవంశకథా ఘట్టము | — — | 75—88 |
| 2. గంగావతరణ ఘట్టము | — — | 88—97 |
| 3. అహల్యా శాపవిమోచన ఘట్టము | — | 97—108 |
| 4. విశ్వామిత్ర చరిత్ర ఘట్టము | — — | 108—131 |
| 5. వివాహ ఘట్టము | — — | 131—141 |
| 5. భార్గవ తీర్థము | — — | 142—166 |
| 1. అయోధ్యా ప్రస్థాన ఘట్టము | — — | 142—145 |
| 2. విష్ణుధనుః పరీక్షా ఘట్టము | — — | 145—159 |
| 3. గృహప్రవేశ ఘట్టము | — — | 159—166 |
| 6. ప్రత్యక్ష దేవతా తీర్థము | — — | 166—221 |
| 1. అభిషేక సంరంభ ఘట్టము | — — | 166—180 |
| 2. వర ప్రదాన ఘట్టము | — — | 180—194 |
| 3. పితృవాక్య పాలన ఘట్టము | — — | 195—221 |

శ్రీరస్తు

# స్తుతి

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్।
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే॥

శ్లో॥ వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యేపుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్।
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం।
వ్యాఖ్యాన్తం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్॥

శ్లో॥ నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై।
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః॥

శ్లో॥ యత్ర యత్ర రఘునాథకీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్।
బాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాన్తకమ్॥

శ్లో॥ కూజన్తం రామ రామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్॥

శ్లో॥ యః కర్ణాంజలిసంపుటై రహరహ స్సమ్యక్పిబత్యాదరాత్
వాల్మీకే ర్వదనారవిన్దగళితం రామాయణాఖ్యం మధు।
జన్మవ్యాధిజరావిపత్తిమరణై రత్యంతసోపద్రవం
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్॥

శ్లో॥ వాల్మీకి గిరిసంభూతా రామసాగరగామినీ।
పునాతు భువనం పుణ్యా రామాయణ మహానదీ॥

# తొలి పలుకులు

ప్రియమిత్రుఁడు శ్రీ బొమ్మిశెట్టి ఎల్లమందయ్యా, బి. ఏ. యొక్క ప్రేరణమున శ్రీ రామకృష్ణ సేవా సమాజ యాజమాన్యము నందు 26-10-74 నుండి 14-12-75 వఱకును జరిగిన ఏఁబదియొక్క యుపన్యాసములలో పంద్రెండు వాల్మీకి తీర్థముగా దుందుభి అధికాశ్వీజమున ప్రకటించితిమి. ఇప్పుడు తరువాత యెనిమిది యుపన్యాసములు రెండవభాగముగా ప్రకటించుచున్నాము. శ్రీరామచంద్రుని యనుగ్రహమున తక్కిన యుపన్యాసములు కూడ త్వరలో ప్రకటింపఁబడు నని ఆసించుచున్నాను.

సమాజకార్యదర్శి, ప్రియశిష్యుఁడు చి॥ శివరాజు నరసింహారావు బి. ఏ. బి. టి. ఉపన్యాస కార్యక్రమము **గాక** గ్రంథప్రకాశనము నందు కూడ తోడ్పడుచున్నాఁరు. ఇనమడుగులోని శ్రీశ్రీశ్రీ సత్యానందమహర్షులవారి ప్రియాంతేవాసి శ్రీశ్రీశ్రీ బ్రహ్మానందతీర్థస్వామి వారు ఈ గ్రంథ ప్రకటనమును మిగుల ప్రోత్సహించిరి. ముద్రణ వ్యయభారమును శ్రీ బొమ్మిశెట్టి ఎల్లమందయ్య B. A., వీరి తమ్ముడు శ్రీ బొమ్మిశెట్టి వీరరాఘవులుగారు వహించిరి. ఈ రెండవ భాగమున విద్వాన్ చి॥ సాంప్రతి గోపన్న సాధుప్రతిని తయారు చేయుటలో సాయమొనర్చిరి. చి॥ మాచవోలు శివరామప్రసాదు, యమ్.ఏ. ప్రూపులు దిద్దుటలో తోడ్పడెను. మా అల్లుడు చి॥ బద్దెపూడి రామనాథశర్మ బి. యస్‌సి, ప్రూపులను దిద్దుటయే కాక తప్పొప్పుల పట్టికనుకూడ తయారుచేసెను. చి॥ మామిడిపూడి పట్టాభిరామన్ యమ్. యస్ సి. "బ్లాకు" చేయుటకు వీలుగా గ్రంథకర్త పేరును చిత్రీకరించి

యిచ్చినారు. కమలాంబిక ముద్రణాలయాధికారులు శ్రీ పద్మనాభంగారు, చి॥ రంగనాథము అచ్చుటి కార్యకర్తలును ఎంతో శ్రద్ధతో గ్రంథమును ముద్రించిరి. వీరి కందఱకును శ్రీరామ చంద్రుడు ఆయురారోగ్యైశ్వర్యములను జ్ఞానసంపదను ప్రసాదించుచు గాక అని ప్రార్థించుచున్నాను.

నెల్లూరు — బుధవిధేయుఁడు

రక్తాక్షి, ఆషాఢము — పోలూరి హనుమజ్జానకీరామశర్మ.

జులై 1984.

# శుభాశీస్సులు

**శ్రీ సత్యానందమహర్షులవారు**
శ్రీ సత్యానందాశ్రమము
ఇనమడుగు - నెల్లూరు జిల్లా.

శ్రీరామచంద్రుడు ధర్మమూర్తి, "వేదైశ్చ సమ్మితమ్" వేద తుల్యమైన శ్రీమద్రామాయణములోని శ్రీరాముని దివ్యచరితమునందలి ధర్మ ప్రాధాన్యతను తదనుగుణముగ శ్రీరామచంద్రుని ధార్మిక జీవనమును ప్రతిసందర్భమునను శ్రీ వాల్మీకిమహర్షి స్పష్టీకరించుచున్నారు.

శ్రీ రామభద్రుడు తల్లి దండ్రులయెడ అధికభక్తియు, సోదరుల యెడ పరమ ప్రీతియు, ప్రజలయెడ వాత్సల్యముకలిగి తాను ధర్మముల నాచరించుచు, అన్యులచేత ఆచరింపచేయుచు, ఆదర్శమహామూర్తియై ప్రకాశించెను.

శ్రీ వాల్మీకిమహర్షి శ్రీ మద్రామాయణములో రచించిన అతి రహస్యములగు ధార్మిక విషయములను బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మగారు వారి యేబదియొక్క ఉపన్యాసములలో తెలుగులో తేటతెల్లముగ అతిజాగరూకతతో శ్రోతల హృదయములను రంజిల్లజేయుచు వివరణాత్మకముగ ఉపన్యసించిరి. ఆ ఉపన్యాసములలోని కొన్నిటి సారాంశమును "శ్రీరామాయణతరంగిణి" ప్రథమ భాగము 1983 వ సంవత్సరము జనవరి నెలలో ప్రచురింపబడినది. అందు వాల్మీకి తీర్థ వివరణము అత్యద్భుతముగ జరిగనది. ఇప్పుడు ద్వితీయ భాగము వెల్వడలుట సంతోషదాయకము.

ఈ ద్వితీయ భాగములో విష్ణుతీర్థము, యజ్ఞతీర్థము, కళ్యాణి తీర్థము, భార్గవ తీర్థము, ప్రత్యక్షదేవతాతీర్థము, అను అయిదు తీర్థముల వివరణము విపులముగ గావింపబడి జిజ్ఞాసులోకమునకు అందింపబడుచున్నది. కాన ఈ ఉత్తమ గ్రంథమును పాఠకులు శ్రద్ధతో పఠించిన మానవజీవితమునకు సర్వోత్కృష్ట లక్ష్యమైన ధర్మమును గ్రహించి అనుష్ఠించి కృతార్థులగుదురని మాదృఢవిశ్వాసము. ధర్మాచరణమువలన మానవుడు భౌతికాధ్యాత్మిక శ్రేయములను పొందగలడు. ఈ ద్వితీయ భాగములో శ్రీరామచంద్రుని సత్యవ్రతము, పితృవాక్యపరిపాలనా దీక్ష కొట్టవచ్చినట్లుగనప్పట్టుచున్నది. సీతారాముల అనంత కృపవలన, మా యనంతాశీర్వాదమువలన మున్ముందు రాబోవు భాగములు కూడ ప్రకాశములోనికివచ్చి, జనావళికి ధర్మప్రబోధ మొనర్చుగాక! ఈ గ్రంథ రచయిత శ్రీ హనుమజ్జానకీరామశర్మగారికి మా హృదయ పూర్వక ఆశీర్వాదములు.

———

శ్రీరామ

# శ్రీ రామాయణ తరంగిణి

## 2. విష్ణుతీర్థము

### 1. ఋష్యశృంగఘట్టము

విష్ణుదేవుఁడు వేదధర్మ స్వరూపుఁడు. ధర్మరక్షణమునకై ఆయన అవతరింపఁ బూనినపుడు పవిత్రమైన వంశముననే జన్మించును. వేద ధర్మములను స్మృతిరూపమున మానవలోకమునకు అందించి, అవి చక్కఁగా అనుష్ఠింపఁబడుటకై రాజ్యపాలనవిధానమును మొట్ట మొదట అయోధ్యయందు ప్రారంభించిన మహనీయుఁడు మనువు. మనువంశమే మొదటి రాజవంశము. కావున ఆ మనువంశముననందే విష్ణుదేవుఁడు అవతరించెను. అందువలన ఆ రాజవంశముయొక్క మహత్త్వవర్ణనముతో వాల్మీకి కావ్యమును ఆరంభించెను.

కుశలవులు కావ్యము నిట్లు గానముచేయ మొదలిడిరి. "ప్రజాపతి యైన మనువుతో ఆరంభమైన యిక్ష్వాకువంశరాజులకు, సకలరాజవంశ ములకన్న ముందుగా, సమస్తమైన యీభూమి సొంతమై యుండెను. జయశాలులైన యా భూపాలకులలో సగరుఁడు ప్రసిద్ధుఁ డయ్యెను. ఆయన ఎప్పుడు ఎక్కడికి బయలుదేరినను అఱువదివేలమంది పుత్రులు వెంటనుండెడివారు. వారిచే త్రవ్వఁబడుటచేతనే సముద్రము సాగర మను పేరుతో ప్రసిద్ధ మయ్యెను. అట్టి మహాత్ములైన యిక్ష్వాకులవంశము నందు రామాయణమను నీమహాచరిత్ర పుట్టెను. ధర్మార్థకామ సహిత మైన యీచరిత్ర నంతను మొదటినుండి వినిపించెదము. దీనిని మీరు అసూయ లేకుండ వినవలయును."

శ్లో॥ సర్వాపూర్వ మియం యేషా మాసీత్ కృత్స్నా వసుంధరా ।
ప్రజాపతి ముపాదాయ నృపాణాం జయశాలినామ్ ॥

బాలకాండ - 5 వ సర్గ – శ్లో. 4

గోవిందరాజీయ టీక – ప్రజాపతిం మనుం, "మనుః ప్రజాపతేః పూర్వ మిక్ష్వాకు స్తు మనో స్సుతః" ఇతి వక్ష్యమాణత్వాత్। సర్వా పూర్వం, సర్వేషా మితరేషాం రాజ్ఞా మపూర్వం, దుర్లభం, యథా భవతి తథా ఆసీత్, స్వమ్ ఆసీ దిత్యర్థః।

శ్లో॥ యేషాం స సగరో నామ సాగరో యేన ఖానితః।
షష్టిః పుత్రసహస్రాణి యం యా న్తం పర్యవారయన్ ॥ 2
తిలకటీక:— జగత్పవిత్రీకరణసమర్థా గంగా యద్వంశ్యేన అవ తారితా ఇతి వ్యజ్యతే।

శ్లో॥ ఇక్ష్వాకూణా మిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనామ్।
మహ దుత్పన్న మాఖ్యానం రామాయణ మితి శ్రుతమ్ ॥ 3

శ్లో॥ త దిదం వ ర్తయిష్యావః సర్వం నిఖిల మాదితః।
ధర్మకామార్థసహితం శ్రోతవ్య మనసూయయా ॥ 4

గో. టీక :- అనసూయయా – ప్రేక్షావద్భి రత్ర అసూయా న క ర్తవ్యా, కిం తు భక్త్యా ఏవ శ్రోతవ్యమ్, ఇతి భావః। అనసూయవః అధికారిణః।

ఇచ్చట సాగరమును పేర్కొనుటవలన ఈ రాజవంశమువలననే గంగ భూమికి దిగివచ్చిన దనువిషయము సూచింపఁబడుచున్నది.

ఈ కావ్యము ధర్మకామార్థసహిత మైనది. కావున నిది పురుషార్థ ప్రదము. కవి ఇందు మోక్షమును చెప్పలేదు. తై త్తిరీయోపనిష త్తు నందు చెప్పఁబడిన వేదసారమైన ధర్మానుశాసనమునందు కూడ మోక్ష ప్రసంగము లేదు. కాని ఆ ధర్మానుశాసనముయొక్క అనుష్ఠానముచేత మోక్షము సిద్ధించు ననుట స్పష్టము. అట్లే ఈ కావ్యమునందును వాచ్య ముగా ప్రతిపాదింపఁబడునవి ధర్మార్థకామములే. అవి ఎల్లరకును ఎప్పు

డును బోధింపఁదగినవి. మోక్షోపాయమైన తత్త్వజ్ఞానము మాత్రము దానియందు ఇచ్ఛకలిగి ప్రశ్నించువానికి మాత్రమే బోధింపఁదగినది. అయినను ధర్మార్థకామములనుగూర్చి భావించుటవలన, అనుష్ఠించుట వలన సజ్జనులకు చిత్తము క్రమముగా పరిశుద్ధమై ప్రపంచముయొక్క, మానవజీవితముయొక్క తత్త్వమును తెలిసికోవలయు ననుతలంపు కలుగును. ఇట్టి తలంపును కలుగఁజేయుభావములు ఈకావ్యమునందు దశరథుని పుత్రవియోగదుఃఖము, శ్రీరాముని సతీవియోగదుఃఖము, మొదలగు ఘట్టములలో కొల్లలుగా నున్నవి. వీనివలన తత్త్వజిజ్ఞాస కలిగినవారు గురువులవలన తత్త్వజ్ఞానమును కూడ ఈ కావ్యమునుండియే పొందఁగలరు. కావున ధర్మానుష్ఠానగమ్యమైన మోక్షము కూడ ఈ కావ్యమునందు ప్రయోజనమే.

"అసూయ లేకుండ వినవలయును" (శ్రోతవ్య మనసూయయా) అనుటచే అసూయారహితులే ఈకావ్యశ్రవణమునందు అధికారు లని స్పష్టము గావింపఁబడినది. ఎందఱో మహారాజులు మహర్షులు బ్రహ్మర్షులు ఉండఁగా రామునిచరితమే యెందులకు కావ్యముగా రూపొందవలయు నని కాని, వాల్మీకియే ఎందులకు ఆదికవి అను కీర్తినిపొందవలెనని కాని శ్రోతలు సంకోచమును పొందరాదు. ఆ సంకోచమే అసూయ. అట్టి అసూయకలవారు ఈ కావ్యమును చక్కఁగా గ్రహింపలేరు; ఇందలి రసమును ఆస్వాదింపలేరు.

పిమ్మట వాల్మీకి కోసలదేశమును, అయోధ్యను వర్ణించెను. సరయూనదికి దక్షిణముగా ఉత్తరముగా రెండుతీరములందును కోసలము అనుపేరుగల గొప్ప జనపదము వ్యాపించి యుండెను. అందు ధనధాన్యములు పుష్కలముగా నుండెను. మనువు స్వయముగా నిర్మించిన యయోధ్య అను పురము ఆ జనపదమునందు ప్రసిద్ధమై యుండెను. అది పండ్రెండు యోజనములు పొడవు మూఁడుయోజనములు వెడల్పు

కలిగియుండెను. అందు చక్కఁగా విభజింపఁబడిన పెద్దమార్గములు కలవు. ఆ నగరమున వధూనాటకసంఘములు కూడ ఉండెను. ఎల్ల యెడల ఉద్యానవనములు మామిడితోఁటలు విలసిల్లుచుండెను. ఆ నగరమునకు చుట్టును ఒడ్డాణమువలె పెద్దప్రాకార ముండెను. మధ్యలో కేంద్ర స్థానమున రాజగృహమును, దానికి నాలుగువైపుల రాజవీథులను, ఒక వీథికి మఱియొక వీథికి మధ్య అవకాశమును కలిగియున్న యా పురము సారెలతో జూద మాడుటకు ఉపయోగించుపలకవలె నుండెను. అది ఏడంతస్తుల మేడలతో సర్వవస్తురత్నసమన్వితమై శోభిల్లుచుండెను.

శ్లో॥ కోసలో నామ ముదిత స్స్ఫీతో జనపదో మహాన్।
నివిష్ట స్సరయూతీరే ప్రభూతధనధాన్యవాన్॥ 5

గో॥ టీక : సరయూనామకనద్యా ఉభయతీరే (తీరయోః) నివిష్టః।

శ్లో॥ అయోధ్యా నామ నగరీ తత్రాసీ ల్లోకవిశ్రుతా।
మనునా మానవేంద్రేణ యా పురీ నిర్మితా స్వయమ్॥ 6

శ్లో॥ ఆయతా దశ చ ద్వే చ యోజనాని మహాపురీ।
శ్రీమతీ త్రీణి విస్తీర్ణా సువిభక్తమహాపథా॥ 7

శ్లో॥ వధూనాటకసంఘై శ్చ సంయుక్తాం సర్వతః పురీమ్।
ఉద్యానామ్రవణోపేతాం మహతీం సాలమేఖలామ్॥ 12

గో॥ టీక : సర్వత్ర పుర్యాం వధూనాం యే నాటకాః నర్తయి
తారః తత్సంఘైః సంయుక్తాం। సాలః ప్రాకారో
మేఖలా మేఖలావత్ ఆవరణభూతా యస్యా స్తామ్।

శ్లో॥ చిత్రా మష్టాపదాకారాం వరనారీగణై ర్యుతామ్।
సర్వరత్నసమాకీర్ణాం విమానగృహశోభితామ్॥ 16

(బాలకాండ సర్గ 5)

గో॥ టీక : అష్టౌపదాని స్థానాని యస్య తత్ అష్టాపదమ్।
"అష్టాపదం శారిఫలమ్" ఇత్యమరః (శారిఫలము అనఁగా సారెలతో జూదమాడు పలక) తదాకారాం-మధ్యేరాజగృహామ్ చతుర్దిక్షు రాజవీథయః తన్మధ్యేషు అవకాశశ్చ, ఏవంవిధసంస్థానా మిత్యర్థః

వధూనాటకసంఘము లనఁగా నేమి? వధువు లనఁగా కన్యలు లేక స్త్రీలు. వారిని నటింపఁజేయువారు నాటకులు. అనఁగా వారు వెనుకటి సూత్రధారులవంటివారో లేక ఇప్పటి చలనచిత్రదర్శకులవంటి వారో అయి యుందురు. వారు ఏర్పఱచు సంఘములు నాటకసంఘములు. ఒక్కొక్క నాటకుఁడు ఒక్కొక్క సంఘమును నడుపుచుండు నని గ్రహింపవచ్చును. ఇట్టి సంఘములు అయోధ్యలో పెక్కు కల వనుట బహువచనముచేత (వధూనాటకసంఘైః) స్పష్ట మగుచున్నది.

నటీవృత్తిని వేశ్యలే అవలంబించుచుండి రని తలంపవచ్చును. ఋశ్యశృంగునికథయందు వేశ్యలు అప్పటికి ఒక కులముగా ఏర్పడి నట్లు స్పష్ట మగుచున్నది. ఎన్నో వృత్తులలో అదియు ఒకవృత్తిగా పరిగణింపఁబడుచుండెను. వారిలో రూపలావణ్యములతోఁబాటు సంగీత నృత్యాభినయములయందు కౌశలము కలిగినవారు నాటకసంఘములలో చేరుచుండి యుందురు.

పెక్కు సంఘము లున్నప్పుడు ఒక సంఘమును మించి మఱి యొక సంఘము ప్రదర్శన లిచ్చి ప్రజలను రంజింపఁ జేయుచుండుట సహజము. ఇట్టి ప్రదర్శనములలో పూర్వకథలలోని సన్నివేశములు, వానికి తగిన పాత్రలు, సంవాదములు పాటలు, నృత్యములు మొదలుగా ఎన్నో అంగము లుండును. వీనికి అన్నింటికిని ఆధారముగా సాహిత్యము ఉండక తప్పదు. సాహిత్య మున్నచో కవిత్వము కూడ ఉండును. అట్టియెడల ఈ రామాయణము ఆదికావ్య మని, వాల్మీకి ఆదికవి యని

చెప్పుట ఎట్లు సమంజస మగును? ఆ ప్రదర్శనములు యక్షగానములవలె వీథినాటకములవలె సంగీతనృత్యప్రధానములై యుండును. పాటలో పదములు నిమిత్తమాత్రము లైనట్లు ఆ సాహిత్యమునందు కవిత్వము రేఖామాత్రముగ ఉండియుండును. ఆ సాహిత్యము కవిత్వముగా, అరచయితలు కవులుగా గుర్తింపఁబడరు. ఈనాఁడు సినిమాపాటలలో కూడ సాహిత్యము లేకపోలేదు. అయినను ఆ సాహిత్యములోని కవిత్వమును మనుచరిత్రాదికావ్యములలోని కవిత్వమువంటి దని గాని, ఆ పాటలను వ్రాసినవారిని పెద్దనార్యునివంటి కవు లని గాని ప్రాజ్ఞులెవరును తలంచుట లేదు. సంగీతమునకు ఉపయోగించు సాహిత్యమునందు పదములకూర్పు శ్రుతికి లయకు అనుగుణముగా నుండును. దానియందు ఛందస్సునకు సంబంధించిన గణములయొక్క కూర్పు అక్షరసంఖ్యానియమము ఉండదు. అందువలన ఛందోబద్ధమైన కవిత్వమును రచించువానినే ముఖ్యముగా కవి యని చెప్పుదురు. తక్కిన వారిని రచయిత లనియో పదకర్త లనియో గేయకారు లనియో పేర్కొందురు.

మఱి యీకావ్యమునందు పాత్రలచేత "ఏతి జీవన్త మానందః" మొదలైన గాథలు ఉదాహరింపఁబడి యున్నవి. అవి ఛందోబద్ధములే కదా! నిజమే. ఇది శ్లోకబద్ధమైన కావ్యము. ఇందు వచనము లేదు. కావున ఇందలి పాత్రల ప్రసంగములు, వారు ఉదాహరించుగాథలు స్మృతివాక్యములు మొదలుగా సకలవిషయములను ఛందోబద్ధముగనే వాల్మీకి రచించెను. అంతమాత్రమున ఆ ప్రసంగములు అంతకు పూర్వము లోకమున అట్లే శ్లోకరూపమున ఉండె నని చెప్పుటకు వీలులేదు. ఒక వేళ అట్టి సూక్తులో గాథలో ఏవేని చెదురుగా అక్కడక్కడ శ్లోకరూపములలో ఉన్నను, వానికి రచయితలు ప్రసిద్ధులై యుండరు. ఎంత ప్రసిద్ధమైన సూక్తికిఁ గాని సామెతకుఁ గాని ఫలానివాఁడు కర్త అని ప్రసిద్ధి యుండదు. సాధారణముగా అవి యన్నియు అజ్ఞాతకర్తృ

కములుగానే యుండును. అదియును గాక ఒక సూక్తినో గాథనో శ్లోకములో పలికినంతమాత్రముననే కవిత్వము సిద్ధింపదు. పెక్కు శాస్త్రగ్రంథములు శ్లోకరూపమునఁ గలవు. కాని వానిని కావ్యములనుగా ఆరచయితలను కవులనుగా మనము భావించుట లేదు. పద్యరచనముతోఁ బాటు రమణీయమైన వస్తువర్ణనము ఉన్నప్పుడే కవిత్వము సిద్ధించును. కావున మహోన్నతమైన రామకథను పెక్కు సన్నివేశములతో బహు పాత్రలచిత్రణముతో రమ్యమైన శ్లోకరచనతో సర్గలవిభాగముతో రసవంతమైన మహాకావ్యమును మానవలోకమున మొట్టమొదట నిర్మించి సకలకవులకును మార్గదర్శకుఁ డగుటచే వాల్మీకి ఆదికవిగా రామాయణము ఆదికావ్యముగా ప్రసిద్ధ మయ్యెను,

అయోధ్యావర్ణనమునకు పిమ్మట వాల్మీకి దశరథుని వర్ణించెను. ఆయన వేదవేత్త, సర్వసంగ్రహశాలి, దీర్ఘదర్శి, పౌరజానపద ప్రియుఁడు, అతిరథుఁడు, యజ్ఞకర్త, సత్యసంధుఁడు. ధర్మార్థ కామములను ఆయన చక్కఁగా అనుష్ఠించుచు ఇంద్రుఁడు అమరావతినివలె, అయోధ్యను పాలించుచుండెను. ధర్మపరుఁడు ఇంద్రియని గ్రహముకలవాఁడును అగుటచేతనే ఆయన మహర్షులతో ఇంచుమించుగా సమానుఁడై రాజర్షియై యుండెను. ఆయనపరిపాలనమున ప్రజలు తమ తమ ధనములచే సంతుష్టులై లోభరహితులు సత్యవాదులు ధర్మాత్ములును అయి యుండిరి. బ్రాహ్మణులు స్వకర్మనిరతులు జితేంద్రియులు దానాధ్యయనశీలురును అయి దానములను గైకొనుట యందు సంయమనము కలవారై యుండిరి. క్షత్త్రియసమాజము బ్రాహ్మణముఖముగా వర్తించుచుండెను. వైశ్యులు క్షత్రియులకు అనువ్రతులై యుండిరి. శూద్రులు మూఁడువర్ణములవారికి ఉపచార మొనర్చుచు స్వధర్మనిరతులై యుండిరి.

శ్లో॥ తస్యాం పుర్యా మయోధ్యాయాం వేదవి త్సర్వసంగ్రహః
దీర్ఘదర్శీ మహాతేజాః పౌరజానపదప్రియః॥ 1

శ్లో॥ ఇక్ష్వాకూణా మతిరథో యజ్వా ధర్మపరో వశీ
మహర్షికల్పో రాజర్షి స్త్రిషు లోకేషు విశ్రుతః॥ 2

శ్లో॥ తేన సత్యాభిసంధేన త్రివర్గ ముపతిష్ఠతా
పాలితా సా పురీ శ్రేష్ఠా ఇంద్రేణే వామరావతీ॥ 5

శ్లో॥ తస్మిన్ పురవరే హృష్టా ధర్మాత్మానో బహుశ్రుతాః
నరా స్తుష్టా ధనై స్స్వై రలుబ్ధా స్సత్యవాదినః 6

శ్లో॥ స్వకర్మనిరతా నిత్యం బ్రాహ్మణా విజితేంద్రియాః
దానాధ్యయనశీలాశ్చ సంయతాశ్చ ప్రతిగ్రహే॥ 13

శ్లో॥ క్షత్రం బ్రహ్మముఖం చాసీ ద్వైశ్యాః క్షత్రి మనువ్రతాః
శూద్రా స్స్వకర్మనిరతా స్త్రీణ్ వర్ణా నుపచారిణః 19

బాలకాండ-సర్గ 6

వాల్మీకినారదసంవాదములో నారదుఁడు రాముని గూర్చి, "వేదవేదాంగతత్త్వజ్ఞుఁడు సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞుఁడు. జ్ఞానసంపన్నుఁడు" అని చెప్పినట్లుగా వాల్మీకి దశరథునిగూర్చి చెప్ప లేదు; పైఁగా ధర్మార్థకామములను సేవించువాఁడు (త్రివర్గ ముపతిష్ఠతా) అని స్పష్టముగా చెప్పెను. అనఁగా దశరథునకు నాల్గవ పురుషార్థమైన మోక్షమునందు ఆసక్తి లేదన్న మాట. దశరథుని ఇంద్రునితో వాల్మీకి పోల్చుట (ఇంద్రేణే వామరావతీ) గమనింపఁదగియున్నది. సాధారణముగా ఇంద్రునకు పదవియందు కాంక్ష అది పోవునేమో అనుభయము, స్త్రీలోలత్వము ఉండునని కథలలో ప్రసిద్ధముగ నున్నది. అహల్యాజారత్వము ఈ కావ్యమునందే వర్ణింపఁబడి యున్నది. ఇంద్రునితో పోలికవలన దశరథుఁడు కూడ పదవిని అధికారమును భోగములను గొప్పగా అభిలషించువాఁడని వ్యక్త మగుచున్నది. ఇంద్రునకు వలె ఈయనకును విష్ణుదేవునియొక్క అనుగ్రహము కలుగు ననియు సూచిత మగుచున్నది.

ఆ రాజ్యమున దైనందినప్రజాజీవనము ప్రభుత్వముపై ఎక్కువగా ఆధారపడి యుండ లేదని పై వర్ణనమున వ్యక్తమగు చున్నది. ధర్మపాలనమున ప్రభువు నిమిత్తమాత్రుఁడు. ఎవరి ధర్మములను వారు అనుష్ఠించునప్పుడు,ఎప్పుడో తప్ప ప్రజలకు ప్రభువుతోఁ గాని ప్రభుత్వయంత్రాంగముతోఁ గాని పని యుండదు. క్షత్త్రియ సమాజము బ్రహ్మముఖముగా వర్తించుచుండెను. అనఁగా క్షత్త్రియ సమాజము అను శరీరమునకు బ్రాహ్మణసమాజము ముఖమువలె నుండెను. వ్యక్తికి ముఖము ఎంత ప్రధానమో క్షత్రియులకు బ్రాహ్మణు లంత ముఖ్యులుగా నుండిరి. బ్రాహ్మణులను గురువులనుగా సేవించుచు వారియాదేశము ననుసరించి క్షత్త్రియులు వర్తించుచుండిరి. మఱి బ్రాహ్మణులకు ముఖ మేది ? వారికి వేదమే ముఖము. వారైనను స్వతంత్రులు కారు. వారు కూడ వేదముచే విధింపఁబడిన యధ్యయనము అధ్యాపనము మొదలగు కర్మలయందు నిమగ్నులై యుండిరి. వారు తమ కున్నంతలో ఇతరులకు ఇచ్చుచు దానశీలురై యుండిరి. అంతే కాదు. ఇతరులవలన ఏదేని తీసికొనవలసి వచ్చినప్పుడు చాల సంకోచమును పొందుచుండిరి (సంయతా శ్చ ప్రతిగ్రహే). ఇతరులను యాచించు స్వభావము లేకపోవుటచేతనే వారు వేదవిహితమైన ధర్మమార్గమును నిర్భయముగా నిస్సంకోచముగా క్షత్త్రియులకు బోధింపఁగలిగియుండిరి.

ఈ విధముగా అన్ని వర్ణములవారును పరస్పరసహకారముతో మైత్రితో దైనందిన జీవితమును గడుపుచుండిరి. ప్రజలకు నిత్యజీవిత మున ప్రభుత్వముతో అక్కఱ లేకుండెను. అందువలననే ఇటీవల వఱకును మనదేశమున ఎన్ని ప్రభుత్వములు మాఱుచుండినను సాధారణ ప్రజాజీవనము వివిధ వర్గముల పరస్పరసహకారముతో సామరస్యముతో ప్రశాంతముగ కొనసాగుచుండెను. ఈ ప్రశాంతి బ్రిటిషు

వారు ప్రవేశపెట్టిన ప్రాంతీయ స్వపరిపాలన (**Local self government**)విధానముతో భంగపడుట ఆరంభ మయ్యెను. ఈ విధానమున ఎన్నికలు ప్రధానసాధనము లయ్యెను. ఎన్నికలలో స్వకులాభిమానము, అన్యకులద్వేషము అనివార్యముగా పైకివచ్చి స్వార్థమువలన ధర్మ దృష్టి అంతరించి అసంతుష్టి, అశాంతి పల్లెలను పట్టణములను ఆక్ర మించెను. అధికారవ్యామోహము కారణముగా కులద్వేషము ప్రబలు చుండఁగా, దానిని గుర్తింపక నేఁటి రాజనీతిపరులు వర్ణములను కులములను నిర్మూలింపవలయు నని తలంచుచున్నారు. ఈ వర్ణములు కులములు ఎన్నో యుగములుగా నున్నవి. కులద్వేషము ఇప్పుడే ఏల యింతగా ప్రబలుచున్నది? ప్రశాంతముగ నున్న వీథియందు ఆహారపదార్థములను పడవేసినచో అంతవఱకును అచ్చట కన్పింపని పిల్లులు కుక్కలు మొదలుగా ఎన్నో జంతువులు పరుగెత్తుకొని వచ్చి ఒకదానితో నొకటి పోరాడుచుండును. వాని సంఘర్షణమునకు మూలము ఆ జంతువులలోని జాతి భేదములు కాదు. వ్యవస్థ లేకుండు టయే అందులకు కారణము. ఆ జంతువులను విడివిడిగా ఉంచి వానికి విడిగా ఆహారము నొసంగినచో అప్పుడు పోరాటమునకు అవకాశ ముండదు. అట్టిదే వర్ణకులవ్యవస్థ. ఒక్కొక్క వర్ణమువారికి ఒక్కొక్కవృత్తి జీవనవిధానము ఏర్పఱచినచో ఒక వర్గము మఱి యొక వర్గముతో ఘర్షణపడవలసిన యావశ్యకత యుండదు.

ఉన్నవ్యవస్థను కాపాడుకొనలేక చక్కదిద్దుకొనలేక జన్మ సిద్ధములైన వర్ణకులభేదములను నిర్మూలింపవలయు ననుట మూర్ఖతయే యగును. జాతిభేదములు మానవులకే పరిమితములు కాదు. జంతువులు, పక్షులు, చెట్లు మొదలగు సకలపదార్థములందును ఎన్నో భేదములు కలవు. వీనిలో అవాంతర జాతులును ఎన్నో కలవు. చెట్లు అన్నియు ఒకజాతియే అనుకొన్నను మామిడి వేరు, మఱ్ఱి వేరు. పశువులు

అన్నియు ఒకజాతియే యైనను బఱ్ఱెలు వేఱు, ఆవులు వేఱు. కావున సృష్టి భేదమయము. భేదములు పోయినప్పుడు సృష్టి యుండదు. మానవుఁడు సృష్టిలోనివాఁడే కాని దానికి అతీతుఁడు కాఁడు. కావున మానవు లందఱు ఒకజాతియే యైనను అందును వివిధవర్ణముల భేదము లుండుట సహజము. చెట్లలోని భేదములను నిరూపించుటకు వృక్షశాస్త్రము (Botony), జంతువులలో భేదనిరూపణముకొఱకు జంతుశాస్త్రము (Zoology) మొదలుగా శాస్త్రము లన్నియు వివిధజాతులలోని యవాంతరభేదములను వాని ధర్మములను నిరూపించుటకే ఏర్పడి యున్నవి. అట్లే వేదములు, ధర్మశాస్త్రములు మానవజాతిలోని యవాంతరభేదములైన వర్ణములను కులములను వాని ధర్మములను నిరూపించుచు సమాజమునకు వ్యవస్థను ఏర్పఱచుచున్నవి. చెట్లలోనో తీఁగెలలోనో జంతువులలోనో క్రొత్తభేదమును (New species) నిరూపించువానికి శాస్త్రజ్ఞశేఖరుఁ డని (Doctor of philosophy) బిరుదము నిచ్చి సమ్మానించుచున్న మనము మానవజాతిలో భేదవిశేషములను నిరూపించువారిని తిరస్కరించుట, ద్వేషించుట ఎంత యశాస్త్రీయమో కొంచెము ఆలోచించిన తెలియఁగలదు. శాస్త్రదృష్టి ననుసరించినచో జంతువులలో జాతిభేదములను నిర్మూలింపవలయు ననుట ఎంత యసంగతమో మానవులలో వర్ణభేదములను నిర్మూలింపవలయు ననుట కూడ అంతే అసంగతము.

దశరథునకు ధృష్టి, జయంతుఁడు, విజయుఁడు, సురాష్ట్రుఁడు, రాష్ట్రవర్ధనుఁడు, అకోపుఁడు, ధర్మపాలుఁడు, సుమంత్రుఁడు అను నెనిమిదిమంది యమాత్యులుండిరి. వీరు గాక వసిష్ఠుఁడు వామదేవుఁడు సుయజ్ఞుఁడు, జాబాలి, కాశ్యపుఁడు, గౌతముఁడు, దీర్ఘాయువైన మార్కండేయుఁడు, కాత్యాయనుఁడు అను నెనిమిదిమంది మంత్రు లుండిరి. వీరిలో వసిష్ఠుఁడు, వామదేవుఁడు మహారాజునకు ముఖ్యులైన ఋత్విజులై యుండిరి. అమాత్యులకును మంత్రులకును చాలభేదము కలదు.

మంత్రులు రాజునకు గురువులు, మహర్షులు. వారు రాజధానికి సమీపమున ఆశ్రమములలో ఉండి తపస్సు చేసికొనుచు పిలిపించినప్పుడు వచ్చి వ్యవహారములను పరిశీలించి శాస్త్రదృష్టిలో కార్యనిర్ణయము గావించి వెడలిపోవుదురు. వారు నిర్ణయించిన కార్యవిధానములను రాజుయొక్క అజ్ఞ ననుసరించి అమాత్యులు నిర్వహింతురు. వీరు ఉద్యోగులు. వీరు ప్రతిదినము కొలువునకు వచ్చి రాజునకు నమస్కరించి అజ్ఞలను స్వీకరించుచుందురు. మంత్రులకు రాజు పాదాభివందనము గావించి వారి యాదేశములను శిరసావహించుచుండును. కావున రాజు కూడ స్వతంత్రుఁడు కాఁడు. ఆయన కూడ వేదవిహితములైన ధర్మములను మహర్షులైన మంత్రులనిర్ణయము ననుసరించి ప్రజలను పాలింపవలసియుండెను.

దశరథుని యమాత్యులయొక్క గుణములు గమనింపఁదగినవి వారు నవ్వుచు మాటలాడుదురు. క్రోధముచేతఁ గాని కామమువలనఁ గాని వారు అనృతమును చెప్పరు. తమ రాష్ట్రమునఁ గాని యన్య రాష్ట్రములలో గాని జరుగుచుండు ముఖ్యసంఘటనములను వారు తెలిసికొనుచుందురు. రాజుయొక్క హితమునందు వారు జాగరూకులై యుందురు. తప్పు చేసినచో వారు కుమారులనైన దండింతురు. శత్రువునైనను తప్పు చేయనివానిని హింసింపరు. బుద్ధిసంపదచేతను పరాక్రమముచేతను వారు విదేశములందును విఖ్యాతులై యుండిరి. వారు అగర్భశ్రీమంతులై ఏ ప్రలోభమునకు లొంగక రాజకీయములైన రహస్యనిర్ణయములను చక్కఁగా కాపాడుచుండిరి.

ఇట్టివారు అమాత్యులైనచో ఎప్పుడైనను ప్రజలు తప్పక సుఖింతురు. ఉన్నతపదవులలో ఈనాఁడు ఇట్టివారు మృగ్యమగుటయే ఇప్పటి దుస్థితికి ఒక ముఖ్యకారణము.

దశరథునకు, కొడుకులకొఱకు తపించుచున్నను, వంశకరుఁడైన పుత్రుఁడు కలుగ లేదు. దానినిగూర్చియే ఆలోచించుచుండఁగా ఆయనకు "నేను అశ్వమేధము ఏల చేయ రాదు" అనుతలంపు కలిగెను. వెంటనే ఆయన అమాత్యులతో ఆలోచించి సుమంత్రునిచేత మంత్రులను పిలిపించెను. వారు వచ్చి ఆయనసంకల్పమును ప్రశంసించిరి. "గురువులు చెప్పినట్లుగా వెంటనే యజ్ఞసంభారములను సమకూర్చి సరయువునకు ఉత్తరమున యజ్ఞభూమిని ఏర్పఱుపుఁడు; ఉపాధ్యాయులతో సమర్థులైన సేనాపతులతో యజ్ఞాశ్వమును సాగనంపుఁడు" అని రాజు అమాత్యులకు ఆజ్ఞయిచ్చెను.

శ్లో॥ సంభారా స్సంభ్రియన్తాం మే గురూణాం వచనా దిహ।
సమర్థాధిష్ఠితాశ్చాశ్వ స్సోపాధ్యాయో విముచ్యతామ్॥ 14
సరయ్వా శ్చోత్తరే తీరే యజ్ఞభూమి ర్విధీయతామ్। 15
బాలకాండ - సర్గ - 8

గో॥ టీక : సరయ్వా ఇతి—అనేన సరయూ దక్షిణతీరే అయోధ్యేతి గమ్యతే

సరయువునకు ఉత్తరతీరమునందు యజ్ఞభూమిని ఏర్పఱుపుఁ డని దశరథుఁడు చెప్పుటవలన సరయువునకు దక్షిణతీరమున అయోధ్య యున్న దని స్పష్టమగుచున్నది. దక్షిణకోసలమే ఇక్ష్వాకువంశీయులకు పరంపరాగతమైన ముఖ్యమైన రాజ్యము. ఈ కారణముచేతనే శ్రీరాముఁడు జ్యేష్ఠపుత్రుఁడైన కుశునకు దక్షిణకోసలము నొసంగి, లవునకు ఉత్తరకోసలము నిచ్చెను.

శ్లో॥ కోసలేషు కుశం వీర ముత్తరేషు తథా లవమ్।
అభిషిచ్య మహాత్మానా వుభౌ రామః కుశీలవౌ॥ 17
ఉత్తరకాండ - సర్గ 107

పిమ్మట సుమంత్రుఁడు ఏకాంతమున రాజుతో నిట్లనెను. "నీ పుత్రప్రాప్తినిగూర్చి సనత్కుమారుఁడు ఋషులసన్నిధిలో నొక కథను చెప్పఁగా నేనువింటిని. కశ్యపుని పుత్రుఁడైన విభాండకునకు ఋష్య శృంగుఁ డను కుమారుఁడు కలుగును. అతఁడు తండ్రిని తప్ప నన్య మెఱుఁగక పెరుగుచుండును. అతనికి బ్రహ్మచర్యమున ద్వైవిధ్యము కలుగును. తన దోషమున కలిగిన యనావృష్టిని తొలఁగించుకొను టకై అంగరాజగు రోమపాదుఁడు మంత్రులనిర్ణయము ననుసరించి, వేశ్యలచే ఋష్యశృంగుని తన రాజ్యమునకు తెప్పించి శాంత నొసం గును. ఆ ఋష్యశృంగుఁడు నీకు పుత్రులు కలుగు విధానము నొనరించును."

బ్రహ్మచర్యమున ద్వైవిధ్య మనఁగా నేమి? ద్వైవిధ్య మనఁగా రెండు విధములుగా నుండుట. బ్రహ్మచర్యము రెండువిధములు. అవి వాహితుఁడైన వటువు గురుశుశ్రూష చేయుచు జరుపువ్రతము ముఖ్య మైన బ్రహ్మచర్యము. వివాహితుఁడైన గృహస్థు కూడ ఋతుకాలము లయందు మాత్రమే భార్యాసంగమమును పొందుచున్నచో బ్రహ్మ చారియే యగును. ఇది గౌణమైన, అనఁగా అప్రధానమైన, బ్రహ్మ చర్యము. స్త్రీలకు రజోదర్శనము మొదలుగా పదునాఱు దినములకు ఋతువు అని పేరు. వీనిలో మొదటి నాలుగు దినములు, అమావాస్య పూర్ణిమ మొదలగు పర్వములు వర్జింపఁదగినవి. ఋతువునందు కూడ తక్కిన దినములలో మాత్రమే భార్యను పొందు గృహస్థు బ్రహ్మ చారియే యగును. కావున ఋశ్యశృంగునకు రెండవదియైన గార్హస్థ్య బ్రహ్మచర్యము కూడ సంభవించు నని యర్థము.

శ్లో॥ నాన్యం జానాతి విప్రేంద్రో నిత్యం పిత్రనువర్తనాత్।
ద్వైవిధ్యం బ్రహ్మచర్యస్య భవిష్యతి మహాత్మనః॥ 5

బాలకాండ - 9 సర్గ

గో॥ టీక : ద్వైవిధ్యం ద్వైధీభావః, స్త్రీసంగకృతో భంగః। యద్వా స్మృతిభిః కథితమ్ ఋతుగమనలక్షణం చ బ్రహ్మచర్యస్య ద్వైవిధ్యం భవిష్యతి। ఆహ యాజ్ఞవల్క్యః

శ్లో॥ షోడశర్తు ర్నిశాః స్త్రీణాం తస్మిన్ యుగ్మాసు సంవిశేత్।
బ్రహ్మచార్యేవ పర్వా ణ్యాద్యా శ్చతస్ర శ్చ వర్జయేత్॥ ఇతి

తి॥ టీక : మేఖలాజినాదిధారణరూపం ముఖ్యం బ్రహ్మచర్యం। దారేషు ఋతుగమనరూపం చ పరంగౌణమ్।

ఆ కథను వివరింపుమనఁగా సుమంత్రుఁ డిట్లు చెప్పెను. ఋష్యశృంగుఁడు స్వాధ్యాయపరుఁడై స్త్రీలను, విషయసుఖముల నెఱుంగక యుండెను. మనుష్యచిత్తమును మథించునట్టి యింద్రియార్థములపూలమున ఋష్యశృంగుని కొనివత్తమని మంత్రిపురోహితులు నిశ్చయించిరి. అంత రాజాజ్ఞచే వారాంగనలు విభాండకునియాశ్రమసమీపమున నొకచో నెలకొని యుండిరి. ఋష్యశృంగుఁ డచ్చటికి యాదృచ్ఛికముగా వచ్చెను. వా రందఱును మధురముగా గానమొనర్చుచు సమీపించి “ఎవరు నీవు” ఇత్యాదిగా ప్రశ్నించిరి. ఇంతకు పూర్వము చూడనియందమైనరూపములు కలవారిని చూడఁగనే తన్నుగూర్చి చెప్పవలయునని తలంపు కలిగి తండ్రివిషయమును చెప్పి వారిని తమ యాశ్రమమునకాహ్వానించెను. వారు అతనివెంట ఆశ్రమమునకు పోయి ఆతనియాతిథ్యమును స్వీకరించి, తాము తెచ్చిన మోదకములను వివిధభక్ష్యములను ఫలమూలము లని చెప్పి యొసంగుచు అతనిని కౌఁగిలించుకొనిరి. అవి యేవో క్రొత్తఫలమూలము లనుకొని వానిని అతఁడు భక్షించెను. వారు వెంటనే విభాండకుని భయమువలన త్వరగా సెలవుగైకొని వెళ్లిరి. వారు వెళ్లినతరువాత అతఁడు అస్వస్థహృదయుఁడై దుఃఖముతో అటునిటు తిరుగఁజొచ్చెను. మఱునాఁడు వారినిగూర్చియే చింతించుచు ఋష్యశృంగుఁడు క్రిందటిదినము పోయినతావునకే వెళ్ళెను. వారు వెంటనే

"మా యాశ్రమమునకు రమ్ము; అట విశేషమైనపూజ నొసంగుదుము," అని పలికిరి, అతఁడు వెంటనే సమ్మతించెను. వారు ఆయనను తీసికొని అంగదేశమునకు పోయిరి. ఆయన అంగదేశమున ప్రవేశింపఁగనే వర్షము వచ్చెను. రోమపాదుఁడు మంత్రిపురోహితాదులతో నెదురేగి యర్చించి యతనిని సాంత్వన మొందించి శాంత నిచ్చి వివాహముఁ గావించెను.

సనత్కుమారుఁడు మఱియు నిట్లుచెప్పెను. "దశరథుఁడు తన పుత్రికయైన శాంతను సఖుఁడైన రోమపాదునకు దత్తపుత్రికగా నొసంగును. పుత్రవంతుఁడైన ఋష్యశృంగుని తీసికొనివచ్చి దశరథుఁ డాతని వలన యజ్ఞము గావించి పలుపురుపుత్రులను బడయును. "కావున నీవు సామాత్యబలవాహనుఁడవై పోయి ఋష్యశృంగుని తీసికొనిరమ్ము.

అంతట దశరథుఁడు వసిష్ఠునకు సుమంత్రుఁడు చెప్పిన విషయమును చెప్పి, ఆయనయనుమతి నొంది, భార్యలతో అమాత్యులతో బయలుదేరి ఋష్యశృంగునొద్ద కరిగెను. దశరథుఁడు రోమపాదుని చెంత ప్రజ్జ్వలించుచున్నయగ్నిహోత్రమువలె నున్న యామహర్షిని జూచి పూజించెను. రోమపాదుఁడు హర్షముతో తమసఖ్యమును సంబంధమును ఋష్యశృంగునకు తెలుపఁగా నతఁడు శ్వశురుని సమ్మానించెను. అక్కడ ఏడెనిమిదిరోజు లుండి దశరథుఁడు "భర్తతోగూడ శాంత మా నగరమునకు వచ్చుఁగాక;పెద్దకార్యమును తలపెట్టితిమి గదా" అని రోమపాదునితోఁ బలికెను. రోమపాదుఁ డంగీకరించి; పోయి రమ్మని యల్లునితో చెప్పెను. అతఁడును వల్లె యనెను. దశరథుఁడు రోమపాదుని కౌఁగిలించుకొని వీడ్కొని బయలుదేరి, నగరము నలంకరింపవలసినదిగా వేగరులగు దూతలను ముందుగా పంపెను. పౌరు లట్లే గావించిరి. పిమ్మట వామనునితోఁ గూడిన మహేంద్రునివలె ఋశ్యశృంగునితో దశరథుఁడు శంఖదుందుభినిస్స్వనములతో సమ్మ్రా

ష్టసిక్త ధూపితమై పతాకాద్యలంకృతమైన యయోధ్యం బ్రవేశించెను. భర్తతో వచ్చిన శాంతను జూచి ఎల్లరు సంతోషించిరి.

ఋష్యశృంగున కిట్లేల సంభవించినది? తాను వేశ్యలను జూచిన విషయము తండ్రికి చెప్పెనా? చెప్పినట్లు లేదు. ఋష్యశృంగుడు అస్వస్థచిత్తుఁడై దుఃఖముతో నటునిటు తిరుగుచున్నప్పుడు తండ్రికి చెప్పకుండ నుండునా? తండ్రి ఏదేని పనిమీఁద కుమారుని వదలి ఎచ్చటికేని పోయి యుండవచ్చును. అట్లయినను వేశ్యలు తమ యాశ్రమమునకు రమ్మని చెప్పినప్పుడు మాతండ్రితో చెప్పివత్తు నని ఋష్యశృంగుడు చెప్పి యుండవలెఁ గదా! ఏల చెప్పలేదు? జన్మలక్షణము కొంతవఱకు కారణము కావచ్చును. ఊర్వశీదర్శనమున విభాండకునకు బ్రహ్మచర్య వ్రతభంగమై ఋష్యశృంగుడు జన్మించెను. వ్రతభంజకచిత్తవృత్తిలో నుదయించినవాఁడు కావున మరల అట్టి వేశ్యాసందర్భ మేర్పడినప్పుడు తదాకర్షణవశమున తండ్రికి చెప్పి బయలుదేరవలయు నను ధర్మము మఱచె నన్నమాట.ఇట్టిది సంభవించు నేమో యనియే, కుమారుని నైష్ఠిక బ్రహ్మచర్యము నిర్విఘ్నముగా కొనసాగఁవలయు నను పట్టుదలతోనే విభాండకుఁడు, ఎవరిని తమ యాశ్రమమునకు రానీక, పుత్రునకు స్త్రీపురుషజ్ఞానము కలుగునవకాశము కూడ లేకుండఁజేసి నిరంతర వేదాధ్యయనతత్పరునిగ, అగ్న్యారాధనపరాయణునిగా మహాతపస్వినిఁగా పెంపొందించుచుండెను. అది దైవయోగమున భంగమొందినది. కుమారుఁడు కన్పింపనప్పుడు ఆయన జరిగినదానిని తపోదృష్టిచే గ్రహించి భవితవ్యము దురతిక్రమ మను భావమున, "ఇదియును మంచికే" యని ఎవరిపైనను కోపపడక పుత్రరూప సంసారమును కూడ వీడి కేవల బ్రహ్మనిష్ఠుఁడై యుండియుండును. దీనినిబట్టి బ్రహ్మర్షులు అఖండితబ్రహ్మచర్యము నెంత ప్రాణపదముగా గ్రహించుచున్నారో యెఱుంగనగును. వారట్లు భావించుచున్నా రన్నచో బ్రహ్మానందానుభవ

మునకు బ్రహ్మచర్య మెంత యావశ్యకమో కూడ మనము గ్రహింప వలసియున్నది.

ఇంక ప్రమాదకృతములై సంభవించిన వేశ్యాదర్శన స్పర్శన మోదకభక్షణాదికములవలన సంభవించిన దురితమును ఋష్యశృంగుఁడే ప్రాయశ్చిత్తమున తపస్సుచే నిర్మూలించుకొనియుండు ననుట స్పష్టము. అట్లే బ్రాహ్మణపత్ని లేకుండ క్షత్రియస్త్రీని పత్నిగా పరిగ్రహించుట వలనిదోషమును గూడ ఆయన తపోబలముననే పరిహరించుకొని యుండు నని గ్రహింపవలసియున్నది. ఎట్లైనను ఇది తనకు అసమ్మత మగుటచే విభాండకుఁడు కుమారుని విషయమునే వదలుకొనె నని చెప్ప వచ్చును. శకుంతలావృత్తాంతము కూడ నిట్టిదే కదా!

## 2. శ్రీరామాదిజనన ఘట్టము

తరువాత కొంతకాలమునకు వసంతము రాఁగా దశరథుఁడు అశ్వమేధమునకై బ్రహ్మనుగా ఋష్యశృంగుని వరించెను; వసిష్ఠ వామదేవాదులను పిలిపించి యజ్ఞమును చేయింపఁగోరెను. అట్లే యని వారు చెప్పిరి. మొదటి వసంతమునందు చైత్రపూర్ణిమయందు సాంగ్రహణేష్టిని గావించి, మఱునాఁడు బ్రహ్మౌదనము, మేధ్యాశ్వ బంధన స్నాపన ప్రోక్షణ విమోచనాదికము నొనర్చి, మఱునాఁటినుండి సావిత్ర్యాది సవనములను గావించుచుండఁగా పదునొకండు మాసములు పూర్తియయ్యెను. ఫాల్గునఅమావాస్యయందే యజనభూమికి పోయి అక్కడ దీక్షను గైకొనవలెను. ఫాల్గున మాసారంభమున మరల వసంతము ప్రాప్త మగుచుండఁగా దశరథుఁడు యజ్ఞము నిర్వహింపు మని వసిష్ఠుని ప్రార్థించెను. బ్రహ్మౌదనము మొదలుకొని అశ్వమేధ పూర్తివఱకు యజమానునకు యజ్ఞప్రదేశమును వదలుటకు వీలు లేకుండుటచే దశరథుఁడు యజ్ఞనిర్వహణ మంతయు వసిష్ఠున కప్ప

గించెను. వసిష్ఠుఁ డట్లే యని యజ్ఞకర్మవిదులైన వృద్ధులను, సంభార ములను దెచ్చుటకై రథకారులను భృత్యులను, శిల్పులను, వడ్రంగు లను, వాపీకూపాదులకై ఖనకులను, గణకులను, నటనర్తకాదులను, శాస్త్రవేత్తలను పిలిపించి, వేలకొలఁది ఇటుకలను తయారుచేయించి రాజునకు ఔపకార్యములు (డేరాలు), బ్రాహ్మణావసథములు, నూర్ల కొలఁదిగా పౌరజనులకు అన్నపానాదిపూర్ణములైన శాలలు, శయ్యా గృహములు, మొదలగు నవి తయారుచేయుఁడని ఆజ్ఞాపించెను.

పిదప ఎల్లవర్ణములవారికి సత్కారపూర్వకముగా అన్నముపెట్ట వలెను, యజ్ఞకర్మలయందు నియుక్తులైనవారికి కూడ సత్కారపూర్వ కముగా అన్నపానాదులను సమకూర్చవలెను అని ఆయన ఆజ్ఞాపించెను.

పిదప వసిష్ఠుఁడు సుమంత్రుని పిలిచి,"మిథిలాధిపతిని, కాశీపతిని రాజునకు మామయైన కేకయరాజును, కోసలరాజగు భానుమంతుని, మగధాధిపతిని, మిత్రుఁడైన అంగరాజును రోమపాదుని స్వయముగా పిలువుము, తక్కినవారిని దూతలచే ఆహ్వానింపుము" అని చెప్పెను. అతఁ డట్లే యని వెళ్ళెను. పిదప కర్మాంతికులు అన్నియేర్పాట్లు చేసితి మని చెప్పిరి. అప్పుడుమరలవసిష్ఠుఁడు అవజ్ఞతో నీయవద్దని అట్లు చేసిన దాతకు కీడు కలుగు నని హెచ్చరించెను. తరువాత కొన్ని దినములకు రాజు లందఱు వచ్చిరి. యజ్ఞాయతనము సర్వసన్నద్ధమైన దని వసిష్ఠుఁడు తెల్పఁగా దశరథుఁడు శుభదినమున వసిష్ఠఋష్యశృంగాదులను పురస్కరించుకొని యజ్ఞశాల కరిగి అచ్చట పత్నులతో కూడ దీక్షను పొందెను.

పదునొకండవ మాసమునకు పైన అనఁగా పండ్రెండవమాసము నందు మేధ్యాశ్వమును సదస్యులు గైకొనివచ్చి రావిచెట్లతోఁపునందు కట్టివేయుదురు. పండ్రెండవమాసమునందు శాలానిర్మాణసంభారాహర ణాదికము నిర్వర్తింతురు. ఫాల్గున అమావాస్యయందు ఋత్విక్కులతో

యజ్ఞశాలయందు ప్రవేశించి యజమానుఁడు చైత్రప్రతిపత్తునుండి అశ్వమేధము నారంభించును.

ఋష్యశృంగమహర్షిని పురస్కరించుకొని "ప్రవర్గ్య"మును, "ఉపసద"మును ఋత్విక్కులు గావించిరి; ప్రాతస్సవనమును, మాధ్యందిన సవన,తృతీయ సవనములను నిర్వహించిరి. అనంతరము సోమలతను దాతిపై నుంచి, దక్షిణముగ బ్రహ్మ, పశ్చిమదిశ అధ్వర్యుఁడు, ఉత్తరమున హోత, తూర్పున ఉద్గాత నిలువఁబడి రాలతో దంచి సోమరసమును పిండిరి. పిమ్మట ఆయా దేవతల నాహ్వానించి హోమములు చేసిరి. ప్రతిదినము ప్రాతర్మధ్యాహ్నములందు ద్విసారాశంసనమును, తృతీయ సవనమున సకృన్నారాశంసనమును జరిపిరి. కర్మాంతరములందు విద్వాంసులు శాస్త్రవాదములు జరిపిరి.

వారు బిల్వముతో ఆఱు, చంద్రకొయ్యతో ఆఱు, మోదుగతో ఆఱు, శ్లేష్మాతకముతో (విరిగిచెట్టు) ఒకటి, రెండు దేవదారు యూపములు, మొత్తము ఇరువదియొక్క యూపస్తంభములను స్థాపించిరి. అవి ఏకవింశత్యరత్ని పరిమితములు (ఇరువదియొక్క పిడిమూర పొడవుగలవి; నునుపైనవి) అష్టకోణములుగలవి, కాంచనాలంకృతములు. వానికి వస్త్రములను చుట్టిరి.

అష్టాదశప్రస్తారాత్మకము, రుక్మపక్షము, గరుడాకారమును గల వేదికయందు అగ్నిని స్థాపించిరి. "ఇంద్రాయ రాజ్ఞే" అను మొదలగు అనువాకములందు చెప్పఁబడినవిధముగా ఉరగములు, పక్షులు, కూర్మాది జలచరములు మొదలుగా మూఁడువందల పశువులు మేధ్యాశ్వముతో పాటు యూపములకు ఆరోకాదులందును బంధింపఁబడెను. కౌసల్య ప్రోక్షణముచే అశ్వమును సంస్కరించి మూఁడు కృపాణములతో విశసనమును గావించెను. ఆ రాత్రియంతయు ఆ మృతాశ్వము నొద్ద పట్టమహిషి గడపెను.అధ్వర్యుఁడు మఱునాఁడు "వంపు" అను పేరు

గల అశ్వముయొక్క మేదస్సును తీసి వండి హోమము (వపాహోమము) గావించెను. ఆ హోమగంధము నాఘ్రాణించి దశరథుఁడు సమస్తపాపనిర్ముక్తుఁడయ్యెను. అశ్వాంగము లన్నియు పదునార్వురు ఋత్విక్కులచే హుతము గావింపఁబడెను. దశరథుఁడు బ్రహ్మకు మహిషిని, హోతకు వావాతను, ఉద్గాతకు పరివృత్తిని, అధ్వర్యునకు పాలాకలిని (పాత్రప్రదా) ఒసంగఁగా వారు ఆ స్త్రీలను చేతితో తాఁకెరి. తరువాత ఆయన ఋత్విజులకు ద్రవ్యము నొసంగి మరల వారిని గైకొనెను.

అశ్వమేధము జరుగుచుండఁగా పర్వతములంత అన్నపు రాసులతో అన్నివర్ణములవారికిని అన్నదానము జరుగుచుండెను. మణికుండములతో అలంకృతులైన ద్విజులు వడ్డనచేసిరి.

యజ్ఞపరిసమాప్తియందు రాజు హోతకు తూర్పుదిక్కు, అధ్వర్యునకు పడమటిదిక్కు, బ్రహ్మకు దక్షిణదిక్కు, ఉద్గాతకు ఉత్తరమున రాజ్యము దక్షిణగా నొసంగెను. ఇది స్వయంభూవిహితమైన విధానము. వారు, "స్వాధ్యాయకులమైన మాకు భూమి యెందులకు? దీని కేదైన కొంతధనము నొసంగి నీవే స్వీకరించి పాలింపుము" అని పలికిరి. అట్లే యని రాజు వారికి కొంత ధనము నొసంగి మరల భూమిని స్వీకరించెను. దీనినిబట్టి "రాజునకు భూమిపై స్వామ్యము లేదు; స్వామ్యమున్న బ్రాహ్మణులకు పాలనాధికారము లేదు" అని స్పష్టమగుచున్నది. అనఁగా ఈ నిమిత్తముగానైన రాజులు భూమి తమకు సొంత ఆస్తి కాదని గ్రహింపవలె నన్నమాట.

తరువాత దశరథుఁడు ఋత్విక్కులకు యథాశాస్త్రముగా దక్షిణ లిచ్చెను. పిమ్మట ఆయన అపారముగా దానము లొసంగెను. ఒకానొక బ్రాహ్మణుఁ డడుగఁగా చేతికినున్న స్వర్ణకంకణము కూడ ఆయన

ఇచ్చెను. అంతట దశరథుఁడు నేలపై సాష్టాంగముగ వ్రాలి నమస్కరించి బ్రాహ్మణాశీర్వాదములను పొందెను.

పై దానములనుబట్టి సకలవర్ణములకు మృష్టాన్న భోజనములను బట్టి యజ్ఞములందు మహారాజు జైత్రయాత్రలలో సంపాదించిన ధన మంతయు మరల ప్రజల పరముగా చేయఁబడుచున్న దనుట స్పష్టము.

ఈ సందర్భమున యజ్ఞమునుగూర్చి కొన్ని విషయములు ప్రస్తావించుట ఆవశ్యకము. యజ్ఞము స్వర్గమర్త్యలోకములకు అనుసంధాన సూత్రము. మానవునియందు త్యాగభావమును పెంపొందించి వాని దృష్టిని దివ్యలోకముల కాకర్షించుటకు ఇది ప్రజాపతిచే నేర్పరుపఁబడిన సాధనము. ముఖమునందు ఆహారము వేయఁగా నది జఠరాగ్నియందు పక్వమై సకలేంద్రియములకు సప్తధాతురూపమున నెట్లు చేరుచున్నదో, అట్లే అగ్నిముఖమున హవిస్సులు (అగ్నిముఖా వై దేవాః) ఆయా దేవతల కందును. వారు పుష్టి నొంది మరల మనకు సకలకామముల నొసంగుదురు. కొందఱు ఆజ్యాదిద్రవ్యములను అగ్గిపాలు చేయుచున్నారని తలంతురు. అది అజ్ఞత. పొలములో విత్తనములు చల్లుచున్న కర్షకుని జూచి పిల్లలు ఈ విత్తనములను మట్టిపాలుచేయుచున్నారే అని తలంచుట యెట్టిదో ఇదియు నట్టిదే. పరమేశ్వరుఁ డొసంగిన పదార్థజాతమును ఆయనకు ఆయన పరివారమైన యితరదేవతలకు నివేదించి మిగిలినదానిని అనుభవించుటవలన అనహంకారత, పరమేశ్వరప్రపత్తియు పెంపొంది సత్త్వగుణము అతిశయించును. అది జ్ఞానకారకము.

"యజ్ఞమువలన, యజ్ఞమంత్రముల యుచ్చారణమువలనను వాయుమండలమున గొప్పపరివర్తనము వచ్చును. నిఖిలవిశ్వమున దానివలన ధర్మచక్రము ప్రవర్తిల్లును. అందువలననే బ్రాహ్మణములు,

యజ్ఞమును విశ్వనియామక మని చెప్పుచున్నవి. యజ్ఞములకొఱకే జ్యోతిషము, జ్యామితి, వ్యాకరణము మొదలగు శాస్త్రములు పెంపొందెను. వీనిలో శిల్పులు, వడ్రంగులు. ఇష్టకకారులు, నటనర్తక గాయకాదులు పలువురు పాల్గొందురు. అందువలన ఇవి బ్రహ్మకళా నిలయములు. (హిందీ ఋగ్వేదభూమిక, పుట, 4–1 శ్రీమత్ రామాయణ వైభవము పుట 56–డాక్టర్. మల్లాది గోపాలకృష్ణశర్మ)

మునిబాలకుని చంపినదోషము సంతానప్రతిబంధియై యుండవచ్చును. దానిని నివారించుకొనుటకై దశరథుఁడు అశ్వమేధము నారంభించియుండును. యజ్ఞతత్త్వప్రకాశికయందు ఇది ఇట్లు వర్ణింపఁబడియున్నది "ఇది సోమయాగమే అయినను, సవనీయమైన పశువు ఇందు అశ్వము కావున ఇది అశ్వమేధ మను ప్రఖ్యాతిని పొందినది. బ్రహ్మహత్య మొదలగు పాతకములను నశింపఁజేయునట్టి యీక్రతువు సర్వఫలప్రదము. ఇంతకన్నను శ్రేష్ఠమైనకర్మ ఏదియును లేదు, అని శ్రుతిస్మృతిపురాణములయందు చెప్పఁబడియున్నది. ఇది రాజులకు సర్వరాజజయచిహ్న మగుటయేకాక సర్వలాభప్రదమును అగును."

"యద్యపి అయం సోమయాగః తథాపి సవనీయపశురశ్వః, స చ మహోపకారకేషు పరిగణిత ఇతి కృత్వా,తస్యైవ నామ్నా యాఽగోయం అశ్వమేధ ఇతి వ్యవహారం భజతే. సర్వఫలప్రదోఽయం క్రతుః బ్రహ్మహత్యాది మహాపాతకనాశకః, నైతాదృశం కర్మాంతర మస్తి శ్రేష్ఠతమం ఇతిశ్రుతి స్మృతిపురాణాదిషు ఉక్తం.........రాజ్ఞ స్తు సర్వలాభప్రదః, సర్వరాజజయచిహ్నభూతోఽయ మితి. (యజ్ఞతత్త్వప్రకాశిక–పుట 115–116. (మ. మ. పండిత చిన్నస్వామిశాస్త్రిగారు) శ్రీమద్రామాయణవైభవము పుట. 64.

ఈ యజ్ఞమునుగూర్చి కొందఱు కొన్ని యాక్షేపములను వానికి సమాధానములను చెప్పియున్నారు. అవి పరిశీలింపఁదగియున్నవి.

1. పశువిశసనము హింస. అది "దేవతల కెట్లు ప్రీతికరమగును ?
2. యజమానుఁడు భార్యలను ఋత్విజులకు దాన మిచ్చుటేమి?
3. యజమానుని భార్య రాత్రియంతయు మృతాశ్వము నొద్ద
మండు టేమి ?

దీనినిబట్టి రామాయణముకాలమునాటికే యజ్ఞశబ్దార్థ మెంత యధ్వాన్న మైనదో మనకు తెలియుచున్నది. ఇట్టి యసహ్యామారణ కృత్యములను జూచియే తరువాతి బుద్ధిమంతులు యజ్ఞములన్న నేవగించుకొనఁదొడఁగిరి. ఇది సహజమే, కాని యీ లక్షణ మంతయు పూర్వమునుండి యున్నదనుట పొరపాటు-

కొందఱిట్లు సమాధాన మొసంగిరి :-

"రాష్ట్రం వై అశ్వః" అని శతపథబ్రాహ్మణమునందు కలదు. మేధ మనఁగా బుద్ధి. అశ్వమేధ మనఁగా రాష్ట్రమును గూర్చిన యాలోచన. పెద్దల నందఱ నొకచో సమావేశ మొనర్చి దేశకల్యాణ కారకములైన విషయములను చర్చించుటే అశ్వమేధము, కాని పశు విశసనము కాదు. ఈ హింసావిధానము మొదట వేదములందు లేదు. తరువాత వారు కల్పించినది." (రామాయణసుధాలహరి పుట. 135)

పై వాదము నిరాధారము. రామాయణ మహాభారతాది గ్రంథ ములం దెల్లెడల నీయశ్వమేధ విధానము పశువిశసనాత్మకముగనే వర్ణింపఁబడియున్నది. ఈ గ్రంథములలోని విధానము కాదన్నచో వాల్మీకి వ్యాసులకే లేక వసిష్ఠాదిమహర్షులకే వేదమంత్రముల తాత్ప ర్యము అవగతము కాలేదని చెప్పవలసివచ్చును. ఇట్లనుట సాహసము. మఱి పశువిశసనము పవిత్రకర్మ మగునా? యజ్ఞప్రక్రియ, దానిఫలము రెండును వేదైకగోచరములు. మనబుద్ధికి అందునవి కావు. పుణ్యాపాప ములు కంటికి కన్పింపవు. ఈప్రక్రియచే పుణ్యము కలుగు నని, వేదోక్త

ప్రక్రియచే పాపము, తొలఁగు నని వేదము చెప్పుచున్నది. వానియందలి కార్యకారణభావము గోచరింపకున్నను ప్రాచీనులు వేదమునందలి శ్రద్ధచే ఆ యజ్ఞకర్మల నిర్వహించిరి. పాపములు పోయినట్లు వారు విశ్వసించిరి. కొన్ని యెడల, పుత్రకామేష్టి మొదలగువానియందు, ప్రత్యక్షముగ ప్రాజాపత్యపురుషుఁడు పాయసము నొసంగుట మొదలుగునవి జరుగు చుండెను. ద్రౌపదీ ధృష్టద్యుమ్నులు యజ్ఞకుండమునందే ఆవిర్భవించిరి.

యజ్ఞములందు పశువిశసనము హింస కాదని ప్రాచీనులమతము. "మా హింస్యా త్సర్వా భూతాని" అని వేదమే చెప్పినది. యజ్ఞములందుఁ గావించు పశువిశసనము హింస కాదు. అవి వానికి పశుశరీరమును తొలఁగించి ఉత్తమగతులను గలిగించును. విరాధుఁడు, కబంధుఁడు, మొదలగువారు తమ శరీరములను తొలఁగింపవలసినదిగా శ్రీరాముని ప్రార్థించిరి. శరభంగుఁడు శబరి శ్రీరామునిసమక్షముననే మానవ శరీరములను అగ్నులయందు హుతమొనర్చి దివ్యశరీరములతో ఉత్తమ లోకములకు పోయిరి.

శ్లో॥ తదిచ్ఛా మ్యభ్యనుజ్ఞాతా త్యక్తు మేతత్ కళేబరమ్।

అరణ్య- 74-28

శ్లో॥ తస్మిన్ ముహూర్తే శబరీ దేహం జీర్ణం జిహాసతీ॥ 32

శ్లో॥ అనుజ్ఞాతా తు రామేణ హుత్వాత్మానం హుతాశనే।
జ్వలత్పావకసంకాశా స్వర్గ మేవ జగామ సా॥ 33

కావున సుగతిప్రదమైన యజ్ఞాహుతి హింస కానేరదు. దేశ క్షేమమునకై యుద్ధము జరుగునపుడు సైనికులను యుద్ధభూమికి నడపు సేనాని హింసచేసినవాఁ డగుట లేదు. యుద్ధమున మరణించినవాఁడు ఆత్మహత్యకు పాల్పడుట లేదు.

యజ్ఞములందు పశువిశసనము హింస కావున అవి హేయము లని భావించినచో, అట్లు భావించువారు మానవజీవితమున హింసను పరిహరింపఁగలరా? యజ్ఞములలో పశుమారణము జరుగుమాట నిజమే. కాని ప్రపంచమున భుక్తికొఱకై ఏనాఁడైనను ఎన్ని పశువులు సంహరింపఁబడుచున్నవి? ఏకాలమందైనను మాంసాహారి కాని వాఁడు వేయి కొకఁడైన నుండునో! ఉండఁడో! కేవలము ఉదరపూరణమునకై పశుహింసనము అవార్యమైనపుడు దానిని దేవతానివేదనపూర్వకముగా చేయుట మేలు కదా! బలి యనఁగా పూజ. టెంకాయను ఆహారముగా గలవాఁడు దానిని తన దేవతకు బలిగా నిచ్చుచుండఁగా, పశువులను అన్నముగా గలవాఁడు ఆ పశువులను తన దేవతలకు బలిగా ఇచ్చుచున్నాఁడు. రాముఁడు చెప్పినట్లు, పురుషునకు ఏది యన్న మగుచున్నదో వాని దేవతలకును అదియే అన్న మగును.

శ్లో॥ యదన్నః పురుషో భవతి, తదన్నా స్తస్య దేవతాః॥
అయోధ్య - 192 - 30

యజ్ఞములందు పశుబలిని మాన్పింపఁగలిగినను ప్రతినగరము నందున్న మాంస విక్రయశాలలను, పశుమారణశాలలను మూయింపఁ జాలరు.

శాకాహారులు మాత్రము హింసకు దూరులై యున్నారా? చెట్లకు తీఁగలకు ప్రాణము లున్నవి కదా! మనువు చెప్పినట్లు అవి అంతశ్చైతన్యము కలవి. వాని సుఖదుఃఖములు పైకి కన్పింపవు.

శ్లో॥ అంతస్సంజ్ఞా భవన్త్యేతే సుఖ దుఃఖ సమన్వితాః॥ మనుస్మృతి

కాయలు కోసినపుడు, కొమ్మలు విఱిచినపుడు, చెట్లకు దుఃఖము కలుగ దని చెప్పుటకు వీలు లేదు. వాని రోదనము మనకు విన్పింపదు కావున వానికి దుఃఖము లేదని చెప్పఁజాలము. మఱి చీమ

లయొక్క దోమలయొక్క రోదనము కూడ విన్పింపదు. కావున వానిని చంపినచో హింస కాదా! ఇల్లు చిమ్మినప్పుడు, నడచునప్పుడు, కూరలు తఱుగునప్పుడు, దంచునప్పుడు, వండునప్పుడు, తినునప్పుడు, సూక్ష్మజీవులు చచ్చిపోవుట లేదా? అది హింస కాదా? ఈ హింసను పరిహరించినచో ఎట్లు బ్రతుకఁగలము? హింసను పరిహరింప లేము. కావున ఆ హింసింపఁబడిన భూతములకు సద్గతి కలుగునట్లుగా మంత్రములతో సంస్కరించుటయే మనము చేయఁగలిగినపని. కావున ప్రతి గృహస్థుయొక్క అన్నము పైనచెప్పఁబడిన పంచసూనములచే దుష్ట మగుచున్నది. దానిని పవిత్ర మొనర్చుటకు పంచయజ్ఞములు (దేవ భూత పితృ బ్రహ్మ మనుష్య యజ్ఞములు) చేయవలసియున్నది.

[1 కండని = (కత్తిపీట) 2 పేషణీ = (ఱోలు) 3 చుల్లి = (పొయ్యి 4 మార్జని = చీపురుకట్ట 5 ఉదకుంభి = నీటికడవ. ఈ ఐదు ప్రాణివధ స్థానములు పంచసూచనములు. పంచయజ్ఞములు వీనికి పరిహారములు.]

హింస అయినప్పటికి ఆకలికి అన్నమును తినుచున్నట్లే, సంతానవాంఛ కలవాఁడు హింసాత్మక మైనప్పటికి శాస్త్రవిహిత మైనది కాఁబట్టి యజ్ఞమును చేయవచ్చును. కావుననే వేదము దేవతానివేదనమునందైన హింస, యజ్ఞమునందైన హింస, హింస కానేరదని అనుగ్రహించినది. మహాభారతమున అరణ్యపర్వమునందు ధర్మవ్యాధుఁడు కౌశికునకు అహింసాస్వరూపమును ఇట్లు బోధించెను.

మ॥ హలికుం డెంతయు నోజతో దునఁగ సీరాగ్రంబునం జొక్కి ప్రా
ణు లనేకంబులు సచ్చు; హింస యది యౌనో కాదో! వేయేల మ
ర్త్యులు నేలం జరియించుచోఁ బదములఁ ద్రొక్కంబడుం బెక్కుజం
తులు; హింసావిధిఁగాదనంగ వశమే దోషజ్ఞ యూహింపుమా! 57

చ॥ సలిలము లుర్వి యాకసము సర్వము జంతుమయంబు గావునన్
గలుగు నవశ్యమున్ సకలకర్మములందును హింస; హింసకుం
దొలఁగిన దేహయాత్రయును దుర్ఘటమైనటులుండు; నింతయుం
దలఁపరు హింససేయ మని తారు తలంతురు కొంద ఱిమ్మహిన్. 58

క॥ పనివడి యహింస వ్రతముఁగఁ
గొని వనమున నున్న మునులకుం దొడరదె హిం
సనము; తరుమూలఫలశా
క నిపీడన మదియు హింస గాదొకొ? తలఁపన్॥ 59

తే॥ గీ॥ హింస సేయనివాఁడు లేఁ డిజ్జగమున
నొక్కఁ డైనను; తమతమ యోపినట్లు
హింస తెరువున కెడఁగల్గి యేఁగవలయు;
నదియ చూవె యహింస నా నతిశయిల్లు - 60

వ॥ ధర్మంబు బహుప్రకారంబై యుండుఁ దదీయ సూక్ష్మగతి దురవబోధంబు గావున శ్రుతిప్రమాణంబులవలనను వృద్ధాచార నిదర్శనంబులను నెఱింగికొనునది.

ఆంధ్ర మహాభారతము-అరణ్యపర్వము - ఆశ్వాసము. 6

సృష్టి యజ్ఞముకొఱకే జరుగుచున్న దని శాంతిపర్వమునందు ఇట్లు వివరింపఁబడియున్నది. "వివిధ దక్షిణలతో కూడిన యజ్ఞములతో ప్రజలు నన్నుగూర్చి యజ్ఞములు చేయఁగల రని ధర్మాత్ముఁడు అకల్మషుఁడును అయిన ప్రజాపతి ప్రజలను సృష్టించెను. లతలను వృక్షములను ఓషధులను మేధ్యములైన పశువులను హవిస్సులను అయన సృష్టించెను. వీనిని పొంది పశుధాన్యధనాన్వితులై ఏ గృహస్థులు యజ్ఞములు చేయకుందురో వారియందు కిల్బిషము శాశ్వతముగా నుండును.

శ్లో॥ అసృజ ద్ధి ప్రజా రాజన్ ప్రజాపతి రకల్మషః।
మాం యక్ష్యస్తీతి ధర్మాత్మా యజ్ఞై ర్వివిధదక్షిణైః॥

శ్లో॥ వీరుధ శ్చైవ వృక్షాం శ్చ యజ్ఞార్థం వై తదౌషధీః।
పశూం శ్చైవ తథా మేధ్యాన్ యజ్ఞార్థాని హవీంషి చ॥

శ్లో॥ తత్సంప్రాప్య గృహస్థా యే పశుధాన్యధనాన్వితాః।
న యజన్తే మహారాజ శాశ్వతం తేషు కిల్బిషమ్॥

శాంతిపర్వము.

ఇంక యజమానుఁడు భార్యలను ఋత్విక్కుల కొసంగుటలో త్యాగభావనయే ముఖ్యలక్ష్యము. ఇచ్చినంతమాత్రమున వారు స్వీకరింపరు. వెంటనే యజమానుఁడే మూల్యము నిచ్చి కైకొనుచున్నాఁడు. ఋత్విజులవలనఁ గైకొన్న భార్యలను ధర్మసంతతిసిద్ధికి సాధనములుగనే భావింపవలెఁ గాని భోగసాధనములుగా భావింపరా దని శ్రుతియొక్క తాత్పర్యము.

యజమానపత్ని గుఱ్ఱపుశవమునొద్ద రాత్రిని గడపుటవలన ఆమె మనస్సునందు అనేకజన్మలనుండి రూఢములై యున్న భయము, కామము మొదలగు భావములు పెకలింపఁబడును. శవసాన్నిధ్యము వలనియావేగమున శరీరమునందును మార్పులు సంభవింపవచ్చును. బిడ్డలు పుట్టుటకు పుట్టకుండుటకు వైద్యులు శస్త్రచికిత్స చేయుదురు. ఏప్రక్రియవలన నేది సంభవించునో వారికే గాని మనకు తెలియదు. మనకు తెలిసినది వారిని విశ్వసించి మన శరీరముల వారికి నప్పగించుటే. అట్లే యీప్రక్రియయందును వేదమును నమ్మి వ్యవహరింపవలసియున్నది.

అప్పయ్యదీక్షితులవారికిని ఇట్టి సందేహము కలుగగా, వారు వరదరాజస్వామిని ప్రార్థించిరి. వరదరాజస్వామి వపాపరిమళముతో

కూడినముఖముతో ప్రత్యక్షమయ్యెను. ఆ స్వామిని దీక్షితులవారు ఈ శ్లోకమున స్తుతించి రని చెప్పుదురు.

శ్లో॥ వపాపరిమళోల్లాస వాసితాధరపల్లవమ్,
ముఖం వరదరాజస్య ముగ్ధస్మిత ముపాస్మహే॥

అశ్వమేధము ముగిసిన తరువాత దశరథుఁడు కులవర్ధనమైన క్రతువు నొనరింపఁజేయు మని ఋష్యశృంగుని కోరెను. ఆయన కొంచెముసేపు ఆలోచించి అధర్వణవేదశిరస్సులందుఁ జెప్పఁబడిన మంత్రములతో పుత్త్రీయమైన యిష్టినిఁ జేయింతు నని పలికి అందుల కుపక్రమించెను. ఆయన అగ్నియందు హోమమొనరించుటకు ప్రారంభించినంతనే తమతమ భాగములను ప్రతిగ్రహించుటకై దేవత లచ్చటికి చేరిరి. వారితోఁబాటు గంధర్వులు, సిద్ధులు, దేవర్షులును వచ్చిరి. అంతర్ధానశక్తి కలవారగుటచే, వారందఱును అంతరిక్షమున నొకచో మనుష్యుల కగోచరముగా సమావేశమైనా రన్నమాట.

దేవత లందఱు బ్రహ్మదేవునకు రావణుని యకృత్యములను విన్నవించిరి. వానికి మనుష్యునివలననే మృత్యువు సంభవింపఁగల దని బ్రహ్మదేవుఁడు చెప్పెను. ఆ సమయమున శంఖచక్రగదాపాణియు, పీత వసనుఁడును అయిన విష్ణుదేవుఁ డచ్చటికి వచ్చెను. దేవతలు సంతోషముతో ఆయనకు నమస్కరించి "మేము లోకహితమునకై నిన్ను నియోగించుచున్నాము (నియోక్ష్యామహే). మహర్షిసముఁడైన దశరథునకు హ్రీశ్రీకీర్తులతో సమానలైన పత్నులయందు నాల్గుమూర్తులతో జన్మించి లోకకంటకుఁడైన రావణుని సంహరింపుము" అని ప్రార్థించిరి. అప్పు డాయన "రావణుని ఏయుపాయముతో సంహరింపవలె" నని

యడిగెను. వారు బ్రహ్మదేవునివరము సంగతి చెప్పి మనుష్యరూపమున వానిని సంహరింప వచ్చు నని చెప్పిరి. ఆయన రావణుని సపరివారముగా సంహరించి పృథివిని పదునొకండువేల సంవత్సరములు పాలింతు నని చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

అపుడు పుత్రకామేష్టికుండమునందలి పావకునిలోనుండి రక్తాంబరధరుఁడు, రక్తాస్యుఁడునైన యొక నల్లని దివ్యపురుషుఁడు దివ్యపాయసపూర్ణమై, వెండిపళ్ళెరము మూతగాఁగలిగిన బంగారుపాత్రను రెండు చేతులతోఁబట్టుకొని పైకివచ్చి దశరథునితో నిట్లనెను. "నేను ప్రాజాపత్యపురుషుఁడను.ఇదిదేవనిర్మితమైన పాయసము.దీనిని నీ భార్యలకొసంగుము; పుత్రులు కలుగుదురు" అని పలికెను. దశరథుఁడు ప్రీతుఁడై తలవంచి ఆ పాత్రను ప్రతిగ్రహించి ఆ పురుషునకు ప్రదక్షిణము గావించెను. ఆ ప్రాజాపత్యపురుషుఁ డంతర్ధానము నొందెను.

అంతట దశరథుఁడు అంతఃపురమున ప్రవేశించి ఆ పాయసములో సగము కౌసల్యకు, మిగిలిన సగములో సగము అనఁగా నాల్గవ భాగము సుమిత్రకు, మిగిలిన నాల్గవవంతులో సగము అనఁగా ఎనిమిదవభాగము కైకేయికి నిచ్చి, ఆలోచించి తుదకు మిగిలిన యెనిమిదవభాగమును మరల సుమిత్ర కిచ్చెను.

శ్లో॥ కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా।
అర్ధా దర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః॥ 27

శ్లో॥ కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థకారణాత్
ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమమ్॥ 28

శ్లో॥ అనుచింత్య సుమిత్రాయై పున రేవ మహామతిః।
ఏవం తాసాం దదౌ రాజా భార్యాణాం పాయసం పృథక్॥ 29

శ్లో॥ తాశ్చైవం పాయసం ప్రాప్య నరేంద్రస్యోత్తమా స్త్రియః।
సమ్మానం మేనిరే సర్వాః ప్రహర్షోదితచేతసః॥ 30

బాలకాండ సర్గ–16

దశరథుఁడు పాయసమును ముప్పురకు సమానముగా పంచి యిచ్చుట ధర్మము కాదు. జ్యేష్ఠానుక్రమమున పంచి యీయ వలయును. అందువలన ఆయన పాయసమును ఎనిమిది భాగములుగా ఉద్దేశించి, వానిలో నాల్గు భాగములు (1/2) కౌసల్యకు, మూఁడు భాగములు (1/4 + 1/8) సుమిత్రకు; ఒక్కభాగము (1/8) కైకేయికి ఇచ్చెను. కావున రాముఁడు విష్ణుతేజములో 1/2 భాగము, లక్ష్మణుఁడు 1/4 భాగము కాఁగా భరతశత్రుఘ్నులు 1/8, 1/8 భాగము లైనారు. తనకిచ్చిన భాగమును కౌసల్య వెంటనే భుజించెను. కైకేయి కూడ వెంటనే భుజించెను. దశరథుఁడు తనకిచ్చినట్లే మిగిలిన నాల్గవవంతు కైకేయి కిచ్చునా లేదా యని పరిశీలించుచు సుమిత్ర కైకేయికి 1/8 వంతు నిచ్చుచున్నపుడు, తనకు మొదట ఇచ్చిన పాతికభాగమును భుజించి, తరువాత మరల నిచ్చిన 1/8 భాగమును భుజించెను. అందువలన పాయసమును భుజించిన కాలము యొక్క క్రమమున ముందు శ్రీరాముఁడు, తరువాత భరతుఁడు, తరువాత లక్ష్మణశత్రుఘ్నులును జన్మించిరి. కౌసల్య కిచ్చిన వెంటనే సుమిత్రకు మొదటిభాగమును దశరథుఁడిచ్చుటచే రామలక్ష్మణులు సన్నిహితు లైరి. మిగిలిన పాతికభాగమున రెండు అష్టమాంశములుగా విభజింపఁబడిన పాయసమువలన జన్మించుటచే భరతశత్రుఘ్నులు సన్నిహితు లైరి. పాయసము మహాప్రభావమహిత మగుటచే సూక్ష్మ భేదములకుఁ గూడ స్పష్టమగు పరిణామ మేర్పడినది. బుద్ధిశాలియైన మహారాజు ఆలోచించి యిట్లు చేసెను. "అనుచింత్య మహామతిః" అని అనుటవలన దశరథుని ధర్మబుద్ధియు వ్యక్త మగుచున్నది. కైకేయియందు ఆయన పక్షపాతము చూపలేదు. ముప్పురను తమకు

సమ్మానము కలిగినట్లుగా తలంచి రనుటవలన (సమ్మానం మేనిరే సర్వాః) అప్పటికి కైకేయి కూడ ధర్మబుద్ధియే కలిగియుండె నని వ్యక్తమగు చున్నది.

విష్ణువు దశరథునకు పుత్రత్వము నొందుచుండఁగా బ్రహ్మదేవుఁడు దేవతలను చూచి "మీరును విష్ణుసాహాయ్యార్థముగా అప్సరసల యందు గంధర్వయక్షపన్నగవానరకిన్నరకన్యలయందు బుద్ధిసంపన్నులు, మాయావిదులు, శూరులు, విష్ణుతుల్యపరాక్రములైన వానరులను సృజింపుఁడు, పూర్వము నేను ఆవలించుచుండఁగా నాముఖము నుండి ఋక్షవల్లభుఁడైన జాంబవంతుఁడు ప్రభవించి యున్నాఁడు" అని పలికెను. అందులకు వారందఱును అంగీకరించిరి. మహేంద్రగిరినిభుఁడైన వాలిని ఇంద్రుఁడు సృష్టించెను. సూర్యుఁడు సుగ్రీవుని, బృహస్పతి తారుని, కుబేరుఁడు గంధమాదనుని, విశ్వకర్మ నలుని, అగ్ని నీలుని, మైందద్వివిదులను అశ్వనీదేవతలు, వరుణుఁడు సుషేణుని, పర్జన్యుఁడు శరభుని, వాయువు హనుమంతుని పుట్టించిరి. ఈ జన్మకథలు కొన్ని ఇతరకాండలలో వివరింపఁబడియున్నవి.

రావణుఁడు కుబేరుని జయించి కైలాసపర్వతమునొద్దకుఁ బోయెను. అక్కడ శంకరుని చెంతనున్న వానరముఖుఁడైన నందినిఁ జూచి రావణుఁడు పరిహసించెను. అపుడు నంది యిట్లు శపించెను. "ఓరీ! దశముఖా! నీవు నన్ను అవమానించి పిడుగు పడినట్లుగా పెద్ద శబ్దముతో పరిహసించితివి. కావున నా రూపమువంటి రూపము కలవారు, నాతో సమానమైన వీర్యము తేజస్సు కలవారైన వానరులు నీ కులముయొక్క వధకొఱకు జన్మింపఁగలరు"

శ్లో॥ యస్మా ద్వానరరూపం మా మవజ్ఞాయ దశానన।
అశనీపాతసంకాశ మపహాసం ప్రయుక్తవాన్॥

శ్లో॥ తస్మాన్మద్రూపసంయుక్తా మద్వీర్యసమతేజసః।
ఉత్పత్స్యన్తి వధార్థం హి కులస్య తవ వానరాః॥ 17

ఉత్తరకాండ-సర్గ-16

వాలిసుగ్రీవులు రామునికన్న పెద్దవారు కాదా? రావణుఁడు కార్తవీర్యార్జునునిచేత నిగ్రహింపఁబడిన పిమ్మట వాలిచే నిగ్రహింపఁబడినట్లు ఉత్తరరామాయణమున కలదు. వాలి కార్తవీర్యునిసమకాలికుఁడైనచో రామునకు చాల పూర్వుఁ డగును. రామాయణతిలకటీకాకారుఁడు "ఇతని యుత్పత్తి కూడ భగవదవతారమునకు పూర్వమే యని యెఱుంగఁదగును" అని జాంబవంతునివలె వాలియు రామునకు పూర్వుఁడే యనిచెప్పెను. గోవిందరాజస్వామి తన గురువులయభిప్రాయము నిట్లే చెప్పి తాను మాత్రము వాలిని రాముని సమకాలికునిగనే భావించెను. గోవిందరాజులవారిగురువులు ఇట్లు చెప్పిరి. "ఇఁక బ్రహ్మదేవునివలన జాంబవంతునియొక్క సృష్టివలెనే పూర్వసిద్ధమైన ఇంద్రాదులవలన జరిగిన వాలి మొదలగు వారియొక్క సృష్టిని అనువదించుచున్నాఁడు....కావుననే "వాలిని పుట్టించెను" అని చెప్పఁబడినది. పుట్టించె ననఁగా అప్పుడు పుట్టించె నని యర్థము కాదు....ఇంద్రాదులు గూడ బ్రహ్మ నియోగించిన తరువాత ఇట్లు అనుకొనిరి. "క్రొత్తగా సృష్టించుట యెందులకు? ఇంతకు పూర్వమే యొక ప్రయోజనము కొఱకు పుట్టింపఁబడినవారే ఇప్పుడును సాహాయ్యము చేయఁగలరు." ఎవరు ఇంతకు ముందు పుత్రులను పుట్టింపలేదో వారు మాత్రమే అప్పుడు పుట్టించిరి"

గోవిందరాజస్వామి తన యభిప్రాయము నిట్లుచెప్పెను. "వాలి మొదలగువారి జన్మ రామావతారకాలమునందే జరిగిన దనియును చెప్పవచ్చును. కార్తవీర్యార్జునుఁడు రావణుని జయించిన వెంటనే వాలి రావణుని జయింపలేదు. "తరువాత" (తతః) అను పదము కార్తవీర్యా

ర్జునునిజయమునకు పిమ్మట వాలియొక్క జయము సంభవించినది అని మాత్రమే తెలుపును. ఆ మాటవలన రెండు సంఘటనములు వెంటవెంటనే జరిగిన వని చెప్పనక్కఱలేదు. కావుననే తరువాత నొక ప్పుడు(తతః కదాచిత్)అని చెప్పఁబడినది. మఱి దుందుభి యన్ననో వరదానముచేత ఎల్లప్పుడు యువకుఁడుగా మత్తుఁడుగా నుండెను. ఆ కారణమువలన చాల కాలమునకు తరువాత వానికి వాలితో యుద్ధము సంభవించి యుండవచ్చును. ఈ విధముగా తక్కినది కూడ ఊహింపఁ దగియున్నది. ఎట్లైనను ఉపక్రమమునందు అవగత మగుచున్న క్రమ మును తప్పింపరాదు....మఱియును మయుఁడు రావణునకు మండో దరిని ఇచ్చునప్పుడు ఇట్లుచెప్పెను. "నాకు ఇద్దఱు సుతులు కలిగిరి. మాయావి మొదటివాఁడు, దుందుభి తరువాతివాఁడు"

ఇది గురువుల యభిప్రాయము: "అథ బ్రహ్మణో జాంబవత్ సృష్టివత్ పూర్వసిద్ధం ఇంద్రాదిభ్యో వాల్యాది సృష్టి మనువదతి....అత ఏవ వాలినం జనయామాస ఇత్యుక్తం నతు, తదా జనయామాస ఇతి ....ఇంద్రాదయః ఖలు ఏవం అమన్యన్త బ్రహ్మనియోగానన్తరం "కిం అపూర్వ సర్గేణ? పూర్వ మస్వార్థ ముత్పన్నా ఏవ సాహాయ్యం కరిష్యన్తి" ఇతి। యైస్తు పుత్రానోత్పాదితాః తే పునస్తదా జనయామాసుః।

గోవిందరాజస్వామి యభిప్రాయము: "యద్వా రామావతారకాలే ఏవ వాల్యాదిజన్మ। వాలిజయశ్చ న అర్జునజయ అవ్యవహితోత్త రకాలికః తతశ్శబ్దస్య ఆనన్తర్య మాత్ర పరత్వాత్। అత ఏవ "తతః కదాచిత్" ఇత్యుక్తమ్....దుందుభిశ్చ వరదానేన సదా యువా మత్తశ్చ। తతశ్చ తస్య బహుకాలానన్తర మపి వాలినా యుద్ధం సంభవత్యేవ। ఏవ మన్య ద ప్యూహ్యమ్। సర్వథా ఉపక్రమావగతః క్రమః న బాధితవ్యః। అపి చ మయో రావణాయ మండోదరీ ప్రదానకాలే

శ్లో॥ ద్వౌ సుతౌ తు మమ త్వస్యాం భార్యాయాం సంబభూవతుః।
మాయావీ ప్రథమ స్తావత్ దుందుభి స్తదనన్తరః।
ఇత్యుక్తవాన్"

మాయావితో యుద్ధము జరిగినపుడే సుగ్రీవుఁడు పట్టాభిషిక్తుఁడైనాఁడు. అది భ్రాతృవైరకారణమైనది. తరువాత దుందుభి వచ్చి వాలిచే చంపఁబడెను. దుందుభి కంకాళమును రామునకు సుగ్రీవుఁడు చూపెను. అనఁగా దుందుభి సంహరింపఁబడి మూఁడునాలుగేండ్లు గడచె నన్నమాట. ఏమైనను వేలయేండ్లు గడచినచో రాముఁడు విసరఁదగినట్లుగా కంకాళ ముండదు. బావమఱఁది లిద్దరు చచ్చి రని విని రావణుఁడు వాలిపైకి వచ్చియుండును. అప్పటికి సుగ్రీవుఁడు తఱిమి వేయఁబడెను. అందువలన వానికి రావణుని విషయము తెలియలేదు. ఇది యంతయు రామసుగ్రీవమైత్రికి పూర్వము కొన్ని యేండ్లలో సంభవించి యుండవచ్చు.

దేవేంద్రుఁడు విష్ణువునకు సహాయునిగా వాలిని పుట్టించు టేమి? వాలివలన శ్రీరామునకు ఏమి సాయము జరిగినది ? పైఁగా అధార్మికుఁడై రామునిచే సంహరింపఁబడెను గదా! వాలి శక్తిసామర్థ్యములచే ఋక్షవానరబలములను దేవతలవలన జన్మించిన తార నలనీలాది మహావీరుల నందఱను కిష్కింధారాజ్యమునకు లోఁబడునట్లు కేంద్రీకరించెను. ఈ సామర్థ్యము సుగ్రీవునకు లేదు. వాలిచే సుప్రతిష్ఠితమైన యీ సామ్రాజ్యబల మంతయు సుగ్రీవుని ద్వారమున రామునకు కైవస మయ్యెను. సుగ్రీవునియందు సామర్థ్య మున్నను లేకున్నను రామపరాక్రమమునకు వెఱచి ఆ మహావీరు లందఱును సుగ్రీవాజ్ఞకు లోనయి వర్తించినా రనుట స్పష్టము. కావున ఋక్షవానరబలసంఘటనము ద్వారమున, తన పుత్రుఁడగు అంగదునిరూపమున వాలియు రామునకు సహాయుఁడే యయ్యెను.

శ్లో॥ తాంశ్చ సర్వాన్ మహాబాహు ర్వాలీ విపులవిక్రమః
జుగోప భుజవీర్యేణ ఋక్షగోపుచ్ఛవానరాన్॥ 35

బాలకాండ-సర్గ-17

ఈమహావీరు లందఱును మేరుమందర సంకాశశరీరులు, మహాబలపరాక్రమశాలులు, కామరూపులు. వీరందఱును చాల త్వరగా పుట్టి పెరిగినారు. అనగా నిది దేవగంధర్వమహర్ష్యాదులవలన ప్రత్యేక సృష్టిగా జరిగిన దన్నమాట. ఏ దేవునకు ఏ రూపము, వేషము, పరాక్రమము కలదో వానివలన జన్మించినవానికి ఆ రూపము, ఆ వేషము ఆ పరాక్రమమును సిద్ధించెను. ముఖమునందు మాత్రము వానరత్వమున్నను, తక్కిన శరీరసంస్థాన మంతయు పితృతుల్యముగనే యుండె నన్నమాట. కావుననే వారందఱును పాదపశిలాప్రహరణులు, నఖదంష్ట్రాయుధులు అయినప్పటికి సర్వాస్త్రకోవిదులై యుండిరి. కావుననే ఆంజనేయుఁడు అధ్యయనసంపన్నుఁడు, వాగ్మియు నయ్యెను.

శ్లో॥ అప్రమేయబలా వీరా విక్రాంతాః కామరూపిణః।
మేరుమందరసంకాశా వపుష్మంతో మహాబలాః॥ 18

శ్లో॥ ఋక్షవానరగోపుచ్ఛాః క్షిప్ర మే వాభిజజ్ఞిరే।
యస్య దేవస్య యద్రూపం వేషో య శ్చ పరాక్రమః॥ 19
శ్లో॥ అజాయత సమం తేన తస్య తస్య పృథక్ పృథక్।

బాలకాండ-సర్గ-17

గో. టీక : ముఖమాత్రే వానరాకారత్వేఽపి సంస్థానాదౌ సర్వే
పితృతుల్యా ఏవ ఆస న్నిత్యర్థః॥

శ్లో॥ కామరూపబలోపేతాః యథాకామవిచారిణః। 24
శిలాప్రహరణా స్సర్వే సర్వే పాదపయోధినః॥ 25

శ్లో॥ నఖదంష్ట్రాయుధా స్సర్వే సర్వే సర్వాస్త్రకోవిదాః। 26
గో. టీక : సర్వాస్త్రకోవిదాః :—దేవాంశత్వేన స్వయంప్రతిఘాత అస్త్రప్రహార పరిహారోపాయాః, న త్వస్త్రప్రయోక్తారః శిలాప్రహరణా ఇత్యుక్తేః।

యజ్ఞపరిసమాప్త్యనంతరము పండ్రెండవమాసమున చైత్రమున నవమీతిథియందు అదితిదేవతాకమైన పునర్వసునక్షత్రమందు అయిదు గ్రహములు ఉచ్చయం దుండఁగా, గురువు చంద్రునితోఁ గూడియున్న కర్కాటకలగ్నమున కౌసల్య శ్రీరాముని కనెను. మరునాఁడు దశమియందు పుష్యమీనక్షత్రమున మీనలగ్నమందు ఉదయమున భరతుఁడు జన్మించెను. మధ్యాహ్నమున కర్కాటకమందు సర్పదేవతాకమైన ఆశ్లేషానక్షత్రమందు కవలుగా లక్ష్మణశత్రుఘ్నులు జన్మించిరి. దేవదుందుభులు మ్రోఁగెను. గంధర్వులు గాన మొనర్చిరి. అప్సరసలు నృత్యము చేసిరి.ఆకసమునుండి పుష్పవృష్టి కురిసెను. అయోధ్యయందు మహోత్సవము జరిగెను. దశరథుఁడు పరమహర్షమున సూతమాగధవంది బ్రాహ్మణాదులకు పెక్కుదానములు గావించెను.

శ్లో॥ తతో యజ్ఞే సమాప్తే తు ఋతూనాం షట్ సమత్యయుః।
తత శ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ॥ 8

శ్లో॥ నక్షత్రే ఽదితిదైవత్యే స్వోచ్చసంస్థేషు పంచసు।
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా విందునా సహ॥ 9

శ్లో॥ ప్రోద్యమానే జగన్నాథం సర్వలోకనమస్కృతమ్।
కౌసల్యాజనయ ద్రామం దివ్యలక్షణసంయుతమ్॥ 10

శ్లో॥ భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః।
సాక్షాద్విష్ణోః చతుర్భాగః సర్వైః సముదితో గుణైః॥ 13

శ్లో॥ అథ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాజనయత్ సుతౌ।
వీరౌ సర్వాస్త్రకుశలౌ విష్ణో రర్ధసమన్వితౌ॥ 14

శ్లో॥ పుష్యే జాత స్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః।
సార్పే జాతౌ తు సౌమిత్రీ కుళీరేఽభ్యుదితే రవౌ॥ 15

బాలకాండ-సర్గ-18

గో. టీక : సాక్షాద్విష్ణోః శ్రీరామచంద్రస్య చతుర్భాగః విష్ణోః అష్టమాంశః। అర్ధసమన్వితౌ-సమన్వితార్ధౌ-అర్ధశబ్దో అంశమాత్రవాచి సమన్వితశబ్దేన యుగప దుపయు క్తత్వ ముచ్యతే।

పురుడు గడచిన తరువాత వసిష్ఠుఁడు జ్యేష్ఠునకు రాముఁ డని, కై కేయీసుతునకు భరతుఁ డని, సుమిత్రాపుత్రులకు లక్ష్మణశత్రుఘ్నులని నామకరణముఁ గావించెను.

గద్యము :— ఆప స్తంబసూత్ర కౌండిన్యసగోత్ర పోలూరి వేంకట నరసాంబా నారాయణామాత్యపుత్ర హనుమజ్జానకీరామశర్మ ప్రణీతంబైన శ్రీరామాయణతరంగిణియందు రెండవదియైన విష్ణుతీర్థము సమాప్తము.

# 3. యజ్ఞతీర్థము

## 1. తాటకాసంహారఘట్టము

దశరథుఁడు కుమారులకు అన్నప్రాశనచౌలోపనయనాదిసంస్కారములు యథాకాలముగా జరిపించెను. వారు విద్యావినీతులై జ్ఞానసంపన్నులై పితృశుశ్రూషణపరులై శోభింపఁజొచ్చిరి.

శ్లో॥ తేషాం జన్మక్రియాదీని సర్వకర్మా ణ్యకారయత్।
తేషాం కేతు రివ జ్యేష్ఠో రామో రతికరః పితుః॥

బాలకాండ-సర్గ-18

వారందఱిలోను రాముఁడు తండ్రి కత్యంత మిష్టుఁ డయ్యెను. "రామో రతికరః పితుః" అనుట చిత్రము. రతి శబ్దము స్త్రీ భోగము నందు ప్రసిద్ధము. దశరథుఁడు స్త్రీలాలసుఁ డనుట భార్యలసంఖ్యవలననే విదితము. అట్టివానికి రామునిచూచినంతనే ఇష్టస్త్రీభోగమువలన కలుగు సుఖమువంటి సంతోషము కలుగునన్న మాట. కావుననే రామవియోగము ఆయనకు అంతగా దుస్సహ మయ్యెను.

సోదరుల ప్రేమయు నిట్టిదే. బాల్యము నుండియు లక్ష్మణుఁడు రామునియెడ ఎల్లప్పుడు స్నేహముతో వర్తించుచుండెను. రాముఁడు కూడ లక్ష్మణుని తనశరీరముకన్నను ప్రియుఁడైన వానినిగా బహిః ప్రాణమునుగా ప్రేమించుచుండెను. భరతునకుఁ గూడ శత్రుఘ్నుఁడు ప్రాణముకన్నను ప్రియుఁడుగా నుండెను. శత్రుఘ్నుఁడు నైతము భరతుని అట్లే ప్రేమించెను. అతఁడు లక్ష్మణునకు తమ్ముఁడు కదా!

శ్లో॥ బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః॥ 28

శ్లో॥ రామస్య లోకరామస్య భ్రాతు ర్జ్యేష్ఠస్య నిత్యశః।
సర్వప్రియకర స్తస్య రామస్యాపి శరీరతః॥ 29

శ్లో॥ లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః॥ 30

శ్లో॥ భరతస్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః॥ 32

శ్లో॥ ప్రాణైః ప్రియతరో నిత్యం తస్య చాసీ త్తథా ప్రియః॥ 34

రాముఁడు తనకు తరువాతివాఁడైన భరతునితో కలిసియుండుట, ఒక తల్లికి జన్మించిన లక్ష్మణ శత్రుఘ్నులు కలిసి యుండుట సహజము. ఇట్లేల సంభవించినది ? పాయసవిభాగమే యిందులకు కారణము. పాయసమును మొదట రెండుభాగములు చేసినప్పుడు

రామునివిభాగమునకు అంటికొనియున్నభాగము లక్ష్మణునిది. రాముని భాగమును దశరథుఁడు కౌసల్యకు ఇచ్చిన వెంటనే మిగిలిన సగభాగము లోని భాగమును (1/4) సుమిత్ర కిచ్చెను. అట్లే మిగిలిన పాతిక భాగమును ఆయన రెండుగా విభజించి కైకేయికి, మరల సుమిత్రకును ఇచ్చెను. అనఁగా భరతశత్రుఘ్నులు ఒక ముక్కలోనుండి ఏర్పడిన రెండుభాగము లైరి. అందువలన వా రిద్దఱు కలసియుండుట సంభవ మయ్యెను.

ఒకనాఁడు దశరథుఁడు కుమారుల వివాహముఁ గూర్చి మంత్రులతో, ఉపాధ్యాయులతో, బంధువులతో కలసి యాలోచించుచుండెను. అపుడు విశ్వామిత్రమహర్షి వచ్చెను. దశరథుఁడు మంత్రి పురోహితాదులతో ఆయన కెదురేగి యర్ఘ్యపాద్యము లిచ్చి లోనికిఁ గొనివచ్చెను. కుశలప్రశ్న లైన తరువాత దశరథుఁడు మిగుల నుదారముగా నిట్లనెను "నీవు వచ్చుటచే నాజన్మ ధన్యమైనది. నీయాగమనకార్య మేమో చెప్పుము. నీ కార్యమును నెఱవేర్చి అనుగ్రహీతుఁడను కాఁగోరుచున్నాను. నీవు సందేహింప వలదు. నీవు నాకు దైవతమవు." కుమారుల వివాహ సమాలోచనసందర్భ మగుటచే దశరథుఁడు మిగుల సంతోషముతో నుండె ననుట స్పష్టము.

శ్లో॥ అద్య మే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్॥ 53
బ్రూహి యత్ప్రార్థితం తుభ్యం కార్య మాగమనం ప్రతి॥ 56

ఇచ్ఛా మ్యనుగృహీతోఽహం త్వదర్థపరివృద్ధయే।
కార్యస్య న విమర్శం చ గంతు మర్హసి సువ్రత॥ 57

శ్లో॥ కర్తా చాహ మశేషణ దైవతం హి భవాన్ మమ॥ 58

బాలకాండ-సర్గ-18

అపుడు విశ్వామిత్రుఁడు హర్షము నొంది యిట్లనెను. "వసిష్ఠ శిష్యుఁడవైన నీ విట్లు చెప్పుట తగియున్నది. నా యభీష్టమును గావించి సత్యప్రతిజ్ఞుఁడవు గమ్ము. ఒకానొక సిద్ధికొఱకై నేను యజ్ఞదీక్షా నియమము నొందుచున్నాను. మారీచసుబాహువులు వచ్చి యజ్ఞవేదిని మాంసరుధిరపూరములతో ధ్వంస మొనర్చుచున్నారు. వారిపై కోపించి శపించుటకు వీలు లేదు. ఆ నియమము అట్టిది. నీ జ్యేష్ఠపుత్రుని రాముని నాకొసంగుము. అతఁడు దివ్యమైన తనతేజస్సుచేతను, నా చేతను రక్షితుఁడై రాక్షసులను నిర్మూలింపఁగలడు. అతనికి బహురూపమైన శ్రేయస్సును గలిగింతును. సంశయము లేదు. అతఁడు దానిచే మూఁడులోకములలో ఖ్యాతి నొందఁగలఁడు. పుత్త్రిస్నేహముతో విచారింపకుము. ఆ యిద్దఱు రాక్షసులు చచ్చినట్లే తలంపుము. నీకు నేను శపథముఁ జేసి చెప్పుచున్నాను. మహాత్ముఁడు, సత్యపరాక్రముఁడు నైన రాముని నే నెఱుంగుదును. మహాతేజస్వియైన వసిష్ఠుఁడే కాక తపోనిష్ఠులైన వారందఱు నెఱుంగుదురు. వసిష్ఠప్రభృతులైన మంత్రులయంగీకారముతోనే రాము నొసంగుము. యజ్ఞకార్యము పదిదినములే. నాకు యజ్ఞారంభమునకు ఆలస్యము గాకుండ రామునిఁ బంపుము; దుఃఖింపకుము."

శ్లో॥ స్వపుత్రం రాజశార్దూల రామం సత్యపరాక్రమమ్॥ 8

శ్లో॥ కాకపక్షధరం వీరం జ్యేష్ఠం మే దాతు మర్హసి।
శక్తో హ్యేష మయా గుప్తో దివ్యేన స్వేన తేజసా॥ 9

శ్లో॥ రాక్షసా యే వికర్తార స్తేషా మపి వినాశనే।
శ్రేయ శ్చాస్మై ప్రదాస్యామి బహురూపం న సంశయః॥ 10

శ్లో॥ త్రయాణా మపి లోకానాం యేన ఖ్యాతిం గమిష్యతి॥ 11

శ్లో॥ న చ పుత్ర గతం స్నేహం కర్తు మర్హసి పార్థివ। 13

శ్లో॥ అహం తే ప్రతిజానామి హతౌ తౌ విద్ధి రాక్షసౌ।
అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్॥ 14

శ్లో॥ వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః। 15
మహాత్మానం-అపరిచ్ఛిన్నం "వేదాహ మేతం పురుషం
మహాన్తమ్"

ఆ మాటలు విన్నంతనే దశరథుఁడు మూర్ఛనొందినట్లయి కొంతసేపటికి తేరుకొని యిట్లనెను. "మా రామునకు పదునాఱేండ్లు కూడ నిండలేదు. రాక్షసులతో యుద్ధముచేయు యోగ్యత వానియందు నాకు కన్పించుట లేదు. నాయొద్ద అక్షౌహిణి సేన యున్నది. దానితో నేను వచ్చి రాక్షసులతో యుద్ధము చేయుదును. రాముఁడు బాలుఁడు. రాక్షసులు మాయతో యుద్ధము చేయుదురు. రామునకు అస్త్రబలసంపత్తి లేదు; యుద్ధవిశారదుఁడును గాఁడు. రాముని వదలి నేను ముహూర్తమైనను జీవింపలేను. నీవు రాముని తీసికొని పోఁదలఁచినచో చతురంగ బలముతో నన్నుకూడ తీసికొని పొమ్ము. నాకు అరువదివేలయేండ్లు. ఎట్లో ఇప్పటికి ఎంతో కష్టము మీఁద పుత్రులను పొందినాను. అందును నాకు రామునియందు ప్రేమ యధికము. వానిని నీవు తీసికొనిపోవుట తగదు. ఇంతకును ఆ రాక్షసు లెట్టి పరాక్రమము కలవారు? వా రెవరి పుత్రులు? వారికి అండగా ఎవ రున్నారు? వారితో ఎట్లు యుద్ధము చేయవలె? అంతయు చెప్పుము"

శ్లో॥ ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః।
న యుద్ధయోగ్యతా మస్య పశ్యామి సహ రాక్షసైః॥ 2

శ్లో॥ విప్రయుక్తో హి రామేణ ముహూర్త మపి నోత్సహే।
జీవితుం నరశార్దూల, న రామం నేతు మర్హసి॥ 3

బాలకాండ_సర్గ-20

విశ్వామిత్రుఁడు వచ్చునప్పటికి దశరథుఁడు పుత్రులవివాహ మునుగూర్చి ప్రస్తావించుచున్నాఁడు. వివాహమునకు యోగ్యుఁడైన రాముఁడు యుద్ధమునకు యోగ్యుఁడు కాఁడని దశరథుఁడు చెప్పుట వింతగానే యున్నది. కాని రాక్షసులతో యుద్ధము (సహ రాక్షసైః) సామాన్యము కాదు. అందువలన ఆయన అట్లు భయపడెనని చెప్ప వచ్చును.

అప్పుడు విశ్వామిత్రుఁ డిట్లు చెప్పెను. "రావణుఁడను రాక్షస ప్రభువు నెఱుంగుదువు గదా! బ్రహ్మచే వరముల నొందిన యారావ ణుఁడు ముల్లోకములను పీడించుచున్నాఁడు. వాఁడు స్వయముగా బయలుదేరనపుడు తన యనుచరులైన మారీచసుబాహువులను యజ్ఞ భంగమునకై పంపును."

శ్లో॥ శ్రూయతే చ మహారాజ రావణో రాక్షసాధిపః 17

శ్లో॥ సాక్షాద్వైశ్రవణభ్రాతా పుత్రో విశ్రవసో మునేః।
యదా న ఖలు యజ్ఞస్య విఘ్నకర్తా మహాబలః॥ 18

శ్లో॥ తేన సంచోదితౌ తౌ తు రాక్షసౌ చ మహాబలౌ।
మారీచశ్చ సుబాహుశ్చ యజ్ఞవిఘ్నం కరిష్యతః॥ 19

బాలకాండ-సర్గ-20

ఆ మాటలు విని నిర్విణ్ణుఁడై దశరథుఁ డిట్లనెను. "ఆ రావణు నెదుర్కొనుటకు నేను చాలను. దేవదానవులే వాని నెదిరింపఁజాలరు మానవుల సంగతి యేమి ? నేను సేనలతో నాపుత్రులతోఁగూడ వాని నెదుర్కొనఁజాలను. ఇందులకు బాలుఁడైన నాపుత్రు నొసంగను. నన్ననుగ్రహింపుము. ఆ మారీచసుబాహువులు కూడ యమునివంటి వారు. నేను మిత్రులతో బంధువులతోఁ గూడి ఆ యిర్వురిలో ఏ యొక్కనితోనైన పోరఁగలను"

శ్లో॥ అథ కాలోపమౌ యుద్ధే సుతౌ సుందోపసుందయోః॥ 25

శ్లో॥ యజ్ఞవిఘ్నకరౌ తౌ తే నైవ దాస్యామి పుత్రకమ్॥ 26

బాలకాండ - సర్గ. 20

వీరినిగూర్చి దశరథునకు ఇంతకుముందే తెలియు నన్నమాట. అయినను మొదట విశ్వామిత్రుఁడు వారిపేర్లు చెప్పినప్పుడు పుత్ర వియోగ భావనచే నిర్విణ్ణుఁడై తెలిసినవిషయమును గూడ సరిగా గ్రహింపలేక మఱల అడిగెను. రామవియోగస్మరణముననే అతఁడు వివశుఁ డగును. అప్పు డాయనకు సత్యధర్మములు కూడ భాసింపవు. ముందు తాను వత్తు నని తరువాత సపుత్రమిత్రబాంధవముగ వత్తు నని చెప్పి రావణుని పేరు విన్నంతనే "నేను చాలను; పుత్రునిఁ గూడ నొసంగ" ననెను. అంతకు పూర్వము "న రామం నేతు మర్హసి" అని అయిదుసార్లు చెప్పి, రావణునిపేరు విన్న తరువాత "నైవ దాస్యామి పుత్రకమ్" అని రెండుసార్లు అనెను.

అంత విశ్వామిత్రుఁడు క్రుద్ధుఁడై "మొదట ఇత్తునని శపథ మొనర్చి, ఇప్పుడు ప్రతిజ్ఞను తప్పించుకొనుచున్నావు. ఇది నీకు తగి యున్నచో నేను వచ్చినవాఁడను వచ్చినట్లే తిరిగిపోవుదును. ప్రతిజ్ఞా భంగముతో నీవు బంధువులతో సుఖముగా నుండుము" అని పలికెను.

శ్లో॥ పూర్వ మర్థం ప్రతిశ్రుత్య ప్రతిజ్ఞాం హాతు మిచ్ఛసి।
రాఘవాణా మయుక్తోఽయం కులస్యాస్య విపర్యయః॥ 2

విపర్యయః - ప్రతిజ్ఞాహానిః

శ్లో॥ య దీదం తే క్షమం రాజన్ గమిష్యామి యథాగతమ్।
మిథ్యాప్రతిజ్ఞః కాకుత్స్థ సుఖీ భవ సబాంధవః॥ 3

బాలకాండ – సర్గ. 21

అప్పుడు వసిష్ఠుఁడు దశరథునితో ఇట్లు చెప్పెను. "ఇక్ష్వాకు కులమునఁ బుట్టిన నీవు ధర్మమును వదలరాదు. స్వధర్మము ననుష్ఠింపుము. నీ వధర్మము చేయఁదగదు. చేయుదు నని చెప్పి పనిని చేయనివాఁడు ఇష్టాపూర్తవధము జేసిన పాపము నొందును కావున రాముని పంపుము. కృతాస్త్రుఁడైనను, అకృతాస్త్రుఁడైనను కౌశికునిచే రక్షితుఁడైన రాముని రాక్షసు లేమియుఁ జేయఁజాలరు. ఇతఁడు మూర్తిమంతమైన ధర్మము; వీర్యవంతులలో శ్రేష్ఠుఁడు; పరమతపస్వి. ఇతఁడు సకలలోకములలోని సర్వాస్త్రముల నెఱుంగును. క్రొత్త యస్త్రములను సృష్టింపఁగలఁడు. భూతభవ్యములలో నితనికి తెలియని దేదియు లేదు. నీవు సంశయింపవలదు. ఆ రాక్షసుల నితఁడే నిగ్రహింపఁగలఁడు. అయినను నీ పుత్రునిహితముకొఱకే నిన్ను యాచించుచున్నాఁడు." ఇది వసిష్ఠుని మహోదారతను వ్యక్తముచేయుచున్నది.

శ్లో॥ త్రిషు లోకేషు విఖ్యాతో ధర్మాత్మా ఇతి రాఘవః।
స్వధర్మం ప్రతిపద్యస్వ నాధర్మం వోఢు మర్హసి॥ 7

శ్లో॥ ప్రతిశ్రుత్య కరిష్యేతి ఉక్తం వాక్య మకుర్వతః
ఇష్టాపూర్తవధో భూయాత్ తస్మా ద్రామం విసర్జయ॥ 8

[గో.టీక॥ ఇష్టమ్ అశ్వమేధాంతో యాగః।

శ్లో॥ వాపీకూపతటాకాది ప్రతిష్ఠా సేతుబంధనమ్।
అన్నప్రదాన మారామః పూర్త మి త్యభిధీయతే॥]

శ్లో॥ కృతాస్త్ర మకృతాస్త్రం వా నైనం శక్ష్యన్తి రాక్షసాః।
గుప్తం కుశిక పుత్రేణ జ్వలనే నామృతం యథా॥ 9
శక్ష్యన్తి ధర్షయితు మితి శేషః

శ్లో॥ ఏష విగ్రహవాన్ ధర్మో ఏష వీర్యవతాం వరః।
ఏష విద్యాధికో లోకే తపస శ్చ పరాయణమ్॥ 10

శ్లో॥ ఏషోఽస్త్రాన్ వివిధాన్ వేత్తి త్రైలోక్యే సచరాచరే।
నైనమన్యః పుమాన్ వేత్తి న చ వేత్స్యన్తి కేచన॥ 11
ఏనమ్ ఏతదవగతమ్ అస్త్రసమూహమ్.

శ్లో॥ అపూర్వాణాం చ జననే శక్తో భూయశ్చ ధర్మవిత్॥ 18

శ్లో॥ న కించి దస్త్యవిదితం భూతం భవ్యం చ రాఘవ॥ 19

ఆ మాటలకు దశరథుఁడు సంతోషించి లక్ష్మణునితో కూడ రాముని బిలిపించి తాను కౌసల్య వశిష్ఠుఁడు వారికి స్వస్త్యయనముఁ గావించిన పిమ్మట దశరథుఁడు రాముని మూర్ధమునం దాఘ్రాణించి ప్రీతితో విశ్వామిత్రున కొసంగెను. అపుడు దుమ్ము లేకుండ గాలి సుఖస్పర్శముగా వీచెను. శంఖదుందుభి నిర్ఘోషములతో పుష్పవృష్టి కురిసెను. ముందు విశ్వామిత్రుఁడు చనుచుండఁగా రాముఁ డాయన వెంట బయలుదేరెను. రాముని వెంట లక్ష్మణుఁడు బయలుదేరెను. అశ్వనీదేవతలు బ్రహ్మనువలె; స్కందవిశాఖులు ఈశ్వరునివలె రామలక్ష్మణులు విశ్వామిత్రు ననుసరించిరి.

ఈ సందర్భమున రాముఁడు గాని లక్ష్మణుఁడు గాని తండ్రితో "ఈఋషి ఎవరు? ఈయనతో మే మెందులకు పోవలె? పోయి ఏమి చేయవలె? అక్కడ ఎన్నాళ్ళుండవలె?" అని మొదలుగా ఒక ప్రశ్న యైన వేయకుండుట గమనింపఁదగియున్నది. పెద్దలు చెప్పినట్లు చేయుటే గాని, దానినిగూర్చి ప్రశ్నించుట కూడ పిన్నలకు తగదన్న మాట. ఆవశ్యకములైన విశేషములను పెద్దలే చెప్పుదురు గదా, మన మడుగుట యెందులకు? పిల్ల లిట్లు గదా ప్రవర్తింపవలె.

ఒకటిన్నర యోజనము పోయినతరువాత సరయువుయొక్క దక్షిణతీరమున విశ్వామిత్రుఁడు రాముని పిల్చి జలమును గైకొనుమని బల అతిబల అను మంత్రముల నొసంగెను. "వీనిని పఠించుచు

న్నచో క్షుత్పిపాస లుండవు. సౌభాగ్యమున దాక్షిణ్యమున బుద్ధినిశ్చయమున ఎదుటివానికి సమాధానము చెప్పు సామర్థ్యమున నీకు సమానుఁ డెవఁడును ఉండఁడు"

శ్లో॥ న సౌభాగ్యే న దాక్షిణ్యే న జ్ఞానే బుద్ధినిశ్చయే।
నోత్తరే ప్రతివక్తవ్యే సమో లోకే తవానఘ॥ 10

శ్లో॥ ఏతద్విద్యాద్వయే లబ్ధే న భవే త్సదృశ స్తవ।
బలాచాతి బలా చైవ సర్వజ్ఞానస్య మాతరౌ॥ 17
క్షుత్పిపాసే న తే రామ భవిష్యేతే నరోత్తమ।
బలా మతిబలాం చైవ పఠతః పథి రాఘవ॥ 18

బాలకాండ - సర్గ 22.

"ఇవి పితామహసుతలు; తేజస్సమన్వితలు. పైగుణములు ఇంతకు పూర్వమే నీయందున్నను వీనిచే నధికముగా ప్రకాశింపఁ గలవు" అని విశ్వామిత్రుఁడు పలికి నంతనే రాముఁ డాచమించి శుచియై ఆ విద్యలను పరిగ్రహించి మిగుల ప్రకాశించెను.

శ్లో॥ ప్రతిజగ్రాహ తే విద్యే మహర్షే ర్భావితాత్మనః।
విద్యాసముదితో రామ శ్శుశుభే భూరివిక్రమః॥ 22

గో. టీక॥ విద్యాసముదితః సముదితవిద్యః, లబ్ధవిద్యః ఇతి యావత్।
ఊషు స్తాం రజనీం తత్ర సరయ్వా స్సుసుఖం త్రయః॥ 23

బాలకాండ - సర్గ 22

"మా భూత్ కాలస్య పర్యయః'' అనుటవలన మధ్యాహ్నకాలము దాటకుండ మహర్షి మంత్రోపదేశము గావించియుండును. తరువాత అచ్చటనే భోజనముచేసి ఆ రోజున ఇంకను ఎక్కువ ప్రయాణము చేయకుండ సరయూతీరముననే రాత్రి గడపియుందురు.

తెల్లవారుజాముననే విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను ఇట్లు మేల్కొలిపెను. "రామా! నీవు జన్మించుటవలన కౌసల్య మంచి పుత్రుని గన్నతల్లియై ధన్యురాలైనది. ఉదయసంధ్యాకాలము ఆరంభమైనది. పురుషవ్యాఘ్రమ! లెమ్ము. దేవతారాధనరూపమైన యాహ్నికమును నీవు చేయ వలసియున్నది". మహర్షి రామునే సంబోధించినను లక్ష్మణుని కూడ మేల్కొలిపినట్లే మనము గ్రహింపవలసియున్నది. సోదరులలో పెద్దవానికి ఏదేని విషయమును చెప్పినచో అది తమ్ములకు కూడ చెప్పినట్లే గ్రహింపవలయును.

శ్లో॥ కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్॥ 2

గో. టీక :- కౌసల్యా సుప్రజాః–త్వజ్జననీ, హేరామ; సుప్రజాః, శోభనా ప్రజా పుత్రో యస్యా స్సా సుప్రజాః; సుపుత్రా (శోభతే) ఇత్యర్థః. యద్వా కౌసల్యాయాః సుప్రజా ఇతి సంబోధనమ్। కర్మధారయే అపి ఆర్షో అసిచ్ (శోభనా చ అసౌ ప్రజా చ సుప్రజాః సుపుత్రః- హే కౌసల్యాసుపుత్ర! ఇతి సంబోధనమ్)

అలవాటు లేకుండ చాల దూరము నడచి వచ్చి అలసిపోయి యొడలు మఱచి నిద్రించుచున్న రాజపుత్రులను నిద్రలేపుట మనస్సునకు కష్టముగా నున్నను విశ్వామిత్రమహర్షి గురువుగా తనకర్తవ్యమును చక్కఁగా నిర్వర్తించెను. ఎంత మృదువుగా మధురముగా పల్కుచున్నను ఆయన మేల్కొల్పుట మానలేదు. ఇట్టియెడల దాక్షిణ్యము అనుచితము. "ఈ మహాత్ముని నే నెఱుంగుదును" (అహం వేద్మి మహాత్మానం) అని యెఱింగినవాఁ డయ్యును మహర్షి కర్తవ్యమును వీడలేదు. విష్ణుదేవాంశసంభవుఁ డయ్యును రాముఁడు సాధారణమానవుని వలెనే ఆహారనిద్రాదులను గలిగియుండె ననుట స్పష్టము; కావున సంధ్యావందనాదికృత్యములును తప్పవు.

శ్లో॥ తస్యర్షేః పరమోదారం వచ శ్శ్రుత్వా నరోత్తమౌ,
స్నాత్వా కృతోదకౌ వీరౌ జేపతుః పరమం జపమ్॥ 3

గో. టీక :- కృతోదకౌ కృతార్ఘ్య ప్రక్షేపౌ; జప్యతే ఇతి జపః గాయత్రీ మితి యావత్. తస్యా ఏవ పరమత్వాత్ "న సావిత్ర్యాః పరమ్ జప్యమ్" ఇతి వచనాత్.

వారు సంధ్యాజపాదికమును నిర్వర్తించి మరల బయలుదేరి సాయంకాలమునకు స్థాణ్వాశ్రమమును జేరిరి. అచ్చట పూర్వము మన్మథుఁడు సమాధిప్రయత్నమందున్న రుద్రుని పరిభవించి శరీరమును కోల్పోయెను. అందువలన అది అంగదేశముగా ప్రసిద్ధ మయ్యెను. అచ్చట స్థాణ్వాశ్రమము కలదు. ఆశ్రమమునందున్న స్థాణుశిష్యులైన మహర్షులయాతిథ్యమును స్వీకరించి, వారు ఆ రాత్రి నచ్చట గడిపి మఱునాఁ డుదయమే గంగాతీరమును చేరి యోడ నెక్కిరి. మధ్యలోనికి పోఁగానే ప్రవాహద్వయసంఘర్షణశబ్దమును విని ఇది యే మని రామలక్ష్మణులు ప్రశ్నించిరి. "మానససరస్సు నుండి పుట్టినసరయువు ఇచ్చట గంగలో సంగమించుచున్నది; మీరు నమస్కరింపుఁడు" అని విశ్వామిత్రుఁడు చెప్పఁగా వా రట్లే నమస్కరించిరి. గంగను దాటి దక్షిణతీరమునకు చేరి వా రొక భయంకరమైన వనమునఁ బ్రవేశించిరి. ఈ భయంకరవన మే మని రాముఁ డడుగఁగా విశ్వామిత్రుఁ డిట్లు చెప్పెను.

"వృత్రుఁడు త్వష్టృప్రజాపతిపుత్రుఁడు. తనకు మొదట పుట్టిన విశ్వరూపుని ఇంద్రుడు సహరించుటచే, వానిని సంహరించుటకై త్వష్ట వృత్రుని పుట్టించెను. ఇంద్రుఁడు వృత్రుని చంపెను. అతనికి బ్రహ్మహత్యవలన మలము, కారూషము (ఆకలి) కలిగెను. దేవతలు ఋషులు తీర్థోదకములతో ఇంద్రు నభిషేకించిరి. అప్పు డాతని మాలిన్యము, కారూషము ఇచ్చట తొలఁగెను. అందువలన ఇంద్రుఁ డీజన

పదములు మలదములు కారూషములుగా వర్ధిల్లు నని ప్రశంసించెను. అవి అట్లే వర్ధిల్లెను.

పూర్వ మొకప్పుడు సుకేతుఁడను యక్షపతి సంతతికొఱకై బ్రహ్మనుగూర్చి తపస్సు చేసెను. బ్రహ్మ ప్రత్యక్షమై వేయియేనుగుల బలము గలిగినకూఁతు నొసంగెను. ఆమెయే తాటక. ఆమెను తండ్రి జంభునికుమారుఁడైన సుందునకు భార్యగా నొసంగెను. వారికి మారీచుఁడు జనించెను. సుందుఁ డగస్త్యునిచే మరణించెను. అప్పుడు తాటకామారీచులు అగస్త్యుని మ్రింగఁబోయిరి. ఆయన వారిని రాక్షసులు గండని శపించెను. అందువలన వారు క్రోధమూర్ఛితులై ఆయన నేమియు చేయలేక ఆయనయున్న మలదకరూశదేశములను నశింపఁ జేయఁజొచ్చిరి. ఇచ్చటికి అర్ధయోజనముననే తాటక మార్గము నడ్డగించి వసతి నేర్పఱచుకొని యున్నది. కావుననే మనము అచ్చటికి పోవలసి యున్నది. నీవు నీ బాహుబలమును ఆశ్రయించి నా యాజ్ఞచేత ఈదుష్టచారిణిని సంహరించి ఈదేశమును నిష్కంటక మొనరింపుము".

శ్లో॥ అత ఏవ చ గన్తవ్యం తాటకాయా వనం యతః।
స్వబాహుబల మాశ్రిత్య జహీమాం దుష్టచారిణీమ్॥ 30
మన్నియోగా దిమం దేశం కురు నిష్కంటకం పునః। 31

బాలకాండ - సర్గ 24

"స్వబాహుబలము నాశ్రయించియే తాటకను సంహరింపు" మని మహర్షి చెప్పెను. ఆయన తాను అస్త్రము లీయక పోఁగా ఇంతకు ముందు రాముఁడు నేర్చుకొన్న యస్త్రములను గూడ ప్రయోగింపకుండ కేవలము బాహుబలముతోడనే తాటకను సంహరింపు మనుచున్నాఁడు. సాధ్యమైనంతవఱకు అస్త్రముల ప్రయోగింపరా దనుట, రాముని బాహుబల మెంతదో ఆయన చూడఁగోరుట ఇందు వ్యక్తమగుచున్నవి. బలహీనుఁడైనవానికి అస్త్రముల నొసంగ రాదు. వాఁడు వానిని చిన్నలక్ష్య

ములపైఁ గూడ ప్రయోగించును. కావున రాముని బలమును పరీక్షించిన తరువాతనే విశ్వామిత్రుఁడు అస్త్రముల నొసంగెను. శ్రీరాముఁడును సాధ్యమైనంతవఱకు ఖరదూషణాదులవధయందు కూడ, కేవలబాహు శక్తినే ఉపయోగించెను గాని అస్త్రముల నుపయోగింపలేదు.

విశ్వామిత్రుఁడు మరల ఇట్లనెను. "శాపవశమున గొప్ప బలమును కలిగియున్న దీనిని నీవు తప్ప ఎవరును సంహరింపఁజాలరు. ఇది స్త్రీవధ యని ఏవగించుకొనకుము. నాలుగువర్ణములవారియొక్క హితముకొఱకు రాజపుత్రునకు ఇది కర్తవ్యమే యగును. ప్రజారక్షణమున రాజపుత్రుఁడు నృశంస మైనను అనృశంస మైనను సదోష మైనను పాతక మైనను దుష్టులను సంహరింపక తప్పదు. రాజ్యభారమునందు నియుక్తులైనవారి కిది సనాతనమైన ధర్మము; ఇది యధర్మాత్మ్యం. ఈ తాటకకు ధర్మ మన్నదియే లేదు; దీనిని చంపుము. పూర్వము విరోచనునిపుత్రియైన మంథర పృథ్విని హింసింపఁ బూనఁగా ఇంద్రుఁడామెను సంహరించెను. అట్లే విష్ణువు కూడ ఇంద్రసంహారమును కోరుచున్న భృగుపత్నిని, పతివ్రతను, శుక్రునితల్లిని సంహరించెను. ఇట్లే యనేకులు రాజపుత్రులు అధర్మయుక్తలైన స్త్రీలను సంహరించిరి. కావున నీవు కూడ నాయాజ్ఞ ననుసరించి తాటకను సంహరింపుము"

శ్లో॥ న హి స్త్రీవధకృతే ఘృణా కార్యా నరోత్తమ।
చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా॥ 17

శ్లో॥ నృశంస మనృశంసం వా ప్రజారక్షణకారణాత్।
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సదా॥ 18

గో.టీక॥ రక్షతా - రాజపుత్రేణ

నృశంసం క్రూరమపి అనృశంస మివ కార్యమ్.

శ్లో॥ రాజ్యభారనియుక్తానా మేష ధర్మ స్సనాతనః।
అధర్మ్యం జహి కాకుత్స్థ ధర్మో హ్యస్యాం న విద్యతే॥ 19

శ్లో॥ శ్రూయతే హి పురా శక్రో విరోచనసుతాం నృప।
పృథివీం హన్తు మిచ్ఛన్తీం మంథరా మభ్యసూదయత్॥ 20

శ్లో॥ విష్ణునా చ పురా రామ భృగుపత్నీ పతివ్రతా।
అనింద్రం లోక మిచ్ఛన్తీ కావ్యమాతా నిషూదితా॥ 21

ఏష ధర్మ స్సనాతనః - ఈ ధర్మము సనాతనము. ధర్మరక్షణ విషయమున దాక్షిణ్యమును గాని కేవలమైన యార్జవమును గాని పాటింప నక్కఱలేదు. తాటకామారీచాదులు ప్రతివీరులు కారు. వీరు నిష్కారణముగా ప్రజలను చంపి భక్షించుచున్నారు. ఇట్టివారిని ఆతతాయు లందురు. అట్టివారిని కన్పించినంతనే సంహరింపవలె. వారితో మాటాడి విచారించి యుద్ధము చేయవలసినపని లేదు. క్రూరసర్పములను వలె వారిని ఆత్మరక్షణము కొఱకు లేదా, ప్రజారక్షణముకొఱకు, ఎట్లు సంహరించినను తప్పు లేదు.

శ్లో॥ ఆతతాయిన మాయాన్తం హన్యాదే వావిచారయన్।

దొంగతనముతో వచ్చి పల్లెలపైఁ బడి ప్రజలను హింసించి దోచుకొనిపోవు బందిపోటుదొంగల విషయమున ఏనాఁడైనను ప్రభుత్వము "కన్పించినచో కాల్చి చంపుఁడు" **(Shoot on sight)** అని రక్షకభటులకు **(Police)** ఆజ్ఞ ఈయక తప్పదు. అట్లు ఆజ్ఞ ఈయకున్నచో రక్షకభటులే వారికి బలి యగుదురు.

మనదేశముపై దండెత్తివచ్చిన విదేశీయుల విషయము కూడ ఇట్టిదే. వా రెవరును ద్వంద్వయుద్ధమున తమ వీరత్వమును నిరూపించుకొనుటకు బాహాటముగా వచ్చినవారు కారు. వా రందఱును ఆకస్మికముగా బందిపోటుదొంగలవలె మనదేశముపై దాడి చేసి ప్రజలను హింసించి సంపన్నులను దోచుకొన్నవారే, వారివలన మన ప్రజలకు కలిగిన హింసలకు మితి లేదు. వారిని ఎట్లైనను సంహరించి ప్రజలనురక్షింప

వలసిన బాధ్యత ఆనాఁటి ప్రభువులపై నుండెను. మన ప్రభువులు వారిని వేటలో క్రూరమృగములనువలె మాటుపెట్టి యైనను సంహరించి యుండవలసినది. కాని వారు అట్లు చేయ లేదు. దురాక్రమణపరాయణులను సాటివీరులనుగా భావించి యుద్ధసన్నద్ధతకు అవకాశముల నొసంగి, వారు ఓడిపోయి చిక్కినప్పుడుకూడ క్షమించి విడిచిపెట్టిరి. కాని వారు మాత్రము మన ప్రభువులవిషయమున ఈ పద్ధతిని పాటింపనే లేదు. వారు ఎప్పుడును "మేము దండెత్తి వచ్చుచున్నాము. కాచుకొనియుండుఁడు" అని ముందుగా చెప్పిపంపలేదు; ఆకస్మికముగనే వచ్చి పైఁబడిరి. మన ప్రభువులు యుద్ధమునందు ఓడి చిక్కినప్పుడు కూడ వారు ఏనాఁడును క్షమించి వదిలిపెట్ట లేదు.

విశ్వామిత్రుఁడు శ్రీరామునికు ఉపదేశించిన రాజధర్మదృష్టితో ఆలోచించినప్పుడు పృథ్వీరాజు మొదలుగు వారు దురాక్రమణ పరాయణులైన శత్రువులను విడిచిపెట్టుట, ఉదారతతో వ్యవహరించుట కేవలము అధర్మ మని స్పష్ట మగును. విడిచిపెట్టఁబడిన యాస్వార్థపరులు మన యుదారతను గ్రహించి సజ్జను లైనారా? వారికి మరల అవకాశము కలిగినంతనే దండెత్తి వచ్చినారు గదా! అవి వారి సైన్యములకు మన సైన్యములకు ఒకానొకప్రదేశమునందు మాత్రమే జరిగినపరిమితములైన యుద్ధములు కావు. ఆ యుద్ధములకు ముందు వారి సైన్యములు దారి పొడవునను పల్లెలపైఁబడి దోఁచుకొని స్త్రీలను భంగపఱచి గోవులను హింసించి దేవాలయములను కొల్లఁగొట్టి సాఁగివచ్చెడివి. మన ప్రభువులు వారిని చిక్కినప్పుడే సంహరించియున్నచో వారు మరల దండెత్తి వచ్చుటకుఁ గాని, ప్రజలను హింసించుటకుఁ గాని అవకాశముండదు. ఈ ప్రజాహింస కంతకును బాధ్యత వహింపవలసిన వారు ఆ దురాక్రమణపరాయణులను విడిచిపెట్టిన మనప్రభువులే. వారు చూపిన యుదారత ధర్మాభ్యాసము అనఁగా ధర్మమువలె కన్పించుచుం

డిన యధర్మము. ఒకఁడు ఇంకొకనిని చంపినచో అది హత్య యని చంపినవానికి మరణమునే శిక్షగా ప్రభువు విధించును. హత్యాకారుఁడు తనకు మిత్రుఁడైనను, ఆప్తబంధువైనను, కుమారుఁడే యైనను ధార్మికుఁడైన యేప్రభువున కైనను వానిని విడిచిపెట్టు అధికారము లేదు. మన ప్రభువులు స్వతంత్రులు కారు; ధర్మాధీనులు. వారు ధర్మమునే అనుసరింపవలె. అట్టియెడల ఎన్నో దోపిడులకు హత్యలకు మానభంగములకు దేవాలయధ్వంసనములకు కారకులైనవారు చిక్కినప్పుడు వారిని వదలిపెట్టి, వారివలన మరల ప్రజాహింసలు జరుగుటకు అవకాశ మిచ్చుట ఎంత ఘోరమైన యధర్మమో చెప్ప నక్కఱ లేదు. ఉత్తమమైన పుణ్యము గాని, ఘోరమైన పాపము గాని ఈలోకమునందే వెంటనే ఫల మొసంగు నని చెప్పుదురు (అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫల మశ్నుతే). ఐకమత్యము లేకపోవుటవలన మన రాజులు విధ్వంసము నొంది రని ఏవో కారణములను చరిత్రకారులు చెప్పుదురు గాని, ధర్మదృష్టితో ఆలోచించినప్పుడు వారు కావించిన యీ ఘోరమైన యధర్మమే వారి వినాశనమునకు కారణ మయ్యె నని చెప్పవలసి యున్నది.

ఇటీవలిచరిత్రలో పరంపరగా వచ్చుచున్న యీయధర్మమును గుర్తించి నిరాకరించి సనాతనమైన ధర్మమును పునరుద్ధరించినవాఁడు శివాజీ మహారాజు. ధర్మధ్వంసకుల యెడ ఉదారత గాని ఆర్జవము గాని **(Straight forwardness)** పనికి రాదని, వారిని ఏవిధముచే నైనను నిర్మూలించి ప్రజలను రక్షించుట ప్రభువులకు ప్రథమకర్తవ్య మని ఆయన గ్రహించెను. ఆయనకు గురువైన శ్రీసమర్థరామదాసస్వామియే ఈ ధర్మమును ప్రబోధించి యుండవచ్చును. ఎట్లైన నేమి ప్రబలములైన మిడుతలదండులవలె పైఁబడుచున్న మొగలాయీల సైన్యములను శివాజీ తన కున్న యల్పసైన్యములతో కొండలచాటున గుట్టలమాటున పొంచి యుండి విధ్వంస మొనర్చుచు వారిచే ఆక్రమింపఁబడిన దుర్గములను

జయించుచు స్వతంత్రమైన హిందూరాజ్యమును నెలకొల్పెను. ఆయన ఏర్పఱచినరాజ్యము చిన్నదే అయినను, నిరూపించిన ధర్మసూక్ష్మము మహోన్నతమైనది. ఆయన చూపిన రాజనీతి మార్గమువలన మనదేశ చరిత్ర ఒక మలుపు తిరిగిన దనుటలో సందేహము లేదు. కావుననే ఆయనకు చరిత్రలో ఉన్నతమైన స్థానము లభించినది.

కాని మన నాయకులు మరల ఈ నీతిని ధర్మమును విస్మరించి సొంతయాస్తివలె అనాదియైనజాతికి చెందిన భరతవర్షమును భరతఖండమును బుద్ధిపూర్వకముగ ముక్కలొనరించి ధర్మధ్వంసకులకు పంచిపెట్టి ఎట్లైనను వారితో రాజీపడి ధర్మహీనులముగా నైనను మనుగడ సాగింపవలయు నని తలంచుచుండుట మిగుల విచారకరము.

"నాలుగు వర్ణములవారియొక్క హితముకొఱకు (చాతుర్వర్ణ్య హితార్థాయ) ప్రజారక్షణకారణమువలన (ప్రజారక్షణకారణాత్) రాజపుత్రుఁడు ప్రజాహింసకులను ఏమార్గముచేత నైనను నిర్మూలింపవలె" నని విశ్వామిత్రుఁడు రామునకు బోధించెను. ఆయన మొదట చాతుర్వర్ణ్యమును పేర్కొని తరువాత ప్రజలను ప్రస్తావించెను. దీనిని బట్టి పరిపాలితులలో (Subjects of the Government) నాలుగువర్ణములవారు ఒక భాగమై యుండఁగా దానికి చెందని జనసముదాయములు వేఱొకభాగముగా నుండె నని గ్రహింపవలసియున్నది. మొదటి భాగము వేదవిహితములైన ధర్మములను పాటించుచు నియమబద్ధమైన జీవితమును గడపుచుండఁగా, తక్కినవారు చాతుర్వర్ణ్యమును అనుసరించుచు వారివలన నుపదేశములను పొందుచు అర్హత ననుసరించి ఉత్తమస్థితిని అందుకొనుచుండిరి. వారియొక్క అర్హతను బట్టి భక్తియొక్క అతిశయమును బట్టి వారిలో కొందఱు, చాతుర్వర్ణ్యములోని వారికి కూడ అందని, స్వర్గాదిలోకములను మోక్షమును సైతము పొందుచుండిరి. గుహుఁడు, శబరి, సుగ్రీవాదివానరులు జాంబవంతుఁడు మొదలైన భల్లూకములు జటాయువు మొదలుగా పక్షులును ఇట్టివా?

వీరు ఏవర్ణమునకును చెందరు. వీరిలో అందఱు విజ్ఞానవంతులు కూడ కారు. అట్టివారు ధర్మముతో సంబంధము లేకుండ ఆహారనిద్రాభయ మైథునాదులతోనే జీవించుచుండిరి. పూర్వపుణ్యవశమున వారిలో కొందఱకు తాము ఉన్నస్థితికన్న ఉన్నతమైన స్థితిని పొందవలయు నను కుతూహలము సంకల్పము కలుగుచుండెను. అట్టివారు మహర్షు లను ఆశ్రయించి ధర్మమును గ్రహించి ఆచరించి యౌన్నత్యమును పొందుచుండిరి. కావున వేదవిహితములైన ధర్మములు కేవలము నాలుగు వర్ణములవారికే పరిమితములు కావు. అవి పరంపరగా సకలమానవులకు వర్తించును. తండ్రిని చూచి కుమారుఁడు గురువును చూచి శిష్యుఁడు ఎట్లు వర్తించునో అట్లే నాలుగువర్ణములవారిని చూచుచు తక్కిన సమాజములోనివారు తమ యర్హతను బట్టి శక్తి కొలఁది యనుసరించు చుందురు. కావుననే శ్రీకృష్ణుడనెను. "శ్రేష్ఠుఁడు దేనిని ఎట్లు ఆచరించు చుండునో దానిని అట్లే ఇతరుఁడును ఆచరించుచుండును. అతఁడు దేనిని ప్రమాణముగా ఏర్పఱచునో లోకము దానినే అనుసరించును."

శ్లో॥ య ద్య దాచరతి శ్రేష్ఠ స్త త్త దే వేతరో జనః।
స యత్ప్రమాణం కురుతే లోక స్త దనువర్తతే॥ 21

భగవద్గీత - అధ్యాయము - 3

కావున చాతుర్వర్ణ్యవ్యవస్థ తక్కిన ప్రాణికోటి కంతకును ఆదర్శ ప్రాయమైనది. ఈ విషయమునే భగవంతుఁడగు మనువు ఇట్లు నిర్దే శించెను. "ప్రపంచములోని మానవు లందఱును ఈదేశమున జన్మించిన యగ్రజన్ముని యొక్క సన్నిధియందు తమ తమ జీవితవిధానములను గూర్చి శిక్షణమును పొందవలయును."

శ్లో॥ ఏత ద్దేశప్రసూతస్య సకాశా దగ్రజన్మనః।
స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః॥

మనుస్మృతి - అధ్యాయము - 1

కావున ప్రభువులు నాలుగువర్ణములవారియొక్క యోగక్షేమములనే కాక ఇతరప్రాణికోటియొక్క యభ్యుదయమును కూడ రక్షింపవలసియే యున్నది.

అప్పుడు రాముఁడు ఇట్లనెను "తండ్రిగారి వచననిర్దేశమువలనే ఆమాటయందలి గౌరవమువలన మీయొక్క వచనమువలనను ఈ కార్యము నిశ్శంకముగాఁ గావింపవలసినదే. అయోధ్యయందు గురుజన సమక్షమున మాతండ్రిగారు మీరు చెప్పినట్లు చేయవలసినదిగా అనుశాసించిరి. ఆమాట ఉపేక్షింపరానిది. కావున తండ్రిగారి మాటనుబట్టి బ్రహ్మవాదులైన మీశాసనమునుబట్టి ఉత్తమమైన తాటకావధమును గావింతును. సందేహము లేదు.

శ్లో॥ మునే ర్వచన మక్లీబం శ్రుత్వా నరవరాత్మజః।
రాఘవః ప్రాంజలి ర్భూత్వా ప్రత్యువాచ దృఢవ్రతః॥ 1

శ్లో॥ పితు ర్వచననిర్దేశాత్ పితు ర్వచనగౌరవాత్।
వచనం కౌశిక స్యేతి కర్తవ్య మవిశంకయా॥ 2

శ్లో॥ అనుశిష్టోఽస్మ్యయోధ్యాయాం గురుమధ్యే మహాత్మనా।
పిత్రా దశరథే నాహం నావ జ్ఞేయం హి తద్వచః॥ 3

శ్లో॥ సోఽహం పితు ర్వచ శ్శ్రుత్వా శాసనా ద్బ్రహ్మవాదినః।
కరిష్యామి న సందేహః తాటకావధ ముత్తమమ్॥ 4

శ్లో॥ గోబ్రాహ్మణహితార్థాయ లోకస్య చ హితాయ చ।
తవ చై వాప్రమేయస్య వచనం కర్తు ముద్యతః॥ 5

అక్లీబం - ధృష్టమ్

ఇట్లు పలికినవెంటనే రాముఁడు అల్లెత్రాటిని మ్రోగించెను. ఆభయంకర ధ్వని విని క్రుద్ధయై తాటక శబ్దము ననుసరించి పరుగెత్తుకొని వచ్చెను. ఆమెను చూచి రాముఁడు లక్ష్మణునితో ఇట్లనెను. "మాయా బలసమన్వితురాలై ఎదుర్కొనుటకు వీలు లేనట్లు వచ్చిపడుచున్న దీనిని చూడుము. దీని చెవులను ముక్కును హరించి దీనిని మరలి పోవునట్లు చేయుదును. స్త్రీత్వముచేత రక్షితురాలైన దీనిని చంపుటకు ఉత్సాహము కలుగుటలేదు. దీనిబలమును గమనమును ప్రతిహతము గావించుటయే మేలని నాకుఁ దోఁచుచున్నది."

శ్లో॥ ఏతాం పశ్య దురాధర్షాం మాయాబలసమన్వితామ్।
వినివృత్తాం కరో మ్యద్య హృతకర్ణాగ్రనాసికామ్॥ 11

శ్లో॥ న హ్యేనా ముత్సహే హన్తుం స్త్రీస్వభావేన రక్షితాం।
వీర్యం చాస్యా గతిం చైవ హన్యా మితి హి మే మతిః॥ 12

బాలకాండ - సర్గ 26

గో. టీక॥ ఏతావతైవ గురువచనానుష్ఠానసిద్ధే రితి భావః.

అప్పుడే ప్రతిజ్ఞ చేసియున్నను రాముఁడు వెంటనే తాటకను చంపుటకు సందేహించుట గమనింపఁదగియున్నది. అర్జునునకు కలిగిన దౌర్బల్యమువంటిదే ఇచ్చట శ్రీరామునకు కొంచెము కలిగినదన్న మాట. కర్ణనాసాచ్ఛేదము స్త్రీలకు శిక్షగా ప్రసిద్ధమై యున్న దని వ్యక్తమగుచున్నది.

రాముఁ డిట్లనుచుండఁగా తాటక క్రోధమూర్ఛితయై చేయి పైకెత్తి రామునివైపు పఱతెంచెను. విశ్వామిత్రుఁడు హుంకారముచే దానిని వెఱపించి రాఘవులకు స్వస్తియగుఁ గాక జయ మగుఁ గాక!

అని పలికెను. తాటక దుమ్ము ఎగయఁజిమ్మి వారిని కలగుండుపడఁ జేసి మాయచేత శిలావర్షమును కురిపించెను. రాముఁడు క్రుద్ధుఁడై శరజాలముచే శిలలను వారించుచు దాని కరములను ఖండించెను; లక్ష్మణుఁడు దాని కర్ణాగ్రములను నాసికను ఖండించెను. అంత నది మాయచే అనేకరూపముల నొందుచు అంతర్హితయై రాలవానతో వారిని ముంపఁ జొచ్చెను. అప్పుడు విశ్వామిత్రుఁడు రామునితో నిట్లనెను. "రామా! దీని విషయమున జాలి తలఁపరాదు. ఇది యజ్ఞవిఘ్నకారిణి. సంధ్యాకాలము సమీపించుచున్నది. రాక్షసులు సంధ్యాకాలమున దుర్ధర్షులగుదురు. కావున దీనిని వెంటనే సంహరింపుము". అంతట రాముఁడు శబ్దవేధికౌశలమున శబ్దమునుబట్టి దానిపై బాణప్రయోగమును గావించెను. తనయంతర్ధానశక్తి వ్యర్థమైనంతనే తాటక పిడుగువలె వారిపై పఱతెంచెను. రాముఁడొక నిశితశరమున వక్షమును ఛేదింపగా నది క్రింద పడి మరణించెను.

అప్పుడు దేవతలు సురేంద్రుఁడును రాముని ప్రశంసించిరి. దేవేంద్రుఁడు విశ్వామిత్రునితో ఇట్లనెను. "ఈతాటకాసంహారమునకు మే మందఱమును సంతోషించితిమి. ఇంక రామునియందు ప్రీతిని చూపుము. ప్రజాపతియైన కృశాశ్వనిపుత్రులు తపోబలపూర్ణులైన యస్త్రదేవతలను రామున కొసంగుము. ఇతఁడు వారిని పరిగ్రహించుటకు అర్హుఁడు. మఱియును నీయనుగమనమున దృఢవ్రతుఁడు. ఈతని వలన గొప్ప దేవకార్యము జరుగవలసియున్నది కదా!" పిదప దేవేంద్రుఁడు విశ్వామిత్రుని పూజించి సురలతో కూడ గగనమార్గమున నరిగెను.

"ఇతఁడు నీయనుగమనమునందు ఆసక్తిగలవాఁడు" (తవానుగమనే రతః) అని ఇంద్రుఁడు చెప్పుట గమనింపఁదగియున్నది. అనుగమన మనఁగా కేవలము తపోవనమునకు వెంట నడచుట కాదు.

అస్త్రములకు పాత్రుఁడని ఇంద్రు డీమాట చెప్పుచున్నాఁడు. ఆయస్త్రములకు ప్రయోజనమైన రాక్షససంహారపూర్వక లోకకల్యాణమును సాధించుటలో నిన్నే యనుసరింపఁగలఁడు; కావున వీనివలన నీలక్ష్యము సిద్ధించు నని దేవేంద్రునియభిప్రాయము.

శ్లో॥ ప్రజాపతేః కృశాశ్వస్య పుత్రాన్ సత్యపరాక్రమాన్॥ 29

శ్లో॥ తపోబలభృతో బ్రహ్మన్ రాఘవాయ నివేదయ।
పాత్రభూతశ్చ తే బ్రహ్మన్ తవానుగమనే రతః॥ 30

శ్లో॥ కర్తవ్యం సుమహత్ కర్మ సురాణాం రాజసూనునా।
ఏవ ముక్త్వా సురా స్సర్వే జగ్ము ర్హృష్టా విహాయసమ్॥ 31

బాలకాండ - సర్గ - 26

దీనివలన ఇంతవఱకును పాత్రుడైన శిష్యునికొఱకే విశ్వామిత్రుఁడు వేచియున్నాఁ డనుట స్పష్టము. తాటకాసంహారమున రాముని యోగ్యత వ్యక్త మైనది. కావున దేవేంద్రుఁడు కూడ రామునకు అస్త్రము లిమ్మని విశ్వామిత్రుని ప్రోత్సహించినాఁడు.

ఈసందర్భమున రాముఁడు కర్తవ్యమును నిశ్చయించుకొను విధాన మెట్టిదో గమనింపఁదగియున్నది. స్త్రీవధము మహాపాతక మనుట సుప్రసిద్ధము. అయినను ప్రజారక్షణముకొఱకు రాజపుత్రుఁడు స్త్రీవధమును కూడ చేయవలసినదే అని విశ్వామిత్రుఁడు ధర్మము యొక్క పద్ధతిని దృష్టాంతములతో నిరూపించెను. అప్పుడు రాముఁడు, "మీరు చెప్పిన ధర్మము సహేతుకముగా చక్కఁగా ఉన్నది. కావున అట్లే ఆచరింతును" అని చెప్పలేదు. ఆయన ఆహేతువాదమును పట్టించుకొన లేదు. ఆయన దృష్టిలో తండ్రిగారిమాట పరమప్రమాణము. తండ్రిగారిమాటను నిర్వహించుటయే ఆయనకు పరమకర్తవ్యము. తక్కిన ధర్మాధర్మములచర్చలతో ఆయనకు పనిలేదు. ఈవిషయమును

ఆయన రెండువిధములుగా ఉద్ఘాటించినాఁడు. తండ్రిగారు, "ఈకౌశికుఁడు చెప్పినపనిని చేయుము" అని విశ్వామిత్రుని చూపించెను: (పితుర్వచన నిర్దేశాత్. Directive Principle) ఒకవేళ ఆకౌశికుఁడు అధర్మకార్యమును చేయించినచో తాను చేయవలసినదేనా? ఆకౌశికుఁడు మంచివాఁడో చెడ్డవాఁడో నిశ్చయించుకోవలసిన యక్కఱ కూడ తనకు లే దని రాముఁడు పై మాటచేత స్పష్టము చేయుచున్నాఁడు. తండ్రిగారిమాట యందలి గౌరవముచేత (పితుర్వచనగౌరవాత్ Standing Cause of action) కౌశికుఁడు మంచికార్యమును చేయించుచున్నాఁడా, చెడ్డకార్యమునకు పురికొల్పుచున్నాఁడా అనువిచారణయే లేకుండ కౌశికుఁడు ఏది చెప్పినను చేయుదు నని రాముఁ డనుచున్నాఁడు. అనఁగా తండ్రిగారి వచననిర్దేశము ననుసరించి రామునిదృష్టిలో కౌశికునకు ఆయనవాక్యమునకు ప్రామాణ్య మేర్పడినది. కాఁబట్టి కౌశికునియొక్క ఆదేశము ధర్మబద్ధమా కాదా అనువిచారమే రామునకు అక్కఱలేకపోయినది. అనఁగా తల్లి తండ్రి ఆచార్యుఁడు మొదలుగా పెద్దలైనవారు ఏదేని ఒకకార్యమును చేయవలసినదిగా ఆజ్ఞాపించినచో పుత్రుఁడు శిష్యుఁడు మొదలగువారు వెంటనే ఆయాజ్ఞను నిర్వహింపవలసినదే; కాని అది ధర్మమా అధర్మమా అని చర్చించుచు కూర్చుండరాదు. "తండ్రిని దేవతనుగా కలిగియుండుము" (పితృదేవో భవ) అని వేదము శాసించుచున్నది. కుమారునకు తండ్రి దేవుఁడే అగును. అట్టి తండ్రియొక్క వాక్యమును కుమారుఁడు విచారించుటకు పూనుకొనినచో వానికి ఆతండ్రి దేవుఁ డెట్లగును? అదియునుగాక తండ్రియాజ్ఞను కుమారుఁడు తత్క్షణమే నిర్వహింపక దానినిగూర్చి విచారింపఁబూనుకొన్నచో పను లెట్లు జరుగును కావున అది క్రమశిక్షణకు పద్ధతి కాదు. పెద్దల యాజ్ఞలను పిన్నలు నిర్విచారముగా తత్క్షణమే జరుపవలె. అదియే క్రమశిక్షణకు పద్ధతి.

మఱి పెద్ద లందఱును సజ్జనులై యుందురా? వారు అక్రమములైన యాజ్ఞల నిచ్చినచో వానిని పాటింపవలసినదేనా? ఈప్రశ్నకే

ఒక సైనికుఁడుగాని, రాజకీయపక్షములలో ఒక సామాన్యుఁడైన కార్య కర్త గాని, ప్రభుత్వయంత్రాంగములో ఒకచిన్నయుద్యోగి గాని వేసినచో సమాధానమేమి చెప్పుదురు ? "అయ్యా! పైయధికారుల యుత్తరువు అక్రమమా సక్రమమా అన్న విచారణ నీకేల? విధికి కట్టుబడిన (Disciplined or Duty bound) సైనికుఁడవుగా లేక కార్యకర్తవుగా లేక ఉద్యోగివిగా ఆ యుత్తరువులను అమలు జరుపుటయే నీకర్తవ్యము. వానియొక్క మంచిచెడులనుగూర్చి యాలోచింపవలసినపని నీది కాదు. అవి మంచి వైనను చెడ్డ వైనను వానివలన కలుగుఫలముతో (Ultimate result) నీకు పనిలేదు" అనియే కదా సమాధానము చెప్పుదురు. ఈవిధానమునే కుటుంబమునందు గురుశిష్య సంబంధమునందును పాటింపవలె నని వేదము చెప్పుచున్నది. ఈనాఁటికిని ఈసూత్రమును సైన్యములో రాజకీయములలో ప్రభుత్వయంత్రాంగములో పాటించు చున్నారు. సైనికుఁడు సేనాధిపతిని ప్రశ్నింపఁడు; ప్రశ్నించినచో వాఁడే యుండఁడు. కార్యకర్త ప్రశ్నించినచో రాజకీయములలో వానికి భవిష్యత్తు ఉండదు. చిన్నయుద్యోగి అడిగినచో వానియుద్యోగమే ఊడిపోవచ్చును. ఆయుత్తరువులను పాటించుటవలన చిన్నవారికి అపాయమే సంభవించినను, "కర్తవ్యనిర్వహణమున ఇట్టియాపదలు (Hazards of Duty) సంభవించుచునేయుండును" అని కాని, "అయ్యా! ఇది యంతము ప్రారబ్ధకర్మయొక్క ఫలము; మనము ఏమి చేయఁ గలము" అని కాని సరిపెట్టుకొనుచుందురే కాని క్రిందివారు పైయధికారు లయుత్తరువులను ధిక్కరింపవచ్చు నని కాని విచారింపవచ్చు నని కాని బుద్ధిమంతులు ఎవరును అంగీకరింపరు. అట్లే తల్లిదండ్రులయాజ్ఞలను కుమారులు, గురువులయాజ్ఞలను శిష్యులను నిశ్శంకముగా నిర్వహింప వలయు ననుటయే సనాతనధర్మము. అట్టియాజ్ఞానిర్వహణమున ఆపదలు సంభవించినను, ఆకస్మికములైన విపత్తులను (Dangerous accidents) రోగములను ఎట్లు గత్యంతరములేక అనుభవించుచున్నామో, అట్లే అను

భవింపవలయునే కాని ఆజ్ఞాధిక్కారణము పనికిరాదు. తండ్రిమాటను ధిక్కారించినవాఁడు తన కుమారుని ఎట్లు అదుపులో పెట్టఁగలఁడు? గురువుయొక్క ఆజ్ఞను తిరస్కారించినవాఁడు తన శిష్యులను ఎట్లే శాసించి క్రమశిక్షణలో నుంచఁగలఁడు ? కావున ఎన్నికష్టనష్టములు సంభవించుటకు అవకాశమున్నను కుటుంబముయొక్క సమాజము యొక్క సక్రమజీవనమునకు (Orderly life) ఆధారములైన సూత్రములను వదలిపెట్టరాదనుటయే రామునివర్తనమునుబట్టి మనము గ్రహింపవలసియున్నది.

పిమ్మట ఆరాత్రి వారు తాటకావనముననే సుఖముగానుండిరి. తాటక చనిపోయినంతనే ఆవనము చైత్రరథమువలె ప్రకాశించెను.

శ్లో॥ ముక్తశాపం వనం తచ్చ తస్మిన్నేవ తదాహని
రమణీయం విబభ్రాజ యథా చైత్రరథం వనమ్॥ 35

గో. టీక. ముక్తశాపం – ముక్తోపద్రవమ్

బాలకాండ – సర్గ. 26

## 2. యజ్ఞరక్షణఘట్టము

తెల్లవారినతరువాత విశ్వామిత్రుఁడు దివ్యములైన సకలాస్త్రములను రాముని పరిగ్రహింపు మనెను. కృశాశ్వమహర్షి దక్షప్రజాపతి యొక్క పుత్రికలను జయ, సుప్రభ అను వారిని భార్యలుగా పరిగ్రహించెను. ఆయన జయయందు అసురసైన్యములవధకొఱకై ఏఁబది మందిని అస్త్రాత్మకులైన పుత్రులను పొందెను. అట్లే ఆయన సుప్రభయందు సంహారాత్మకములైన యస్త్రములను ఏఁబదిమందిని పొందెను.

శ్లో॥ తేఽపి పుత్రాః కృశాశ్వస్య ప్రజాపతిసుతాసుతాః
నైకరూపా మహావీర్యా దీప్తిమంతో జయావహాః॥ 14

శ్లో॥ జయా చ సుప్రభా చైవ దక్షకన్యే సుమధ్యమే।
తే సువాతేఽస్త్రశస్త్రాణి శతం పరమభాస్వరమ్॥ 15

శ్లో॥ పంచాశతం సుతాన్ లేభే జయా లబ్ధవరా వరాన్
వధా యాసురసైన్యానా మమేయాన్ కామరూపిణః॥ 16

శ్లో॥ సుప్రభాజనయ చ్చాపి పుత్రాన్ పంచాశతం పునః।
సంహారాన్ నామ దుర్ధర్షాన్ దురాక్రామాన్ బలీయసః॥ 17

బాలకాండ - సర్గ 21

విశ్వామిత్రుఁడు రామునితో నిట్లనెను. "కుమారా। నీయెడల నేను చాల పరితోషమును పొందితిని. అత్యంతమైన ప్రీతితో నీకు అన్ని యస్త్రములను ఇచ్చుచున్నాను. గంధర్వనాగాదులతో కూడిన దేవాసురగణముల నైనను నీవు ఆయస్త్రములతో జయింపఁగలవు. కామరూపములు మహాబలశాలులు పరమోదారములును అయిన యీయస్త్రములను వెంటనే పరిగ్రహింపుము." పిదప మహర్షి శుచియై తూర్పుముఖముగా కూర్చుండి రామునకు మంత్రసముదాయమును ఉపదేశించెను. ఆయ వస్త్రముల నన్నింటిని పొందఁగల్గుట దేవతలకు కూడ దుర్లభమే. ఆమహర్షి మంత్రములను జపించుచుండఁగా మహనీయములైన యాయస్త్రము లన్నియు వివిధరూపములతో రాముని సమీపించి అంజలించి సంతోషముతో "రాఘవా! మేము నీకు కింకరులమై యున్నాము" అని పలికెను. రాముఁడు ఆయస్త్రదేవతల నందఱను పాణిస్పర్శతో పరిగ్రహించి, "నేను స్మరించినంతనే వచ్చుచుండుఁడు" అని వారిని పంపెను.

శ్లో॥ పరితుష్టోఽస్మి భద్రం తే రాజపుత్ర మహాయశః।
ప్రీత్యా పరమయా యుక్తో దదా మ్యస్త్రాణి సర్వశః॥ 2

శ్లో॥ దేవాసురగణా న్వాపి సగంధర్వోరగా నపి।
యై రమిత్రాన్ ప్రసహ్యాజౌ వశీకృత్య జయిష్యసి॥ 3

శ్లో॥ ఏతాన్ రామ మహాబాహో కామరూపాన్ మహాబలాన్।
గృహాణ పరమోదారాన్ క్షిప్ర మేవ నృపాత్మజ॥ 21

శ్లో॥ స్థిత స్తు ప్రాఙ్ముఖో భూత్వా శుచి ర్మునివర స్తదా।
దదౌ రామాయ సుప్రీతో మంత్రగ్రామ మను త్తమమ్॥ 22

శ్లో॥ సర్వసంగ్రహణం యేషాం దైవతై రపి దుర్లభమ్।
జపత స్తు మునే స్తస్య విశ్వామిత్రస్య ధీమతః।
ఉపతస్థు ర్మహార్హాణి సర్వా ణ్యస్త్రాణి రాఘవమ్॥ 24

శ్లో॥ ఊచు శ్చ ముదితా రామం సర్వే ప్రాంజలయ స్తదా।
ఇమే స్మ పరమోదార కింకరా స్తవ రాఘవ॥ 25

శ్లో॥ ప్రతిగృహ్య చ కాకుత్స్థః సమాలభ్య చ పాణినా।
మనసా మే భవిష్యధ్వ మితి తా న్యభ్యచోదయత్॥ 26

బాలకాండ సర్గ–27

ఇట్లు విశ్వామిత్రుఁడు రామునకు దండచక్రము ధర్మచక్రము విష్ణుచక్రము వజ్రము శైవశూలము, మోదకి శిఖరి అనుగదలు, వరుణపాశము ధర్మపాశము కాలపాశము, శుష్కము ఆర్ద్రము అను అశనులు, మొదలుగా ఎన్నో అస్త్రములను ఇచ్చెను. ఈ యస్త్రము లన్నియు మంత్రాత్మకములే. వీని యొక్క జపముచేత ఆ మంత్ర ములకు అధిష్ఠానదేవతలు వచ్చి చెప్పిన పనులను చేయుచుండును. యుద్ధసమయములలో వీనిని ప్రయోగించినప్పుడు ఈయస్త్రదేవతలు చక్రము గద పాశము అశని మొదలగు రూపములను వహించి శత్రు సంహారము కావించును. కావున విశ్వామిత్రుడు అస్త్రములను ఇచ్చె ననఁగా ఆయామంత్రములను ఉపదేశించె ననియే గ్రహింపవలసి యున్నది. అవి ఆయుధములు కావు. ప్రయోగించినపుడు వీరులు ఆ దేవతలను బాణము, చక్రము, గద మొదలగు వానిపై ఆవహించి

ప్రయోగించుచుందురు. ఇట్టి ప్రయోగమున మంత్రశక్తియే ప్రధానము గాని ఆయుధముల బలము కాదు. రాముఁడు కాకాసురునిపై బ్రహ్మాస్త్రమును దర్భపుల్లపై ఆవహించి ప్రయోగించినట్లు ప్రసిద్ధమై యున్నది.

మంత్రము లేమి, మంత్రములవలన దేవతలు వచ్చుటేమి ? వారివలన శత్రుసంహారము జరుగునా అని శంకించు వారు నేఁడు పలువురు కలరు. ఇప్పటి భౌతికశాస్త్రవిజ్ఞానము ననుసరించి యివి నిరూపించుటకు వీలులేని వని వారియభిప్రాయము. ఆధునికశాస్త్ర విజ్ఞానమును చక్కఁగా ఆకళించుకొనిన శ్రీ వివేకానందుఁడు ఈ విషయమున ఏమి చెప్పెనో వినుఁడు "ప్రాచీనకాలమున యుద్ధముల లోని యస్త్రముల శక్తులన్నియు మంత్రాత్మకములు. మన శాస్త్రములం దెల్లయెడల నివి యంగీకరింపఁబడి యున్నవి. ఆశాస్త్రము లన్నియు భావనా మాత్రము లనుట మూఢత్వమే" **(Ls. 1-4, 18-23, P 89 Part VI-Works)**

పూజ్యులగు శ్రీ కోట వేంకటచలముగారి గ్రంథమున "కలిశకవిజ్ఞానము" తృతీయభాగములో అలెగ్జాండర్ క్రీ. పూ. 327 సం॥న మన దేశముపైకి దండెత్తివచ్చినప్పుడు అతనితో వచ్చిన చరిత్రకారుఁడు తెమిస్టసు వ్రాసిన మాటలు ఉదాహరింపఁబడినవి. అవి యీ సందర్భమున గమనింపఁ దగియున్నవి. చూడుఁడు.

"బ్రాహ్మణులు దూరమం దుండి పిడుగులను మెఱపులను మాపై వెదజల్లుచు యుద్ధము గావించిరి.

అలెగ్జాండరు అరిస్టాటిలునకు వ్రాసినయుత్తరములోని మాటలు ఉదాహరింపఁబడినవి.

"నా సైన్యము హిందూదేశములో దావాగ్నిసన్నిభములైన అస్త్రములలో మ్రింగివేయఁబడెను"

ఫిలోస్ట్రాటసు అను చరిత్రకారుని వాక్యములు కూడ ఆ గ్రంథమున ఉదాహరింపఁబడినవి.

"విరోధు లెవ్వ రైనను వారిపైకి యుద్ధమునకు వచ్చినచో ఆకసమునుండి జార్చినట్లు తుపానులను పిడుగులను శత్రువులపై వెదజల్లి తరిమివేసేదరు. శత్రురాజులు ముట్టడించువరకు ఈ బ్రాహ్మణఋషీశ్వరులు నిశ్చింతగా జూచుచుండి వారు ముట్టడి సాగించినవెంటనే సుడిగాడ్పులను పిడుగులను మింటనుండి కురిపించి వారల నాశనము గావించి పారద్రోలియున్నారు"—

"స్వానుభవముతో విదేశీయులు వ్రాసియున్నయీవిషయములు మరువరానివి. ఆనాడు ఇచ్చట అస్త్రప్రభావము ప్రదర్శింపఁబడియుండ దానిని విదేశీయులు కీర్తించియుండ మనవారు "మేము నమ్మఁజాలము" అనుట హేయము"

(బ్రహ్మశ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి శ్రీమద్రామాయణతత్త్వ కథనము-పుటలు 93, 94-ముద్రణము క్రీ. శ. 1961.

ఇట్లే విశ్వామిత్రుని తపస్సునకు మెచ్చి ఈశ్వరుఁడు ప్రత్యక్షమై యస్త్రముల నొసంగె ననువిషయమును కూడ అనేకులు నమ్మరు. "పరమేశ్వరునకు రూప మున్నదా? నామరూపరహితుఁడైన వాఁడు ఎట్లు ప్రత్యక్షమగును ?" అని వారు ప్రశ్నింతురు. కాని శ్రీకృష్ణ భగవానుఁడు గీతలో ఇట్లు చెప్పెను. "ఏయే భక్తుఁడు ఏవిధమైన దేవతారూపమును శ్రద్ధతో అర్చింపఁ గోరుచుండునో ఆయాభక్తులకు ఆయాదేవతారూపములందు అచలమైన శ్రద్ధ కలుగునట్లు చేయుదును. ఆశ్రద్ధతో అతఁడు ఆదేవతారూపమును ఆరాధించుచు నాచేతనే యొసంగఁబడు నభీష్టములను పొందును.

శ్లో॥ యో యో యాం యాం తనుం భక్త శ్శ్రద్ధ యార్చితు మిచ్ఛతి।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తా మేవ విదధా మ్యహమ్॥ 21

శ్లో॥ స తయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధన మీహతే।
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్॥ 22

భగవద్గీత-అధ్యా-7

కావున భగవంతుని రూపవంతునిగా అర్చించినచో ఆయన ఆ రూపముతో భక్తునకు ప్రత్యక్ష మగును. ఈవిషయమున శ్రీవివేకానందుఁ డేమి చెప్పెనో గమనింపుఁడు. "సగుణుఁడగు పరమేశ్వరుని నిరూపించు సందర్భములతో వేదములు నిండియున్నవి. సుదీర్ఘములగు తపస్సులవలనఁ బరమేశ్వరదర్శనము నొందిన మహర్షులు ఇతరుల కజేయమగు దానిని గోచర మొనర్చుకొని మేము దీనిని సాధించితిమని ప్రపంచమునకు సవాలు చేయుచున్నారు. ఆ మహర్షులయుపదేశముల ననుసరింపక, వారు చూపిన మార్గమున అడుగైనను బెట్టకయే సర్వము నెఱిఁగినయట్లే యహంకరించువారు మాత్రమే యామహానీయులు పొందిన దర్శనమును అంగీకరింపక విమర్శించుచుందురు. కాని "ఆ మహర్షులు నిర్దేశించిన విధానములను నేను సక్రమముగాఁ బాటించితిని, అయినను నా కట్టిదర్శనము కలుగ లేదు; ఆ ఋషు లందఱు అసత్యవాదులే"అని చెప్ప సాహసింపఁగలిగినవాఁడు నేటివఱ కెవఁడును కన్పించుట లేదు."

తాటకావనమునుండి విశ్వామిత్రుఁడు ప్రయాణ మగుచుండెను. అప్పుడు రాముఁడు విశ్వామిత్రునకు ప్రాంజలియై, "అయ్యా! ఈయస్త్రములచేత నేను దేవతలకు కూడ దురాధర్షుఁడ నైతిని. మఱి వీనికి సంహారములను కూడ నెఱుంగఁ గోరుచున్నాను" అని ప్రార్థించెను"

శ్లో॥ గృహీతాస్త్రోఽస్మి భగవన్ దురాధర్ష స్సురాసురైః।
అస్త్రాణాం త్వహ మిచ్ఛామి సంహారాన్ మునిపుంగవ॥ 2

శ్లో॥ ఏవం బ్రువతి కాకుత్స్థే విశ్వామిత్రో మహాతపాః।
సంహారాన్ వ్యాజహా రాథ ధృతిమాన్ సువ్రత శ్శుచిః॥ 3
బాలకాండ - సర్గ - 28

ఉపసంహారము నెఱుఁగకుండ అస్త్రములను ప్రయోగింపరాదు. కావున కేవలాస్త్రగ్రహణము ప్రయోజనకరము గాదు. అందువలన సంహారములను కూడ నెఱిఁగింపు మని రాముఁడు ప్రార్థించెను. రాముని సంప్రదాయవిజ్ఞతకు విశ్వామిత్రుఁడు సంతోషించి సత్యవంతము, సత్యకీర్తి, దశాక్షము, శతవక్త్రము, దశశీర్షము, శతోదరము మున్నగా సంహారముల నొసంగెను. వెంటనే ఆ మంత్రాధిదేవతలు దివ్యమూర్తులతో సుఖప్రదములై రాముని సమీపించిరి. అందు కొందఱు నిప్పు కణికలవలె, కొందఱు పొగవలె, మఱికొందఱు చంద్రసూర్యులవలె నుండిరి. వారందఱును ప్రాంజలులై "మేము నీకు ఏమి చేయవలసి యున్నది?" అని మధురముగా అడిగిరి. అప్పుడు రాముఁడు "నాకు పని యేర్పడినప్పుడు స్మరించినంతనే వచ్చి సాయ మొనర్పుఁడు. యథేచ్ఛగా వెళ్ళుఁడు" అని చెప్పెను. వారు అట్లే అని రామునకు ప్రదక్షిణము గావించి సెలవుఁగైకొని వెళ్ళిరి.

శ్లో॥ దివ్యభాస్వరదేహా శ్చ మూర్తిమన్త స్సుఖప్రదాః॥ 11

శ్లో కేచి దంగారసదృశాః కేచి ద్ధూమోపమా స్తథా।
చంద్రార్కసదృశాః కేచిత్ ప్రహ్వాంజలిపుటా స్తథా॥ 12

శ్లో॥ రామం ప్రాంజలయో భూత్వాబ్రువన్ మధురభాషిణః।
ఇమే స్మ నరశార్దూల శాధి కిం కరవామ తే॥ 13

శ్లో॥ గమ్యతా మితి తా నాహ యథేష్టం రఘునందనః।
మానసాః కార్యకాలేషు సాహాయ్యం మే కరిష్యథ॥ 14

శ్లో॥ అథ తే రామ మామంత్ర్య కృత్వా చాపి ప్రదక్షిణమ్।
ఏవ మ స్త్వితి కాకుత్థ్సు ముక్త్వా జగ్ము ర్యథాగతమ్॥ 15
బాలకాండ-సర్గ-28

తరువాత వారు సిద్ధాశ్రమము చేరనేగిరి. ఆయాశ్రమము దూరమున కన్పించినంతనే విశ్వామిత్రుఁడు దానిని గూర్చి ఇట్లు చెప్పెను. "ఇచ్చట విష్ణుదేవుఁడు పెక్కు యుగములు తపస్సుచేయుచు నుండెను. ప్రహ్లాదుని మనుమఁడు విరోచనునిపుత్రుఁడును అయిన బలి దేవతలను జయించి స్వర్గరాజ్యమును పాలింప మొదలిడి భూలోకమున యజ్ఞమును చేయ నారంభించెను. వానిలో ఉత్తమమైన యజ్ఞము జరుగుచుండఁగా దేవతలు వచ్చి ఈ యాశ్రమముననే విష్ణుదేవుని శరణుఁజొచ్చి, ఆ యజ్ఞము ముగియకుండఁగనే దేవకార్యమును సాధింపు మని ప్రార్థించిరి; యజమానుఁడైన బలిని వామనరూపమున స్వర్గరాజ్యమును యాచింపు మని ఉపాయమును కూడ చెప్పిరి. ఆసమయముననే అదితితో కూడ కశ్యపమహర్షి వేయి దివ్యసంవత్సరములు వ్రత మొనర్చి విష్ణుదేవుని స్తుతించెను. విష్ణుదేవుఁడు ప్రత్యక్ష మయ్యెను. దేవతలను అనుగ్రహించుటకై తనకు పుత్రుఁడుగ ఇంద్రునకు తమ్ముఁడుగా జన్మింపు మని కశ్యపుఁడు ఆయనను ప్రార్థించెను. విష్ణువు అంగీకరించెను. అప్పుడు కశ్యపుఁడు "నీయనుగ్రహమున మా కోరికలు సిద్ధించుచున్నవి. కావున ఇది సిద్ధాశ్రమముగా ప్రసిద్ధ మగునుగాక" అని కోరెను. విష్ణువు అట్లే అని కశ్యపునకు వామనుఁడుగా జన్మించి బలిని మూఁడడుగులు యాచించి మూడులోకములను ఆక్రమించి త్రైలోక్యరాజ్యమును మరల ఇంద్రున కొసంగెను. ఇది వామనునియాశ్రమ మని భక్తితో నేను కూడ ఇందే యున్నాను."

శ్లో॥ ఇహ రామ; మహాబాహో! విష్ణు ర్దేవవరః ప్రభుః।
వర్షాణి సుబహూ న్యేవ తథా యుగశతాని చ॥ 2

శ్లో॥ తపశ్చరణయోగార్థ మువాస సుమహాతపాః।
ఏష పూర్వాశ్రమో రామ వామనస్య మహాత్మనః॥ 3

శ్లో॥ సిద్ధాశ్రమ ఇతి ఖ్యాతః సిద్ధోఽప్యత్ర మహాతపాః॥ 4

గో. టీక; మహాతపాః కాశ్యపః వామనః

శ్లో॥ బలే స్తు యజమానస్య దేవా స్సాగ్నిపురోగమాః।
సమాగమ్య స్వయం చైవ విష్ణు మూచు రిహాశ్రమే॥ 6

శ్లో॥ బలి ర్వైరోచని ర్విష్ణో యజతే యజ్ఞ ముత్తమమ్।
అసమాప్తే క్రతౌ తస్మిన్ స్వకార్య మభిపద్యతామ్॥ 7

శ్లో॥ స త్వం సురహితార్థాయ మాయాయోగ ముపాగతః।
వామనత్వం గతో విష్ణో కురు కళ్యాణ ముత్తమమ్॥ 9

బాలకాండ–సర్గ-29

యజ్ఞమును రక్షింపవలసిన విష్ణువు బలియొక్క యజ్ఞమునకు విఘ్నమును కలిగించి బలిని బంధించుట ఎట్లు సమంజస మగును? బలికి పూర్వమే ఒకడు నూఱుయజ్ఞములనో గొప్ప తపస్సులనో చేసి ఇందప్రదవిని పొందియుండెను. ఆయనయొక్క పరిపాలనకాలము పూర్తికాకముందే బలి దైత్యులప్రోత్సాహమున ఆ యింద్రుని జయించి ఆ పదవిని ఆక్రమించెను. తరువాత ఆ పదవికి అవశ్యకమైన యర్హతను **(Qualification)** సంపాదించుకొనుటకై యజ్ఞములను చేయ మొదలు పెట్టెను. ఆ యజ్ఞములు పూర్తియైనచో బలికి కూడ ఇంద్రత్వమునకు తగిన యోగ్యత కలుగు నన్న మాట. ఇది అక్రమము. ఒకానొకడు ప్రజాస్వామ్యవిధానములో విప్లవము ద్వారా బలప్రయోగమున ఉన్న ప్రభుత్వమును **(Existing Government)** పడగొట్టి ప్రధాన మంత్రియో అధ్యక్షుడో అయి, తరువాత ఆపదవియందు నెలకొనుటకు యోగ్యతను సంపాదించుకొనుటకై ఎన్నికలను జరిపి అందు నెగ్గుట

ఎట్టిదో ఇదియు అట్టిదే. కావున బలి యవలంబించినపద్ధతి విశ్వ రాజ్యాంగమునకు విరుద్ధము **(Unconstitutional in the Administration of The Universe)** . అతఁడు ముందుగా నూఱు యజ్ఞములో తపస్సులో చేసి ఇంద్రపదవికి అర్హతను సంపాదించుకొని అప్పుడున్న యింద్రునిపరిపాలనకాలము పూర్తియైన తరువాత, తాను కూడ ఇంద్రుఁడు కావచ్చును. అది క్రమమైన పద్ధతి. బలి అట్లు చేయక దురాక్రమణము కావించెను. అందువలన శిక్షార్హుఁ డయ్యెను. విశ్వముయొక్క సృష్టికి బ్రహ్మ అధికారి. అట్లే దాని యొక్క స్థితికి విష్ణువు అధికారి. **(Administrator of the Universe)** విశ్వమునందు ప్రశాంతస్థితికి **(Peaceful Existenec)** ధర్మపరిపాలనమే **(Rule of Law)** సాధనము. అది భంగపడి నపుడు ఆయన యేదో రూపమున అవతరించి ధర్మభంజకులను శిక్షించి ధర్మపరులను కాపాడి ధర్మపరిపాలనమును మరల నెలకొల్పును. ఈ కారణముచేత ఆయన బలిని నిగ్రహించి ఇంద్రునకు మరల పదవి నొసంగెను.

విశ్వామిత్రుఁడు ఈకథను చెప్పుచుండఁగా వారు సిద్ధాశ్రమము లోనికి పోయిరి. ఆదినముననే ఆయన యజ్ఞదీక్షను పొందెను. మఱు నాఁడుదయమున రామలక్ష్మణులు విశ్వామిత్రుని చేరి, "ఆ నిశాచరుల నుండి మిమ్ము ఎప్పుడు రక్షింపవలె ? వారు ఏ సమయమునందు వత్తురు ?" అని అడిగిరి. అప్పుడు అచ్చట నున్న మహర్షు లిట్లనిరి. "ఈ దినమునుండి ఆఱు అహోరాత్రములు మీరు యజ్ఞమును రక్షింప వలె. మహర్షి దీక్ష నవలంబించి మౌనమును పొందియున్నాఁడు"

ఆ సోదరులు ధనుస్సులను ధరించి అహర్నిశములు జాగరూకులై తపోవనమును రక్షించుచుండిరి. ఆఱవదినమున ఆకాశము వర్షాకాలపు మేఘములతో నిండినట్లుగా అయ్యెను. ఇంతలో మాయావులైన మారీచ

సుబాహువులు అనుచరులతో కూడి భయంకరనాదములతో వచ్చి రక్తమును కురిపింపఁ జొచ్చిరి. రాముఁడు వారిని చంపుటకు ఇష్ట పడక వారికి నాయకుఁడై ముందునకు వచ్చుచున్న మారీచుని మాన వాస్త్రముతో నూఱుయోజనములదూరమున సాగరసంప్లవమునందు పడునట్లుగా విసరివైచెను. సాగరసంప్లవ మనఁగా రెండు సముద్ర ముల సంధి. సిద్ధాశ్రమమునుండి 800 మైళ్ళ దూరములో ఇప్పటి కన్యాకుమారిసమీపమున వాఁడు మహోదధి(**Bay of Bengal**) రత్నా కరము (**Arabian sea**) కలియుచోట పోయి పడె నన్నమాట.

శ్లో॥ స తేన పరమాస్త్రేణ మానవేన సమాహతః।
సంపూర్ణం యోజనశతం క్షిప్తస్సాగరసంప్లవే॥ 18
బాలకాండ-సర్గ-30

ఆమానవాస్త్రము మారీచునకు మూర్ఛ కలిగించినదే గాని చంపలేదు. అందువలననే అతఁడు ఎట్లో దండకారణ్యమునకు చేరి ఆశ్రమమును ఏర్పరచుకొని తపస్సు చేయ మొదలిడెను. నాయకుఁ డెగిరిపోవుటను చూచి అనుచరులు పారిపోయినచో వారిని హింసించుట తప్పును అని రామునితలంపుగా ఉండవచ్చును. ఈ కారుణ్యము రామునియందు ప్రబలముగా అనేకపర్యాయములు కన్పించును. కాని తక్కినవారు అట్లు పారిపోలేదు. అందువలన రాముఁడు ఆగ్నే యాస్త్రమున సుబాహువును, వాయువ్యాస్త్రమున తక్కిన రాక్షసులను సంహరించెను.

రాజకుమారులపరాక్రమమునకు మును లందఱు మిగుల సంతో షించిరి. యజ్ఞము సాంగముగా సమాప్తమయ్యెను. విశ్వామిత్రుఁడు రాముని చూచి "కుమారా! కృతార్థుఁడనైతిని. నీవు గురువచనమును నిర్వహించి ఈసిద్ధాశ్రమమును సార్థకమైన పేరుగలదానినిగా చేసితివి" అని ప్రశంసించెను. పిమ్మట రామలక్ష్మణులతో ఆయన సాయంసంధ్య నుపాసించెను.

శ్లో॥ కృతార్థోఽస్మి మహాబాహో! కృతం గురువచ స్త్వయా।
సిద్ధాశ్రమ మిదం సత్యం కృతం వీర మహాయశః॥
స హి రామం ప్రశ స్యైవం తాభ్యాం సంధ్యా ముపాగమత్॥26
బాలకాండ-సర్గ-30

గద్యము : ఆపస్తంబసూత్ర కౌండిన్యసగోత్ర పోలూరి వేంకట నరసాంబానారాయణామాత్యపుత్ర హనుమజ్జానకీరామశర్మ ప్రణీతంబైన శ్రీ రామాయణతరంగిణియందు మూఁడవదియైన యజ్ఞతీర్థము సమాప్తము.

# 4. కళ్యాణతీర్థము

## 1. కుశవంశకథాఘట్టము

యజ్ఞము ముగిసిన తరవాత మఱునాఁడు ఉదయమున రామలక్ష్మణులు విశ్వామిత్రునియొద్దకు పోయి నమస్కరించి, "ఇదిగో మేము వచ్చితిమి. నీకు కింకరులము. మేము ఏమి చేయవలయునో చెప్పుము. మమ్మ నీయిష్టానుసారముగా ఆజ్ఞాపింపుము." అని విన్నవించిరి.

శ్లో॥ ఇమౌ స్మ మునిశార్దూల కింకరౌ సముపాగతౌ।
ఆజ్ఞాపయ యథేష్టం వై శాసనం కరవామ కిమ్॥ 4
బాలకాండ-సర్గ-31

రాజపుత్రులైన రామలక్ష్మణులు "మేము నీకు కింకరులము" అని చెప్పుట గమనింపఁదగియున్నది. ఇది కేవలమైన విధేయతకు లక్షణము **(Absolute Obedience).** ఇప్పుడు తాత్కాలికమైన ప్రయోజనాపేక్షతో కొందఱు రాజకీయనాయకులయెడ, అధికారుల విషయమున ఇట్లు ప్రవర్తించుచున్నారు గాని, తల్లిదండ్రుల యెడ గురువులయెడ ఇట్లు చెప్పగలవారు అఱుదగుచున్నారు. సమా

సత్వము (Equality) వ్యక్తిత్వము (Individuality) మొదలగు భావములు ప్రబలములై విధేయత అడుగంటుచున్నది.

అప్పుడు విశ్వామిత్రునిసమక్షమున మహర్షు లిట్లనిరి. "పరమధర్మిష్ఠమైన యజ్ఞము మైథిలుఁడైన జనకుఁడు చేయఁబోవుచున్నాఁడు. అచ్చటికి మేము పోవుచున్నాము. నీవు కూడ మాతో అక్కడికి వచ్చుచున్నావు. ఆరాజుయొక్క ఇంటియందు దేవతవలె ఆరాధింపఁబడుచున్న యద్భుతమైన ధనుస్సును చూడఁగలవు. అది వివిధ గంధధూపములతో అర్చింపఁబడుచున్నది"

శ్లో॥ మైథిలస్య నరశ్రేష్ఠ జనకస్య భవిష్యతిః
యజ్ఞః పరమధర్మిష్ఠః తత్ర యాస్యామహే వయమ్॥ 6

శ్లో॥ త్వం చైవ నరశార్దూల సహాస్మాభి ర్గమిష్యసి।
అద్భుతం చ ధనూరత్నం తత్ర త్వం ద్రష్టు మర్హసి॥ 7

శ్లో॥ అయాగభూతం నృపతే స్తస్య వేశ్మని రాఘవః
అర్చితం వివిధై ర్గంధైః ధూపై శ్చాగురుగంధిభిః॥ 13

బాలకాండ-సర్గ-31

గో. టీక : ధనురుత్సవే ప్రాధాన్యేన అర్చితం ధనుః అయాగః ఉచ్యతే—

తిలకటీక : యజనీయదేవతాభూతమ్।

విశ్వామిత్రుఁ డేమియు చెప్పలేదు. మహర్షులు కూడ జనకుని శపథమునుగూర్చి గాని సీతనుగూర్చి గాని ప్రస్తావింపకుండుట గమనింపఁ దగియున్నది. రామలక్ష్మణులు కూడ "మమ్ము యజ్ఞరక్షణముకొఱకుఁ గదా ఇక్కడికి తీసికొని వచ్చితిరి. అది పూర్తియైనది. ఇంక మేము అయోధ్యకు పోకుండ మిథిల కెందుకు రావలె?" అని యడుగకుండుటయు గమనింపఁదగియే యున్నది.

విశ్వామిత్రుఁడు ప్రయాణ మగుచుండఁగా నూఱు శకటములతో అగ్నిహోత్రాది సామగ్రులతో పెక్కుమంది మహర్షులు బయలుదేరిరి. కొందఱు ఆశ్రమమునందే యుండిరి. విశ్వామిత్రుఁడు నిలిచియున్న ఋషులను వనదేవతలను సంబోధించి, "మీ కందఱకు స్వస్తి అగును గాక! ఈ సిద్ధాశ్రమమునందు నేను సంకల్పసిద్ధుఁడునై ఇక్కడనుండి జాహ్నవికి ఉత్తరముగా నున్న హిమవంతమునకు పోయి వత్తును" అని చెప్పి ఆయాశ్రమమునకు ప్రదక్షిణము గావించి బయలుదేరెను. ఆశ్రమవాసులైన ఋషులు మృగపక్షిగణములు కూడ అయనను సాగ నంపుచు వెంట వచ్చెను. కొంతదూరము పోయిన తరవాత ఆయన "ఇంక మీరు నిలువుఁడు" అని వారి నందఱను వెనుకకు పంపెను.

శ్లో॥ స్వస్తి వోఽస్తు గమిష్యామి సిద్ధ స్సిద్ధాశ్రమా దహమ్।
ఉత్తరే జాహ్నవీతీరే హిమవన్తం శిలోచ్చయమ్॥ 15

శ్లో॥ ప్రదక్షిణం తతః కృత్వా సిద్ధాశ్రమ మనుత్తమమ్।
ఉత్తరాం దిశ ముద్దిశ్య ప్రస్థాతు ముపచక్రమే॥ 16

శ్లో॥ మృగపక్షిగణా శ్చైవ సిద్ధాశ్రమనివాసినః।
అనుజగ్ము ర్మహాత్మానం విశ్వామిత్రం తపోధనమ్॥ 18

శ్లో॥ నివర్తయామాస తతః పక్షిసంఘాన్ మృగా నపి॥ 19

బాలకాండ-సర్గ-31

వారు చాల దూరము పోయి అస్తమయవేళకు శోణాకూలమును చేరి స్నానసంధ్యాగ్నిహోత్రముల నిర్వర్తించిరి. ఆ రాత్రికి వారు అక్కడ నుండిరి.

"ఏదేశ మిది?" యని రాముఁ డడుగఁగా మహర్షిమధ్యమున విశ్వామిత్రుఁ డిట్లు చెప్పెను.

"కుశుఁడు బ్రహ్మపుత్రుఁడు. ఆయన సద్వంశజాతయైన వైదర్భియందు కుశాంబుఁడు కుశనాభుఁడు అధూర్తరజసుఁడు వసువు

అను నల్వురు పుత్రులను మహాబలశాలులను పొందెను. ఆయన ప్రజా పాలనమున శ్రద్ధగలవాఁడై ఈకుమారులవలన క్షత్రధర్మమును పెంపొందింపఁ దలచెను.వారు ధర్మిష్ఠులు సత్యవాదులు మహోత్సాహులు దీప్తియుక్తులై యుండిరి. ఆయన వారిని పిలిచి, "మీరు ప్రజలను పాలింపుఁడు; పుష్కలమైన ధర్మమును పొందఁగలరు" అని యాదేశించెను.

తండ్రియొక్క ఆశయము నవలంబించి కుశాంబుడు కౌశాంబిని, కుశనాభుడు మహోదయమును ఆధూర్తరజసుఁడు ధర్మారణ్యమును వసువు గిరివ్రజమును రాజధానులుగా చేసికొని ప్రజాపాలన మొనర్చిరి. ఇది వసువు యొక్క దేశము. దీనిని మగధ యందురు. ఇందు ఐదు శైలములు కలవు. శోణానది ఈశైలములమధ్య మాలికవలె ప్రవహించుచు సుమాగధి అని విఖ్యాత అయ్యెను.

శ్లో॥ స మహాత్మా కులీనాయాం యుక్తాయాం సుమహాబలాన్।
వైదర్భ్యాం జనయామాస చతురః సదృశాన్ సుతాన్॥ 2

శ్లో॥ కుశాంబం కుశనాభం చ ఆధూర్తరజసం వసుమ్।
దీప్తియుక్తాన్ మహోత్సాహాన్ క్షత్రధర్మచికీర్షయా॥ 3

శ్లో॥ తా నువాచ కుశః పుత్రాన్ ధర్మిష్ఠాన్ సత్యవాదినః।
క్రియతాం పాలనం పుత్రా ధర్మం ప్రాప్స్యథ పుష్కలమ్॥ 4

గో. టీక -: కౌ భూమౌ శేతే ఇతి కుశః; నారదాదివత్ బ్రహ్మలోకే అనవస్థాయ ప్రజాపాలనే దత్తాదరతయా భూమౌ అవస్థానాత్ కుశ ఇత్యస్య నామ। అత ఏవ క్షత్రియవ్యాపారాత్ క్షత్రియోఽయమ్।

తి. టీక :- క్షత్రధర్మచికీర్షయా తద్ధర్మవృద్ధికరణేచ్ఛయా।

శ్లో॥ సుమాగధీ నదీ రమ్యా మాగధాన్ విశ్రుతా యయౌ।
పంచానాం శైలముఖ్యానాం మధ్యే మాలేవ శోభతే॥ 9

శ్లో॥ సైషా హి మాగధీ రామ వసో స్తస్య మహాత్మనః।
పూర్వాభిచరితా వీర సుక్షేత్రా సస్యమాలినీ॥ 10

గో. టీక :- పూర్వదేశాత్ ప్రత్యఙ్ముఖవాహినీ

బాలకాండ-సర్గ-32

కుశుఁ డను పేరు గమనింపఁ దగినది. "కు" అనఁగా భూమి. అందు శయనించువాఁడు కుశుఁడు. బ్రహ్మయొక్క కుమారుఁడు భూమియందు శయనించు టేమి? ఆయన తండ్రితో నారదాదులవలె బ్రహ్మలోకమున ఉండక భూలోకమునకు వచ్చె నన్నమాట. తండ్రియే ఆయనను భూలోకమున ధర్మమును పెంపొందింపు మని పంపియుం డును. ప్రజాపాలనము చక్కఁగా జరుగుచున్నచో ప్రజ లందఱును తమతమధర్మములను చక్కఁగా నిర్వహించుకొనుచు వానియందు పెంపును బొందఁగల్గుదురు. ఎవరిపాటికి వారు తపస్సునో వాణిజ్యమునో ఇతరవృత్తులనో చేసికొనుచుండుట సులభము. కానీ వీరందఱు తమలో తాము పోటీపడకుండ, కామక్రోధాదులకు వశులై కలహింపకుండ సమాజము సుఖశాంతులతో వర్ధిల్లుటకు సమర్థుఁడైన పరిపాలకుఁడు అవశ్యకము. బ్రహ్మకు మనుమలైన తనకుమారులు తపస్సు చేసికొనుచు సుఖముగా నుండఁగోరుచున్నను, ఆయన వారిని ప్రజాపాలనముఁ గావింపుఁ డని ఆదేశించెను. నిజమున కది సులభము కాదు. అందు ఎన్నో బాధ్యతలు కలవు. అందువలననే "కిరీటమును ధరించిన శీర్షము చింతాభారమున అసుఖముతో శయనించుచుండును" అను సూక్తి లోకమున ప్రసిద్ధ మయ్యెను.

**"Uneasy lies The head that wears a Crown"**
**Henry IV-Part II. Act. IV. Sence I**

ఇట్లు కుశుఁడు లోకసంగ్రహదృష్టితో క్షత్రియధర్మమును అవలంబించి క్షత్రియుఁ డయ్యెను. ఆయనవంశము క్షత్రియవంశ మయ్యెను.

అట్లయినచో వర్ణములు వృత్తులనుబట్టి ఏర్పడుచున్నవే కాని జన్మసిద్ధములు కావు అని చెప్పవచ్చునా? అట్లు చెప్పుటకు వీలులేదు. పశువులు పక్షులు మొదలగు వానియందు జాతిభేదములు జన్మసిద్ధముగానే ఎట్లు యేర్పడుచున్నవో అట్లే మానవులయందును వర్ణభేదములు జన్మసిద్ధముగానే యున్నవి. ఈ భేదములు భూలోకమున మానవులయందే కాని యితరలోకములలో లేవు. బ్రహ్మయొక్క కుమారులకు ఆలోకమున వర్ణవిభేదము లేదు. కాని ఆయన తనపుత్రులను భూలోకమునకు పంపునప్పుడు వసిష్ఠాదులను బ్రహ్మర్షులనుగా కుశుఁడు మొదలగువారిని క్షత్త్రియులనుగా ఉండుఁడని యాదేశించెను. కావున సృష్టికర్తయొక్క ప్రత్యేకమైన నియోగమున (Special Order) బ్రహ్మపుత్రులయిన యామహర్షులు భూలోకమున బ్రాహ్మణవంశములను క్షత్రియవంశములను పెంపొందించిరి. ఇది తక్కినవారికి వర్తింపదు. తక్కినవా రందఱు జన్మచేతనే వర్ణములను పొందిరి. కావుననే పరశురాముఁడు క్షత్త్రియకర్మను గావించినను క్షత్రియుఁడు కాలేదు. క్షత్రియుఁడుగా జన్మించిన విశ్వామిత్రుఁడు లక్షలయేండ్లు తపస్సు చేసినఁగాని బ్రహ్మర్షిత్వమును పొందఁజాలక పోయెను. నిజమునకు ఆ తపస్సు కూడ ఆబ్రహ్మర్షిత్వమునకు ముఖ్యకారణము కాదు. ఋచీకమహర్షి బ్రాహ్మణుఁడైన కుమారుఁడు జన్మింపవలయునని తయారుచేసిన హవిష్యమును విశ్వామిత్రునితల్లి భుజించెను. అందువలన జన్మసిద్ధముగనే ఆయనయందు బ్రాహ్మణత్వము నిప్పుపుల్లయందు దాహకద్రవ్యమువలె గూఢమైన శక్తిగా (Potential Energy) ఉన్నది. ఆయన చేసిన తపస్సు అంతయు గూఢమైయున్న యాశక్తిని ప్రజ్వలింపజేయుటకు (Making it Kinetic energy) ఉపయోగపడినది. అంతేకాని తపస్సు చేతనే ఆయన బ్రాహ్మణత్వమును పొందెనని చెప్పుటకు వీలు లేదు. వస్తువునందు సహజముగా లేనిధర్మము ఏసాధనముచేత కూడ క్రొత్తగా పుట్టదు. అయస్కాంతమును దెచ్చి ఇనుముపై పెట్టి

ఘర్షణ మొనరించినచో అది అయస్కాంత మగును, కాని మట్టిపెడ్డపై పెట్టి ఎంత సాధనము గావించినను అది అయస్కాంతము కానేరదు. కావున వర్ణములు జన్మసిద్ధములే కాని వృత్తులచేత తపస్సులచేత లభింపవు.

కుశనాభునకు ఘృతాచియందు నూర్వురు కన్యలు కలిగిరి. వారు మెఱపుతీఁగలవంటివారు. వా రొకప్పుడు ఉద్యానవనమున విహరించు చుండఁగా వాయుదేవుఁడు వారిని కామించి, ఇట్లనెను. "నేను మిమ్ము కోరుచున్నాను. మీరందఱు నాకు భార్యలు అగుదురు. మనుష్యత్వమును వదలి మీరు దీర్ఘాయువును పొందఁగలరు. యౌవనము ఎప్పుడును చంచలము. మనుష్యులయందు మిగుల చంచలము. అక్షయ్యమైన యౌవనము పొంది మీరు అమరకాంత లగుదురు."

ఆ మాటలు విని ఆ కన్య లిట్లనిరి, "అయ్యా! నీవు సకల భూతములయందు చరించుచుండు సురశ్రేష్ఠుఁడవు. మా కందఱకును నీ ప్రభావము తెలియును. మ మ్మేల నీవు అవమానించుచున్నావు? మే మందఱమును కుశనాభునిపుత్రికలము. నిన్ను నీపదవినుండి దిగఁజార్పఁగల సామర్థ్యము మా కున్నది. అయినను మేము మా తపస్సును రక్షించుకొనుచున్నాము. ఓయీ! దుర్బుద్ధీ! సత్యవాదియైన మాతండ్రిని అవమానించి స్వతంత్రతతో మేము స్వయంవరమును పొందుకాలము రాకుండుఁ గాక! తండ్రియే మాకు ప్రభువు; పరమదైవతము. ఎవనికి మమ్ము ఆయన ఇచ్చునో అతఁడే మాకు భర్త యగును."

శ్లో॥ మాభూత్ స కాలో దుర్మేధః పితరం సత్యవాదినమ్।
అవమాన్య స్వధర్మేణ స్వయంవర ముపాస్మహే॥ 21

తి. టీక :— స్వధర్మేణ-కామేన, ఆత్మనా స్వాతంత్ర్యేణ

శ్లో॥ పితా హి ప్రభు రస్మాకం దైవతం పరమం చ నః।
యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి॥ 22
బాలకాండ – సర్గ. 32

ఆ మాటలకు వాయుదేవుఁడు కోపించి, వారిని భంజించెను. వెంటనే వా రందఱును గూని కలవా రైరి.

వారు దుఃఖముతో అంతఃపురమునకు పోయిరి. వారిని చూచి కుశనాభుఁడు ఉద్వేగముతో ఇదే మని యడిగెను. వా రందఱు ఆయనకు పాదాభివందనము గావించి జరిగిన విషయమును చెప్పిరి. ఆయన వారిని ఇట్లు అభినందించెను. "బిడ్డలారా! క్షమావంతులకు క్షమించుట కర్తవ్యము. దానిని మీ రందఱు ఐకమత్యమును బొంది గొప్పగా నిర్వహించినారు. నాకులముయొక్క ఔన్నత్యమును గూడ మీరు చక్కఁగా కాపాడినారు. క్షమ స్త్రీకిఁ గాని పురుషునకుఁ గాని అలంకారము. ఓర్చుకొనుట చాల దుష్కరము; దేవతలయందు అది ఇంకను దుర్లభము. మఱియును ఇంతమంది ఐకమత్యముతో దానిని పాటించుట చాల విశేషము. క్షమయే దానము. క్షమయే సత్యము. అవియే యజ్ఞము."

శ్లో॥ క్షాంతం క్షమావతాం పుత్ర్యః! కర్తవ్యం సుమహత్కృతమ్।
ఐకమత్య ముపాగమ్య కులం చావేక్షితం మమ॥
స. 33 6

గో. టీక :- హే పుత్ర్యః; క్షమావతాం కర్తవ్యం కర్తు మర్హం, కృత మిదం సుమహత్కర్మ. దేవే ప్రార్థయమానేఽపి అవికృతచిత్తత్వం, శరీరం భంజయతి సతి నిగ్రహోద్ధతత్వం చ దుష్కర మితి భావః।

శ్లో॥ అలంకారో హి నారీణాం క్షమా తు పురుషస్య వా।
దుష్కరం తద్ధి వై క్షాంతం త్రిదశేషు విశేషతః॥ స. 33-7

గో. టీక :- క్షమైవ దుష్కరా ; తతః త్రిదశేషు దుష్కరా। తతో ఽపి సర్వాసా మవిశేషణ క్షమా దుష్కరై వేత్యర్థః।

శ్లో॥ యాదృశీ వః క్షమా పుత్ర్యః సర్వాసా మవిశేషతః।
క్షమా దానం క్షమా సత్యం క్షమా యజ్ఞశ్చ పుత్రికాః॥
స. 33-8

తి. టీక :- యాదృశీ వః క్షమా తాదృశీ అస్మాకం కులే సర్వాసాం అస్తు ఇతి శేషః॥

ఇందు కన్యలు వాయుదేవుని తిరస్కరించుట గమనింపఁదగి యున్నది "మేము నిన్ను నీపదవినుండి దింపఁగలము. కాని మేము తపస్సును రక్షించుకొనుచున్నాము" అని వా రన్నారు. వాయు దేవుఁడు అనఁగా వట్టి గాలి కాదు. విశ్వములోని వాయుసంచారమునకు అంతకును అధికారి వాయుదేవుఁడు. విశ్వపరిపాలనమునందు ఇంద్రిత్వమువలె ఇదియును ఒక పదవియే. గొప్ప తపస్సులు చేసినవారు ఆ పదవులకు వత్తురు. వా రందఱును ప్రత్యేకవ్యక్తిత్వములు కల వారే. కావున వారు కూడ కామక్రోధములతో వర్తించుచునే యుందురు. వారికన్న అధికమైన తపశ్శక్తి కలవారు వారిని నిగ్రహించి పదవుల నుండి దింపి వేయ వచ్చును. మఱి ఈ కన్యలు చేయుచున్న తపస్సు ఏమి? వారు కన్యావ్రతమును ఆచరించుచున్నారు. అదియే వారికి తపస్సు.

అనంతరము కుశనాభుఁడు కన్యాప్రదానమునుగూర్చి ఆలోచించెను. ఆకాలమున చూలి యను మహర్షి బ్రాహ్మమైన తపస్సు చేయుచుండెను. సోమద యను గంధర్వస్త్రీ ఆయనకు శుశ్రూష చేయుచుండెను. చిరకాలమునకు ఆయన ప్రసన్నుఁడై ఆమెను వరము కోరుకొమ్మనెను. ఆమె ఇట్లు కోరెను. "అయ్యా! నీవు మహాతపస్వివి; బ్రాహ్మ్యమైన లక్ష్మితో పూర్ణుఁడవై బ్రహ్మవై యున్నావు. బ్రాహ్మ

మైన తపస్సు కలవాఁడు ధార్మికుఁడు అయిన పుత్రుని పొందఁగోరు చున్నాను. అయ్యా! నీకు భద్ర మగునుగాక! నేను ఎవరిని పతినిగా పొంద లేదు. నేను ఎవరికిని భార్యను కాను. నీకు శుశ్రూష కావించు చున్న నాకు పుత్రుని బ్రాహ్మవిధానముననే మనస్సుచేతనే సృష్టించి ఈయఁదగి యున్నావు"

శ్లో॥ లక్ష్మ్యా సముదితో బ్రాహ్మ్యా బ్రహ్మభూతో మహాతపాః।
బ్రాహ్మేణ తపసా యుక్తం పుత్ర మిచ్ఛామి ధార్మికమ్॥ 16

శ్లో॥ అపతి శ్చాస్మి భద్రం తే భార్యా చాస్మి న కస్యచిత్।
బ్రాహ్మే ణోపగతాయా శ్చ దాతు మర్హసి మే సుతమ్॥ 17

బాలకాండ - సర్గ - 33

తి. టీక :- బ్రాహ్మే ణోపగతాయాః-ఉపగతాయాః కింకరీత్వం ప్రాప్తాయాః, బ్రాహ్మేణ బ్రహ్మసంబంధినా ఉపాయేన, సుతం దాతు మర్హసి, సనకాదయః ఇవ మానసపుత్రో దేయ ఇతి భావః।

ఆ బ్రహ్మర్షి ఆమెకు ప్రసన్నుఁడై బ్రాహ్మమైన తపశ్శక్తిచేత పుత్రుని పుట్టించి ఆమె కొసంగెను. అతఁడు బ్రహ్మదత్తుఁ డని ప్రఖ్యాతి నొంది కాంపిల్యమునకు రాజై మహావైభవముతో దేవేంద్రుని వలె పాలించుచున్నాఁడు. ఆ బ్రహ్మదత్తునకు కుశనాభుఁడు నూర్వురు పుత్రికల నొసంగెను.

శ్లో॥ తస్యాః ప్రసన్నో బ్రహర్షి ర్దదౌ బ్రాహ్మ మనుత్తమమ్।
బ్రహ్మదత్త ఇతి ఖ్యాతం మానసం చూలినః సుతమ్॥

శ్లో॥ స రాజా బ్రహ్మదత్తస్తు పురీ మధ్యవస త్తదా।
కాంపిల్యాం పరయా లక్ష్మ్యా దేవరాజో యథా దివమ్॥ 19

తి. టీక :- స రా జా, గంధర్వ్యాః సోమదాయాః క్షత్రియత్వాత్।

బాలకాండ-సర్గ - 33

బ్రహ్మదత్తుఁడు ఆకన్యలపాణిని గ్రహించుచుండఁగనే వా రందఱును గూని లేనివారై దిగులు లేనివారై పరమశోభతో విల సిల్లిరి.

శ్లో॥ స్పృష్టమాత్రే తదా పాణౌ వికుబ్జా విగతజ్వరాః।
యుక్తం పరమయా లక్ష్మ్యా బభౌ కన్యాశతం తదా॥
స. 33-23

తన పుత్రిక లందఱును వాయువునుండి విముక్తలై సౌభాగ్య వతు లగుచుండుటను చూచి కుశనాభుఁడు పరమహర్షము నొందెను. బ్రహ్మదత్తుఁడు నూర్వురు భార్యలతో కాంపిల్యమునకు పోయి తల్లికి నమస్కరించెను. ఆమె బ్రాహ్మమైన తపస్సుయొక్క ప్రభావమును ప్రకాశింపఁ జేసిన పుత్రుని చూచి కుశనాభుని ప్రశంసించి కోడండ్రను స్పృశించి స్పృశించి సంతోషించెను.

శ్లో॥ సోమదాపి సుతం దృష్ట్వా పుత్రస్య సదృశీం క్రియామ్।
యథాన్యాయం చ గంధర్వీ స్నుషా స్తాః ప్రత్యనందత।
స్పృష్ట్వా స్పృష్ట్వా చ తాః కన్యాః కుశనాభం ప్రశస్య చ॥26
బాలకాండ సర్గ-33

తరువాత కుశనాభుఁడు పుత్రేష్టిఁ గావించెను. అప్పుడు కుశుఁడు నీకు "గాధి" అను అనుగుణుఁడైన పుత్రుఁడు కలుగు నని చెప్పి ఆకాశమునఁ బ్రవేశించి బ్రహ్మలోకమున కేఁగెను. బ్రహ్మపుత్రుఁడైన కుశుఁడు పుత్రులకు ప్రజాపాలనధర్మమును అప్పగించిన తరువాత బ్రహ్మలోకమునకు పోయి తండ్రియొద్ద నుండెను. కుశనాభుఁడు పుత్త్రునికొఱకై ఇష్టి చేయునప్పుడు కుశుఁడు బ్రహ్మలోకమునుండి వచ్చి కుమారుని ఆశీర్వదించి మరల అచ్చటికే పోయెను.

శ్లో॥ జగా మాకాశ మావిశ్య బ్రహ్మలోకం సనాతనమ్।
సర్గ-34-1

గో. టీక :- అనేన సదా బ్రహ్మలోకవాసీ కుశః పుత్రానుగ్రహార్థం భువ మాగతః ఇత్యవగమ్యతే।

తి. టీక :- ఆకాశ మావిశ్య, ఆకాశరూపో భూత్వా, అనేన తస్య ముక్తత్వం సూచితమ్।

తరువాత గాధి కలిగెను. గాధికి సత్యవతి అనుపుత్రిక విశ్వామిత్రుఁడును కలిగిరి. గాధి పుత్రికను ఋచీకునకు భార్యగా నిచ్చెను. ఋచీకుఁడు అడవులలో తపస్సు చేసికొనుచున్న యొక ఋషి. ఆయనయే సత్యవతిని తనకు భార్యనుగా ఇమ్మని గాధిని కోరియుండును. ఋషియొక్క కోరికను నిరాకరించుటకు ఇష్టము లేక గాధి ఆమెను ఆయనకు ఇచ్చి యుండును. ఆమె మహాపతివ్రత. రాజపుత్రిక అయ్యును ఆమె ఆశ్రమమునం దుండి వనవాసకష్టములను తపోనియమక్లేశములను సహించుచు ఏకదీక్షతో భర్తకు శుశ్రూష చేయుచుండెను. ఆభర్తృసేవాదీక్షవలన ఆమె గొప్ప మహిమను పొంది శరీరమును వీడకయే స్వర్గమునకు పోయెను. అంతే కాదు. సకల భూతములకు ఉపకార మొనర్పవలయు ననుతలంపుతో ఆమె తన మహిమచేత తమ యాశ్రమప్రాంతమున నొకమహానదిని సృష్టించి ప్రవహింపఁజేసెను. విశ్వామిత్రునకు కౌశికుఁ డనుపే రున్నట్లే, ఆమెకు కూడ కౌశికి అను నామాంతర ముండెను. అందువలన ఆనదికి కౌశికి అను పేరు ప్రసిద్ధమయ్యెను.

శ్లో॥ సశరీరా గతా స్వర్గం భర్తార మనువర్తినీ ।
కౌశికీ పరమోదారా ప్రవృత్తా చ మహానదీ॥ 8

గో. టీక :- భర్తార మనువర్తినీ భర్త్రనువర్తనధర్మప్రభావా దితి భావః। న కేవలం స్వర్గగమనం అస్యాః మహానదీత్వం చ జాతమ్।

శ్లో॥ దివ్యా పుణ్యోదకా రమ్యా హిమవన్త ముపాశ్రితా।
లోకస్య హితకామార్థం ప్రవృత్తా భగినీ మమ॥ 9
బాలకాండ సర్గ 34

గో. టీక :- హితకామార్థం; హితం ఆముష్మికం, కామః ఐహికం; తదుభయార్థం ప్రవృత్తా నదీరూపేణ, స్వర్గాత్ హిమవన్త ముపాశ్రితా ఇత్యర్థః।

సశరీరముగా స్వర్గమునకు పోవుట అనఁగా నేమి? యజ్ఞయాగములో తపస్సులో చేసినవారు ఈలోకమున చనిపోయిన తరువాత స్వర్గమునకు పోవుదు రనుట ప్రసిద్ధమై యున్నది. కాని ఈమె శరీరముతో కూడ స్వర్గమునకు పోయినది. అనఁగా ఆమె ఈలోకమున చనిపోలే దన్నమాట. వసిష్ఠవిశ్వామిత్రాదిమహర్షులు కొందఱు ఇంద్రుని సభకు బ్రహ్మసభకును పోయి వచ్చుచుండుట పురాణములలో ప్రసిద్ధముగా నున్నది. వారు ఆలోకములకు పోవునపుడెల్ల ఈలోకములో తమకు సహజములై యున్న పార్థివశరీరములను వదలి సూక్ష్మశరీరములతో పోవుదు రని చెప్ప నక్కఱలేదు. వారు తపశ్శక్తిచేత సహజములైన శరీరములయందే ఆవశ్యకములైన మార్పులను పొంది ఆలోకములకు పోవుచుండి రని చెప్పవచ్చును. నేఁడు జలాంతర్గాములలో తిరుగువారు చంద్రమండలమునకు పోవువారును ఎట్లు ప్రత్యేకములైన దుస్తులతో పరికరములతో ప్రయాణము చేయుచున్నారో ఆమహర్షులును ఆవిధముగానే తపశ్శక్తితో తగిన సాధనములను పొందుచుండి రని చెప్పవచ్చును. విశ్వామిత్రుఁడు త్రిశంకువుచేత యజ్ఞమును చేయించి సశరీరముగా అతనిని స్వర్గమునకు పంపుటకు ప్రయత్నించి, ఆప్రయత్నము విఫలమైనప్పుడు తనతపశ్శక్తిచేతనే అతనిని అంతరిక్షమున నిలిపె ననుట గమనింపఁ దగియున్నది. కావున స్త్రీలకు పాతివ్రత్యము యజ్ఞయాగములతో గొప్ప తపస్సులతో సమాన మని గ్రహింపవలసియున్నది.

సోదరియందలి ప్రీతిచే విశ్వామిత్రుఁడు కౌశికీ నది తీరముననే తపస్సు చేసికొనుచుండెను. ఒకానొకసిద్ధిని కోరి ఆయన సిద్ధాశ్రమమునకు వచ్చెను.

ఈకథను చెప్పినతరువాత మఱునాఁడు విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతో శోణానదిని దాటి గంగను చేరెను. అచ్చట వారు మాధ్యాహ్నికవిధులను అనుష్ఠించి సాయంకాలము కూడ అచ్చటనే యుండిరి. అప్పుడు రాముఁడు అడుగఁగా విశ్వామిత్రుఁడు గంగావతరణ కథను చెప్పెను.

## 2. గంగావతరణ ఘట్టము

హిమవంతునకు మేరుపుత్రియగు మేనకయందు గంగ ఉమ అనుపుత్రికలు జన్మించిరి. పెద్దదియైన గంగను లోకహితము కొఱకై దేవతలు హిమవంతుని ప్రార్థించి దేవలోకమునకు తీసికొని పోయిరి. ఉమాదేవి ఉగ్రమైన తపస్సు చేసెను. తండ్రి ఆమెను శివునకు ఒసంగెను.

శ్లో॥ అథ జ్యేష్ఠాం సురా స్సర్వే దేవకార్యచికీర్షయా ।
శైలేంద్రం వరయామాసు ర్గంగాం త్రిపథగాం నదీమ్॥ 16

శ్లో॥ దదౌ ధర్మేణ హిమవాం స్తనయాం లోకపావనీమ్।
స్వచ్ఛందపథగాం గంగాం త్రైలోక్యహితకామ్యయా॥ 17

బాలకాండ-సర్గ 35

గో. టీక :- జలప్రవాహరూపాయాః నద్యాః కథ మాకాశే గమనమ్ ? తత్రాహ। స్వచ్ఛందపథగా మితి। స్వచ్ఛందః స్వేచ్ఛా తదాయత్తాః పంథాః స్వచ్ఛందపథః, తం గచ్ఛ తీతి స్వచ్ఛందపథగా, తథా మేఘజలవద్ద్వారగతి విశేషేణ ఆకాశేఽపి గతిః సంభవతీతి భావః॥

పూర్వము అయోధ్యాపతియైన సగరునకు విదర్భరాజపుత్రికయగు కేశిని, కశ్యపుని పుత్రికయగు సుమతియు ఇరువురు భార్య

లుండిరి. సుమతి గరుత్మంతునకు సోదరి. సగరుఁడు సంతతికొఱకు భృగుప్రస్రవణ మను గిరియందు నూఱేండ్లు తపస్సు చేసెను. భృగు మహర్షి ప్రసన్నుఁడై నీకు వంశకరుఁడైన సుతుఁ డొకపత్నియందు అఱువదివేలమంది రెండవపత్నియందును కలుగుదు రని చెప్పెను. అప్పు డా రాజపత్నులు ఎవరికి ఎట్టి పుత్రులు కలుగుదు రని ప్రశ్నించిరి. ఆయన మీరే కోరుకొనుఁ డనెను. కేశిని వంశకరుఁడైన పుత్రుని కోరెను. సుమతి అఱువదివేలమందిని కోరెను. సగరుఁ డయోధ్యకు తిరిగివచ్చినతరువాత కేశినికి అసమంజసుఁడు జన్మించెను. సుమతికి గర్భతుంబము (సొఱకాయ) వంటి పిండము జన్మించెను. అది వెంటనే పగిలి అఱువదివేలమంది పుత్రు లుదయించిరి. దాదులు వారిని నేతి కుండలలో నుంచి పెంచఁగా కొంత కాలమునకు వారందఱు యువకులైరి.

అసమంజసుఁడు చిన్న పిల్లలను గైకొనిపోయి సరయువులో విసరి వారు మునిఁగి పోవుచుండఁగా పకపక నవ్వుచుండెను. అందువలన తండ్రి వానిని నగరమునుండి వెడలఁగొట్టెను. బహుశః అసమంజసుఁడు చిన్నప్పటి నుండి మతిహీనుఁడై యుండును. అందువలన వానిని వధింపక తండ్రి విడిచిపెట్టియుండును. అతని పుత్రుఁడైన అంశుమంతుఁడు వీర్యవంతుఁడై ప్రియంవదుఁడై సర్వలోకసమ్మతుఁడై యుండెను.

శ్లో॥ తస్య పుత్రోఽంశుమాన్ నామ అసమంజస్య వీర్యవాన్।
సమ్మతః సర్వలోకస్య సర్వస్యాపి ప్రియంవదః॥ 22
బాలకాండ-సర్గ-35

తి. టీక:— అసమంజ శబ్దోఽదంతః సాన్తశ్చేతి బోధ్యమ్।

చాలకాలమునకు సగరుఁడు వింధ్యహిమాలయమధ్యదేశమున ఆర్యావర్తమున అశ్వమేధము నారంభించెను. అంశుమంతుఁడు అశ్వము వెంట తిరిగి వచ్చెను. ఉక్థ్యాహమునందు అశ్వాలంభమునకు పూర్వము ఇంద్రుఁడు రాక్షసరూపమున అశ్వమును హరించెను. యజ్ఞము విఘ్నము నొందకుండ అశ్వమును తెప్పింపు మని ఋత్విజులు చెప్పఁగా సగరుఁడు అందులకు అఱువదివేలమంది కుమారులను నియోగించెను. ఆయన అంశుమంతుని తనయొద్దనే యుంచుకొనెను. ఒక్కొక్క యోజనము చొప్పున భూమి యంతయు వెదకి గుఱ్ఱము కన్పింపక పోయినచో భూమిని త్రవ్వి రసాతలమునందును వెదుక వలసినదిగా సగరుఁడు కుమారుల కాజ్ఞాపించెను. వారు భూమిపై వెదకి అశ్వముఁ గానక త్రవ్వఁజొచ్చిరి.

దానివలన భూతహింస ప్రబలెను. ముప్పది ముగ్గురు దేవతలు బ్రహ్మయొద్దకుపోయి ఈ విప్లవమును విన్నవించిరి. కపిలునివలన సాగరులు నశింతు రని ఆయన చెప్పెను. కొంతమేర త్రవ్వి సాగరులు తండ్రియొద్దకు వచ్చిరి. తండ్రి యింకను త్రవ్వుఁ డనెను. వారు మరల పోయి త్రవ్వుచు తూర్పున విరూపాక్ష గజమును చూచి దానికి ప్రదక్షిణము గావించి దక్షిణముగా త్రవ్వుచు పోయి మహాపద్మ మను గజమును చూచి ప్రదక్షిణము గావించి,పడమరగా త్రవ్వుచు సౌమనసమును చూచి ప్రదక్షిణము గావించి, ఉత్తరముగా నేగి భద్ర మను గజమును చూచి ప్రదక్షిణము గావించి; ఈశాన్యముగా నేగి కపిలునియాశ్రమము చేరి అట నున్న యజ్ఞాశ్వమును చూచి అతఁడే అశ్వహర్త యని ఆయనపై కురికిరి. ఆయన రోషముతో హుంకరింప వారందఱు భస్మరాశు లైరి.

సాగరులు ఇప్పటి బంగాళాఖాతమునుండి ఆరంభించి హిందూ మహాసముద్రము అట్లాంటిక్ మహాసముద్రము పసిఫిక్ మహా

సముద్రము ఆర్కిటిక్ సముద్రముల మార్గములో ఆఫ్రికాను దక్షిణ అమెరికాను చుట్టి ఉత్తర అమెరికా మీఁదుగా గ్రీన్‌లాండ్ దాటి నార్వే స్వీడన్, ఫిన్‌లాండ్‌వైపుగా రష్యాలో నుండి జపాన్ ప్రాంతమునకు వచ్చి యుండవచ్చును. వారు భారతదేశము మాత్రమే కాదు భూమి నంతయు గాలించినారు. ఈ భూమి యంతయు పురాణములలో జంబూ, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కరము, అని యేడు ద్వీప ములుగా విభజింపఁబడి యున్నది. వీనిలో జంబూద్వీపము ఇంద్ర, కశేరు, తామ్ర, గభస్తి, నాగ, సౌమ్య, గంధర్వ, చారణ, భారతము, అని తొమ్మిది వర్షములుగా విభజింపఁబడి వర్ణింపఁబడియున్నది.

పుత్రు లెంతకాలమునకు రాకపోవుటవలన సగరుఁడు మనుమని పంపెను. అంశుమంతుఁడు సాగరులు త్రవ్విన మార్గములో పోయి, దిశాగజములకు నమస్కరించి పినతండ్రులసంగతి, అశ్వహర్తను గూర్చియు అడిగెను. అవి యన్నియు "నీవు అశ్వముతో తాతగారిని" చేరఁగలవు అని చెప్పెను. అట్లు అంశుమంతుఁడు కపిలాశ్రమమును చేరి భస్మరాశులైన పినతండ్రులకు తర్పణముల నొనర్చుటకై జలము కొఱకు వెదుకఁగా జలాశయము కన్పింపలేదు. నలువైపుల చూచు చుండఁగా సాగరులకు మేనమామయైన గరుత్మంతుఁడు కన్పించి "కపిల క్రోధదగ్ధులైన వీరలకు లౌకికజలముతో తర్పణము తగదు; గంగా జలముతో చేయవలయును. గంగాదేవి ఈ భస్మరాసులను తన జల ముతో ముంచి తేల్చినచో వీరందఱును స్వర్గము నొందుదురు." అని చెప్పెను.

అంతట అంశుమంతుఁడు హయముతో తిరిగి వచ్చి, తాతగారికి జరిగిన దానిని గరుత్మంతుని వాక్యమును నివేదించెను. ఆయన ఆవార్త విని దుఃఖించి యజ్ఞమును యథాకల్పముగా పూర్తిచేసి అయోధ్యకు వచ్చి, గంగావతరణమునకు మార్గమును నిశ్చయింపలేక ముప్పది వేలేండ్లు పాలించి దివంగతుఁడయ్యెను.

శ్లో॥ తచ్ఛ్రుత్వా ఘోరసంకాశం వాక్య మంశుమతో నృప।
యజ్ఞం నిర్వర్తయామాస యథాకల్పం యథావిధి॥ 24

శ్లో॥ స్వపురం చాగమ చ్ఛ్రీమా నిష్టయజ్ఞో మహీపతిః।
గంగాయా శ్చాగమే రాజా నిశ్చయం నాధ్యగచ్ఛత॥ 25

శ్లో॥ అగత్వా నిశ్చయం రాజా కాలేన మహతా మహాన్।
త్రింశద్వర్షసహస్రాణి రాజ్యం కృత్వా దివంగతః॥ 26

బాలకాండ—సర్గ-29

అంశుమంతుఁడు రాజై పుత్రుఁడగు దిలీపునకు రాజ్య మప్పగించి హిమవంతమున ముప్పదిరెండువేలయేండ్లు తపస్సు చేసి దివంగతుఁ డయ్యెను. దిలీపుఁడు కూడ గంగావతరణ మెట్లు జరుగునో తెలియక చింతాక్రాంతుఁ డయ్యెను. అతఁ డనేకయజ్ఞములను చేసి ముప్పదివేలయేండ్లు పాలించి గంగావతరణమును గూర్చిన చింతతోడనే దివంగతుఁ డయ్యెను.

వాల్మీకి అయోధ్యారాజుల వంశపరంపరను చెప్పుటయేగాక, ఒక్కొక్కరాజు ఎంతకాలము పాలించెనో స్పష్టముగా చెప్పెను. మనకు చరిత్ర యింత వివరముగా స్పష్టముగా నుండఁగా నేటివిద్వాంసు లనేకులు పాశ్చాత్యులబోధలు తలకెక్కి, మనకు చరిత్రయే లేదని, రామాయణములో భారతములో చెప్పఁబడిన వృత్తాంతములు చారిత్రికములు కావని, అవి యన్నియు పుక్కిటిపురాణము లని ఉద్ఘాటించుచున్నారు. ఇంత కన్నను అసంగతము అశాస్త్రీయమునైన ప్రసంగము ఇంకొకటి యుండదు. సకల పురాణములలో ఇతిహాసములలో రాముఁడు పునర్వసునక్షత్రమున జన్మించె నని, శ్రీకృష్ణుడు రోహిణీనక్షత్రమున జన్మించె నని ముహూర్తములలెక్కలతో కూడ విస్పష్టముగా మహర్షులు చెప్పియుండఁగా "రాముఁడు కృష్ణుఁడు మొదలైనవా రెవ్వరు

చారిత్రికవ్యక్తులు కారు (Historical Persons), మనచరిత్ర అలెగ్జాండరుదండయాత్రతో ఆరంభమైన దని చెప్పువారియజ్ఞానము సాహసము సామాన్యము కాదు.

ప్రపంచము మొత్తముమీఁద ఒక్క భారతదేశమునందే సృష్టి యొక్క ఆరంభము నుండి ఇప్పటివఱకును జరిగిన కాలమును లెక్క వేసి, దానిని కల్పములుగా మన్వంతరములుగా యుగములుగా విభజించి, ఒక్కొక్క మన్వంతరము, ఒక్కొక్కయుగము ఏనక్షత్రమున ఏతిథియందు ఆరంభమై ఎప్పుడు ముగియుచున్నవో పంచాగములలో నేఁటికిని నిర్దేశింపఁబడుచున్నవి. వానిలో నిర్దేశింపఁబడిన తిథులను నక్షత్రములను అనుసరించియే ఆసేతుహిమాచలముగా పరశురాముఁడు దత్తాత్రేయుఁడు ఆంజనేయుఁడు మొదలగువారిజయంతులను జరుపుకొనుచున్నాము. పంచాగములలోని యీపరిగణనము (Calculations) అంతయు కల్పితమే అనుటకు ఏమి యాధారమును చూపింపఁగలరు? ఆగ్రంథములను ఆశాస్త్రములను అర్థము చేసికొనుటకు ఆసక్తి శక్తి రెండును లేని నేఁటి చరిత్రకారులు ఏపరిశోధనము చేయకుండఁగనే, "రామాయణభారతకథ లన్నియు కల్పితములు" అని చెప్పుటకన్న అశాస్త్రీయప్రసంగము (Unscientific talk) ఏమి యుండును? ఈమూర్ఖవాదమును చాలయేండ్లక్రిందటనే వివేకానందుఁడు ఎట్లు ఖండించెనో చూడుఁడు. "మనకు అట్టిచరిత్రయే లేదని నీవు చెప్పుదు వని నాకుఁ దెలియును. నీవలె ఆలోచించువారికి అది కన్పింపదు; విశ్వవిద్యాలయములలోని మహావిద్వాంసులకును అది తోఁపదు. పాశ్చాత్యదేశములలో అత్యంతవేగముగ పర్యటించి వారివేషభాషలతో తిరిగి వచ్చి, మన కే మున్నది? మనము అనాగరకులము అని నొక్కి వక్కాణించువారును అట్లే తలంతురు. నిజమే. ఇతరదేశములకున్న చరిత్రమువంటిది మనకు లేకపోవచ్చును. మనము బియ్యమును వండుకొని తినుచున్నాము. ఆంగ్లేయులు అట్టియన్నమును తినుట లేదు.

కావున వా రందఱును పస్తులతో నశించుచున్నా రని చెప్పఁగలవా ? తమదేశమున నేది లభించుచున్నదో, ఏది వారికి తగియుండునో అట్టి యాహారముతో వారు చక్కఁగానే జీవించుచున్నారు. అట్లే మనకు ఎట్టి చరిత్ర యుండవలయునో అట్టి చరిత్రయే యున్నది, నీవు కనులు మూసికొని, అయ్యో ! మనకు చరిత్ర లేదే! అని యంగలార్చు చున్నంత మాత్రమున ఉన్న చరిత్ర నశించిపోదు. మనకు మహోజ్జ్వల మైన చరిత్ర యున్నదని, దానిబలముననే ఈజాతి యింకను బ్రతికి యున్నదనియు కనులు గలవా రందఱును కాంచుచునే యున్నారు.

**(Lines-17-34, P. 281, Part V-Works)**

దిలీపునిపుత్రుఁడు భగీరథుఁడు. అతనికి చిరకాలము పుత్రులు కలుగలేదు. అందువలన రాజ్యమును మంత్రుల కప్పగించి, గంగావ తరణముఁ గావింప కృతనిశ్చయుఁడై గోకర్ణమునందు మాసాహారుఁడై పంచాగ్నిమధ్యమున ఊర్ధ్వబాహుఁడై వేలసంవత్సరములు తపస్సు చేసెను. బ్రహ్మ ప్రత్యక్షము కాఁగా భగీరథుఁడు తన ప్రపితామహులకు స్వర్గగతి కలుగునట్లును ఇక్ష్వాకులసంతతికి విచ్ఛేదము లేకుండునట్లును కోరెను. బ్రహ్మ ఆ వరము లొసంగుచు గంగ భూమికి దిగునపుడు ఆ వేగమును భరింపఁగలవాఁడు శంకరుఁడే కావున అందులకు ఆయనను ప్రార్థింపు మనెను. వెంటనే భగీరథుఁడు అంగుష్ఠాగ్రమున నిలిచి సంవత్సరకాలము తపస్సు చేయఁగా ఈశ్వరుఁడు ప్రత్యక్షమై గంగను శిరమున ధరింతు నని అంగీకరించెను.

అప్పుడు గంగ అవతరింపఁ దలఁచి గర్వముతో తనవేగమున ఈశ్వరుని గూడ పాతాళమునకుఁ గొనిపో నెంచెను. ఆ సంకల్పము నెఱింగి ఈశ్వరుఁ డామెను జటామండలమున బంధించెను. అందుండి వెల్వడుటకు మార్గముఁ గానక గంగ జటలయందే తిరుగుచుండెను. భగీరథుఁడు మరల ప్రార్థింపఁగా ఈశ్వరుఁడు బిందుసరమునకు అభిముఖముగా గంగను వదలిపెట్టెను. అప్పుడు ఆ గంగనుండి ఏడు

ప్రవాహములు బయలుదేరెను. హ్లాదినీ పావనీ నలినీ అను మూఁడు ప్రవాహములు తూర్పుగా; సుచక్షువు సీతా సింధువు అను మూడు ప్రవాహములు పశ్చిమముగా ప్రసరించెను; ఏడవ ప్రవాహము భగీరథుని వెంట వచ్చెను.

శ్లో॥ విససర్జ తతో గంగాం హరో బిందుసరః ప్రతి।
తస్యాం విసృజ్యమానాయాం సప్త స్రోతాంసి జజ్ఞిరే॥ 11

శ్లో॥ హ్లాదినీ పావనీ చైవ నలినీ చ తథైవ చ।
తిస్రః ప్రాచీం దిశం జగ్ము ర్గంగా శ్శివజలా శ్శుభాః॥ 12

శ్లో॥ సుచక్షు శ్చైవ సీతా చ సింధు శ్చైవ మహానదీ।
తిస్ర శ్చైతా దిశం జగ్ముః ప్రతీచీం తు శుభోదకాః॥ 13

బాలకాండ - సర్గ - 43

గో. టీక:- బిందుసరో నామ హిమవతి బ్రహ్మనిర్మిత సరో విశేషః।

శంకరునిశిరస్సునుండి భూమికి అవతరించుచున్న గంగను చూచుటకై దేవతలు విమానములలో వచ్చిరి. భూమితలవాసులైన ఋషిగణములు, గంధర్వులు భవాంగపతితమైన గంగాతోయము పవిత్ర మని స్పృశించిరి. భగీరథుఁడు అందు స్నాన మొనర్చి పవిత్రుఁడై దివ్యమైన రథమున ముందు చనుచుండఁగా వెనుక గంగ రాఁజొచ్చెను. దేవదానవులు అప్సరసలు మహర్షులు భగీరథునిరథము ననుసరించిరి. అట్లు వచ్చుచున్న గంగ మార్గవశమున జహ్నుమహాముని యొక్క యజ్ఞవాటమును ముంచెను. ఆయన కోపించి ఆ జలము నంతయు త్రావెను. అంతట దేవతలు మహర్షులు విస్మితులై "ఈ గంగ నీకు పుత్రిక యగును, వదలిపెట్టు" మని ప్రార్థించిరి.ఆయన ప్రసన్నుఁడై శ్రోత్రములనుండి వెలువరింపఁగా గంగ మరల బయలుదేరి సాగరమును, భస్మరాశులను ముంచెను. అప్పుడు ఆ సాగరు లందఱు స్వర్గము నొందిరి.

అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై భగీరథునితో నిట్లు చెప్పెను.

శ్లో॥ సాగరస్య జలం లోకే యావ త్థాస్యతి పార్థివ ।
సగర స్యాత్మజా స్సర్వే దివి స్థాస్య న్తి దేవవత్॥ 4

శ్లో॥ ఇయం చ దుహితా జ్యేష్ఠా తవ గంగా భవిష్యతి ।
త్వత్కృతేన చ నామ్నా హి లోకే స్థాస్యతి విశ్రుతా॥ 5

శ్లో॥ గంగా త్రిపథగా రాజన్ దివ్యా భాగీర థీతి చ।
త్రీన్ పథో భావయ న్తీతి తస్మా త్త్రిపథగా స్మృతా॥ 6

బాలకాండ సర్గ-44

"సగరునిపుత్రు లందఱు స్వర్గము నొందిరి. ఎంతకాలము సాగర జలము ఈ లోకమునం దుండునో అంతకాలము వారు స్వర్గమునం దుందురు. ఈ గంగయు నీకు జ్యేష్ఠపుత్రికయై నీ పేరుతో భాగీరథిగా విశ్రుత మగును. మూఁడు పథములయందు వర్తించుచున్న యీనది "త్రిపథగ" యనియు ప్రసిద్ధి నందును. ఇంక నీవు నీపితామహుల కందఱకును తర్పణములను చేయుము. గరుత్మంతునిచే నుపదిష్టమైన ప్రతిజ్ఞను విసర్జింపుము. మీపూర్వుఁడైన సగరునిచేత అప్రతిమతేజస్కుఁడైన యంశుమంతునిచేత,తపస్సుచే నాతో తుల్యుఁడైన నీతండ్రియైన దిలీపునిచేతను, ఈ ప్రతిజ్ఞ నిర్వహింపఁబడలేదు. అట్టిది నీచేత నిర్వహింపఁబడినది.నీవు పరమమైన యశస్సు పొందితివి; గొప్ప ధర్మ ప్రతిష్ఠ నొందితివి."

ఇట్లు పలికి బ్రహ్మదేవుఁడు స్వలోకమున కేగినపిమ్మట భగీరథుఁడు సాగరుల కందఱకు యథావిధిగ తర్పణములు చేసి కృతార్థుఁడై అయోధ్యకు తిరిగివచ్చి రాజ్యపాలనముఁ గావించెను.

సగరుఁడు అశ్వమేథము ఎందులకు ఆరంభించెనో **తెలియదు.** ఆయన పుణ్యాతిశయముకొఱకే ఆరంభించి యుండవచ్చును. కావుననే

ఇంద్రుఁడు గుఱ్ఱమును హరించెను. మరల అంశుమంతుఁడు గుఱ్ఱమును తెచ్చిన తరువాతనే అశ్వమేథము జరిగినది. ఆ మహాపుణ్యమునకు ఫలముగా భగీరథుఁడు జన్మించి వంశముయొక్క చిరస్థాయిత్వమును "గంగావతరణమును" సాధించెను. సగరునియశ్వమేథమువలన గంగ భూమికి అవతరించినది. ఇది గంగ భూమికి దిగిరాకయున్నప్పటి చరిత్ర.

### 3. అహల్యాశాపవిమోచన ఘట్టము

1. అట్లు ఆరాత్రి గంగావతరణకథలతో సుఖముగా గడువఁగా మఱునాఁ డుదయము వా రందఱును గంగను దాటి యుత్తరతీరమును చేరిరి. అక్కడ నుండి వారికి విశాలానగరము కన్పించుచుండెను. ఈ నగరమున ఏ రాజవంశము పాలించుచున్నది అని రాముఁడు ప్రశ్నించెను. విశ్వామిత్రుఁడు నడచుచునే ఇట్లు చెప్పెను.

"కృతయుగమున అదితిపుత్రులు దితిసుతులును అమృతము కొఱకు మందరమును కవ్వముగా వాసుకిని త్రాడుగా చేసి, క్షీరసముద్రమును మథింపఁజొచ్చిరి. వేయి సంవత్సరములకు వాసుకి ముఖముల నుండి విషమును గ్రక్కుచు మందరమునందలి శిలలను కఱవఁ జొచ్చెను.

శ్లో॥ అథ వర్ష సహస్రేణయోక్త్రసర్పశిరాంసి చ।
వమన్తోఽతివిషం తత్ర దదంశు ర్దశనై శ్శిలాః॥ 19

శ్లో॥ ఉత్పపా తాగ్నిసంకాశం హాలాహలమహావిషమ్॥ 20

బాలకాండ-సర్గ-45

తి. టీక :- దష్టశిలాఖండా ఏవ మహావిషరూపం భూత్వా త్పపాత।

అప్పుడు హాలాహలమహావిషము అగ్నివలె పైకి వచ్చి జగము నాక్రమింపఁజొచ్చెను. దేవతలు శంకరుని శరణుఁజొచ్చిరి.

శ్లో॥ ఉవా చైనం స్మితం కృత్వా రుద్రం శూలధరం హరిః।
దైవతై ర్మథ్యమానే తు య త్పూర్వం సముపస్థితమ్॥ 23

శ్లో॥ త త్త్వదీయం సురశ్రేష్ఠ సురాణా మగ్రతో హి యత్।
అగ్రపూజా మిమాం కృత్వా గృహా ణేదం విషం ప్రభో॥ 24

శ్లో॥ ఇత్యు క్త్వా చ సురశ్రేష్ఠ స్తత్రై వాంతరధీయత।
దేవతానాం భయం దృష్ట్వా శ్రుత్వా వాక్యం తు శార్ఙ్గిణః॥ 25

శ్లో॥ హాలాహలం విషం ఘోరం సంజగ్రా హామృతోపమమ్।
దేవాన్ విసృజ్య దేవేశో జగామ భగవాన్ హరః॥ 26

బాలకాండ-సర్గ-45

తి. టీక :- ఛలేన విషదానాత్ స్మితమ్।

అప్పుడు హరియును ప్రత్యక్షమై శంకరుని చూచి నవ్వుచు, "నీవు అమరులకు అగ్రేసరుఁడవై యున్నావుకదా, వీరి యీ సముద్ర మథనమున ఏది ముందు జన్మించునో దానిని స్వీకరించుటకు నీవే తగుదువు. కావున ఈహాలాహలమును అగ్రపూజగా గ్రహింపుము" అని పలికి అంతర్హితుఁ డయ్యెను. అప్పుడు పరమేశ్వరుఁ డా విషమును అమృతమువలె స్వీకరించి యటనుండి వెడలిపోయెను.

పిమ్మట మరల దేవాసురులు మథనమును మొదలు పెట్టిరి. ఇంతలో మందరము పాతాళమునకు జారెను. దేవత లప్పుడు విష్ణువును స్తుతించిరి.విష్ణువు తాఁబేటి రూపముతో మందరమును తనవీఁపుపై నుంచుకొని పైకితెచ్చి, యొకచేతితో పర్వతాగ్రమును పట్టుకొని యుండెను.

శ్లో॥ పర్వతం పృష్ఠతః కృత్వా శిశ్యే తత్రోదధౌ హరిః।
పర్వతాగ్రం తు లోకాత్మా హస్తే నాక్రమ్య కేశవః॥ 30

శ్లో॥ దేవతానాం మధ్యత స్థిత్వా మమంథ పురుషోత్తమః॥ 31
బాలకాండ సర్గ-45

మరల దేవతలతో కలిసి ఆపురుషోత్తముఁడు మఱియొక రూపముతో మథన మొనరింపఁ జొచ్చెను. పిమ్మట వేయి సంవత్సరములకు సదండకమండలుఁడై ఆయుర్వేదమయుఁడైన ధన్వంతరి పైకివచ్చెను. అప్సరసలును పైకి వచ్చిరి. వారు 60 కోట్లు ; వారి పరిచారికలు అసంఖ్యాకముగా నుండిరి. వారిని దేవదానవులు ఎవరును తమకు భార్యలనుగా పరిగ్రహింపలేదు. అందువలన వారు అందఱకును సాధారణవనిత లైరి. పిమ్మట వరుణకన్య వారుణి వచ్చెను. దైత్యులామెను వల దనఁగా ఆదిత్యులు స్వీకరించిరి. ఉచ్చైశ్శ్రవము, కౌస్తుభమును ప్రభవించెను. తుదకు అమృత ముద్భవించెను. దానికొఱకై మహాయుద్ధము జరిగెను. అందు దైత్యులను సంహరించి ఇంద్రుఁడు లోకపాలకుఁ డయ్యెను.

నిహతపుత్రయైన దితి ఇంద్రసంహారకుఁడైన పుత్రు నను గ్రహింపు మని భర్తయగు కశ్యపుని ప్రార్థించెను. వేయి సంవత్సరములు శుచివై వ్రత మొనర్చినచో అట్టిపుత్రుని పొందఁగల వని ఆయన ఆమెను చేతితో నిమిరి తపస్సునకై వెడలిపోయెను. దితి "కుశప్లవ" మును చేరి తపస్సు చేయఁ జొచ్చెను. ఇది తెలిసి ఇంద్రుఁ డామెకు పరిచర్య మిక్కిలి వినయముతో చేయుచుండెను. పది తక్కువగా వేయి యేండ్లు నిండుచుండఁగా దితి సంతుష్టయై ఇంద్రునితో నిట్లనెను. 'నాకు పుట్టఁబోవు పుత్రునితో కూడ నీవు నిశ్చింతగా త్రైలోక్యవిజయము నొందఁగలవు" ఇట్లుచెప్పి మధ్యాహ్న మగుచుండఁగా మంచము

మీఁద తలవైపు పాదములు, పాదములవైపు తలయు నుంచి నిద్రా పరవశయై వ్రాలెను.

శ్లో॥ ఏవ ముక్త్వా దితి శ్శక్రం ప్రాప్తే మధ్యం దివాకరే।
నిద్ర యాపహృతా దేవీ పాదౌ కృత్వాఽథ శీర్షతః॥ 16

శ్లో॥ దృష్ట్వా తా మశుచిం శక్రః పాదతః కృతమూర్ధజామ్।
శిరస్థానే కృతౌ పాదౌ జహాస చ ముమోద చ॥ 19

బాలకాండ - సర్గ - 46

ఆమెను జూచి ఇంద్రుఁడు నవ్వుకొని ఆమెలో ప్రవేశించి గర్భమును ఏడుఖండములుగా వజ్రమున భేదించుచు, ఆ గర్భ మేడ్చుచుండఁగా "మా రుదః, మా రుదః" అని పలుకుచుండెను. దితి మేల్కొని చంపకుము, చంపకు మని పలికెను.

ఇంద్రుఁడు వజ్రముతో కూడ వెలికి వచ్చి, "నీవు అశుచివైతివి, అందువలన శక్రహంతయైన నీగర్భమును భేదించితిని క్షమింపు" మని ప్రార్థించెను. దితి చేయునది లేక తన యేడుగురు పుత్రులను వాయుస్కంధస్థానములకు పాలకులనుగా చేయు మని కోరెను, ఇంద్రుఁ డట్లే యని యంగీకరించెను. వారు సప్తమారుతులై సప్తవాయుస్కంధము లందు అభిమానదేవతలై చరింపఁజొచ్చిరి.

శ్లో॥ వాతస్కంధా ఇమే సప్త చరన్తు దివి పుత్రక।
మారుతా ఇతి విఖ్యాతాః దివ్యరూపా మమాత్మజాః॥ 4

శ్లో॥ బ్రహ్మలోకం చర త్వేక ఇంద్రలోకం తథాపరః।
దివ్యవాయు రితి ఖ్యాతః తృతీయోఽపి మహాయశాః॥ 5

శ్లో॥ చత్వార స్తు సురశ్రేష్ఠ దిశో వై తవ శాసనాత్।
సంచరిష్య న్తి భద్రం తే దేవభూతా మమాత్మజాః॥ 6

బాలకాండ - సర్గ - 46

గో.టీ.క. :- సప్తమారుత శ్చోక్తాః

శ్లో॥ గగనస్స్పర్శనో వాయు రనిల శ్చ తథాపరః।
ప్రాణః ప్రాణేశ్వరో జీవ ఇత్యేతే సప్త మారుతాః॥

ఇతి। విష్ణుపురాణే తు ఆవహ, ప్రవహ, సంవ, హోద్వహ, వివహ, పరివహ, పరావహాః సప్త మారుతాః ఇత్యుక్తమ్।

దితి తపస్సు చేసిన కుశప్లవమే యీవిశాలానగరము. ఇక్ష్వాకు పుత్రుఁడైన "విశాలుఁడు" ఈ నగరమును నిర్మించెను. ఆవంశమున ఇప్పుడు సుమతి యను రాజు పరిపాలించుచున్నాఁడు. ఈ రాత్రికి ఇక్కడ నుండి రేపు జనకుని చూడఁబోవుదము.

ఇట్లు విశ్వామిత్రుఁడు చెప్పుచుండఁగా వారు నగరమును చేరిరి. సుమతి యెదురువచ్చి వారిని సత్కరించెను. మరునాఁడు వారు బయలు దేరి మిథిలను జేర నేగిరి. మిథిల సమీపమున ఉపవనమునందు ప్రాంత పడిన యొకయాశ్రమమును చూచి, రాముఁడు "ఇది యెవరియాశ్రమము? ఇది యేల మునివర్జిత మయ్యెను?" అని ప్రశ్నించెను. అప్పుడు విశ్వామిత్రుఁడు ఇట్లు చెప్పఁదొడఁగెను.

"ఇది మహాత్ముడైన గౌతమునియాశ్రమము. ఆయన యిందు అహల్యతో కూడ పెక్కువత్సరములు తపస్సుచేసెను. ఒకనాఁడు ఇంద్రుఁడు ముని స్నానమున కేగిన సమయము చూచి గౌతముని వేషముతో ఆమెను సమీపించెను.

శ్లో॥ ముని వేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన।
మతిం చకార దుర్మేధా దేవరాజకుతూహలాత్॥ 19

శ్లో॥ అబ్రవీత్ సురశ్రేష్ఠం కృతార్థే నాంతరాత్మనా।
కృతార్థాస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్ర మితః ప్రభో॥ 20

శ్లో॥ ఆత్మానం మాం చ దేవేశ సర్వథా రక్ష గౌతమాత్।
ఇంద్ర స్తు ప్రహసన్ వాక్య మహల్యా మిద మబ్రవీత్॥ 21

బాలకాండ-సర్గ - 48

గో. టీక:_ రక్ష_అప్రకాశగమనా దితి భావః।

ఆమెయు ఇంద్రుని గుర్తించి, దుర్బుద్ధియై, దేవరాజసంగమ కుతూహలమున "నేను కృతార్థురాల నైతిని, శీఘ్రముగ ఇటనుండి పొమ్ము. నిన్ను, నన్నును గౌతమునివలన రక్షింపుము" అని పలికెను. ఇంద్రుఁడు నవ్వుచు "నేనును పరితుష్టుఁడ నైతిని; వచ్చినట్లే ఇదిగో పోవుచున్నాను" అని ఆమెతో సంగమించి ఆశ్రమమునుండి బయల్వెడలెను. గౌతమునకు వెఱచి అతఁడు త్వరత్వరగా పోవుచుండఁగా, తీర్థోదకము లోడుచుండియు అగ్నివలె ప్రకాశించుచు సమిత్కుశలను గైకొని దేవదానవదుర్ధర్షుఁడైన మహాతపస్వి గౌతముఁ డెదురయ్యెను.

శ్లో॥ దేవదానవదుర్ధర్షం తపోబలసమన్వితమ్।
తీర్థోదకపరిక్లిన్నం దీప్యమాన మి వానలమ్॥ 24

శ్లో॥ గృహీతసమిధం తత్ర సకుశం మునిపుంగవమ్।
దృష్ట్వా సురపతి స్త్రస్తో వివర్ణ వదనోఽభవత్॥ 25

శ్లో॥ అథ దృష్ట్వా సహస్రాక్షం మునివేషధరం మునిః।
దుర్వృత్తం వృత్తసంపన్నో రోషా ద్వచన మబ్రవీత్॥ 26

శ్లో॥ మమ రూపం సమాస్థాయ కృతవా నసి దుర్మతే।
అకర్తవ్య మిదం యస్మాత్ విఫల స్త్వం భవిష్యసి॥ 27

శ్లో॥ గౌతమే నైవ ముక్తస్య సరోషేణ మహాత్మనా।
పేతతు ర్వృషణౌ భూమౌ సహస్రాక్షస్య తత్క్షణాత్॥ 28

శ్లో॥ తథా శప్త్వా చ వై శక్ర మహల్యా మపి చ శప్తవాన్।
ఇహ వర్షసహస్రాణి బహూని త్వం నివత్స్యసి॥ 29

శ్లో॥ వాయుభక్షా నిరాహారా తప్యన్తీ భస్మశాయినీ।
అదృశ్యా సర్వభూతానా మాశ్రమేఽస్మి న్నివత్స్యసి ॥ 30

శ్లో॥ యదా చైత ద్వనం ఘోరం రామో దశరథాత్మజః।
ఆగమిష్యతి దుర్ధర్షః తదా పూతా భవిష్యసి॥ 31

శ్లో॥ త స్యాతిథ్యేన దుర్వృత్తే లోభమోహవివర్జితా।
మత్సకాశే ముదా యుక్తా స్వం వపు ర్ధారయిష్యసి॥ 32

బాలకాండ-సర్గ-48

ఆయనను చూడగానే యింద్రుఁడు భీతుఁడై విషణ్ణవదనుఁడయ్యెను. మునివేషధరుఁడైన యింద్రుని జూచి, గౌతముఁడు జరిగిన దానిని గ్రహించి, క్రుద్ధుఁడై "నారూపమును ధరించి ఇట్టి యకృత్యమును చేసితివి. కావున నీవు విఫలుఁడ వగు" మని శపించెను. వెంటనే యింద్రుని వృషణములు భూమిపైఁ బడెను. పిమ్మట గౌతముఁడు భార్యను జూచి," నీ విందు పెక్కువేల యేండ్లు వాయువే ఆహారముగా భస్మమునందు పడియుండి సర్వభూతములకు అగోచరవై తపించుచుండుము. ఇప్పటికి దశరథాత్మజుఁడు వచ్చినపుడు పవిత్రురాలవు కాఁగలవు. లోభమోహవివర్జితవై, నా సమక్షమున అతనికి ఆతిథ్యము నొసంగి,స్వరూపము నొందఁగలవు" అని పలికి హిమవచ్ఛిఖరమునకు తపస్సుచేయఁ బోయెను.

ఇంద్రుఁడు దేవతల యొద్దకు పోయి "గౌతమునకు క్రోధమును కలిగించి, అతనితపస్సు వ్యయ మగునట్లు చేసితిని; అతని కోపము వలన అహల్య నిరాకరింపఁబడినది; నేను అఫలుఁడ నైతిని. నన్ను సఫలుని గావింపవలె" అని పలికెను. అగ్నిపురోగములై దేవతలు పితృదేవతలయొద్దకు పోయి వారికి హవిస్సుగా అర్పింపఁబడిన మేషమును జూచి యిట్లనిరి. "ఈ మేషము సఫలమై యున్నది,

ఇంద్రుడు అఫలుడై యున్నాడు. కావున ఈ మేషవృషణముల నింద్రునకు నిండు. అఫలమైన ఈ మేషము మీకు తుష్టిని కలిగించుగాక ; మీరు యజమానులకు అక్షయఫలము నొసంగుడు" అని పలికెరి. పితృదేవతలు అంగీకరించి ఇంద్రుని మేషవృషణుని గావించిరి. కావున గౌతమాశ్రమములోనికి పోదము రమ్ము. అహల్యను తరింపజేయుము"

శ్లో॥ త దాగచ్ఛ మహాతేజ ఆశ్రమం పుణ్యకర్మణః।
తారయైనాం మహాభాగా మహల్యాం దేవరూపిణీమ్॥

శ్లో॥ విశ్వామిత్రవచ శ్శ్రుత్వా రాఘవ స్సహలక్ష్మణః।
విశ్వామిత్రం పురస్కృత్య ఆశ్రమం ప్రవివేశ హ॥ 12

శ్లో॥ దదర్శ చ మహాభాగాం తపసా ద్యోతితప్రభామ్॥ 13
ధూమే నాభిపరీతాంగీం దీప్తా మగ్నిశిఖా మివ॥ 14

శ్లో॥ సాపి గౌతమవాక్యేన దుర్నిరీక్ష్యా బభూవ హ।
త్రయాణా మపి లోకానాం యావ ద్రామస్య దర్శనమ్॥ 15

శ్లో॥ శాప స్యాన్త ముపాగమ్య తేషాం దర్శన మాగతా॥ 16

బాలకాండ-సర్గ-49

అంతట రాముడు సలక్ష్మణుడై విశ్వామిత్రునితో ఆశ్రమమున ప్రవేశించి, తపస్సుచే ప్రకాశించుచు దేవతలకును దుర్నిరీక్ష్యయై, ధూమపరీతయైన యగ్నిశిఖవలె నున్న అహల్యను జూచెను. ఆమె తుషారావృతమై మేఘముతో కూడిన పూర్ణచంద్రునివలె, నీటి మధ్యములో తేజరిల్లు సూర్యకాంతివలె నుండెను. శాపము అంతము కానుండుటవలన ఆమె వారికి వ్యక్తావ్యక్తముగా కన్పించెను.

శ్లో॥ రాఘవౌ తు తదా తస్యాః పాదౌ జగృహతు ర్ముదా।
స్మరన్తీ గౌతమవచః ప్రతిజగ్రాహ సా హి తౌ॥ 17

శ్లో॥ పాద్య మర్ఘ్యం తథాతిథ్యం చకార సుసమాహితా।
ప్రతిజగ్రాహ కాకుత్స్థో విధిదృష్టేన కర్మణా॥ 18
బాలకాండ-సర్గ-49

రామలక్ష్మణులు వెంటనే ఆమెకు పాదాభివందన మొనర్చిరి. ఆమెయు వారికి పాద్యార్ఘ్యములతో ఆతిథ్యమొసంగెను।

శ్లో॥ సాధు సాధ్వితి దేవా స్తా మహల్యాం సమపూజయన్।
తపోబలవిశుద్ధాంగీం గౌతమస్య వశానుగామ్॥ 20

శ్లో॥ గౌతమోఽపి మహాతేజా అహల్యాసహిత స్సుఖీ।
రామం సంపూజ్య విధివ త్తప స్తేపే మహాతపాః॥ 21
బాలకాండ-సర్గ-49

అప్పుడు దేవతలు పుష్పవృష్టితో దుందుభినినాదములతో అభినందించిరి. గౌతముఁడును అచ్చటికి వచ్చి ఆమెను స్వీకరించి, రాముని పూజించి మరల తపస్సు చేయఁజొచ్చెను.

దేవతలు అహల్యను అభినందించిరి. కావున మనకును ఆమె ప్రాతస్మరణీయురాలై యున్నది. ఎందువలన ? అహల్య చేసినది తప్పు అనుటలో సందేహము లేదు. కాని ఆమె గౌతముని శాపమువలన వేలయేండ్లు తపస్సు చేసినది. తపోబలముచే విశుద్ధాంగియైనది. అందు వలన ఆమెను దేవతలు అభినందించిరి. విశ్వామిత్రమహర్షి ఆమెను మహాభాగనుగా గుర్తించెను. శ్రీరాముఁ డామెయాతిథ్యమును స్వీకరించెను. అనఁగా ఆమెయం దేర్పడిన పాపరూపమాలిన్యము పూర్తిగా పోయిన దన్నమాట. నిష్పాపయైన తరువాత ఆమెను యథాపూర్వముగా మన్నించుట న్యాయ్యము. ప్రాయశ్చిత్తము జరిగినతరువాత కూడ తక్కువచూపుతో ఆమెను దూర మొనర్చుట అన్యాయ్యము. ఇంకను ఆమె ఆర్యులకు పరిగ్రాహ్యురాలు కాకపోయినచో ప్రాయశ్చి

త్తమునకు ఫలిత మేమి? అట్లగుచో ప్రాయశ్చిత్తమును విధించుచున్న శాస్త్రమే వ్యర్థ మగును. ఈధర్మసూక్ష్మమును ప్రకటించుటకే విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులను అచ్చటికి గైకొనిపోయెను. ఆమెవలన రాముఁడు విశ్వామిత్రునిసమక్షమున ఆతిథ్యమును స్వీకరించినంతనే ఆమె పరిశుద్ధురాలై మహాతపస్వియైన గౌతమునకు పత్నిగా పరిగ్రాహ్యురా లయ్యెను. కావుననే గౌతమమహర్షియు వెంటనే అచ్చటికి వచ్చి, ఆమెను పత్నినిగా పరిగ్రహించి శ్రీరాముని ఆదరించి అహల్యాసహితముగా సుఖియై మరల తపస్సు చేయఁ జొచ్చెను.

తరువాత వారు ఈశాన్యముగా పోయి జనకునియజ్ఞవాటమును చేరి, అచ్చట నొక విజనప్రదేశమున నివాస మేర్పఱచుకొనిరి. విశ్వామిత్రుఁడు వచ్చె నని విని జనకుఁడు శతానందునితో ఋత్విజులతో అర్ఘ్యపాద్యములు గైకొని వచ్చి వారిని పూజించెను. కుశలప్రశ్నలై అందఱు సుఖాసీనులైన తరువాత జనకుఁడు "యజ్ఞదీక్షలో పండ్రెండురోజు లింక మిగిలియున్నవి. తుదిదినమున సుత్యాహస్సునందు దేవతలను జూతువు గాక" అని పలికి, రామలక్ష్మణులనుగూర్చి యడిగెను. విశ్వామిత్రుఁడు యజ్ఞరక్షణమునుండి అహల్యాశాపశమనమువఱకు వృత్తాంతమును చెప్పెను. అప్పుడు మాతృశాపవిమోచనశ్రవణమున పులకితుఁడైన శతానందుఁడు విస్మితుఁడై రామలక్ష్మణులను జూచుచు "మా తల్లిని రామునకు జూపితివా ? ఆమె ఆతిథ్య మొసంగెనా ? జరిగిన వృత్తాంతమును చెప్పితివా? మా తండ్రిగారు మాయమ్మను స్వీకరించెనా?" అని యనేకవిధముల ప్రశ్నించెను. ఇన్ని ప్రశ్నలకు విశ్వామిత్రుఁడు ఇట్లు సంగ్రహముగా సమాధానము చెప్పెను. "ఏది కర్తవ్యమో అది అతిక్రమింపఁబడలేదు. నాకర్తవ్యమును నిర్వహించితిని. రేణుక జమదగ్నితో కూడినట్లు మీ జననియు గౌతమునితో కూడియున్నది."

రేణుకయు శీలదోషమున, భర్తయొక్క ఆజ్ఞచేత పరశురామునిచే నిహతయై మరలఁ బ్రతికెను. అదియే ఆమెకు ప్రాయశ్చిత్తము. అట్లు ప్రాయశ్చిత్తము నొందిన యామెను జమదగ్ని మరల పత్నినిగా స్వీకరించెను.

శ్లో॥ నాతిక్రాంతం మునిశ్రేష్ఠ యత్కర్తవ్యం కృతం మమ।
సంగతా మునినా పత్నీ భార్గవే ణేవ రేణుకా॥

బాలకాండ-సర్గ 51

ఇది విశ్వామిత్రమహర్షి యొక్క ప్రధానాశయమును ధ్వనింపఁ జేయుచున్నది. హిమవత్పర్వతప్రాంతములలో కౌశికీనదీతీరమున ప్రశాంతముగా తపస్సు చేసికొనుచున్న యాయనకు రావణునివలన లోకమునకు కలుగుచున్నబాధలను నివారించుటలో తన కర్తవ్యము కూడ కలదని తోఁచెను. అందువలననే ఆయన సిద్ధాశ్రమమునకు వచ్చి యజ్ఞరక్షణకై రాముని గొనివచ్చి అస్త్రముల నిచ్చి మహావీరునిగా తీర్చెను. తపోరూపప్రాయశ్చిత్తమున శుద్ధురాలైనయహల్యను రామునకు చూపి, ఆమెవలన ఆతిథ్యమును గైకొనునట్లు చేసి, ప్రాయశ్చిత్తముతో తప్పు తీఱినట్లే; అట్లు ప్రాయశ్చిత్తము నొందినవారిని తప్పుచేయనివారితో సమానముగనే భావింపవలె; తక్కువ చేయరాదు." అను విషయమును వ్యక్తమగునట్లు చేసినాఁడు. ఇట్లే కైక పరితప్తురాలైన దని తెలిసిన తరువాత రాముఁడు సీతాగ్నిప్రవేశసందర్భమున ప్రత్యక్షమైనతండ్రిని కైకను క్షమింపవలసినదిగా ప్రార్థించె ననుట గమనింపఁ దగియున్నది.

అట్లే విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను జనకునొద్దకు తెచ్చి, శివధనువును రాముఁ డెక్కుపెట్టుటకు వీలు కలిగించి రెండు గొప్ప రాజవంశములకు సంబంధము కలుగునట్లుచేసి, మఱియొక కర్తవ్యమును నిర్వహించెను. "పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా"

అని జనకుఁడు చెప్పఁబోపు పద్ధతిలో సీత రాముని ఎప్పుడును అనుస రించియే యుండును. కావున అరణ్యవాసమునందును ఆమె రాముని వెంటనే యుండును. కావున ఆమెనిమిత్తముగా రావణసంహారమునకు బీజము నాఁటినవాఁడై విశ్వామిత్రుఁడు కర్తవ్యమును నిర్వహించెను.

అంతట శతానందుఁడు మిగుల సంతోషించి రామునకు స్వాగ తము పలికె. "విశ్వామిత్రుని గురువునుగా పొందిననీకన్నను ధన్య తరుఁడు లోకమున నెవ్వఁడును లేఁడు. ఈ మహాత్ముని బల మెట్టిదో, చరిత్ర యెట్టిదో చెప్పెదను వినుము" అని విశ్వామిత్రచరిత్రమును చెప్ప నుపక్రమించెను.

ఈ మహర్షి పూర్వము రాజుగా పెక్కు వేలయేండ్లు పాలిం చెను. ఈయన ఒకప్పుడు చతురంగ బలములతో అక్షౌహిణీసేనా పరివృతుఁడై భూపర్యటనము చేయుచు, వశిష్ఠాశ్రమమునకు పోయి ఆబ్రహ్మర్షికి నమస్కరించెను. ఆయన ఈయనను అర్ఘ్యపాద్యాదులతో సత్కరించెను. కుశలప్రశ్నలైన తరువాత ఇరువురును చాలా సేపు ఇష్టకథాగోష్ఠి సలిపిరి. పిదప వసిష్ఠుడు సదైన్యముగా విశ్వామిత్రునకు ఆతిథ్యము సేయఁగోరెను. విశ్వామిత్రుఁడు "ఆ మాటయే చాలు. మాకు ఆతిథ్యము లభించినట్లే. ఇంక పోయివత్తును. మమ్ము మైత్రితో చూచుచుండుఁడు" అని పలికెను. కాని వసిష్ఠుఁడు ఆతిథ్యమును స్వీకరింపు మని బలవంతపెట్టెను.తుదకు విశ్వామిత్రుఁ డంగీకరించెను. వెంటనే వసిష్ఠుఁడు శబలను పిలిచి సదైన్యముగా వీరి కందఱకును ఇష్టమృష్టాన్నములఁ గూర్పు మని యాదేశించెను. వెంటనే ఆకామ ధేనువు భక్ష్యభోజ్యచోష్యలేహ్యములతో మహారాజునకు సైన్యమున కంతకును దివ్యమైన విందుఁ గావించెను.

సాంతఃపురామాత్యమంత్రిభృత్యబలవాహనముగ పరితుష్టుఁ డై విశ్వామిత్రుఁడు ప్రహర్షముతో వసిష్ఠునితో నిట్లనెను. "మహాత్మా!

పూజార్హుఁడవైన నీచేత నేను సపరివారముగా సుపూజితుఁడ నైతిని. నేనొక మాట చెప్పెదను వినుము. నీకు లక్షగోవుల నిచ్చెదను. ఈ శబలను నా కిమ్ము. ఇది రత్నము. మఱి రత్నహారికదా పార్థివుఁడు. కావున ధర్మవిధిచే న్యాయముగా ఇది నాదియే"

శ్లో॥ గవాం శతసహస్రేణ దీయతాం శబలా మమ
రత్నం హి భగవ న్నేతత్; రత్నహారీ తు పార్థివః॥ 9
శ్లో॥ తస్మా న్మే శబలాం దేహి ; మ మైషా ధర్మతో ద్విజ। 10
బాలకాండ – సర్గ. 53

అప్పుడు వసిష్ఠుఁ డిట్లనెను. "నీవు లక్ష కాదు కోటిగోవుల నొసంగినను రజతములరాశుల నొసంగినను నేను దీనిని వదలఁజాలను. మానధనునియొక్క కీర్తివలె ఇది నానుండి విడఁదీయరానిది. హవ్యకవ్యాదిసకలవిధులు నాజీవితయాత్రయు దీనిపైననే ఆధారపడియున్నవి. పెక్కుకారణములచే నే నీ శబలను ఈయఁజాలను.

శ్లో॥ శాశ్వతీ శబలా మహ్యం కీర్తి రాత్మవతో యథా।
అస్యాం హవ్యం చ కవ్యం చ ప్రాణయాత్రా తథైవ చ॥13
శ్లో॥ కార్యాణై ర్బహుభీ రాజ న్న దాస్యే శబలాం తవ। 16

అంతట విశ్వామిత్రుఁడు హిరణ్యాలంకారభూషితములైన గజములు 14 వేలు శ్వేతాశ్వములు గల 800 బంగారురథములు ఇంకను వేలకొలఁది యుత్తమహయములతో కోటిగోవుల నిత్తు నని ప్రలోభపెట్టెను. వసిష్ఠుఁడు, "నాకార్యము లన్నియు దీనిపై ఆధారపడి యున్నవి. ఇన్ని మాట లేల! నీవు ఏమిచ్చినను నేను ఈకామ దోహినిని ఈయను" అని పలికెను.

శ్లో॥ అదోమూలాః క్రియా స్సర్వా మమ రాజ న్నసంశయః।
బహునా కిం ప్రలాపేన న దాస్యే కామదోహినీమ్॥ 25

బాలకాండ సర్గ–53

అప్పుడు విశ్వామిత్రుఁడు శబలను గొనితేర భటులను బంపెను. భటులు తన్ను లాగుచుండఁగా శబల దుఃఖించి వారిని త్రోసివేసి వాయువేగమున వసిష్ఠుని యొద్దకు వచ్చి "భగవానుఁడా నన్ను వదలిపెట్టితివా యేమి? ఈభటు లేల నన్ను పట్టుకొను చున్నారు?" అని అడిగెను.

శ్లో॥ భగవన్ కిం పరిత్యక్తా త్వ యాహం బ్రహ్మణ స్సుత।
యస్మా ద్రాజభృత్యా మాం హి నయన్తే త్వత్సకాశతః॥ 8

శ్లో॥ ఏవ ముక్త స్తు బ్రహ్మర్షి రిదం వచన మబ్రవీత్।
శోకసంతప్తహృదయాం స్వసార మివ దుఃఖితామ్॥ 9

శ్లో॥ న త్వాం త్యజామి శబలే నాపి మేఽప్రకృతం త్వయా।
ఏష త్వాం నయతే రాజా బలా న్మత్తో మహాబలః॥ 10

బాలకాండ-సర్గ - 54

అట్లు సోదరివలె దుఃఖించుచున్న శబలను జూచి వసిష్ఠుఁడు "నీ వేమియు తప్పు చేయలేదు. నేను నిన్ను వదల లేదు. సేనాపరివృతుఁడైనయీరాజు నాకన్న బలవంతుఁడై నిన్ను బలవంతముగా తీసికొనిపోవుచున్నాఁడు" అని పలికెను. అప్పు డా ధేనువు "క్షత్రియునిబల మేమి బలము? బ్రహ్మబలమే బలవత్తరమైనది. నీబలము అప్రమేయము. నన్ను నియోగింపుము. ఈ దురాత్మునిబలమును దర్పమును నశింపఁజేయుదును" అని పలికెను. వసిష్ఠుఁడు అట్లే చేయు మనెను.

శ్లో॥ అప్రమేయం బలం తుభ్యం న త్వయా బలవత్తరః।
విశ్వామిత్రో మహావీర్య స్తేజ స్తవ దురాసదమ్॥ 15

శ్లో॥ నియుంక్ష్వ మాం మహాతేజః త్వద్బ్రహ్మబలసంభృతామ్।
తస్య దర్పం బలం య త్తత్ నాశయామి దురాత్మనః 16

బాలకాండ - సర్గ - 54

అప్పు డాధేనువు హుంకారవముచేత వందలకొలఁదిగా పహ్లవులను సృష్టించెను. వారు విశ్వామిత్రసైన్యమును నుఱుమాడఁ జొచ్చిరి. విశ్వామిత్రుఁడు వివిధాయుధములతో ఆపహ్లావులను సంహరించెను. అది చూచి శబల మరల సంపెగకేసరములవర్ణము కలిగి మహాపరాక్రమశాలులైన యవనసహితులైన శకులను సాయుధులైన వారిని సృష్టించెను. వారు విశ్వామిత్రునిసైన్యమును నిర్దగ్ధ మొనర్పఁ జొచ్చిరి. విశ్వామిత్రుఁడు వారిపై వివిధాస్త్రముల ప్రయోగించి విధ్వంస మొందించెను. అప్పుడు వసిష్ఠుఁడు ఇంకను సృజింపు మని శబలను ప్రోత్సహించెను. అప్పు డామెహుంకారమువలన రవిసన్నిభులైన కాంభోజులు, పొదుగునుండి శస్త్రపాణులైన బర్బరులు, యోని ప్రదేశమునుండి యవనులు శకృత్దేశమునుండి (పేడ వెలికి వచ్చు స్థానమునుండి) శకులు రోమకూపములనుండి మ్లేచ్ఛ హారీత కిరాతకులును బయల్వెడలి విశ్వామిత్రసైన్యమును విధ్వంస మొనర్చిరి. అది చూచి యతనిపుత్రులు నూర్వురు సాయుధులై వసిష్ఠుని పైకుఱికి, ఆయన గావించినహుంకారమున భస్మీభూతులైరి.

అప్పుడు విశ్వామిత్రుఁడు నిస్తరంగమైన సముద్రమువలె, కోరలువిరిగినపాామువలె, రాహుగ్రస్తుఁడైన రవివలె నిస్తేజుఁడై హతశేషుఁడైన కుమారునకు రాజ్యము నొసంగి హిమవంతమునకు పోయి, మహాదేవునిగూర్చి తపస్సుచేసెను. కొంతకాలమునకు పరమే

శ్వరుఁడు ప్రత్యక్షమై విశ్వామిత్రునకు సాంగోపాంగముగా సరహస్యముగా సకలధనుర్వేదమును. త్రైలోక్యమునందలి సర్వాస్త్రములను ప్రసాదించెను.

శ్లో॥ యది తుష్టో మహాదేవ ధనుర్వేదో మమానఘ।
సాంగోపాంగోపనిషదః సరహస్యః ప్రదీయతామ్॥ 16

శ్లో॥ యాని దేవేషు చాస్త్రాణి దానవేషు మహర్షిషు।
గంధర్వయక్షరక్షస్సు ప్రతిభాన్తు మమానఘ॥ 17

బాలకాండ - సర్గ - 55

అంతట విశ్వామిత్రుఁడు దర్పితుఁడై వసిష్ఠుఁడు హతుఁడైనట్లే తలంచుచు, ఆశ్రమమును సమీపించి, దానిని అస్త్రములచే నిర్దగ్ధమొనర్చెను. ఆశ్రమవాసు లందఱు పారిపోఁగా తపోవనము ఊషరక్షేత్రమువలె నయ్యెను. అప్పుడు వసిష్ఠుఁడు విశ్వామిత్రుని చూచి రోషముతో, "చిరసంభృతమైనయాశ్రమమును నాశ మొందించితివి : మూఢుఁడవు;ఇంక నీబల మంతయు చూపుము" అని బ్రహ్మదండమును గైకొనెను.

శ్లో॥ క్షత్త్రబంధో స్థితోఽస్మ్యేష యద్బలం తద్ విదర్శయ।
నాశయా మ్యద్య తే దర్పం శస్త్రస్య తవ గాధిజ॥ 3

శ్లో॥ క్వ చ తే క్షత్త్రియబలం క్వ చ బ్రహ్మబలం మహత్।
పశ్య బ్రహ్మబలం దివ్యం మమ క్షత్త్రియపాంసన॥ 4

బాలకాండ-సర్గ-56

విశ్వామిత్రుఁడు మహాదేవునిప్రసాదమున పొందిన యాగ్నేయాదిసకలాస్త్రములను వసిష్ఠునిపై ప్రయోగించెను. బ్రహ్మదండముతో వసిష్ఠుఁడు వాని నన్నింటిని గ్రసించెను.

శ్లో॥ వసిష్ఠే తపతాం శ్రేష్ఠే త దద్భుత మి వాభవత్।
తాని సర్వాణి దండేన గ్రసతే బ్రహ్మణ స్సుతః॥ 13

శ్లో॥ బ్రహ్మాస్త్రం గ్రసమానస్య వసిష్ఠస్య మహాత్మనః।
త్రైలోక్యమోహనం రౌద్రం రూప మాసీ త్సుదారుణమ్॥17

శ్లో॥ రోమకూపేషు సర్వేషు వసిష్ఠస్య మహాత్మనః।
మరీచ్య ఇవ నిష్పేతు రగ్నే ర్ధూమాకులార్చిషః॥ 18

బాలకాండ-సర్గ-56

తుదకు విశ్వామిత్రుఁడు బ్రహ్మాస్త్రమును ప్రయోగింపఁగా దానిని కూడ వసిష్ఠుఁడు బ్రహ్మదండముచేతనే గ్రసించెను. అప్పు డాయన రోమకూపములనుండి పొగలు సెగలు వెలువడఁజొచ్చెను. అప్పుడు ముని లందఱును బ్రహ్మాస్త్రమును నీయందే ఉపసంహరింపు మని వసిష్ఠుని ప్రార్థించిరి. వసిష్ఠుఁడు వల్లెయని దానిని శాంతింపఁజేసి తానును శమించెను. తిరస్కృతుఁడైన విశ్వామిత్రుఁడును, "ఛీ! క్షత్త్రియబల మేమిబలము; ఒక్క బ్రహ్మదండముచే నా యస్త్రము లన్నియు హతములైనవి. కావున బ్రహ్మత్వమును సాధించుటకై, ప్రసన్నేంద్రియమానసుఁడనై గొప్పతపస్సు చేయుదు'' నని నిశ్చ యించుకొనెను.

శ్లో॥ ధి గ్బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్।
ఏకేన బ్రహ్మదండేన సర్వాస్త్రాణి హతాని మే॥ 23

శ్లో॥ త దేతత్ ప్రసమీక్ష్యాహం ప్రసన్నేంద్రియమానసః।
తపో మహత్ సమాస్థాస్యే య ద్వై బ్రహ్మత్వకారణమ్॥24

బాలకాండ - సర్గ - 56

గో. టీక :- ప్రసన్నేంద్రియమానసః పరిత్యక్తక్షత్త్రిరోషః ఇత్యర్థః।

అంతట విశ్వామిత్రుఁడు భార్యతో కూడ దక్షిణదిక్కునకు పోయి, ఫలమూలభోజనుఁడై తీవ్రతపస్సు చేసెను. అప్పు డాయనకు హరిష్పంద మధుష్పంద దృఢనేత్ర మహారథులు జన్మించిరి.

వేయిసంవత్సరములకు బ్రహ్మ ప్రత్యక్షమై "నీచేత రాజర్షిలోకములు జి ము లయ్యె" ననెను. అనగా విశ్వామిత్రుఁడు రాజర్షి యయ్యె నన్నమాట. విశ్వామిత్రుఁడు సిగ్గుపడి దుఃఖితుఁడై "ఇంతతపస్సునకు ఫలము రాజర్షిపదమా! తపస్సునకు ఫలమే కలుగలే దన్నమాట!" అని తలంచి, మరల తపస్సుచేయ మొదలుపెట్టెను. ఆసమయముననే ఇక్ష్వాకువంశ్యుఁడు త్రిశంకువు శరీరముతో స్వర్గమున కేఁగ తలంచి తగినయజ్ఞమును చేయింపు మని వసిష్ఠుని ప్రార్థించెను. అది ఆయన అశక్య మనెను. పిదప నతఁడు వసిష్ఠపుత్రులను చేరి అట్లే ప్రార్థించెను. "భగవంతుఁడగు మాతండ్రిగారు అశక్యమని చెప్పినది మాకు సాధ్య మగునా? నీవు బాలిశుఁడవు" అని నిందించిరి. అతఁడు "అట్లయినచో నేను వేరొకమార్గమును చూచుకొందు" ననెను. బ్రహ్మపుత్రుఁడైన తమతండ్రిగారి నతిక్రమించి మఱియొకని నాశ్రయింతు నని వారి యెదుట చెప్పుట ఆయన నవమానించుటే కాక వారిని కూడ అవ మానించిన ట్లయ్యెను. అందువలన వారు తండ్రిగారియవమానమును సహింపక మిగుల కోపించి, చండాలత్వమును పొందఁగల వని శపించిరి. తెల్లవారునప్పటికి త్రిశంకువు చండాలత్వమును పొందెను. అది చూచి అప్పటివఱకు వెంట వచ్చియున్న యమాత్యులు పౌరులును అతనిని విడిచి వెళ్ళిపోయిరి. అంతట త్రిశంకువు విశ్వామిత్రుని సమీపించి తనకోర్కెను వృత్తాంతమును చెప్పి, "నాకు నీకన్న శరణము లేదు. నాదుర్దైవమును పురుషకారముచేత నీవే తొలఁగింపఁ

గలవు" అని ప్రార్థించెను. విశ్వామిత్రుఁడు సుప్రీతుఁడై "ఈశరీర ముతోనే నిన్ను స్వర్గమునకు పంపుదును. నన్ను శరణము నొందితివి. కావున నీకు స్వర్గము హస్తగత మైనట్లే" అని పలికి పుత్రులను శిష్యులను పిలిచి త్రిశంకుయజ్ఞమునకు వాసిష్ఠులతో కూడ మహర్షుల నందఱ నాహ్వానింపుఁడు. నామాట నెవరేని కాదన్నచో వా రేమనిరో నాకు వచ్చి చెప్పుఁడు" అని పంపెను. వారు పోయి మహర్షుల నంద అను ఆహ్వానించిరి. సకలదేశములనుండి సశిష్యులై మహర్షులు రాఁదొడంగిరి. పుత్రులు శిష్యులు తిరిగివచ్చి విశ్వామిత్రునితో నిట్లనిరి. మహోదయుఁడు వాసిష్ఠులు తప్ప తక్కినవా రందఱు మీయాహ్వానము మన్నించిరి. మహోదయసహితులైన వాసిష్ఠు లిట్లనిరి. "క్షత్రియుఁడు యాజకుఁడా? అందును చండాలునకా? ఆ యాగసదస్సునందు దేవతలు ఋషులును హవిస్సు నెట్లు భుజింతురు? చండాలభోజన మొనర్చి సదస్యులైన బ్రాహ్మణులు విశ్వామిత్రపాలితు లయ్యును. స్వర్గము నెట్లు పొందుదురు?" అంతట విశ్వామిత్రుఁడు మండిపడి "యుగ్రమైన తపస్సు చేయుచున్న నన్ను దూషించుచున్న యా దురాత్ములు భస్మ మగుదురు గాక! ఏడువందలజన్మలు శవభక్షకులై విరూపులు వికృతులు నిర్దయులై ముష్టికు లను పేరుతో ఈ లోకమున చరించుచుందురు గాక! మహోదయుఁడును చిరకాలము నిషాదుఁడగును గాక!" అని శపించెను.

మహోదయవాసిష్ఠులు చెప్పినది న్యాయ్యమే యైనను విశ్వామిత్రుఁడు తనపుత్రులను దగ్ధ మొనర్చిన వసిష్ఠునిపై పగతీర్చుకొనుటకే యిట్లు శపించె ననుట స్పష్టము. వసిష్ఠుఁడు ప్రతీకారమును తలంపకుండుట ఆయనప్రశాంతికి ప్రబలనిదర్శనము. విశ్వామిత్రుఁ డొనర్చినది యన్యాయ్యమే. పుత్రశోకమువలన వసిష్ఠునకు కలిగిన సంతాపము కూడ సామాన్యము కాదు. అయినను ఆయన దుఃఖము ననుభవించెనే కాని ప్రతీకారమున తపస్సును వ్యయింపఁ బూన లేదు.

తన తపోబలముచే వాసిష్ఠులు మహోదయుఁడును హతులై రని తెలిసికొని విశ్వామిత్రుఁడు మహర్షిసంఘమధ్యమున త్రిశంకు యాగమునుగూర్చి ప్రస్తావించెను. వా రాయనకు వెఱచి యజ్ఞ మారంభించిరి. యాజకుఁడుగా విశ్వామిత్రుఁడు చిరకాలము యజ్ఞము జరిపి హవ్యమునకై దేవతల నాహ్వానించెను. వారు రాలేదు. విశ్వామిత్రుఁడు క్రుద్ధుడై స్రువమును పైకెత్తి "నాతపోబలముచే నీవు సశరీరముగా స్వర్గమునకు పొమ్ము" అని త్రిశంకువుతో పలికెను. వెంటనే త్రిశంకువు మును లందఱు చూచుచుండఁగా స్వర్గమున కరిగెను. పాకశాసనుఁ డాతనిని "శాపహతుఁడవు నీవు స్వర్గమునకు తగవు; తలక్రిందుగా నేలపై పడు" మని తిరస్కరించెను. అట్లు పడుచు త్రిశంకువు "రక్షింపు రక్షింపు" మని విశ్వామిత్రుని ప్రార్థింపఁజొచ్చెను. అతనియాక్రోశము విని విశ్వామిత్రుఁడు "నిలువుము! నిలువు" మని పలికి క్రోధావిష్టుఁడై దక్షిణపువైపుగా క్రొత్తనక్షత్రములను ఇంద్రుని దేవతలను సృష్టింప మొదలిడఁగా సురాసురులు మహర్షులును సంభ్రాంతులై వచ్చి శాపహతుఁడైన త్రిశంకువు స్వర్గమునకు తగఁ డని అనునయించిరి. "నాప్రతిజ్ఞ అనృతము కారాదు. సశరీరుఁడైన త్రిశంకువునకు స్వర్గ మేర్పడును గాక! ఈ నక్షత్రములు ఇట్లే నిలుచును గాక!'' అని ఆయన కోరెను. వారును ఆనక్షత్రములు జ్యోతిశ్చక్రమునకు వెలుపల నుండు నని వానియందు ప్రకాశించుచు త్రిశంకు వధోముఖుఁడై ధ్రువముగా నుండు నని అంగీకరించి యజ్ఞాంతమున వెడలిపోయిరి.

పిదప విశ్వామిత్రుఁడు పడమటిదిశకు పోయి పుష్కరతీర్థమునందు తపస్సుచేయ మొదలుపెట్టెను. అప్పుడు అంబరీషుఁ డను నయోధ్యరాజు యజ్ఞము చేయుచుండఁగా యజ్ఞపశువు అపహరింపఁబడెను. దానికి మాఱుగా బలిపశువుకొఱకు వెదకుచు ఆరాజు భృగుతుంగములో తపస్సుచేయుచున్న ఋచీకునియొద్దకు పోయెను. పెద్దకుమారు నీయ నని ఋచీకుఁ డనెను. కనిష్ఠు నీయ నని తల్లి పలికెను. మధ్య

ముఁడైన శునశ్శేపుని విక్రయించుకొని అంబరీషుఁడు బయలుదేరెను. దారిలో శునశ్శేపుఁడు మేనమామయైన విశ్వామిత్రుని శరణుఁజొచ్చెను. ఆయన శునశ్శేపునకు మారుగా పుత్రులను పొమ్మనెను. వారు నిరాకరించిరి. ఆయన కోపించి "మీరు శ్వమాంసభక్షకులు కండు" అని శపించెను. పిదప ఆయన శునశ్శేపునకు రెండు గాథలు ఉపదేశించి యజ్ఞమునందు ఇంద్రుని స్తుతింపు మని చెప్పెను.అతఁ డట్లే చేయఁగా ఇంద్రుఁడు ప్రసన్నుఁడై వానికి దీర్ఘాయువు నొసంగెను.

తరువాత విశ్వామిత్రుఁడు వేయేండ్లు తపస్సు చేయఁగా బ్రహ్మ వచ్చి "ఋషి వైతివి"అని పలికెను. మరల నచ్చటనే ఆయన తపస్సు చేయుచుండఁగా ఇంద్రుఁడు మేనకను పంపెను. గాధేయుఁడు ఆమెకు వశుఁడై కామక్రీడలతో పదియేండ్లు గడిపెను. పొరపాటును తెలిసికొని ఆయన ఆమెపై కోపింపక ఆమెను ఓదార్చి పంపెను.

పిమ్మట ఆయన అటనుండి ఉత్తరదిక్కునకు పోయి కౌశికీనదీ తీరమున తపస్సు చేయఁగా బ్రహ్మదేవుఁడు వచ్చి "మహర్షి వైతివి" అని పలికెను. తరువాత విశ్వామిత్రుఁడు వాయుభక్షణుఁడై ఊర్ధ్వబాహుఁడై వేసవిలో పంచాగ్నిమధ్యమున చలికాలమున సలిలములందును నిలిచి తపస్సు చేసెను. ఆతపస్సునకు వెఱచి ఇంద్రుఁడు రంభను పంపెను. ఆమెను చూడఁగానే విఘ్నకారిణి అని యెఱింగి విశ్వామిత్రుఁడు "పదివేలయేండ్లు ఱాయివై పడియుండు"మని శపించెను. వెంటనే జరిగిన పొరపాటు తెలిసికొని ఆయన "ఇంక కోపమును పొందను; మాటాడుటయే మానివేయుదును. లేదా వందలకొలఁది వత్సరములు నిశ్శ్వాసమును మాని తపస్సుచేయుదును."- అని నిశ్చయించుకొనెను.

శ్లో॥ నైవ క్రోధం గమిష్యామి న చ వక్ష్యే కథంచన।
అథవా నోచ్ఛ్వసిష్యామి సంవత్సరశతా న్యపి॥ 18
బాలకాండ-సర్గ-64

పిమ్మట ఆ మహర్షి తూర్పుదిక్కునకు పోయి మౌనము వహించి కాష్ఠమువలె నుండి వేయేండ్లు తపస్సు చేసెను. వ్రతాంతమునందు ఆయన పారణ మొనర్చుటకు సిద్ధముచేసికొన్నయన్నమును ఇంద్రుఁడు భూసురవేషమున వచ్చి యాచించెను. దాని నాతని కొసంగి విశ్వామిత్రుఁడు మరల కుంభక మొనర్చి వేయేండ్లు తపస్సు చేసెను. అప్పు డాయనయొక్క మూర్ధమునుండి ధూమము బయలుదేరి మూఁడులోకములు సంభ్రాంతి నొందెను. బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమై "బ్రహ్మర్షి వైతి" వనెను. "వశిష్ఠుఁడు వచ్చి నేను బ్రహ్మర్షి నైతి నని చెప్పిననే తప్ప అంగీకరింపఁజాల"నని విశ్వామిత్రుఁడు పలికెను. దేవతలసంప్రార్థనమున వశిష్ఠుడు వచ్చి "నీవు బ్రహ్మర్షి వైతి" వని పలికి ఆతిథ్యమును స్వీకరించి సఖ్యమును గావించెను.

విశ్వామిత్రుని చరిత్రలో ఆలోచింపఁదగినయంశములు అనేకములు కలవు. విందుచేయుటయందు శత్రుపులను సంహరించుటయందును శబల చూపినసామర్థ్యము అమేయముగా నున్నది. ఆవునకు ఇట్టి సామర్థ్య ముండునా? సాధారణమానవులకు లేని శక్తులు యోగసిద్ధులైన మహర్షులకు నుండుట సహజము. గులకఱాయి కొండఱాయి మొదలుగా రత్నమువఱకు అన్నియు ఱాలే. కాని రత్నమున కున్నకాంతి తక్కినవానికి లేదు. అట్లే దివ్యధేనువున కున్నశక్తి తక్కినయావులకు ఉండదు. కావున శబలయొక్క సామర్థ్యమును కల్పన యని త్రోసివేయ రాదు.

విశ్వామిత్రుఁడు, "ఇది రత్నము; మఱి రత్నహారి కదా పార్థివుఁడు; కావున ధర్మవిధిచే న్యాయముగా ఇది నాదియే" అని శబలపై

తనహక్కును ప్రకటించుట గమనింపఁదగియున్నది. రత్నమును హరించువాఁడు రత్నహారి. ప్రతిజాతియందును ఏది యుత్కృష్టమైన వస్తువో అది రత్నముగా భావింపఁబడును. పై సిద్ధాంతమునకు ఏమర్థము? శ్రేష్ఠములైన వస్తువులు ఎక్కడ ఉన్నను వాని నన్నిటిని రాజు తనయొద్దకు చేర్చుకో వలయు నన్నమాట. అట్లయినచో ప్రజలు శ్రేష్ఠములైన వస్తువులను సంపాదించుకొన్నచో వానిపై వారికి స్వామ్యము ఉండదా? ఇంక ప్రజలకు సొంతయాస్తి విషయమున భద్రత ఎట్లుండును? కాని వశిష్ఠుఁడును ఈసిద్ధాంతమును ఆక్షేపింప లేదు. అనఁగా ఈ సిద్ధాంతము కొన్నియెడల సమంజసమే యగునని తలంపవలసి యున్నది.

సూర్యుని మెప్పించి సత్రాజిత్తు శమంతకమణిని తెచ్చుకొన్నప్పుడు శ్రీకృష్ణుఁడు కూడ ఆమణిని ప్రభువైన యుగ్రసేనునకు ఇమ్మని చెప్పెను. సత్రాజిత్తు అంగీకరింప లేదు. అందులకు ఫలము వెంటనే కానవచ్చెను. ఆమణిని ధరించి ప్రసేనజిత్తు మొదట సింహమునకు బలి యయ్యెను. దానిని చంపి జాంబవంతుఁడు మణిని హరించెను. అతఁడును శ్రీకృష్ణునితో పోరి శరణాగతుఁడై చావు తప్పించుకొనెను. ఆమణికొఱకే శతధన్వుఁడు సత్రాజిత్తును చంపెను. దానికొఱకే శ్రీకృష్ణుఁడు శతధన్వుని సంహరింపవలసి వచ్చెను. దీని వలన అమూల్యమైన వస్తువులు అల్పశక్తి కలవారికి ఆపద కలిగించు ననుట స్పష్టము. సామాన్యములైన యాస్తులకొఱకే సాధారణప్రజలు రక్షణమును కోరుచుండఁగా రత్నములసంగతి చెప్పవలసిన దేమున్నది? రత్నములను చెంతనుంచుకొని సామాన్యులు భయగ్రస్తులై దినదిన గండముగా బ్రతుకుటకన్న వానిని ప్రభుత్వమున కప్పగించుటయే శ్రేయస్కర మనుట పై సూక్తికి తాత్పర్యముగా గ్రహింపవచ్చును. కాని ఒకానొకఁడు శ్రేష్ఠమైన వస్తువును కష్టపడి సంపాదించుకొని దానిని ఉపయోగించుకొనుటకు కాపాడుకొనుటకు సమర్థుఁడై యున్న

ప్పుడు ప్రభువు కేవలము స్వార్థముతో దానిని బలవంతముగా హరింపఁ బూనుట సమంజసము కాదు. శ్రీకృష్ణునకు స్వార్థము లేకుండటచేతనే మణికొఱకు సత్రాజిత్తును నిర్బంధింప లేదు. స్వార్థము ప్రబలుటచే విశ్వామిత్రుఁడు దురాక్రమణమునకు పూనుకొనెను.

ఆచారము ననుసరించి మహారాజులు మహర్షులకు ప్రణమిల్లు చున్నను బ్రాహ్మణులు క్షత్రియులకన్న బలవంతు లన్నవిషయము చాలమంది నమ్మరు. రాజులవైభవము కంటికి కన్పించినట్లుగా బ్రాహ్మణుల తపోబలము పైకి కన్పింపదు అవమానము సంభవించినను బ్రాహ్మణులు ఇతరులవలె శత్రువులను మార్కొనరు. వారు తపోవ్యయమునకు సులభముగా అంగీకరింపరు. రాక్షసులు మహర్షులయాశ్రమములపై దాడిచేయుచుండుటకు ఇదియే ముఖ్యకారణము. విశ్వామిత్రుని వంటి ధార్మికుఁడైన మహారాజు కూడ బ్రాహ్మణునిసొత్తును హరించుటకు పాల్పడె నన్నచో యథార్థముగా బ్రాహ్మణులయందు గౌరవము నిలుపుకొనుట కష్ట మనుట స్పష్టము.

తపోవ్యయముసంగతియే కాక శత్రువులను ప్రతిఘటించుట బ్రాహ్మణులకు తగ దని మనువు చెప్పియున్నాడు. "పీడింపఁబడి ఆర్తుఁడై యున్నను బ్రాహ్మణుఁడు మర్మభేదకముగా సద్గతినిరోధకముగా, అనఁగా శపించుచు మాటాడరాదు; పరులకు అపకారము జరుగవలయు ననుబుద్ధిని కూడ పొంద రాదు". "బ్రాహ్మణుఁడు సమ్మానమును విషముగా తలంచుచు దానికి భయపడవలయును; అమృతమును వలె అవమానమును సదా ఆకాంక్షింపవలెను."

శ్లో॥ నారుంతుద స్స్యా దార్తోఽపి న పరద్రోహకర్మధీః।
యయాస్యోద్విజతే వాచా నాలోక్యాం తా ముదీరయేత్॥ 161

శ్లో॥ సమ్మానా ద్బ్రాహ్మణో నిత్య ముద్విజేత విషా దివ।
అమృతస్యేవ చాకాంక్షే దవమానస్య సర్వదా॥ 162

(మనుస్మృతి. అధ్యాయ. 2.)

కావున వశిష్ఠుఁడు ప్రతిఘటింప లేదు. కాని తనకు జరిగిన యవమానమును తాను నియమబద్ధుఁడై ఓర్చుకొన్నను గృహస్థుఁడు పశుపుత్రభార్యాదుల ను రక్షించుబాధ్యతను కూడ కలిగియున్నాఁడు. అందువలన శబల ఆత్మరక్షణకై అనుమతిని అడిగినప్పుడు వసిష్ఠుఁడు వెంటనే అంగీకరించి ప్రతిఘటనమును ప్రోత్సహించెను.

విశ్వామిత్రుఁడు మొదట చేసినతపస్సునకు తరువాత చేసిన తపస్సునకుఁ గలభేదము గమనింపఁ దగియున్నది. వశిష్ఠునివలన ఘోరమైన పరాజయము కలిగినంతనే విశ్వామిత్రుఁడు ఆ మహర్షిని ఎట్లైనను నిగ్రహింపవలె నను నిశ్చయముతో మహేశ్వరునిగూర్చి తపస్సుచేసెను. మహేశ్వరుఁడు ప్రత్యక్షమైనను ఆయనచిత్తమునందు రవంతయును మార్పు రాలేదు. అనఁగా దేవుని చూచినప్పటికిని మనచిత్తములయందు ధర్మతత్త్వజ్ఞానము కొంచెమైనను అభివృద్ధి నొందు నని చెప్పఁజాలము. అర్జునుఁడు కూడ ఈశ్వరుని సాక్షాత్క-రింపఁజేసికొని పాశుపతాస్త్రమును పొందినవాఁడే. కాని అతఁడు కూడ బంధువులతో యుద్ధము చేయవలసివచ్చినప్పుడు తనకు అది ధర్మమగునా కాదా అని సందేహించి, "ధర్మమునందు నాబుద్ధి మూఢమై యున్నది. నేను నీకు శిష్యుఁడను; ప్రపన్నుఁడను. నాకు శ్రేయస్కరమైన విధమున నన్ను శాసింపుము" అని శ్రీకృష్ణుని ప్రార్థించెను. రాక్షసులు అనేకులు తపస్సుచేసి బ్రహ్మదేవునో మహాదేవునో దర్శించిన వారే కదా! వారి కెవరి కైనను కామక్రోధములు తగ్గినవా? ధర్మబుద్ధి కలిగినదా? కావున కోరికలతో తపస్సులు చేసినచో దేవుఁడు కన్పించి ఆ కోరికలు తీర్చునే కాని,ధర్మమునో తత్త్వమునో బోధింపఁడు.కావున ఇట్టితపస్సు చిత్తశుద్ధిని కలిగింపదు.

మహేశ్వరునివలన పొందినసకలాస్త్రములు వసిష్ఠుని బ్రహ్మదండముచే గ్రసింపఁబడిన తరువాత విశ్వామిత్రుఁడు గావించిన

తపస్సు పూర్వము కావించినదానికన్న విశిష్టమైనది. "క్షత్రియ బలము వ్యర్థము. బ్రహ్మతేజోబలమే బలము. కావున నేను ఇంద్రియ ములను మనస్సును ప్రసన్నము లగునట్లు చేసికొని బ్రహ్మత్వమును కలిగించునట్టి గొప్పతపస్సును చేయుదును" అని ఆయన నిశ్చయించు కొనెను. వర్షకాలమున ప్రవాహమునకు స్వచ్ఛత యుండదు. శరత్కాలమున నీరు తేటకొన్నప్పుడు అడుగున నున్నచిన్నవస్తువులు కూడ కన్పించును. అట్టిస్వచ్ఛతయే ప్రసన్నత. కామక్రోధములవేగము తగ్గినచో మనస్సునకు ఇంద్రియములకు ఇట్టిప్రసన్నత కలుగును. విశ్వామిత్రుఁడు రెండవసారి చేసినతపస్సు ఈప్రసన్నతను సాధించుటకు సాధనమైనది. ఈతపస్సాధనముననే క్రమముగా ఆయన ఋషియై, రాజర్షియై, మహర్షియై, బ్రహ్మర్షి యయ్యెను. కావున కర్మ భక్తి తపస్సు మొదలగుసాధనము లన్నియు నిష్కామము లైనప్పుడే చిత్త శుద్ధిని కలిగించి జ్ఞానసాధనములు కాఁగలవు.

వశిష్ఠుఁడు సకలాస్త్రములను గ్రసించుచున్నప్పుడు, ఆయన బ్రహ్మజ్ఞాని కావున ఇంతశక్తిని కలిగియుండె నని కొందఱు తలంపవచ్చును. అట్లయినచో ఎవనియందు ఇట్టిశక్తి లేదో వానికి బ్రహ్మజ్ఞానము ఉండ దని తలంపవలసి యుండును. ఈతలంపు సరియైనది కాదు. బ్రహ్మజ్ఞానమునకు మహిమలకును ఏమియు సంబంధము లేదు. ఈ సందర్భమున వాల్మీకి వశిష్ఠునిగూర్చి, జపించువారిలో శ్రేష్ఠుఁడు (జపతాం వరః) అని పెక్కుపర్యాయములు చెప్పెను. అనఁగా వశిష్ఠుఁడు పరమమంత్రమైన గాయత్రిని వేలయేండ్లు నిష్ఠతో జపించుచున్నాఁ డన్నమాట. ఆజపానుష్ఠానమునకు ఫలముగా ఆయనకు అమితమైన బ్రహ్మతేజోబలము కలిగినది. నదులు ఎన్నియైనను ఎంతపెద్దవి యైనను సముద్రములో లీనమగునట్లు అస్త్రతేజము లన్నియు బ్రహ్మతేజమున లయము నొందెను. ఈ శక్తు లన్నియు విజ్ఞానమయ

కోశములోనివి. వేదాధ్యయన మంతయు మనోమయకోశములోనిది. వేదార్థమును విచారించి ధర్మమును నిశ్చయించుకొనుట ఋతము. దాని ననుసరించి శ్రద్ధతో వ్రతయజ్ఞతపోజపాదులను అనుష్ఠించుట సత్యము. శ్రద్ధయే శిరస్సుగా ఋతము సత్యము రెండుపక్షములుగా వివిధశక్తులతో విజ్ఞానమయకోశము రూపొందును. అనఁగా ఈ శక్తు లన్నియు బుద్ధి నాశ్రయించి యుండు నన్నమాట. బుద్ధి నిద్రలో లీన మైనప్పుడు ఇవి యేవియు ప్రకాశింపవు. రావణుఁడు జాగ్రద్దశలో దశకంఠుఁడుగా వింశతిభుజుఁడుగా కన్పించుచున్నను నిద్రించునప్పుడు ఒకతలతో రెండుభుజములతోనే యుండె నని వాల్మీకి వర్ణించెను. నిద్రాస్థితియే ఆనందమయకోశము. దానికి ఆధారమైనది ఆత్మ. "ఈ కోశములలో ఏదియును ఆత్మ కాదు. ఇవి యన్నియు ఆత్మయందు తోఁచుచున్న దృశ్యములు మాత్రమే. దృక్స్వరూపమైన యాత్మయే నేను" అని దృఢముగ గ్రహించుటయే ఆత్మజ్ఞానము. ఇట్టియాత్మ జ్ఞానమును పొందినవానికి శరీరము మనస్సు బుద్ధి మొదలగు కోశము లలో ఏవేని శక్తులు ఉండవచ్చును; లేకపోవచ్చును. వ్యక్తియొక్క విజ్ఞానమునకు వానిధనసంపత్తికి ఎట్లు సంబంధము లేదో అట్లే బ్రహ్మ జ్ఞానమునకు మహిమలకును సంబంధము లేదు. ఒక తరగతిలో నున్న విద్యార్థులలో కొందఱు ఒకశాస్త్రవిషయమును సమానముగా గ్రహింప వచ్చును. వారిలో పేదవారు సంపన్నులు ఉండవచ్చును. కాని వారు గ్రహించినవిజ్ఞానము సమానముగానే యుండును. జపించువారిలో శ్రేష్ఠుఁ డగుటచే వశిష్ఠమహర్షి తపస్సంపన్నుఁ డయ్యెను. మఱియొకనికి అట్టి తపస్సంపద లేకపోవచ్చును. అయినను ఆచార్యోపదేశమువలన అతనికి బ్రహ్మజ్ఞానము కలుగవచ్చును. ఆ జ్ఞానము దానివలన కలుగు నానందము వశిష్ఠునకు ఎంత యుండునో వీనికిని అంతే యుండును. కావున తపస్సంపద ఉన్నవానికి లేనివానికి బ్రహ్మానుభవము సమా నమే. కావున మహిమలకు బ్రహ్మజ్ఞానమునకు సంబంధము లేదు.

ధార్మికుఁడైన విశ్వామిత్రునకు తనకు ఆతిథ్య మొసంగిన వాని ధేనువును హరింపవలయు నను తలంపు కలుగుటేమి? అర్జునుఁడు శ్రీకృష్ణుని ఇట్లే ప్రశ్నించెను. "తనకు ఇష్టము లేకున్నను మానవుఁడు దేనిచేత బలవంతముగా నియోగింపఁబడిన వానివలె పాపమును చేయు చున్నాఁడు?"

శ్లో॥ అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః।
అనిచ్ఛ న్నపి వార్ష్ణేయ బలా దివ నియోజితః॥
భగవద్గీత-అధ్యాయ-3 శ్లో-36

భగవానుఁ డిట్లు సమాధానము చెప్పెను. "ఇదే కామము. ఇదే క్రోధము. ఇది రజోగుణమువలన పుట్టుచున్నది. దీని కెంత యాహార మైనను చాలదు. మహాపాపములకు ఇదే కారణము. ఈ సంసారము నందు దీనిని శత్రువునుగా నెఱుంగుము"

శ్లో॥ కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్॥
భగవద్గీత-అధ్యాయ-3- శ్లో-37

కావున ధర్మపరుఁడైన విశ్వామిత్రుఁడు కామముయొక్క ప్రాబల్యమునకు వశుఁ డయ్యె నన్నమాట. కాని మహర్షి ఆతిథ్య మీయకున్నచో విశ్వామిత్రునకు ఈతలంపు కలుగదు. అసలు విశ్వామిత్రుఁడు ఆ ప్రాంతమునకు రాకున్నచో ఈ సన్నివేశమే యేర్పడి యుండదు. విశ్వామిత్రుఁడు వశిష్ఠుని దర్శించుటకై బయలుదేరలేదు ; అనుకొనకుండ అచ్చటికి వచ్చెను. అనఁగా దైవమే విశ్వామిత్రుని అక్కడికి లాగికొనివచ్చి, మహర్షికి అట్టిసంకల్పము కలిగించి, గోవు

యొక్క అపూర్వమైన మహిమ అనువర్ణముతో విశ్వామిత్రుని మనస్సు అనుపుట్టలో చుట్టలు చుట్టుకొని నిద్రించుచున్న కామము అను సర్పమును వెలికి తెచ్చె నన్నమాట. ఆకామమే ప్రతిఘటనమువలన మహాక్రోధముగా పరిణమించి గోవుతో మహర్షితో సంఘర్షణమునకు దారితీసెను. మహేశ్వరుఁ డొసంగినయస్త్రసంపద కూడ వ్యర్థమైన తరువాత బ్రహ్మతేజమును పొందవలె నని ఆయన చేసినఘోరమైన తపస్సులో కామక్రోధరూపమైన యామహాసర్పము కోరలు తీసినదాని వలె శాంతించెను. దైవికముగా ఈసన్నివేశమే ఏర్పడకున్నచో ఆయనయంతరంగమున కామరూపమైన కశ్మల మెంత యున్నదో అది ఎన్నిజన్మలవఱకు అట్లే యుండునో తెలియదు. కామము నిర్మూల మైననే గాని బ్రహ్మర్షిత్వము సిద్ధింపదు. అది నిర్మూలమైనదో లేదో ఎట్లు తెలియును? ఎంత విరక్తి యున్నను ప్రలోభ మేర్పడినప్పుడు డాగియున్నకామము తలపైకెత్తును. అప్పటివఱకును అది యున్నట్లు మనకు తెలియదు. కావుననే బ్రహ్మదేవుఁడు సాక్షాత్కరించి "నీవు మహర్షివైతివి" అని చెప్పినప్పుడు విశ్వామిత్రుఁడు, "అట్లయినచో నేను జితేంద్రియుఁడ నైతినా?" అని ప్రశ్నించెను. బ్రహ్మదేవుఁడు "కాలేదు; ఇంకను ప్రయత్నింపుము" అని చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

శ్లో॥ మహర్షిశబ్ద మమలం స్వార్జితైః కర్మభి శ్శుభైః।
యది మే భగవా నాహ తతోఽహం విజితేంద్రియః॥ 21

శ్లో॥ త మువాచ తతో బ్రహ్మా న తావత్త్వం జితేంద్రియః।
యతస్వ మునిశార్దూల ఇత్యుక్త్వా త్రిదివం గతః॥ 22

బాలకాండ – సర్గ. 63

మహర్షిత్వము కలిగినంతమాత్రమున జితేంద్రియత్వము సిద్ధింప దనుట స్పష్టము. కావుననే తరువాత తపోభంగము చేయవచ్చినరంభను

చూచి విశ్వామిత్రుఁడు కోపమును పట్టలేక శిలవు గమ్మని శపించెను. ఈదృష్టితో చూచినచో ఆయనకు బ్రహ్మర్షిత్వము నొసంగవలసిన దైవమే ఈసన్నివేశపరంపరను ఏర్పఱచుచు ఆయనలో అణఁగి యున్న కామక్రోధాదికశ్మలమును పైకిఁ దెచ్చి తుడిచివైచిన దనుట స్పష్టము.

దైవ మనఁగా దేవుఁడు కాదు. అది మనపూర్వకర్మయే. నిన్నఁటికర్మయే నేఁడు దైవమై ఫల మిచ్చుచున్నది. అపథ్యమైన యాహారమును అమితముగ తిన్నచో మఱునాఁటి కది మహావ్యాధిగా పరిణమించును. ఒకానొకఁడు ఒకనిని హత్యచేసినప్పుడు, వాఁడు పట్టుబడుటకు విచారణజరిగి శిక్షింపఁబడుటకు కొన్నియేండ్లు పట్టవచ్చును. అప్పుడు వానికి ఉరిశిక్ష జరిగినచో, కొన్నియేండ్లక్రిందట వాఁడు చేసిన హత్యయే దైవమై వానికి ఈఫల మిచ్చిన దని చెప్పక తప్పదు. వాఁ డొకవేళ ఈ జన్మలో న్యాయస్థానములో శిక్షను తప్పించుకొనఁ గలిగినచో, దైవమైన యాహత్యాకర్మము ఈజన్మలోఁ గాని పైజన్మములోఁ గాని ఘోరమరణమును వానికి తప్పక కలిగించును. మనము చేసిన కర్మలకు ఫలము కన్పించుచున్నప్పుడు వానిమధ్య కార్యకారణ భావమును **(Cause and Effect)** ఒప్పుకొని, కన్పింపనప్పుడు ఒప్పుకొనకుండుట శాస్త్రీయమైనదృష్టి కాదు. మనము చేయుపనుల కన్నింటికిని ఇప్పుడే సమగ్రముగా ఫలము కలుగుట లేదని అందఱకును తెలియును. కొన్నింటికి ఫలము కన్పించుచుండఁగా మఱికొన్నింటికి ఆవిధముగా కన్పింపనప్పుడు, వానికి ఫలము తరువాత కలుగు నని చెప్పవలయునే కాని చేసిన దంతయు నిష్ఫలముగా నశించు ననుట అసంగతము. 1857 లో జరిగిన విప్లవములో ఎందఱో స్వరాజ్య సాధనకై పోరాడి సమరాగ్నికి శరీరములను ఆహుతిఁగావించిరి. అప్పుడు స్వరాజ్యము రాలేదు. అయినను ఆ పోరాటము వారిత్యాగ

ములు నిష్ఫలముగా నశించె నని ఎవ్వరును అనరు. అవి యన్నియు తరువాత వచ్చిన నాయకులయొక్క ప్రజలయొక్క స్మృతిపథములందు మెదలుచు జాతీయోద్యమసమరమునకు దోహదము కావించె నని అంద ఱును అంగీకరింతురు. అనఁగా తొంబదియేండ్ల క్రిందట జరిగిపోయిన విప్లవము 1947 లో వచ్చిన స్వరాజ్యమునకు, అప్పుడు కన్పింపక పోయినను, కారణముగానే యున్న దనుట స్పష్టము. ఇట్టి యదృష్టకారణ ముల పరంపరయే **(Series of Unseen Causes)** దైవము.

ఈకార్యకారణభావమునే మనము వ్యక్తులవిషయమునను అంగీకరింపక తప్పదు. 1857 లో విక్రమించి మరణించినవారికి అప్పుడు ఏఫలమును లభింపలేదు. ఆ త్యాగము లన్నియు సాంఘిక ముగా జాతీయోద్యమమునకు మాత్రము ఉపయోగపడి ఆ వ్యక్తుల విషయమున మాత్రము నిష్ఫల మయ్యె ననుట అసంగతము, అశాస్త్రీ యము. ఇప్పుడు కొందఱు ఏ త్యాగములు చేయకయే గొప్పపదవుల నధిష్ఠించుచున్నారు. ఇదియును నిష్కారణముగనే సంభవించుచున్న దని చెప్పవచ్చునా ? ఆత్యాగములు నిష్ఫలముగా నశించె ననుట ఎంత అయుక్తమో వీరి కిప్పుడు ఈపదవులు నిష్కారణముగా లభించుచున్న వనుటయు అంతే అసంగతము. నిష్కారణముగా ఏదియును సంభ వించుటకు వీలు లేదు. ఏ సంఘటమునకైనను మనకు కారణము కన్పింపకపోయినచో మనకు తెలియని కారణము ఏదో యున్న దని యంగీకరింపవలసినదే. ఆ కన్పింపనికారణమే అదృష్టము. అదియే దైవము. అది ఈజన్మలోఁ గాని పూర్వజన్మలోఁ గాని మనము చేసి యుండిన కర్మలయొక్క ఫలమే. దానినే పాపకర్మలఫల మైనచో దుర్విధి యని, పుణ్యకర్మలఫల మైనచో అదృష్ట మని వ్యవహరించు చున్నాము. కావున ఇప్పుడు ఏ త్యాగములు శుభకర్మలు చేయకపోయి నప్పటికిని, 1857 లో మహాత్యాగములు చేసిన వీరు లనేకులు ఆ త్యాగ

ములకు ఫలముగా ఇప్పుడు నాయకులై పదవుల నధిష్ఠించుచు అధికారములను భోగములను అనుభవించుచున్నా రనుట స్పష్టము.

అంతే కాదు. ఇప్పుడు ఇంతమందికి ఇన్నిభిన్నములైన శరీరములు శక్తిసామర్థ్యములు కలుగుచున్నప్పుడు, ఏయొక్కఁడైనను "నాకు ఇట్టిశరీరము ఇంత బుద్ధిశక్తి ఈసామర్థ్యము కావలయు" నని తెచ్చుకొనుటలేదు కదా! మనకు ఊహ వచ్చునప్పటికే తల్లి, తండ్రి, శరీరము మనస్సు బుద్ధి సామర్థ్యము మొదలుగా జీవితముయొక్క పునాదు లన్నియు ఏర్పడుచున్నవి. ఈపునాదుల ననుసరించియే జీవితము రూపొందవలసియున్నది. అస లివి లేకున్నచో జీవితమే లేదు. ఇంత ముఖ్యములైన యీపునాదులు ఎట్లు ఏర్పడుచున్నవో మనకు తెలియదు. ఇవి నిష్కారణముగా ఏర్పడుచున్న వనుటకన్న మూర్ఖత ఏమున్నది? కావున పూర్వజన్మకర్మయే తల్లిని తండ్రిని శరీరమును బుద్ధిశక్తిసామర్థ్యములను రూపొందించుచున్న దని చెప్పక తప్పదు. ఇట్లే జీవితములో అనుకొనకుండ వచ్చిపడునట్టి శుభము గాని అశుభము గాని దైవమువలననే సంభవించు నని గ్రహింపవలసియున్నది. ఒక్కొక్కప్పుడు దైవము ఎట్టిపరిణామమును కలిగించునో తుదివఱకును చెప్పఁజాలము. విశ్వామిత్రున కిది మొదట దుఃఖమునే కలిగించినను తుదకు పరమశుభమునే కలిగించినది.

"దైవము ఇంత ప్రబలమైనచో ఇంక జీవితములో ఏ విషయమునం దైనను అభివృద్ధిని సాధించుటకు మనము ఏమియు ప్రయత్నింపనక్కఱ లేదు; అంతయు ఆ దైవమే కలిగించును" అని తలంచుటయు తగదు. పునాదులను తప్పించి యిల్లు కట్టుటకు వీలు లేకపోయినను, ఆ పునాదులమీఁదనే పూరిపాకను గాని చాలయంతస్తులతో భవనమును గాని నిర్మించుకొనవచ్చును. ఆ నిర్మాణములో మనకు స్వాతంత్ర్యమున్నది. దైవము సన్నివేశమును ఏర్పఱచి, సంకల్పములను కూడ

కలిగించును. కాని ఆ సంకల్పములను నిరాకరించుటకుఁ గాని కొన సాగించుటకుఁ గాని మనకు స్వాతంత్ర్య మున్నది. విశ్వామిత్రునిరాక వశిష్ఠునకు దైవికమైన సంఘటనమే. అది ఆయన అనుకొన్నది కాదు. ఆతిథ్య మీయవలయునని ఆయనకు సంకల్పము కలుగుట కూడ దైవికమే. కాని విశ్వామిత్రుఁడు వల దన్నప్పుడు ఆసంకల్పమును వదులుకొనుటకును కొనసాగించుటకును వశిష్ఠునకు స్వాతంత్ర్య మున్నది. దైవము సన్నివేశమును సంకల్పమును కలిగించునే కాని మనయొక్క బుద్ధినిర్ణయమును నియమింపదు. విశ్వామిత్రుని ప్రతి ఘటించుటకు ప్రతిఘటింపకుండుటకు మహర్షికి అవకాశము ఉండనే యున్నది. దైవికముగా వచ్చిన యీయాపదలో ఆయన అనుక్షణము ఈయవకాశమునందు ధర్మమునే అనుసరించెను. విశ్వామిత్రునకు కూడ ఇట్టిస్వాతంత్ర్యమే కలదు. ఏక్షణమునం దైనను ధర్మమును పాటించి వశిష్ఠునితో సంఘర్షణమును మానుకొని వెడలిపోవుటకు అవ కాశము కలదు. అయినను ఆయన ప్రచండముగ రేఁగుచుండిన కామ క్రోధములనే అనుసరించెను కాని ధర్మమును తలంప లేదు. అందువలన ఆయన మహాదుఃఖమునుపొందెను.

బ్రహ్మర్షిత్వమును కలిగింపవలసియున్నదైవము ప్రబలమై విశ్వామిత్రుని స్వాతంత్ర్యమును ప్రతిబంధించి ఆయనచేత అట్టిదుష్ట నిర్ణయములను చేయించిన దని చెప్పరాదు. వశిష్ఠుఁడు ఆవు నిచ్చుటకు నిరాకరించినంతనే "బ్రాహ్మణునిసొత్తును బలవంతముగా హరించుట తప్పు" అనుభావముతో ఆయన సంఘర్షణమును విరమించుకొనియుండ వచ్చును. అప్పుడు బ్రహ్మర్షిత్వమును కలిగింపవలసినదైవము, ధ్రువునకు వలె, తపస్సుచేత బ్రహ్మర్షిపదమును సాధింపవలయు నను సంకల్పమును కలిగించియే యుండును. దైవము ప్రబలమైనను మనకు ధర్మాచరణమున స్వాతంత్ర్య మున్నది. ఈయవకాశమును పురస్క రించుకొనియే శాస్త్రములు పెద్దలయుపదేశములు ప్రవర్తించుచున్నవి.

తలంపు కలిగినప్పుడు దానిని వదలుకొనుటకు కొనసాగించుట కును అవకాశము ఉండుటవలన, ఆనిర్ణయమునందు జీవునకు స్వాతంత్ర్యము ఉండుటవలన కర్తృత్వము ఏర్పడుచున్నది. ధర్మము ననుసరించి మనము కర్తవ్యమును నిశ్చయించుకొన్నచో పుణ్యము, కామక్రోధముల ననుసరించి అధర్మకార్యములకు పూనుకొన్నచో పాపము కలుగును. పాండవులరాజ్యమును హరింపవలయు నను తలంపు దుర్యోధనునకు పూర్వజన్మకర్మసంస్కారమువలననే కలిగెను. ఆతలంపును వెంటనే ఆతఁడు పెద్దలయుపదేశమువలన వదులుకొనియున్నచో పాపము కలుగదు. పాండవులరాజ్యము నెట్లయినను హరింపవలయు నని దృఢముగా నిశ్చయించుకొని ఎన్నియో అకృత్యములను అతఁడు చేయుటవలన వాని కన్నింటికి కర్తయై ఆపాపఫలమును అనుభవింపవలసి వచ్చెను. తండ్రిగారియాజ్ఞను నిరాకరించుటకు అవకాశ మున్నను రాముఁడు దానిని వినియోగించుకొనక శాస్త్రము ననుసరించి పితృవాక్యపాలనము అనుమహాధర్మమును నిర్వహించుటచే ఆ మహాకార్యమునకు కర్తయై దానివలన కలిగినమహాపుణ్యమునకు ఫలముగా సకలమానవులకు ఆరాధ్యుఁడైనాఁడు.

శబల తనశరీరమునుండి పహ్లావులు శకులు యవనులు బర్బరులు మొదలగువారిని సృష్టించినది. వీ రందఱును విశ్వామిత్రుని సైన్యమును నాశ మొనర్చినారు. తరువాత వీరు ఏమైనారో తెలియదు. శబల తమోగుణప్రధానమైన క్రోధముతో క్రోధమూర్తులైన యోధులనుగా సృష్టించుటచే వీరు ధర్మసంస్కారదూరులై ఆశ్రమప్రాంతమునుండి ఇతరదేశములకు వలసపోయియుండవచ్చును. మనదేశముయొక్క ఆధునిక చరిత్రలో పహ్లావులు మొదలుగువారు పరదేశములనుండి వచ్చి మన దేశముపై దాడులు సల్పినట్లు ప్రసిద్ధముగా నున్నది. ఇట్టిదాడులు ఆధునికచరిత్రలోనే గాక ప్రాచీనచరిత్రలో కూడ అచ్చటచ్చట

కన్పించుచున్నవి. సగరునితండ్రియైన అసితుఁడు రాజ్యమును పాలించుచున్నప్పుడు హైహయులు తాలజంఘులు శశిబిందులు అయోధ్యపై దాడిచేసిరి. వారిచేత పరాజితుఁడై అసితుఁడు హిమవంతములోనిభృగుప్రస్రవణమునకు పోయి అచట ప్రవాసమొనర్చెను. హైహయులు శశిబిందులు ఈదేశపురాజులుగా కన్పించుచున్నను తాలజంఘులు అను పేరు విదేశీయతను స్ఫురింపఁజేయుచున్నది. శబలవలన కలిగిన శకపహ్లావాదులు పరదేశములకు పోయి అక్కడ వృద్ధినొంది ధనరాజ్యాదికాంక్షలతో మరల ఈదేశముపై దాడులు చేసియుండవచ్చును. కావున పాశ్చాత్యజాతులుగా పేర్కొనఁబడుచున్న శకపహ్లావాదులు ఈదేశమున జన్మించినవా రని స్పష్ట మగుచున్నది.

యయాతియొక్క శాపమువలన యదువంశమువారికి రాజ్యార్హత లేకుండెను. వారిలో కొందఱు పాశ్చాత్యదేశములకు వలసపోయి మ్లేచ్ఛగణము లైనట్లు హరివంశమునందు కలదు. వీరందఱు చంద్రవంశీయులు. అందువలన వీరిలో కొందఱు చంద్రుని ధ్వజమునందు సంకేతముగా నుంచుకొన్నట్లు తోఁచుచున్నది.

ఈవిషయములందు చరిత్రకారులు చేయవలసినపరిశీలన ఎంతయో కలదు.

## 5. వివాహ ఘట్టము

1) శతానందుఁడు కథను ముగించినంతనే జనకుఁడు లేచి విశ్వామిత్రునకు ప్రదక్షిణ మొనర్చి నమస్కరించి వెడలిపోయెను. మఱునాఁడు జనకుఁడు విశ్వామిత్రుని యజ్ఞశాలకు పిలిపించెను. అప్పుడు విశ్వామిత్రుఁడు శివధనుస్సును రామలక్ష్మణులకు చూపుమనెను. జనకుఁడు ధనుస్సుయొక్క వృత్తాంతము నిట్లు చెప్పెను.

దక్షుఁడు యజ్ఞము చేయుచు అందు శివునకు భాగము కల్పింప లేదు. అందులకు శివుఁడు కోపించి, విల్లు నెక్కుపెట్టెను. కాని దేవతలు ప్రార్థింపఁగా ఆయన శాంతించి ఆవింటిని వారి కొసంగెను. వారు దానిని మైథిలుఁడైన దేవరాతునకు ఇచ్చిరి. అప్పటినుండియు అది మిథిలాధిపతులయింట పూజింపఁబడుచుండెను. జనకుఁడు యజ్ఞము చేయుట కొఱకై యాగభూమిని దున్నుచుండఁగా నాఁగటిచాలునుండి సీత యుద్భవించెను. ఆమెను అనేకులు రాజకుమారులు కోరఁజొచ్చిరి. శివ ధనుస్సును ఎక్కుపెట్టినవానికి సీత నిత్తు నని జనకుఁడు వీర్యశుల్కమును ఏర్పఱచెను. రాజపుత్రు లెవ్వరును దానిని కదలింపలేకపోయిరి. వా రందఱును లజ్జితులై జనకునిపై కోపించి, మిథిలను ముట్టడించిరి. సంవత్సరము గడచెను. దిక్కుతోఁచక జనకుఁడు తపస్సు చేయఁగా దేవతలు సైన్యము నొసంగిరి. దానితో ఆయన శత్రువులను నిర్జించెను.

2) ఈవృత్తాంతము విన్నతరువాత విశ్వామిత్రుఁడు, "రామునకు ధనువును జూపుము" అని పలికెను. ఎనిమిది చక్రములు గలిగిన పెద్దయినుపమందసములో నున్నధనువును జనకునియాజ్ఞపై అయిదు వేలమంది భటులు నగరమునుండి మోసికొనివచ్చిరి. ఈరాజకుమారులకు ధనువును చూపు మని జనకుఁడు విశ్వామిత్రునితో అనెను. ఆయన రాముని చూచి, "వత్సా! ధనువును చూడుము'' అని చెప్పెను.

శ్లో॥ వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవ మబ్రవీత్॥ 12

బాలకాండ-సర్గ-67

రాముఁడు మందసమును తెఱచి చూచి, "ఇది దివ్యమైన ధనుస్సు. దీనిని తాఁకుదునా? అనుమతించినచో దీనిని కదలించి పూరించుటకు యత్నింతును." అని పలికెను.

శ్లో॥ ఇదం ధనుర్వరం దివ్యం సంస్పృశామీహ పాణినా।
యత్నవాంశ్చ భవిష్యామి తోలనే పూరణేఽపి వా॥ 14
బాలకాండ-సర్గ - 67

జనకుఁడు కౌశికుఁడును అట్లే చేయుమనిరి. రాముఁడు విలాసముగా దానిని పైకెత్తి ఎక్కుపెట్టి పూరింపఁబొచ్చెను.

శ్లో॥ లీలయా స ధనుర్మధ్యే జగ్రాహ వచనాన్మునేః। 15
ఆరోపయిత్వా మౌర్వీం పూరయామాస తద్ధనుః। 16
తద్బభంజ ధనుర్మధ్యే నరశ్రేష్ఠో మహాయశాః॥ 17
బాలకాండ-సర్గ-67

ఆవిల్లు నడిమికి విఱిగెను. దానినుండి పిడుగు పడినట్లుగా పర్వతము పగిలినట్లుగా పెద్దధ్వని బయలుదేరెను. ఆ ధ్వనికి జనకుఁడు, విశ్వామిత్రుఁడు, రామలక్ష్మణులు తప్ప తక్కినవారందఱు మూర్ఛిల్లిరి. పిదప కౌశికునియనుమతితో జనకుఁడు దశరథుని ఆహ్వానించుచు అయోధ్యకు వార్తను పంపెను.

జనకునిమంత్రులు మూఁడురోజులు ప్రయాణమొనరించి అయోధ్యకు చేరిరి. వారివలన శుభవార్తను విని దశరథుఁడు మిగుల సంతోషించి, మంత్రిపురోహితామాత్యాదులతో బయలుదేరి నాలుగు రోజులకు మిథిలకు చేరెను. సీరధ్వజుఁడు వారికి స్వాగతము నొసంగి విడియింపఁజేసెను. మఱునాఁడు సీరధ్వజుఁడు సాంకాశ్యపురాధిపతియైన తన తమ్ముని కుశధ్వజుని రావించెను. నిండుకొలువులో జనకుఁడు తమ్మునితోఁ గూడియుండి దశరథుని పిలిపించెను. సభలో వసిష్ఠుఁడు ఇక్ష్వాకువంశవర్ణనము కావించి, రామలక్ష్మణులకు కన్యల నిరువుర నిమ్మని యడిగెను. వసిష్ఠుఁడు లక్ష్మణునికొఱకు కూడ కన్యను అడుగుట గమనింపఁదగి యున్నది.

శ్లో॥ ఆదివంశవిశుద్ధానాం రాజ్ఞాం పరమధర్మిణామ్।
ఇక్ష్వాకుకులజాతానాం వీరాణాం సత్యవాదినామ్॥ 41

శ్లో॥ రామలక్ష్మణయో రర్థే త్వత్సుతే వరయే నృప।
సదృశాభ్యాం నరశ్రేష్ఠ సదృశే దాతు మర్హసి॥ 42

బాలకాండ - సర్గ - 70

పిమ్మట జనకుఁడు తనవంశమును వర్ణించి సీతను రామునకు, ఊర్మిళను లక్ష్మణునకు ఇత్తునని చెప్పి, దశరథునితో "పితృకార్యమును జరిపి పిదప రామలక్ష్మణులకు గోదానము గావింపుఁడు. ఈరోజు మఘ; ఉత్తర ఫల్గునియందు వివాహముఁ గావింపుఁడు" అనెను.

శ్లో॥ సీతాం రామాయ భద్రం తే ఊర్మిళాం లక్ష్మణాయ వై।
దదామి పరమప్రీతో వధ్వౌ తే మునిపుంగవ॥ 22

శ్లో॥ రామలక్ష్మణయో రాజన్ గోదానం కారయస్వ హ।
పితృకార్యం చ భద్రం తే తతో వైవాహికం కురు॥ 23

శ్లో॥ మఘా హ్యద్య మహాబాహో తృతీయదివసే ప్రభో।
ఫల్గున్యా ముత్తరే రాజన్ తస్మిన్ వైవాహికం కురు॥ 24

బాలకాండ-సర్గ-71

గోదానం : వివాహపూర్వసమయనియతం కించిత్ కర్మ। గావః కేశాః దోఃపాదమూలరోమాణి చ యత్ర ఖండ్యంతే త దేతత్ గోదానమ్.

అప్పుడు విశ్వామిత్రుఁడు వసిష్ఠునితో సంప్రదించి కుశధ్వజుని పుత్రికలైన మాండవీశ్రుతకీర్తులను భరతశత్రుఘ్నుల కీయవలసినదిగా కోరెను. జనకుఁ డెంతయు సంతోషముతో అంగీకరించి, ఒకదినముననే నాల్గు పాణిగ్రహణములు జరుగును గాక, అని పలికి లేచి ప్రాంజలియై

"మీరు నాకు గొప్పధర్మమును గావించినారు; మీ కిరువురకును శిష్యుఁడను. ఈమూఁడు రాజాసనములను అధివసింపుఁడు. ఈమిథిల దశరథునకు ఎట్లో అయోధ్య నాకును అట్టిదే. మీకు మాపై ప్రభుత్వము కలదు. సందేహము లేదు. కార్యవిధానము జరుపుఁడు" అనెను.

శ్లో॥ ఏకాహ్నా రాజపుత్రీణాం చ తస్రాణాం మహామునే।
పాణీన్ గృహ్ణన్తు చత్వారో రాజపుత్రా మహాబలాః॥ 13

శ్లో॥ ఏవ ముక్త్వా వచ స్సౌమ్యం ప్రత్యుత్థాయ కృతాంజలిః।
ఉభౌ మునివరౌ రాజా జనకో వాక్య మబ్రవీత్॥ 14

శ్లో॥ పరో ధర్మః కృతో మహ్యం శిష్యోఽస్మి భవతో స్సదా।
ఇమా న్యాసనముఖ్యాని ఆసతాం మునిపుంగవౌ॥ 15

శ్లో॥ యథా దశరథ స్యేయం తథాయోధ్యాపురీ మమ।
ప్రభుత్వే నాస్తి సందేహో, యథార్హం కర్తుమర్హథ॥ 16

బాలకాండ - సర్గ - 72

ఇది జనకుని ప్రియవాదిత్వమునకు మంచి నిదర్శనము. ఇంకొక విషయము కూడ కలదు. కేవలము జనకదశరథులు తమపుత్రీపుత్రుల సంబంధములకై ప్రయత్నించినచో వీర్యశుల్కమున సీతారాములకే వివాహమైయుండును. విశ్వామిత్రవసిష్ఠులు పూనుకొనుటవలన నాలుగు కన్యాదానములు జరిగినవి."పరో ధర్మః కృతో మహ్యం" అని జనకుఁడు చెప్పుటవలన కన్యాదానము పరమధర్మ మని వ్యక్తమగుచున్నది. కావుననే జనకుఁ డంతగా కృతజ్ఞతను ప్రకటించెను. ఆరోజే దశరథుఁడు నాందీశ్రాద్ధ మొనర్చెను. మఱునాఁడు కుమారులకు సమావర్తనము "గోదానము" నిర్వర్తించెను. [ఇది కేశఖండనరూపమైన కర్మ] పిదప లక్షలకొలఁది గోవులను దాన మొసంగెను.

మఱునాఁడు వివాహాలంకృతులైన పుత్రులతో దశరథుఁడు యజ్ఞవాటమునకు పోయెను. వసిష్ఠుఁడు వారిరాకను తెలుపఁగా జనకుఁడు "మీకు అడ్డ మేమున్నది? ఇది మీకు స్వగృహమే. కార్యము లన్నియు నిర్వహింపుఁ" డనెను. వసిష్ఠమహర్షి ప్రపామధ్యమున వేదికను అలంకరించి అగ్న్యాధానము గావించి హోమ మొనర్చెను. పిమ్మట జనకుఁడు సర్వాభరణభూషితయైన సీతను తీసికొనివచ్చి అగ్నిసమక్షమున రామునకు అభిముఖముగా కూర్చుండఁజేసి ఇట్లు పలికెను.

శ్లో॥ తత స్సీతాం సమానీయ సర్వాభరణభూషితామ్ ।
సమక్ష మగ్నే స్సంస్థాప్య రాఘవాభిముఖే తదా॥ 25

శ్లో॥ అబ్రవీ జ్జనకో రాజా కౌసల్యానందవర్ధనమ్ ।
ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ॥ 26

శ్లో॥ ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ।
పతివ్రతా మహాభాగా ఛాయే వానుగతా సదా॥ 27

శ్లో॥ ఇత్యుక్త్వా ప్రాక్షిప ద్రాజా మంత్రపూతం జలం తదా॥ 28

బాలకాండ - సర్గ - 73

"ఈసీత నాకూఁతురు. నీకు సహధర్మచారిణి యగును. ఈమెను స్వీకరింపుము. నీపాణితో ఈమె పాణిని గ్రహింపుము. నీకు భద్రమగును గాక. ఈమె పతివ్రత, మహాభాగ; ఎల్లప్పుడు నీడవలె నిన్ను అనుసరించి యుండును." పిమ్మట జనకుఁడు మంత్రపూతమైన దాన జలమును రాముని హస్తమునందు వదలెను. దేవతలు ఋషులు సాధువాదములు గావించిరి. దివ్యదుందుభులనిర్ఘోషము దిక్కులఁ ప్రతిధ్వనించెను. పిదప లక్ష్మణభరతశత్రుఘ్నులను పిలిచి జనకుఁడు పాణిగ్రహణము కావింపుఁ డనెను. ఊర్మిళకు కన్యాదానము తానే కావించినను మాండవీశ్రుతకీర్తులకు కుశధ్వజుఁడే కావించియుండును; జనకుఁ డనుజ్ఞ

నొసంగియుండును. తరువాత వధూవరులు అగ్నికి, ఋషులకు, పెద్దలకు ప్రదక్షిణ మొనర్చిరి. పిమ్మట నల్వురును విడివిడిగా పాణిగ్రహణ హోమము గావించి. తమయగ్నులకు మరల మూఁడుసార్లు ప్రదక్షిణము గావించిరి. గంధర్వాప్సరసలగాననృత్యములు, దుందుభితూర్య నినాదములు చెలంగెను. పుత్రులు భార్యలతో విడిదికి బయలుదేరఁగా దశరథుఁడు వారిని చూచుకొనుచు వెనుక నడచెను.

శ్లో॥ అథోపకార్యం జగ్ముస్తే సభార్యా రఘునందనాః।
రాజా ప్యనుయయౌ పశ్యన్ సర్షిసంఘః సబాంధవః॥ 40
బాలకాండ-సర్గ-73

శివధనుస్సుయొక్క వర్ణనమును అతిశయోక్తిగా కొందఱు తలంతురు. కాని అందు అతిశయోక్తి ఏమియును లేదు. శివధనుర్భంగము, వివాహము జరిగినది యజ్ఞవాటమున. మిథిలకు సమీపమున నదీతీరమున యజ్ఞవాటము ఏర్పఱుపఁబడినది. మిథిలానగరమునుండి అక్కడికి అయిదువేలమంది యోధులు ఆ ధనుస్సు ఉన్నమంజూషను తీసికొనివచ్చిరి. ఆ మంజూష ఎనిమిదిచక్రములు గలిగిన పెద్దయినుపపెట్టె. చక్రములు ఉన్నను ఆ యినుపపెట్టెను వారు నేలపై ఈడ్చుకొని రాలేదు. శివధనుస్సునందలిగౌరవముచేత, దేవునివాహనమునువలె, రెండుపెద్దబొంగులమీద ఆపెట్టె నుంచి బిగించికట్టి నాలుగువైపుల కొమ్ములను భుజముల కెత్తుకొని మెల్లగా మోసికొని వచ్చిరి.

శ్లో॥ నృణాం శతాని పంచాశ ద్వ్యాయతానాం మహాత్మనామ్।
మంజూషా మష్టచక్రాం తాం సమూహు స్తే కథంచన॥ 4
బాలకాండ – సర్గ. 67

ఆ బరువు చాలవఱకు ఇనుపపెట్టెకు సంబంధించినదే; ధనుస్సునకు సంబంధించినదికాదు. ఎంత గొప్పధనుస్సైనను ఇనుముతో

నిర్మింపరు; వెదురుబద్దతోనే తయారుచేయుదురు. ఇనుపబద్ద వెదురు వలె బాణప్రయోగమునకు వీలుగా (Flexible Movement) వంగదు. కొలిమిలో కాచినప్పుడుతప్ప లోహము వంగదు. కావున శివధనుస్సు కూడ వెదురుబద్దయే.

అయినను సురాసురప్రవరులు కూడ ఆ ధనుస్సును ఎక్కుపెట్ట లేకపోఁగా, కదలించుటకు కూడ సమర్థులు కాలేదని జనకుఁడు చెప్పెను.

శ్లో॥ నైత త్సురగణా స్సర్వే నాసురా న చ రాక్షసాః।
గంధర్వయక్షప్రవరా స్సకిన్నరమహోరగాః॥ 9

శ్లో॥ క్వ గతి ర్మనుష్యాణాం చ ధనుషోఽస్య ప్రపూరణే।
ఆరోపణే సమాయోగే వేపనే తోలనేఽపి వా॥ 10

బాలకాండ-సర్గ-67

అది వెదురుబద్దయే అయినను చాల దృఢముగ బరువుగా నుండియుండును. గొప్పబలముగలవారు సులభముగా నుపయోగింపఁ గలిగిన సాధనములను అల్పసత్త్వులు కదలింపలేక పోవుటయు ఆశ్చ ర్యము కాదు. దేవదానవులకు సాధ్యము కాని దానిని పదునాలేండ్లు కూడ నిండనిబాలుఁడైన రాముఁడు ఎట్లు ఎక్కుపెట్టఁగలిగెను? రాముఁడు బాలుఁడే అయ్యును వేయియేనుఁగులబలము కలిగిన తాటకను ఆగ్నేయాద్యస్త్రములతో కాక, కేవలము బాహుబలముతో సంహరించిన వాఁడు. విశ్వామిత్రుఁడు రాముని బాహుబలమును తాటకాసంహారము నందే పరీక్షించి గ్రహించెను. అందువలననే ఆయన రామలక్ష్మణులను మిథిలకుఁ గైకొని వచ్చి రామునకు ఆ ధనుస్సును చూపెను. అంత బలముకలవాఁడు కావుననే రాముఁడు ఆ ధనుస్సును అవలీలగా ఎక్కు పెట్టఁగలిగెను.

రాముఁడు విల్లు విఱిచె నని లోకమున ప్రసిద్ధముగా నున్నది. కాని అది నిజము కాదు. రాముఁడు విల్లును విఱువలేదు. ఆప్రయత్న మును కూడ ఆయన చేయలేదు. ఎక్కుపెట్టుమని విశ్వామిత్రుఁడు, జనకుఁడు చెప్పఁగా రాముఁడు విల్లు నేల విఱుచును ? అది యవినయ మగును. రాముఁడు గురువచనమునకు భిన్నముగా ప్రవర్తించునా ? బద్దను రెండు చేతులతో పట్టుకొని విఱిచినచో, "అల్లేల చేసితి" వని వారు అడుగరా ? మఱి విల్లు ఎట్లు విఱిగినది ? రాముఁడు విల్లు ఎక్కుపెట్టినతరువాత నారిని లాగి చూచెను. ఆయన నారిని లాగుచుం డఁగా, చాల ప్రాఁతది యగుటచే ఆవింటిబద్దయే నడిమికి విఱిగెను. అంతే కాని రాముఁడు తనశక్తిని ప్రకటించుకొనుటకై దానిని విఱువ లేదు. అది రాముని స్వభావమునకు విరుద్ధము.

శ్లో॥ ఆరోపయిత్వా ధర్మాత్మా పూరయామాస తద్ధనుః। 16
తద్బభంజ ధనుర్మధ్యే నరశ్రేష్ఠో మహాయశాః 16 1/2

బాలకాండ సర్గ—67

(నరశ్రేష్ఠో మహాయశాః ధర్మాత్మా తద్ధనుః పూరయామాస తద్ ధనుః మధ్యే బభంజ.)

కాని పరశురాముఁడు సైతము తనకు గురువైన శివునియొక్క విల్లును రాముఁడు విఱిచె ననియే భావించినట్లు తోఁచుచున్నది. ఆయన ఈ విషయమును ప్రస్తావించినప్పుడు ఎక్కుపెట్టుటను పూరించుటను పేర్కొనక విఱుచుటనే ఉటంకించెను.

"ధనుస్సును భేదించిన వృత్తాంతము నంతను వింటిని"
ధనుషో భేదనం చైవ నిఖిలేన మయా శ్రుతమ్। 1
"నీచేత ధనుస్సు విఱుగుట అచింత్యము అద్భుతము"
తదద్భుత మచింత్యం చ భేదనం ధనుష స్త్వయా। 2

'ధనుస్సు విఱిగిపోవుటను వింటిని. అందువలన త్వరగా వచ్చితిని'
శ్రుతవాన్ ధనుషో భేదం తతోఽహం ద్రుత మాగతః। 26
బాలకాండ-సర్గ 75

అందువలన ఆయన వైష్ణవధనువును తెచ్చి యిచ్చి, దానిని రాముఁడు ఎక్కుపెట్టఁగలిగినచో అతనితో ద్వంద్వయుద్ధ మొనర్చి నిర్జింపవలయు నని తలంచెను.

వివాహమునందును కొన్ని విషయములు గ్రహింపఁదగియున్నవి. వివాహము నిశ్చయ మైనంతనే దశరథుఁడు విడిదికి వచ్చి యథావిధిగ శ్రాద్ధకార్యమును జరిపెను. మఱునాఁడు ఉదయమున పుత్రులకు గోదానము గావించి, ఆసందర్భమున పెక్కుగోవులను బ్రాహ్మణులకు దాన మొసంగెను. వివాహమునకుఁ గాని ఉపనయనమునకుఁ గాని ముందుగా నాందీశ్రాద్ధమును గావించుట శాస్త్రవిహితమైన విధానము. కాని శ్రాద్ధ మన్నంతనే అది యేదో అశుభ మని మనవారు అనేకు లిప్పుడు దానిని యథావిధిగ జరుపకుండుట శోచనీయము. ఏశుభకార్యమునం దైనను ముందుగా పితృదేవతల నాహ్వానించి వారికి సంతోషమును కలిగించుట ఆవశ్యకము. పితృదేవతల యనుగ్రహము లేకున్నచో సత్సంతానము కలుగ దని పెద్దలు చెప్పుదురు.

గోదానము జరిగినదినముననే కైకేయిసోదరుఁడు యుధాజిత్తు వచ్చెను. ఆయన సోదరిని మేనల్లుని చూచుటకై అయోధ్యకు వచ్చి కైకేయిని చూచి మేనల్లుంద్ర వివాహము జరుగుచున్న దని తెలిసికొని మిథిలకు వచ్చెను. శుభస్య శీఘ్ర మని జనకుఁడు వ్యవధి లేకుండ పెండ్లికి ముహూర్తమును నిశ్చయించెను. వివాహము నిశ్చితమైన తరువాత, అనివార్యములైన కారణములు ఉండిననే తప్ప, ఆలస్యము పనికిరాదు. అందువలన బంధుమిత్రుల నందఱను పిలిపించు వఱకును ఆగుఁ డని దశరథుఁ డన లేదు. శుభకార్యము జరిగిన దని

విని వా రందఱును సంతోషింతు రనియే జనకుఁడు దశరథుఁడును తలఁచిరి. అందువలన దశరథుఁడు దూరదేశములో నున్న కేకయ రాజును గాని యితరబంధుమిత్రులను గాని ఆహ్వానింపలేదు. ఇంతే కాదు. ఆయన కౌసల్య మొదలగు భార్యలను కూడ మిథిలకు తీసికొని రాలేదు. రాజకుమారుల వివాహములలో స్పర్ధతో ఇతరరాజులు యుద్ధములకు పూనుకొనుచుండుట సంభవించుచుండును. ప్రయాణములలో కూడ కొండలలో అడవులలో రాక్షసులు మొదలగువారివలన కష్టములు కలుగుటకు కూడ అవకాశ ముండెను. అందువలన రాజులు వివాహములకు మగవారే పోయి వధువులను తెచ్చుకొనుచుండుట ఆచార మయ్యె నని తలంప వచ్చును.

భార్యలతో నలువురు కుమారులు విడిదికి పోవుచుండఁగా వారిని చూచుకొనుచు వెనుక దశరథుఁడు వెళ్ళె నని వాల్మీకి వర్ణించుట చాల మనోహరము. ధ్వనిప్రధానమైన రచనకు ఇది చక్కని యుదాహరణము. దశరథుఁడు సంతతికొఱకు ఎంతో పరితపించి యజ్ఞ మొనర్చి పుత్రులను సంపాదించుకొనెను. వారు ప్రయోజకులై మహర్షులచే ప్రశంసల నందుచు ఉత్తమవంశజాతలైన భార్యలను పొందినప్పుడు, ఆయనకు తనజన్మ సార్థక మైనట్లుగా మహానందము వెల్లివిరిసి యుండును. దానిని వాచ్యముగా **(With Dictionary Meaning)** చెప్పుటకు ఏమాటలును చాలవు. అందువలన "ఆయన వారిని చూచుకొనుచు అనుసరించి వెళ్ళెను." (రాజా ప్యనుయయౌ పశ్యన్) అని చెప్పి మహర్షి ఆ యానందమును స్ఫురింపఁజేసెను. మహాకవులే ఇట్లు చెప్పఁగలరు.

గద్యము : ఆపస్తంబసూత్ర కౌండిన్యసగోత్ర పోలూరి వేంకట నరసాంబా వేంకటనారాయణామాత్యపుత్ర హనుమజ్జానకీరామశర్మ ప్రణీతంబైన శ్రీరామాయణతరంగిణి యందు నాల్గవదియైన కళ్యాణతీర్థము సమాప్తము.

# 5. భార్గవ తీర్థము

## 1. అయోధ్యాప్రస్థాన ఘట్టము

వివాహము జరిగినమఱునాఁడు ఉదయమే విశ్వామిత్రుఁడు రామాదుల నాశీర్వదించి దశరథునకు జనకునకు పోయివత్తు నని చెప్పి హిమవంతమునకు వెడలిపోయెను. మరల ఈయన యీకథ యందు ఎచ్చటను పాత్రగ ప్రత్యక్షము కాఁడు, వాల్మీకి రాముని కథలో ఈమహర్షిని ఎంత ఆకస్మికముగా ప్రవేశపెట్టెనో అంతే నిర్విశేషముగ ఆయనయొక్క నిష్క్రమణమును కూడ నిర్దేశించెను. వైకుంఠమునుండి శ్రీరాముఁడుగ అవతరించిన విష్ణుదేవుఁడు మరల వైకుంఠమునకు చేరువఱకు నడిచినవృత్తాంతమే యిందు ప్రధానకథ. దానితో ఇతరపాత్రలకు ఎంతవఱకు సంబంధ ముండునో అంతవఱకే వాల్మీకి వారిని ప్రవర్తింపఁజేయుచు, ఆ సంబంధము ముగిసినంతనే వారి సంగతి వదలివేయును. వారి వృత్తాంతములను సమగ్రముగ చెప్పుటకు ఆయన పూనుకొనఁడు. అది కావ్యకళయందు సమంజసము కాదు.

విశ్వామిత్రుఁడు వెడలిపోయిన తరువాత దశరథుఁడు కూడ అయోధ్యకు బయలుదేరెను. జనకుఁడు లక్షలకొలఁది గోవులు పట్టువస్త్రములు కంబళములు గుఱ్ఱములు ఏనుగులు రథములు పదాతిబలమును దాసదాసీజనము మొదలుగా పుష్కలమైన వస్తుసంపదను కన్యాధనముగా ఇచ్చెను. ఇది కేవలము వేడుకగా ప్రీతికొఱకు ఇచ్చునది కాదు. కన్యాధనము కన్యాదానమునకు అంగము. ధాన్యమును దానము చేయునప్పుడు ఆకులో ధాన్యము పోసి యిచ్చినంత మాత్రమున ఆదానము సమగ్రము కానేరదు. ఆ ధాన్యమును తీసికొన్నవాఁడు దానిని ఉపయోగించుకొనుటకై ఇతర పదార్థములను కూడ ఎన్నింటినో సమకూర్చుకొనవలసి యుండును. వానిని కూడ మనము సమకూర్చినప్పుడే ఆ దానము సఫల

మగును. అందువ ననే దానసాద్గుణ్యముకొఱకు దక్షిణ నొసంగ వలసియున్నది. ఈ కారణముచేతనే గోదానము చేయువారు ఆ గోవు యొక్క పోషణభారము దానిని తీసుకొన్నవానిపై పడకుండ కొంత భూమిని కూడ ఇచ్చుచుందురు. అట్లు గాక మనము ఇచ్చినగోవును పోషించుటకై ఆయన దాని వెలకు మించి ఖర్చుపెట్టుకోవలసివచ్చినచో ఆ దానమునకు ఫల మే మున్నది? అప్పుడు మనము ఇచ్చుభూమి ప్రత్యేకమైన భూదానము కానేరదు. అది ఆ గోదానమునకే అంగ మగును. ఇట్లే కన్యాదానము కావించునప్పుడును ఆమెపోషణమునకై కావలసిన వస్తుసంపద నంతయును కన్యాదాత యథాశక్తిగా నొసంగవలసి యున్నది. అనఁగా దానము గైకొన్నవరునకు కన్య ఏనాఁడును ఆర్థికముగా భారము కారాదు. ఈదృష్టితోనే పూర్వులు తమశక్తి ననుసరించి అరణ మని స్త్రీధన మని గ్రామములు భూములు నొసంగుచుండిరి.

దశరథుఁడు ఋషులను పురస్కరించుకొని పరివారసైన్యపరివృతుఁడై అయోధ్యాభిముఖముగా ప్రయాణము చేయఁజొచ్చెను. కొంత దూరము పోవునప్పటికి పక్షులు భయంకరముగ కూయఁజొచ్చెను. మృగములు ప్రదక్షిణముగా తిరుగఁజొచ్చెను. "ఈ శకునములవలన ఏమి జరుగనున్నదో చెప్పు" మని దశరథుఁడు వసిష్ఠుని ప్రార్థించెను. ఆయన, "పక్షుల ధ్వనులవలన భయంకరమైన సంఘటనము సంభవించు నని తోఁచుచున్నది. కాని మృగములు ప్రదక్షిణముగా పోవుచుండుట వలన ఆ సంఘటనముచేత మనకు ఎట్టి అపాయమును కలుగ దని తెలియుచున్నది. కావున సంతాపము నొందకుము" అని చెప్పెను. వారిద్దఱు మాటాడుచుండఁగనే భయంకరమైన ఎదురుగాలి బయలుదేరి చెట్లను పడఁగొట్టుచు భూమిని కంపింపఁ జేయుచు దుమ్ముతో దిక్కులను నింపెను. సూర్యుఁడు కనరాకుండెను. అంధకారము అలముకొనఁజొచ్చెను. సైన్య మంతయు బూడిదచే కప్పఁబడిన ట్లయ్యెను.

అప్పుడు జటామండలధారియై భుజమునందు పరశువు ప్రకాశించుచుండ విద్యుల్లతవలె మెఱయుచున్న ధనుస్సును ధరించి శరమును చేతిలో త్రిప్పుచు ప్రళయకాలాగ్నివలె జ్వలించుచు రాజకులాంతకుఁడైన భార్గవరాముఁడు వారికి ఎదురుగా వచ్చుచు గోచరించెను. "ఇతఁడు మరల పితృవధమును స్మరించి క్షత్రియులను నిర్మూలింపఁ బూనుకొనలేదు గదా! ఇతఁ డిదివఱకే పగను తీర్చుకొని శాంతించియున్నాఁడు. కావున ఇప్పు డీతఁడు క్షత్రియనాశమునకు పూనుకొనియుండఁడు" అని వసిష్ఠాదిమహర్షులు ఒకరితో నొకరు చెప్పుకొనుచు ఆయనకు ఎదురుగా నేగి మధురముగా స్వాగతమును చెప్పి అర్ఘ్యము నొసంగిరి. ఆయన వారివలన పూజను గ్రహించి రామునితో ఇట్లనెను. "రామా! నీ పరాక్రమము అద్భుతము. ధనుస్సు భంగ మగుట అచింత్యముగా **(Unimaginable)** నున్నది. ఆ మాట విన్నంతనే మఱియొక ధనుస్సును గైకొని వచ్చితిని. జామదగ్న్యమైన యీ గొప్పధనుస్సును ఎక్కుపెట్టి ఈబాణముతో దీసిని పూరించి నీబలమును చూపుము. నీ బలమును చూచి అది శ్లాఘ్య మైనచో నీకు ద్వంద్వయుద్ధము నొసంగుదును."

భార్గవుఁ డిట్లు పలుకుచుండఁగా దశరథుఁడు విషణ్ణవదనుఁడై దీనుఁడై ప్రాంజలియై యిట్లనెను. "అయ్యా! నీవు స్వాధ్యాయవ్రతశాలులైన భార్గవులకులమునందు జన్మించితివి. గొప్పకీర్తిని సంపాదించితివి. క్షత్రియులను సంహరించి పగఁదీర్చుకొని ప్రశాంతుఁడ వైతివి. మహేంద్రునిసమక్షమున ఇంక క్షత్త్రియకర్మ గావింప నని శపథ మొనర్చి అస్త్రసన్న్యాసము చేసితివి. ధర్మపరుఁడవై కాశ్యపునకు వసుంధర నొసంగి వానప్రస్థుఁడవై మహేంద్రపర్వతమునందు తపోవ్రతమును గైకొంటివి. అట్టి నీవు ఇప్పుడు నాసర్వస్వవినాశముకొఱకే వచ్చిన ట్లున్నది. నిన్ను ప్రార్థించుచున్నాను. బాలురైన నాపుత్రులకు

అభయము నొసంగుము. అయ్యా! రామునకు ఒక్కనికి ఏదేని అమంగళము సంభవించినచో మేము ఎవ్వరమును జీవింపము. మమ్ము అందఱను కరుణింపుము."

దశరథుఁడు ఎంత దీనముగ ప్రార్థించినను భార్గవుఁడు ఆతని మాటలను లెక్కపెట్టలేదు; ఏసమాధానము కూడ చెప్పలేదు. ఇంత జరుగుచున్నను రాముఁడు ఏమియు మాటాడకుండుట గమనింపఁ దగియున్నది. రాముఁడు కాక మఱియొకఁ డైనచో ముందునకు వచ్చి తండ్రితో "ఆతని నేల ప్రార్థింతువు? నే నుండఁగా భయపడవలసిన దే మున్నది? నీవు ఊరకుండుము. వీనిసంగతి నేనుచూచుకొందును" అని చెప్పియుండెడివాఁడు. కాని అట్లు మాటాడుట తండ్రిని తక్కువ చేసినట్లే యగును. పెద్దలు మాటాడుచున్నప్పుడు పిల్లలు వచ్చి జోక్యము కలిగించుకొనుట వినయమునకు లక్షణము కాదు. వారు మాటాడుట పూర్తియైన తరువాత వారియభిప్రాయము ననుసరించియే బాలురు ముందుకు రావలె. దీనినిబట్టి రామునియొక్క నిగ్రహము ఎంత మహనీయమో గ్రహింపఁదగియున్నది.

## 2. విష్ణుధనుఃపరీక్షాఘట్టము

భార్గవుఁడు ధనుస్సులనుగూర్చి రామునితో ఇట్లు చెప్పెను. "ఈ ధనుస్సులను రెండింటిని పూర్వము విశ్వకర్మ దృఢములుగ బలిష్ఠములుగా నిర్మించెను. అందువలన నివి సకలలోకములందును ప్రసిద్ధములు, దివ్యములు, శ్రేష్ఠములు. త్రిపురసంహారసందర్భమున దేవతలు ఒక ధనువును త్రినేత్రున కొసంగిరి. దానితో సమానమైన యీ ధనువును విష్ణువున కొసంగిరి. త్రిపురసంహారము జరిగినతరువాత శివకేశవులలో ఎవరు బలవత్తరు లను కుతూహలము దేవతలకు కలిగెను. వారు ఆ విషయమునుగూర్చి బ్రహ్మదేవుని ప్రశ్నించిరి.ఆయన దానికి తగినసన్ని

వేశమును ఏర్పఱచెను. శివుఁడు దక్షయజ్ఞమును భంగ మొనర్చినపుడు దేవత లందఱును పరిభవింపఁబడిరి. వారు విష్ణువును శరణుఁజొచ్చిరి. విష్ణువు శివుని మార్కొనెను. వారికి ఇరువురకును ఘోరయుద్ధము జరిగెను. విష్ణువు విజృంభించి హుంకార మొనర్చెను. ఆ హుంకారమునకు చేతియందున్న ధనుస్సు బెండువలె కాఁగా మహాదేవుఁడు స్థంభించెను. అప్పుడు దేవతలు వారి నిరువురను శాంతింపఁజేసి విష్ణువును అధికునిగా తలంచిరి. బెండువలెనైన తన విల్లును చూచి శివుఁడు విరక్తితో రాజర్షియైన దేవరాతుని చేతి కొసంగెను. దీనిని విష్ణువు మాపితామహుఁడైన ఋచీకునకు ఉత్తమమైన న్యాసమునుగా నొసంగెను. ఆయన మాతండ్రియైన జమదగ్నిమహర్షికి దీనిని అప్పగించెను.

మాతండ్రిగారు శస్త్రమును విసర్జించి తపోవ్రతనిష్ఠుఁడైయుండఁగా కార్తవీర్యార్జునుఁడుపామరబుద్ధితో ఆయనను సంహరించెను. పరమదారుణమైన యావధను విని రోషముతో క్షత్త్రియకులమును పెక్కుపర్యాయములు పైకివచ్చుచున్నదానిని, వచ్చుచుండఁగనే నిర్మూలించితిని. ఆవిధముగా భూమి యంతయు నా కధీన మయ్యెను. అప్పుడు యజ్ఞమును గావించి అందు మహాత్ముఁడైన కశ్యపునకు భూమిని దక్షిణగా నొసంగితిని. పిదప మహేంద్రగిరియందు తపస్సు చేసికొనుచు నుంటిని. ఇప్పుడు శివునిధనుస్సు భగ్న మయ్యె నని విని ఈ వైష్ణవధనువును గైకొని వచ్చితిని. నీవు క్షత్త్రియధర్మమును పురస్కరించుకొని దీనిని తీసికొని ఎక్కుపెట్టి ఈ శరమును సంధింపుము. ఇట్లు నీవు చేయఁగలిగినచో నీకు ద్వంద్వయుద్ధము నొసంగుదును."

శ్లో॥ తదేవం వైష్ణవం రామ పితృపైతామహం మహత్,
క్షత్రధర్మం పురస్కృత్య గృహ్ణీష్వ ధను రుత్తమమ్॥ 27

శ్లో॥ యోజయస్వ ధనుశ్శ్రేష్ఠే శరం పరపురంజయమ్ ।
యది శక్నోషి కాకుత్స్థ ద్వంద్వం దాస్యామి తే తతః॥ 28

బాలకాండ-సర్గ-75

భార్గవుఁడు ఇట్లు చెప్పి విరమించినంతనే దశరథ వసిష్ఠాదు లెవరును మాటాడ లేదు. ఆయనకు రాముఁడే సమాధానము చెప్పవలసి వచ్చెను. రాముఁడు తండ్రియందలి గౌరవమున కంఠస్వరమును పెంచక మెల్లగా భార్గవునితో ఇట్లనెను.

శ్లో॥ శ్రుత్వా త జ్జామదగ్న్యస్య వాక్యం దాశరథి స్తదా।
గౌరవా ద్యంత్రితకథః పితూ రామ మథాబ్రవీత్ ॥ 1

బాలకాండ-సర్గ-76

"పితుః గౌరవాత్ యంత్రితకథః" అనుమాటలు గమనింపఁదగియున్నవి. భార్గవునిప్రసంగమువలన కోపము వచ్చినను రాముఁడు, సమీపమునందు తండ్రి యున్నాఁ డని, ఆయనయెదుట బిగ్గరగా మాటాడరాదని, స్వరమును నిగ్రహించుకొనుచు నెమ్మదిగా మాటాడినాఁడు. ఏ పరిస్థితియందును తండ్రియెదుట బిగ్గరగా మాటాడరా దని ఎంతమందికి తెలియును? ఎంతమందికి స్ఫురించును? ఇంత చిన్నవిషయములో కూడ రాముఁడు ఎంత జాగరూకుఁడో వాల్మీకి మహర్షి "యంత్రితకథః"అను నొక్కమాటచేత స్ఫురింపఁజేయుచున్నాఁడు.

రాముఁడి ట్లనెను. "అయ్యా! నీవు చేసినపనిని వింటిని. తండ్రియొక్క ఋణమును దీర్చుకొనుటకై నీవు గావించినదానిని అంగీకరించుచున్నాము. కాని, క్షత్రియధర్మమునందు నన్ను వీర్యహీనునిగా అశక్తునిగా తలంచుచు నాతేజమును అవమానించుచున్నావు. ఇదిగో నాపరాక్రమమును చూడుము"

శ్లో॥ శ్రుతవా నస్మి యత్కర్మ కృతవా నసి భార్గవ ।
అనురుంధ్యామహే బ్రహ్మన్ పితు రానృణ్య మాస్థితమ్॥ 2

శ్లో॥ వీర్యహీన మి వాశక్తం క్షత్త్రధర్మేణ భార్గవ ।
అవజానాసి మే తేజః పశ్య మేఽద్య పరాక్రమమ్॥ 3

బాలకాండ - సర్గ - 76

ఇట్లు పలికి రాముఁడు క్రుద్ధుఁడై భార్గవుని చేతినుండి ఆ వింటిని క్షణములో గైకొని ఎక్కుపెట్టి శరమును సంధించి, "బ్రాహ్మణుఁడ వగుటచేత విశ్వామిత్రునకు బంధువుఁడ వగుటచేత నీవు నాకు పూజ్యుఁడవు. కావున నీకు ప్రాణాంతకముగా శరమును విడువఁజాలను. నీవు ఇష్టపడినచో నీపాదములయందలి గమనశక్తిని గాని తపోబలముచేత నీవు ఆర్జించిన సాటిలేని పుణ్యలోకములను గాని సంహరింతును. మఱి వైష్ణవమైన యీ శరము పరపురంజయము, శత్రుదర్పవినాశకము. దివ్యమైన యీ బాణము ఎక్కుపెట్టిన తరువాత వ్యర్థముగా పడిపోదు."

శ్లో॥ బ్రాహ్మణోఽసీతి పూజ్యో మే విశ్వామిత్రకృతేన చ ।
తస్మా చ్ఛక్తో న తే రామ మోక్తుం ప్రాణహరం శరమ్॥ 6

శ్లో॥ ఇమాం పాదగతిం రామ తపోబలసమార్జితాన్ ।
లోకా నప్రతిమా న్వా తే హనిష్యామి య దిచ్ఛసి॥ 7

శ్లో॥ న హ్యయం వైష్ణవో దివ్య శ్శరః పరపురంజయః ।
మోఘః పతతి వీర్యేణ బలదర్పవినాశనః॥ 8

బాలకాండ-సర్గ-76

సర్వలోకశ్రేష్ఠమైన విష్ణుధనువును ధరించిన శ్రీరాముని జూచుటకై ఋషిగణములతో కూడి దేవతలు పరమేష్ఠిని పురస్కరించుకొని వచ్చిరి. ఆ మహాద్భుతమును చూచి లోక మంతయు నిశ్చేష్ట మయ్యెను.

శ్రీరాముని తేజస్సులచేత హతవీర్యుఁడైన జామదగ్న్యుఁడు జడీకృతుఁడై (Immobile) పద్మపత్రాక్షుఁడైన రాముని జూచుచు మెల్లగా నిట్లనెను. "కశ్యపునకు నేను ఈభూమి నొసంగినప్పుడు ఆయన, "నీవు నాభూమియందు నివసింపరాదు" అని ఆదేశించెను. ఆ గురువచనమును పాటించుచు రాత్రియందు ఇచ్చట నేను వసించుట లేదు. రాత్రి యగునప్పటికి నేను ఎచ్చట ఉన్నను మనోజవముతో మహేంద్రపర్వతమునకు చేరుదును. కావున నా పాదగమనశక్తిని నీవు భగ్న మొనర్పఁదగదు. తపస్సుతో నాచేత సంపాదింపఁబడిన పుణ్యలోకములను ఆ శరముతో హత మొనరింపుము. ఇంక విలంబము వలదు. రామా! నీకు స్వస్తి యగును గాక! ఈ ధనుస్సును ఎక్కుపెట్టఁ గలిగిన నీవు పురుషోత్తముఁడవైన మధుసూదనుఁడ వని యెఱింగితిని. ఆహవమునందు అప్రతిద్వంద్వుఁడవైన నిన్ను దేవత లందఱును గుములుగూడి చూచుచున్నారు. త్రైలోక్యనాథుఁడవైన నీచేత విన్నఁబాటు నొందుట నాకు లజ్జాకరము కాదు. అప్రతిమమైన యా శరమును వదలుము. శరమోక్షణమును చూచి మహేంద్రగిరికి పోవుదును."

శ్లో॥ తేజోభి ర్హతవీర్యత్వా జ్జామదగ్న్యో జడీకృతః ।
రామం కమలపత్రాక్షం మందం మంద మువాచ హ॥ 12

శ్లో॥ అక్షయ్యం మధుహంతారం జానామి త్వాం సురేశ్వరమ్ ।
ధనుషోఽస్య పరామర్శా త్స్వస్తి తేఽస్తు పరంతప॥ 17

బాలకాండ-సర్గ-76

రాముఁడు బాణమును వదలెను. తాను ఆర్జించినపుణ్యలోకములు హతము లగుటను చూచి శ్రీరాముని ప్రశంసించి ప్రదక్షిణ మొనరించి భార్గవప్రభుఁడు ఆత్మగతికి వెడలిపోయెను. అప్పుడు దిక్కు లన్నియు ప్రసన్నము లయ్యెను. రాముఁడు ప్రశాంతాత్ముఁడై చేత నున్నధనువును సాయకముతో కూడ అప్రమేయుఁడైన వరుణునకు ఒసంగెను.

ఈధనుస్సులకథ ఆయాసందర్భములలో కొంచెము భిన్నముగా కన్పించుచున్నది. సిద్ధాశ్రమమునందు ఋషులు రామునితో, జనకుఁడు గావించినయజ్ఞమునకు ఫలముగా దేవతలు శివధనుస్సును ఇచ్చి రని చెప్పిరి.

శ్లో॥ తద్ధి యజ్ఞఫలం తేన మైథిలే నోత్తమం ధనుః ।
యాచితం నరశార్దూల సునాభం సర్వదైవతైః॥ 12

బాలకాండ - సర్గ - 31

దక్షయజ్ఞసందర్భమున శివుఁ డొసంగినధనువును దేవతలు దేవరాతునకు న్యాసముగా ఇచ్చి రని జనకుఁడు చెప్పెను. రుద్రుఁడే దేవరాతునకు నొసంగె నని భార్గవుఁడు చెప్పెను. జనకుఁడు గొప్పయజ్ఞమును చేయఁగా అప్పుడు వరుణుఁడు ఈధనుస్సును అక్షయసాయకములైన రెండుతూణీరములను ఇచ్చె నని సీత అనసూయతో చెప్పెను.

శ్లో॥ మహాయజ్ఞే తదా తస్య వరుణేన మహాత్మనా ।
దత్తం ధనుర్వరం ప్రీత్యా తూణీ చాక్షయసాయకే॥ 39

అయోధ్యాకాండ-సర్గ-118

ఈ వృత్తాంతమును గోవిందరాజస్వామి వ్యాఖ్యానమున ఇట్లు సమన్వయించెను. త్రిపురసంహారముకొఱకు విశ్వకర్మ సమానసారములైన రెండుధనుస్సులను నిర్మించెను. దేవతలు వానిని శివునకు విష్ణువునకు నొసంగిరి. దక్షయజ్ఞసందర్భమున పోరాటములో జృంభితమైన ధనువును శివుఁడు న్యాసముగా దేవరాతునకు నొసంగెను. అది అప్పటి నుండి ఆవంశీయులచేత పూజింపఁబడుచుండెను. సీతావివాహముకొఱకు సీరధ్వజుఁడు యజ్ఞ మొనర్పఁగా దేవతలు ప్రీతులై యజ్ఞఫలముగా వరుణునిచేత, "ఈధనువు ఇంక నీకు సొంతము. యథేష్టముగా వినియోగించుకొనుము" అని ఆ ధనువును ఆయనకు సొంత మగునట్లుగా

ఇప్పించిరి. న్యాస మనఁగా ఇల్లడగా నుంచుట. అట్లు మనయొద్ద నుంచఁబడిన యితరులవస్తువు ఎన్నాళ్ళైనను మనకు సొంతము కాదు. దేవతలు దానిపై తమస్వత్వమును (హక్కును) వదలుకొని జనకునకు స్వత్వము కలుగునట్లు చేసిరి. అప్పు డాయన ఆ ధనువును వీర్యశుల్కమునుగా ప్రకటింపఁగల్గెను. అది న్యాసముగా నున్నంతకాలము దాని నాయన స్వప్రయోజనమునకు ఉపయోగించుకొనుటకు వీలు లేదు. సొంతమైనతరువాతనే ఆయన దానిని వీర్యశుల్కముగా నుంచెను. అందువలననే అది భగ్నమైనను ఆయనకు దోషము గాని, చింత గాని కలుగ లేదు.

విష్ణుధనువు కూడ భార్గవులయింట న్యాసముగానే యుండెను. అనఁగా విష్ణుదేవుఁ డెప్పు డైనను వచ్చి తనధనువును గైకొనిపోవచ్చును. అందువలన వారు దానిని శ్రద్ధతో పూజించుచు కాపాడుచుండిరి. ఋచీకుఁడు దానిని జమదగ్నికి అప్పగించెను. ఆయన తనకుమారులందఱిలో సమర్థుఁ డని దానిని పరశురామునకు అప్పగించెను. పరశురాముఁడు బ్రహ్మచారి. దానిని కాపాడఁ గలిగినశిష్యులు కూడ ఆయన కెవరును తటస్థింప లేదు. ఇట్లుండఁగా ఆయన శివధనుర్భంగమునుగూర్చి వినెను. విష్ణుహుంకారముచే అది యింతకు పూర్వమే బెండువాఱెను. ఇప్పు డట యొకరాజ కుమారునిచే భగ్నమైన దన్నచో అతఁడు విష్ణుతేజమున జన్మించి యుండునా అనుసందేహము వెంటనే ఆయనకు కలిగెను. కాని క్షత్రియులయందున్న వైమనస్యముచేత ఆయనకు, విశ్వామిత్రునకు వలె, రామునియందు విశ్వాసము కలుగ లేదు. "సత్యపరాక్రముఁడు మహాత్ముఁడు నైన రాముని నేనెఱుంగుదును" అని చెప్పిన విశ్వామిత్రుఁడు కూడ తాటకావధమునందు రాముని బాహుబలమును పరీక్షించినతరువాతనే యస్త్రముల నొసంగెను. పరశురాముఁడు కూడ రాముని పరీక్షించి, ఆతఁడు విష్ణువే యగుచో దుష్ట

శిక్షణముకొఱకు ఆ ధనువును ఆయనకు అప్పగించినచో తనబాధ్యత తీఱు నని కూడ తలంచియుండవచ్చును. అందువలననే ఆయన రాముని గూర్చి పరుషముగా ఒక్కమాటయైన అనలేదు. మఱియును, "నీ పరాక్రమము అచింత్యము అద్భుతము" అనియే ప్రశంసించెను.

మఱి రాముఁ డేల క్రుద్ధుఁ డయ్యెను. అందులకు రెండుకారణములు కలవు. పరశురాముఁడు దశరథునకు మాటమాత్రముగా నైన సమాధానము చెప్పక తృణీకరించుట మొదటికారణము. తండ్రికి జరిగిన యవమానము తనకు జరిగినట్లే రాముఁడు భావించెను. "ఇది విష్ణుధనువు; నీయందు విష్ణుతేజ మున్నచో దీనిని గైకొని ఎక్కుపెట్టుము" అని సరళముగా చెప్పక, "నీకు శక్తి యున్నచో దీనిని ఎక్కుపెట్టుము, తరువాత నీకు ద్వంద్వయుద్ధము నొసంగుదుము" అని యుద్ధమునకు ఆహ్వానించుట రెండవది. భార్గవుఁడు శరమును సంధింపు మని కూడ రెండుపర్యాయము లనెను. అమోఘమైనబాణమును సంధించిన తరువాత ఏమగు ననువిషయమును భార్గవుఁడు ఊహింపలేదు. ఆ తొందఱపాటునకు కూడ రామునకు కోపము వచ్చెను.

రాముఁడు క్రుద్ధుఁ డయ్యును భార్గవుఁడు పితృఋణమును తీర్చుటకై గావించిన క్షత్రియసంహారము సమంజసమే అని అంగీకరించుట గమనింపఁదగియున్నది. "నీతండ్రికి నీఁను కార్తవీర్యార్జునుఁడు, అతనిపుత్రులును అపకార మొనర్చిరి. వారిని సంహరించుట న్యాయమే. అంతటితో ఆగక క్షత్రియకులమును ఏల నిర్మూలించితివి? అది ఎట్లు ధర్మ మగును?" అని రాముఁడు అడుగలేదు. అది సమంజసమే అని యంగీకరించుచున్నాఁడు. (అనురుంధ్యామహే బ్రహ్మన్ పితురానృణ్యమాస్థితమ్) అది ఎట్లు ధర్మ మయ్యెను? కార్తవీర్యార్జునుఁడు జమదగ్ని ధేనువును హరించినప్పుడు, అతనిపుత్రులు, పరశురాముఁడు లేనప్పుడు వచ్చి, ఆశ్రమములో దొంగలవలె ప్రవేశించి సమాధియందున్న జమ

దగ్నిమహర్షిని హత్యగావించినప్పుడు, తక్కిన క్షత్త్రియు లెవరును "ఇది యకార్య"మని ప్రకటింప లేదు; భార్గవులను ఆదుకొన లేదు;సాను భూతి చూపలేదు. వా రందఱును కులముయొక్క కట్టుబాటును ఐకమత్యమునే భావించుచుండిరి కాని ధర్మమును భావింపలేదు. "మనవాఁడు తప్పు చేసినచో వానిని మనము సమర్థింపవలయునే కాని పరపక్షములోనిధర్మమును అంగీకరింపరాదు. మహారాజుపై ఒకబ్రాహ్మణుఁడు తిరుగఁబడుటయా? ఇది సహింపరాదు" అని క్షత్రియు లందఱును వర్గముయొక్క ఐకమత్యభావనతో **(Consciousness of class Uinity)** ఏకీభవించిరి. ఒకఁడు హత్యచేసినప్పుడు, వానిని సమర్థించు వా రందఱును శిక్షార్హులే యగుదురు. రావణుఁ డొక్కడే సీత నపహరించినను, రాక్షసు లందఱును అతనిపక్షముననే యుండుటచే వారి నందఱను రాముఁడు సంహరింపక తప్పలేదు. కార్తవీర్యార్జునుఁడు, ఆతనిపుత్త్రులు చేసినది తప్పే యని వారిని సంహరించుట న్యాయమే యని రామునివలె ఆ సమయమున ఎవరును ధర్మమును సమర్థించి యుండలేదు. అందువలన వా రందఱు శిక్షార్హులే యైరి. కావుననే పరశురాముఁడు చేసినకార్యము సమంజసమే అని రాముఁడు అంగీకరించెను.

భార్గవుఁడు నైష్ఠికబ్రహ్మచారి. ఆయన యజ్ఞ మొనర్చి అందు తనకు లభించినభూమి నంతను కశ్యపునకు యజ్ఞదక్షిణగా నొసంగెను. అవివాహితునకు యజ్ఞములు చేయునధికార మున్నదా? శ్రౌతస్మార్త కర్మలయందు యజమానుఁడు పత్నీసమేతుఁడై యుండవలయు నను టకు కర్మసమృద్ధిని చెప్పుటయందే తాత్పర్యము; పత్నీరహితునకు బ్రహ్మచారికి యజ్ఞాధికారము లే దని చెప్పుటయందు తాత్పర్యము కాదు; ఆపస్తంబశ్రౌతసూత్రమున క్రిందిసూత్రవ్యాఖ్యానమున భట్టరుద్రదత్తుఁడు ఈవిషయమున ఇట్లు నిష్కర్షఁ గావించెను.

సూ॥ యో వా కశ్చి దవిద్యమానాయామ్॥
(ప్రథమప్రశ్నే-వింశఖండే-త్రయోదశసూత్రమ్)

"భార్య లేకున్నను ఒకానొకఁడు అగ్నులను సంపాదించుకొన వచ్చును; అనఁగా యజ్ఞ మొనరింపవచ్చును. పయస్సు ఆజ్యము మొదలగువానివలె యజమానునకు యజ్ఞకర్మయందు భార్యయు ఒక యంగము మాత్రమే యగును. ఏవేని కొన్నియంగములు లోపించి నప్పుడు ప్రతినిధిద్రవ్యములతో యజ్ఞమును కొనసాగింపవలసియే యుండును. అట్లే భార్య లోపించినప్పుడును యజ్ఞాధికారము లోపింపదు. ధర్మవిగ్రహుఁడైన శ్రీరామచంద్రుఁడు సీత లోకాంతరమునకు చేరిన తరువాత కూడ పెక్కు అశ్వమేధములను గావించెను. అంతే కాదు, శిష్టులలో శ్రేష్ఠులైన భీష్ముఁడు కణ్వుఁడు మొదలగువారు యజ్ఞములు చేసినట్లు ప్రసిద్ధముగా నున్నది. కావున అపత్నీకునకు యజ్ఞాధికారము లోపింపదు."

దేవరాతునకు శివధనువు, ఋచీకునకు విష్ణుధనువు ఏకకాలము ననే చేరినవి. ఋచీకునకు మనుమఁడు పరశురాముఁడు. దేవరాతునకు పదునాఅవవాఁడు సీరధ్వజుడు. ఋచీకునకు తరువాత ఒకతరము గడచి రెండవతరము జరుగుచుండఁగా, దేవరాతునకు తరువాత పదునైదుతరములు గడచి పదునాఅవతరము జరుగుచుండెను. దీనినిబట్టి క్షత్రియులకన్న మహర్షులు ఎంత దీర్ఘజీవులో గ్రహింపవచ్చును. సంధ్యోపాసనమును దీర్ఘముగ చేయుటవలన మహర్షులు దీర్ఘాయువును పొందుచుండిరని పెద్దలు చెప్పుదురు. (ఋషయో దీర్ఘసంధ్యత్వా ద్దీర్ఘ మాయురవాప్నుయుః) క్షత్రియులకు రాజ్యకార్యకలాపములచేత అట్లు సంధ్యోపాసనము కావించుటకు అవకాశము లేనందున వారు అట్టి దీర్ఘాయువును పొందకుండిరని గ్రహింపవచ్చును. కావున సంధ్యోపాసనము శక్తి సంపదలకు ముఖ్యసాధన మని, సున్నాలవంటి శక్తిహీనులు వందల

మంది చేయఁగలిగినదానికన్న అంకెలవంటి శక్తిమంతులే కుటుంబమునకుఁ గాని సమాజమునకుఁ గాని సకలవిధముల ఉపకరింపఁ గల రని, సామాజిక కార్యకలాపాదుల ప్రాముఖ్యభావనతో సంధ్యోపాసనమును ఉపేక్షించుట గాని సంక్షేపించుట గాని తగ దని గ్రహింపవలసి యున్నది.

లఘుపరాక్రమముతో రాముఁడు శరచాపములను భార్గవుని హస్తము నుండి గ్రహించెను. (శరం చ ప్రతిజగ్రాహ హస్తా ల్లఘుపరాక్రమః). భార్గవుఁడు ఊహించుటకు కూడ వీలులేనంతవేగముతో రాముఁడు ఆతని చేతినుండి శరచాపములను ఆకర్షించి, ఎక్కుపెట్టి శరమును సంధించి యుగ్రమూర్తియై నిలిచెను. ఆ విజృంభణమును వేగమును చూచుచు భార్గవుఁడు విస్మితుఁడై రామునియందున్నశక్తి తనయందున్నశక్తికన్న చాలరెట్లు అధిక మని గ్రహించి నిర్విణ్ణుఁ డయ్యెను. ఇంక ద్వంద్వ యుద్ధప్రసక్తి యే మున్నది? ఆయనయందు అప్పటివఱకు ప్రజ్వలించు చున్న యుద్ధోత్సాహ మంతయు, నిప్పులపై నీళ్ళు చల్లినట్లు, చల్లారి పోయెను. రామునియొక్క తేజస్సులచేత హతవీర్యుఁ డగుటవలన పరశురాముఁడు జడమువలె నయ్యె నని వాల్మీకి వర్ణించెను. (తేజోభి ర్హతవీర్యత్వా జ్జామదగ్న్యో జడీకృతః). యుద్ధము జరుగ లేదు. రాముఁడు భార్గవుని తాఁక లేదు. ఒకనితేజస్సులచేత మఱియొకనివీర్యము హత మగుట యేమి? తేజస్సులచేతనే ఒకనికన్న మఱియొకఁడు అధికుఁ డగును. అధికతేజస్విని అల్పతేజస్కుఁడు ప్రీతితో చేరినచో సంకటము నొందఁడు; సౌఖ్యమునే పొందును; ప్రతిఘటించి అవమానింపఁబూనినచో అధికములైనతేజస్సులచేత అల్పములైనతేజస్సులు హతము లగును. తేజస్సులు అనేకవిధములు. వేదాధ్యయనముచేత వేదవిహితములైన తపోవ్రతానుష్ఠానములచేత కలుగుతేజస్సు బ్రహ్మతేజస్సు. దుష్టులను శిక్షించుచు శిష్టులను రక్షించుచు ధర్మమును నెల

కొల్పుకార్యదీక్షవలన కలుగునది క్షాత్రతేజము. సత్యవచనపరత్వము పితృసేవాపరాయణత్వము మొదలగు ధర్మములను అనుష్ఠించుటవలన కలుగునది ధర్మతేజము. ఆత్మజ్ఞానమువలన కలుగునది ఆత్మతేజము. ఇవి భార్గవునియందుకన్న శ్రీరామునియందు చాల అధికముగా నున్నవి. విష్ణుధనువును చూడఁగానే రాముఁడు వైష్ణవమైన తనస్వరూపమును భావించెను. విష్ణుత్వము బ్రాహ్మమైనమహాతపశ్శక్తిచేతనే పొందఁదగినది. బ్రాహ్మణుఁడుగా జన్మించియు క్షత్రియకర్మను గావించినవాని యొక్క బ్రాహ్మతేజ మెట్లు మహనీయ మగును? కేవలయుద్ధపరాక్రమముచేత క్షాత్రతేజము సిద్ధింపదు. ఆర్తత్రాణపరాయణత్వము శిష్టరక్షణము ధర్మస్థాపనము మొదలగువానిచేతనే అది సిద్ధించును. ఇవి యన్నియు రామునియందు యజ్ఞరక్షణాదిరూపమున నున్నట్లు భార్గవుని యందు లేవు. "పితృదేవో భవ" అను విధి రామునియందు సమన్వయించునట్లు పరశురామునియందు సమన్వయింపదు. తండ్రియొక్క అనుమతిని పొందకయే భార్గవుఁడు కార్తవీర్యార్జునుని సంహరించెను. అట్టిహింసాకృత్యము బ్రాహ్మణునకు అనుచిత మని తండ్రి ప్రాయశ్చిత్తము గావించుకొమ్మని పరశురాముని ఆదేశించెను. తండ్రి హత్య గావింపఁబడినప్పుడు, తక్కినకుమారు లందఱును ఊరకనే యుండఁగా, భార్గవుఁడు తండ్రి గావించినయుపదేశమును లెక్కపెట్టక ఎంతోమంది రాజులను సంహరించెను. తండ్రిగారిమాటను అసిధారావ్రతముగ ఆచరించిన శ్రీరామునిధార్మికత్వమునకు, తండ్రియుపదేశమును ఉపేక్షించిన భార్గవునిధార్మికత్వమునకు సంబంధమే లేదు. శ్రీరామునిగూర్చి నారద మహర్షి వాల్మీకితో చెప్పినప్పుడు, వేదవేదాంగతత్త్వజ్ఞుఁడు సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞుఁడు (వేదవేదాంగతత్త్వజ్ఞః, సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః) అని వర్ణించెను. వేదవేదాంగములకు సర్వశాస్త్రములకు తత్త్వమైనపరమార్థము ఆత్మయే. కావున వసిష్ఠాదిమహర్షులయొద్ద ఆయన ఆత్మతత్త్వము నెఱింగె ననుట స్పష్టము. అందువలన ఆయనయందు ఆత్మతేజము

విలసిల్లుచుండెను. భార్గవుఁడు అప్పటికి ఆత్మజ్ఞానమును సంపాదింపలేదు. తపస్సుచేత పుణ్యలోకముల నార్జించుచుండెను. అందువలన ఆయన యందు ఆత్మజ్ఞానలభ్యమైన యాత్మతేజము లేదు. ఇన్ని తేజస్సులు రామునియందు అధికముగా నుండుటచే భార్గవుఁడు తన తక్కువతన మును గ్రహించి, తాను చేసినది పొరపాటని తెలిసికొని ఉత్సాహము చల్లారి జడప్రాయుఁ డయ్యెను.

ఈ సంఘటనము పరశురామునిజీవితమునందు చాల అపూర్వ మైనది. అప్పటివఱకును ఆయన తనకన్న మించినవీరుఁ డెవఁడును లేఁడను నమ్మకముతో నుండెను. రామునియందు అగాధమైన మహ త్త్వము గోచరించినంతనే ఈనమ్మకము ఒక్కసారిగా పటాపంచ లయ్యెను. ఆ మహత్త్వమును తనకు ఆరాధ్యమైన విష్ణుత్వమునుగా గ్రహించెను. "త్రైలోక్యనాథుఁడవైన నీచేత పరాజయము కలుగుట నాకు లజ్జాకరము కాదు" అని పలుకుచు తనయపచారమునకు ప్రాయ శ్చిత్తముగా పుణ్యలోకములను బలిపెట్టి, ఆయన రామునిరూపమున గోచరించుచున్న విష్ణుదేవునకు ప్రదక్షిణము గావించి వెడలిపోయెను.

ఆయన వెడలిపోవునప్పుడు, "ఆ ప్రభువు ఆత్మగతికి పోయెను" (జగామ ఆత్మగతిం ప్రభుః)అని వాల్మీకిమహర్షి వర్ణించెను. పరాజితుఁ డైనవానినిగూర్చి ప్రభువు అని చెప్పు టేమి? పరశురాముఁడు పరా జితుఁ డైనను, మహాతపస్సుచేత పొందఁదగిన విష్ణుదేవునిదర్శనమును పొందెను. అది మహాఫలప్రదము. అప్పటితో పరశురామునిజీవితమున నూతనాధ్యాయము ఆరంభ మైనది. అప్పటివఱకును ఆయనను వీరత్వాభి మానము పెనుభూతమువలె ఆక్రమించియుండెను. ఆభూతము తొలఁగి నంతనే, తీవ్రమైనజ్వరము దిగిపోయినంతనే నీరసము కలుగునట్లు, ఆయనకు నిర్వేదము కలిగెను. దానినుండి పరమశుభప్రదమైన ఆత్మ విమర్శనము ఆరంభ మయ్యెను. చిరకాలతపస్సుచే ఆర్జించినపుణ్యలోక

ములు ఆయన చూచుచుండఁగనే లిప్తమాత్రలో విధ్వంసము లయ్యెను. "ఇంక దేనిని సంపాదించినను ఇట్లు ఒకానొకప్పటికి నశించునదే కదా! ఇట్లు నశింపక అక్షయ్యమగు ఫలము నొసంగున దేది?" అను ఆలోచన ఆయనయందు మొలకెత్తెను. "కర్మచేత ప్రాప్తములగు లోకములను పరీక్షించి బ్రాహ్మణుఁడు నిర్వేదమును పొందవలె. కృతముచే అకృతము కలుగదు." అని శ్రుతి చెప్పుచున్నది. [పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేద మాయా న్నాస్త్యకృతః కృతేన] లోకములను పరీక్షించుట యనఁగా అనిత్యము లని నిశ్చయించుకొనుట. కృత మనఁగా ధర్మాచరణరూపమైన కర్మ. అకృత మనఁగా మోక్షము. కర్మచేత మోక్షము కలుగదు. అది జ్ఞానముచేతనే సిద్ధించును. ఇట్లు పరశురాముఁడు విష్ణుదేవునిదర్శనమువలన ఆత్మవిచారమార్గమున ప్రవేశించెను. ఇప్పటివఱకును ఆయన ఏమనస్సునకు లోఁబడియుండెనో, ఆ మనస్సుపై అధికారమును పొంది దానిని విమర్శించుచు ప్రభువయ్యెను. "లోకము లన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియానీకము చిత్తమున్ గెలువ నేరవు" అని ప్రహ్లాదుఁడు హిరణ్యకశిపునితో చెప్పినట్లు చిత్తమును శాసింపఁగలుగుటయే నిజమైన ప్రభుత్వము. ఇట్లు పరశురాముఁడు ఆత్మజ్ఞానము నొంది ముక్తుఁ డయ్యె నని వాల్మీకిమహర్షి, "ఆ ప్రభువు ఆత్మగతికి అరిగె" నని మూఁడుమాటలలో చెప్పెను. ఈ సంఘటనమునకు తరువాత భార్గవరాముఁడు నిర్వేదము నొంది సంవర్తుని కలిసికొనుట, తరువాత దత్తాత్రేయుని సేవించి ఆత్మజ్ఞానమును పొంది ముక్తుఁ డగుట అను వృత్తాంతములు త్రిపురారహస్య మను పేరుతో ప్రసిద్ధమైయున్న హారితాయనసంహితయందు విపులముగ వర్ణింపఁబడి యున్నవి.

రాముఁడు విష్ణుధనువును తనయొద్ద నుంచుకొనక అప్రమేయుఁడైన వరుణున కొసంగెను. (వరుణాయ అప్రమేయాయ). ఇతఁడు

వరుణుఁడని యితరులచే గుర్తింపఁబడకుండుటయే ఇచ్చట అప్రమే యత్వము. వరుణుఁడే జనకునకు శివధనుస్సుపై స్వత్వమును కలిగించెను. ఆయనయే ఇప్పుడు మరల రామునివలన విష్ణుధనువును గ్రహించి అగస్త్యునియొద్దకు ఇంద్రునిద్వారా చేర్చెను. కావున విశ్వకర్మ ఈ రెండుధనుస్సులను నిర్మించినప్పుడు వీనికి వరుణుని అధిష్ఠానదేవతను గావించె నని చెప్పవచ్చును. రాముఁడు వచ్చువఱకును అగస్త్యుఁడు ఈధనువును అభిమంత్రించుచు దీనిశక్తిని పెంపొందించుచుండెను. రాముఁడు పంచవటికి బయలుదేరిపోవుచున్నప్పుడు రాక్షససంహారమునకు సాధనములుగా ఈధనువును, ఖడ్గమును తూణీరములను ఆయన రామున కొసంగెను.

### 3. గృహప్రవేశ ఘట్టము

పరశురాముఁడు వెడలిపోయినంతనే రాముఁడు వసిష్ఠాదిమహర్షులకు నమస్కరించి తండ్రియొద్దకు పోయెను. భార్గవుని విజృంభణముచేత దశరథుఁడు సొమ్మసిల్లియుండెను (విహ్వలః). భార్గవుడు వెడలిపోయెను. "అయ్యా! మనసేన ఇంక నీశాసనమున అయోధ్యకు బయలుదేరును గాక. ఎల్లరును నీయాజ్ఞకై ఎదురుచూచుచున్నారు" అని రాముఁడు తండ్రితో వినయమధురముగా చెప్పెను. "భార్గవుఁడు వెడలిపోయెను" అను రెండుమాటలు అమృతబిందువులవలె చెవిని బడినయంతనే దశరథుఁడు ప్రహర్షముతో లేచి, తాను పుత్రుఁడును మరల జీవించినట్లే భావించుచు రాముని గాఢముగా కౌఁగిలించుకొని త్వరగా బయలుదేరుఁడని సేనలకు ఆజ్ఞయిచ్చెను.

అట్లు వేగముగా పయనించుచు వారు అయోధ్యను సమీపించిరి. వారి యాగమనవార్త ముందుగనే తెలియవచ్చుటచే నగర మంతయు పతాకలతో పుష్పమాలికలతో మనోహరముగా అలంకరింపఁబడెను.

పౌరముఖ్యులు మంగళద్రవ్యములతో నగరమునుండి చాలదూరము వచ్చి మహారాజునకు స్వాగతము నొసంగిరి. వారితో కూడ మంగళాలంకారశోభితమై హిమవద్గిరివలెనున్న స్వగృహమునందు దశరథుఁడు కొడుకులతో కోడండ్రతో ప్రవేశించెను. కౌసల్యా సుమిత్ర కైకేయి మొదలుగా మహారాజపత్నులు సీతను ఊర్మిళను మాండవీ శ్రుతకీర్తులను చూచి మిగుల ప్రీతితో స్వీకరించిరి. పిదప వా రందఱును మంగళస్నానములు చేసి పట్టువస్త్రములు ధరించి దేవతాయతనములందు పూజలు గావించిరి. తరువాత నూతనవధువులు పెద్దల కందఱకును క్రమముగా నమస్కరించిరి. పిమ్మట రాజకుమారులు తమభార్యలతో స్వగృహములకు పోయి స్నేహితులతో కూడి ఇష్టకథాలాపములతో క్రీడలతో వినోదించుచు మాతాపి రులను సేవించుచు సుఖముగా నుండిరి.

ఇట్లు కొంతకాలము గడచెను. యుధాజిత్తు వారితో కూడి ఆనందించుచు అయోధ్యయందే యుండెను. ఒకనాఁడు దశరథుఁడు భరతుని జూచి, "నీమేనమామయైన యుధాజిత్తు నిన్ను వారియింటికి తీసికొనిపోవలయు ననుతలంపుతో వచ్చియున్నాఁడు. అతఁడు మిథిలయందే నన్ను ఆవిధముగా కోరియుండెను." అని చెప్పెను. భరతుఁడు తండ్రికి రామునకు నమస్కరించి లక్ష్మణుని కౌఁగిలించుకొని శత్రుఘ్నునితో కూడ బయలుదేరి యుధాజిత్తు వెంట కేకయనగరమునకు పోయెను.

పిమ్మట రామలక్ష్మణులు తండ్రియాజ్ఞను పురస్కరించుకొని పౌరకార్యములను గురుకార్యములను మాతృకార్యములను కాలోచితముగా నిర్వర్తించుచుండిరి. రాముని శీలవృత్తముచేత ఎల్లరును సంప్రీతులై యుండిరి.

రాముఁడు సీతతో కూడ పెక్కుఋతువులు విహరించెను. ఆయన ఆమెయొక్క మనస్సునందు నిత్యము వర్తించుచుండెను. సీత కూడ

రామునకు తండ్రిచేత నొసంగఁబడిన భార్య యై ప్రీతిపాత్రురాలై యుండెను. సౌశీల్యాదిగుణములచేత సౌందర్యముచేతను ఆయనకు ఆమెయందు ప్రీతి వర్ధిల్లఁజొచ్చెను. ఆమె, ఆయనను హృదయము నందు రెట్టింపుగా ఆరాధింపఁ జొచ్చెను. పరస్పరముగా వారికున్న ప్రీతి వారిహృదయములకు తెలియుచుండెను.

శ్లో॥ రామ స్తు సీతయా సార్థం విజహార బహూ నృతాన్।
మనస్వీ తద్గత స్తస్యా నిత్యం హృది సమర్పితః॥ 26

శ్లో॥ ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి।
గుణా ద్రూపగుణా చ్చాపి ప్రీతి ర్భూయోఽభ్యవర్ధత॥ 27

శ్లో॥ తస్యా శ్చ భర్తా ద్విగుణం హృదయే పరివర్తతే।
అంతర్జాత మపి వ్యక్త మాఖ్యాతి హృదయం హృదా॥ 28

బాలకాండ-సర్గ-77

ఇట్లు సంగ్రహముగా ఆదంపతుల శృంగారమును మహర్షి వర్ణించినాఁడు. ఇందు ఆయన అనేకవిషయములను ధ్వనింపఁజేయు చున్నాడు. రాముఁడు పెక్కు ఋతువులను విహరించె నన్నప్పుడు వసంతగ్రీష్మాదిఋతువులలో ఆయాఋతువులకుఁ దగినట్లుగా భోగించె ననుట సామాన్యమైన యర్థము. ఈశృంగార మంతయు ధర్మావిరుద్ధ మైన కామభోగానుభవ మని చెప్పుటయే ఇందు మహర్షికి ముఖ్యమైన తాత్పర్యము. అందువలన ఋతువులందు విహరించె ననఁగా, ధర్మ శాస్త్రము విధించినట్లుగా సీతయొక్క ఋతుకాలములయందే ఆమెతో భోగించె నని గ్రహింపవలసియున్నది. ఋతుకాలములయందు మాత్రమే ఎవఁడు భార్యను పొందునో వాఁడు సదాబ్రహ్మచారి యనుట ప్రసిద్ధము. "రాముఁడు విహరించె" ననుటవలన రాముని యభిప్రాయము ననుసరించి సీత భోగములను పొందుచుండె నని, ఆమె తనయిష్టము ననుసరించి

రాముని భోగముల నర్థింప లేదని సూచిత మగుచున్నది. భార్య తానై భర్తను భోగముకొఱకు అర్థింపరా దనువిషయము సుప్రసిద్ధము. ఆమె అర్థింపక పోయినను రాముఁడు ఆమెకు సంతోషమును కలిగించుట కొఱకే భోగములయందు ప్రవర్తించె ననుట "విజహార" అనుపరస్మై పద ప్రయోగముచేత కవి సూచించుచున్నాఁడు. ఆత్మారాముఁడైన రాము నకు, పత్నికొఱకే భోగవిహారము కాని, తనకొఱకు ఏమియు నక్కఱ లే దనుట స్పష్టము.

ఈవిషయమునే మహర్షి మఱియొకవిధముగా నిరూపించు చున్నాఁడు. సీత రామునకు ప్రియురాలే. ఎందువలన? "తండ్రిచేత భార్యగా నొసంగఁబడిన"దని (దారాః పితృకృతా ఇతి). సీత వీర్య శుల్కముగా రామునకు భార్య యయ్యె ననుట ప్రసిద్ధము. ఇందు దశ రథుని ప్రసక్తి ఏమున్నది? ఇట్లు చెప్పుట వెనుకచెప్పినదానికి భిన్నము గదా! కాని యిందులకు ఆధారము సీతాదేవి అనసూయతో తన వివాహమునుగూర్చి చెప్పినమాటలలో నున్నది. "ధనుస్సు భగ్నమైన తరువాత మాతండ్రి రామునకు న న్నొసంగుటకై జలకలశమును గైకొనెను. కాని తనతండ్రియొక్క అభిప్రాయము తెలియకపోవుటచే రాముఁడు అప్పుడు నన్ను పరిగ్రహింప లేదు."

శ్లో॥ తతోఽహం తత్ర రామాయ పిత్రా సత్యాభిసంధినా।
నిశ్చితా దాతు ముద్యమ్య జలభాజన ముత్తమమ్॥ 50

శ్లో॥ దీయమానాం న తు తదా ప్రతిజగ్రాహ రాఘవః।
అవిజ్ఞాయ పితు శ్ఛంద మయోధ్యాధిపతేః ప్రభోః॥ 51

అయోధ్యాకాండ - సర్గ - 118

"మాతండ్రిగారిని పిలిపింపుఁడు. ఆయనకు ఇష్ట మైనచో నేను ఈకన్యను స్వీకరింతు" నని రాముఁడు చెప్పియుండును. వధువును

పరిగ్రహించుట యన్నది వరునకు మాత్రమే సంబంధించిన విషయము కాదు. అది వంశాభివృద్ధికి, అభ్యున్నతికి సంబంధించినవిషయము. తన యింటికి తగినకోడలిని ఎన్నుకొని తెచ్చుకోవలసినయధికారము వరుని తండ్రికే ప్రధానముగా నుండును. ఆయన స్వయముగాఁ గాని పెద్దల వలనఁ గాని సరియైన కన్యను నిర్ణయింపవలె. దీనినే కన్యావరణ మను చున్నాము. అట్టికన్యనే వరుఁడు పరిగ్రహింపవలె. ఈపద్ధతియందే దశ రథుని ప్రతినిధిగా వశిష్ఠుఁడు జనకునిసభయందు సూర్యవంశము నంతను పేర్కొని రామలక్ష్మణులకొఱకు సీతను ఊర్మిళను వరించెను. జనకుఁడు కూడ తనవంశము నంతను పేర్కొని కన్యల నిత్తు నని చెప్పెను. ఇట్లు పెద్ద లందఱయొక్క అనుమతితో కన్యను పరిగ్రహింప వలయునే కాని, తండ్రియభిప్రాయము నెఱుఁగకుండ కుమారుఁడు కన్యను స్వీకరించుట తగ దనుట స్పష్టము.

దశరథుఁడు ఏకారణముచేత నైనను అంగీకరింపకున్నచో సీత రామునకు భార్యయై యుండెడిది కాదు. తండ్రియొక్క అనుమతిచేతనే ఆమె భార్య యగుటచే, ఆమె ఆయనకు పితృకృతయైన పత్ని అయ్యెను. కావున ఆయన ఆమెను ప్రేమించెను. తండ్రి సీతను భార్యనుగా తనకు ఇచ్చుటచే రాముఁడు ఆమెను పరిగ్రహించెనే కాని, తండ్రియాదేశము లేకున్నచో తనభోగముకొఱకు ఏ వనితను రాముఁడు భార్యనుగా స్వీక రింపఁ డనియు దీనివలన మనము గ్రహింపవలసియున్నది. కావుననే ఆయన సీతాదేవి లోకాంతరమునకు పోయినతరువాత మఱియొక వని తను భార్యనుగా పరిగ్రహింపక యజ్ఞములయందు సీతయొక్క ప్రతి మనే ప్రతినిధినిగా ఏర్పఱుచుకొనెను. అందువలన ఆయన స్త్రీభోగ నిరపేక్షుఁ డనుట స్పష్టము. ఆయన భార్యకొఱకు విరహమున విల పించుట దాక్షిణ్యస్నేహమూల మని గ్రహింపవలసియున్నది.

సీతయొక్క సౌశీల్యాదిగుణములవలన సౌందర్యమువలన రామునకు సీతయందు ప్రీతి పెంపొందె నని చెప్పెనే కాని, వాల్మీకి మహర్షి సీతయొక్క ప్రేమను అట్లు వర్ణింపలేదు. ఆమెకు భర్త యందున్న ప్రీతి గుణనిమిత్తమైనది కాదు. అట్లయినచో ఆగుణములు ఏకారణముచేతనైనను పోయినచో ప్రీతియు నశించును. అది పతివ్రతకు లక్షణము కాదు. భర్త గుణవంతుఁడైనను కాకున్నను, భార్య పతిని ప్రేమించుచు సేవింపవలసినదే. సీత అనసూయతో ప్రసంగించు నప్పుడు ఇట్లు చెప్పినది. "ఈనాభర్త సద్వర్తనమును కోల్పోయి నప్పుడు కూడ, ఈయనను నేను భేదము లేకుండ వెనుకటివలెనే సేవింపవలె. అట్లే నేను ఈయనను సేవించుచున్నాను."

శ్లో॥ యద్య ప్యేష భవే ద్భర్తా మమార్యే వృత్తవర్జితః ।
అద్వైధ ముపచర్తవ్యః తథా ప్యేష మయా భవేత్॥ 3

అయోధ్యాకాండ - సర్గ - 117

అద్వైధ మనఁగా రెండవవిధము లేకుండుట. (ద్విధాభావః ద్వైధమ్, న ద్వైధమ్ అద్వైధమ్. భర్త సంపన్నుఁడైనప్పుడు ఒక విధముగా, దరిద్రుఁడైనప్పుడు మఱియొకవిధముగా, బలిష్ఠుఁడై యున్నప్పుడు ఒకవిధముగా, రోగియైనప్పుడు మఱియొకవిధముగ వర్తించుట భార్యకు తగదు. ఏపరిస్థితియందైనను ఎట్టివాఁడైనను భర్తను భార్య భక్తి అనునొక్కవిధముతోనే సేవించుచుండవలె.

సీతయొక్క హృదయమునందు రాముఁడు రెట్టింపుగా వర్తించు చుండెను (తస్యాశ్చ భర్తా ద్విగుణం పరివర్తతే) అని వాల్మీకి చెప్పెను. ఈవాక్యమునకు ఏమి యర్థము? రాముఁడు సీతకు వెలుపల

భర్తగా ఆమెయొక్క సేవలను పొందుచున్నాడు. తనయెదుట ఆయన లేకున్నప్పుడు కూడ ఆమె ఆయననుగూర్చి భావించుచునే యుండెను. ప్రత్యక్షముగా నున్నప్పుడు ఆయనను ఆమె ఎంతగా భావించుచున్నదో పరోక్షమునందును హృదయములో ఆయననుగూర్చి రెట్టింపుగా భావించుచున్నది. మఱియును, సందర్భమునుబట్టి, రాముఁడు ఆమెను ఎంతగా ప్రేమించుచున్నాఁడో, అంతకు రెట్టింపుగా ఆమె ఆయనను హృదయమునందు ఆరాధించుచుండె ననియు గ్రహింపవలసియున్నది. భర్త ఎంతగా తన్ను ప్రేమించుచున్నాఁడో భార్యకూడ అంతమాత్రమే భర్తను ప్రేమింపరాదా? భార్యాభర్తల ప్రేమ సమానముగా ఉండఁగూడదా? భర్తయొక్క ప్రేమకు భార్యయొక్క ఆరాధనమునకు సంబంధము లేదు. భర్త తన్ను ప్రేమించినను ప్రేమింపకపోయినను భర్తను ఆరాధించుచుండుట భార్యకు విధి. దశరథుఁడు కైకేయిని ప్రేమించినట్లు కౌసల్యాదులను ప్రేమింప లేదు. ఆ కారణముచేత వారు భర్తను సేవింపకుండుట గాని ఉపేక్షించుట గాని తగదు. తండ్రి కుమారుల సంబంధము కూడ ఇట్టిదే. తండ్రి తన్ను ప్రేమించినను ప్రేమింపకున్నను కుమారుఁడు తండ్రిని భక్తితో సేవింపవలసినదే. భర్త భార్యను ప్రేమించుట ఐచ్ఛికము **(Optional)**; తప్పక ప్రేమింపవలయు నను నియమము లేదు. కాని భార్య భర్తను ఆరాధించుట శాస్త్రవిధి. ఎందువల్ల ననఁగా అదియే ఆమెకు తపస్సు. ఈ విషయమునే సీత ఇట్లు స్పష్టమొనర్చినది. "పతిశుశ్రూషకన్న అన్యముగా స్త్రీకి తపస్సు ఏదియు విధింపఁబడ లేదు".

పతిశుశ్రూషణా న్నార్య స్తపో నాన్య ద్విధీయతే॥ 9

అయోధ్యాకాండ-సర్గ-117

మఱి తల్లిని తండ్రిని ఆచార్యుని ఆరాధించుట పురుషునకు తపస్సు అగును గాని, భార్యను ప్రేమించుట తపస్సు కానేరదు. అందు

వలన భర్తయొక్క ప్రేమకు,భార్యయొక్క ఆరాధనమునకు సంబంధము లేదు. "సీతయొక్క హృదయమునందు రాముఁడు రెట్టింపుగా వర్తించు చున్నాఁడు" అనువాక్యముచేత వాల్మీకి ఈవిషయముల నన్నింటిని ధ్వనింపఁజేయుచున్నాఁడు.

గద్యము :— ఆపస్తంబసూత్ర కౌండిన్యసగోత్ర పోలూరి వేంకట నరసాంబా వేంకటనారాయణామాత్య పుత్ర హనుమ జ్జానకీరామశర్మ ప్రణీతంబైన శ్రీరామాయణతరంగిణి యందు పంచమంబైన భార్గవతీర్థము సమాప్తము.

# 6. ప్రత్యక్ష దేవతాతీర్థము

## 1. అభిషేకసంరంభఘట్టము

ప్రత్యక్షదేవతలైన తండ్రిని తల్లులను సేవించుచు శ్రీరాముఁడు లక్ష్మణునితో కూడి తండ్రియాజ్ఞ ననుసరించి పౌరకార్యములను తీర్చు చుండెను. ఎల్లరును శ్రీరాముని గుణగణములను శ్లాఘింపఁజొచ్చిరి. అతఁడు ఎప్పుడును ప్రశాంతాత్ముఁడుగ నుండును. ఎవరైనను ఎదురుగా వచ్చుచున్నప్పుడు ముందుగా తానే రాముఁడు మృదువుగ పలుక రించును; రాజకుమారుని పలుకరించుటకు సాధారణముగా ఇతరులకు ఉండు సంకోచమును తానే ముందుగా మాటాడి తొలఁగించు నన్నమాట. ఇతరులు ఎవరైనను పరుషముగా మాటాడినను రాముఁడు దానికి తగి నట్లుగా ఇంకను పరుషముగా సమాధానము చెప్పఁడు. ఎవరైనను ఏ కొంచము ఉపకార మైనను చేసినచో, దానిని వారు ఉద్దేశపూర్వకముగా చేయకపోయినను, రాముఁడు ఎంతో సంతోషించును. ఇతరు లెవరైన నూఱు అపకారములు చేసినను, ఆయన, ఆత్మవంతుఁ డగుటచే, వానిని గూర్చి యనుకొనఁడు.

అట్టి గుణవంతునకు తేజస్వికి నూఱు అపకారములు ఎవరైన చేయఁగల్గుదురా? అసలేల చేయుదురు? ఇది యథార్థముగా సంభవము కాదు. ఎవరైనను నూఱు అపకారములు వరుసగా ఆయనకు చేయుటయే సంభవించినను ఆయన వానిని లెక్కపెట్టఁ డనుటయే వాల్మీకి తాత్పర్యము. ఇట్లు లెక్కపెట్టకుండుట ఎవనియందైనను ఎట్లు సాధ్యము? రాముఁడు ఆత్మవంతుఁడు కాఁబట్టి ఆయనకు అది సాధ్యమే అని వాల్మీకి చెప్పుచున్నాఁడు. తనకు అపకారము జరిగినప్పుడు సాధారణమానవుఁడు ఏల ప్రజ్వలించుచున్నాఁడు? దానివలన అప్పటివఱకును ఉన్నసుఖమునకు భంగము కలుగు నని, క్రొత్తగా ఏదో దుఃఖము వచ్చి పైనఁబడు నని సాధారణమానవుఁడు అపకారము చేసినవానిని ప్రతిఘటించి పగఁదీర్చుకొనుటకు ప్రయత్నించుచున్నాఁడు. కాని ఆత్మవంతునకు అట్టిభావన యుండదు. ఆత్మవంతుఁ డనఁగా ఆత్మజ్ఞానవంతుఁ డని యర్థము. నిత్యము అఖండమును అయిన యానందమే ఆత్మయొక్క స్వరూపము. అది ఏ కారణములచేతనైనను హెచ్చదు, తగ్గదు. అట్టి యాత్మానందము నూఱు అపకారములచేతనైనను మార్పునొందదు. కావున ఆత్మజ్ఞుఁడు ఇతరుల యపకారములను, కలలో జరిగిన సంఘటనములను వలె, ఉపేక్షించునే కాని వానివలన తనకు యథార్థముగా సుఖహాని కలుగు నని తలంపఁడు. అట్టి రాముఁడు రాజు కావలె నని ప్రజలు కోరుచుండిరి.

శ్లో॥ స చ నిత్యం ప్రశాంతాత్మా మృదుపూర్వం చ భాషతే।
ఉచ్యమానోఽపి పరుషం నోత్తరం ప్రతిపద్యతే॥ 10

శ్లో॥ కథంచి దుపకారేణ కృతేనైకేన తుష్యతి।
న స్మర త్యపకారాణాం శత మప్యాత్మవత్తయా॥ 11

అయోధ్యాకాండ - సర్గ - I

వృద్ధుఁడైన దశరథునకు, "నేను జీవించియుండఁగా రాముఁడు రా జెట్లు అగును? నాకు ఈ ప్రీతి ఎట్లు కలుగును?" అను చింత కలిగెను. ఆయనయొక్క హృదయమునందు ఇది పరమమైన ప్రీతివిషయముగా మెదలుచుండెను. "ప్రియుఁడైన కుమారుఁడు అభిషిక్తుఁ డగుటను ఎప్పుడు చూడఁగలనో" అనియే ఆయన నిరంతరము ఆలోచింపఁ జొచ్చెను.

శ్లో॥ ఏతైస్తు బహుభి ర్యుక్తం గుణై రనుపమై స్సుతమ్ ।
దృష్ట్వా దశరథో రాజా చక్రే చింతాం పరంతపః॥ 35

శ్లో॥ అథ రాజ్ఞో బభూ వైవం వృద్ధస్య చిరజీవినః ।
ప్రీతి రేషా కథం రామో రాజా స్యా న్మయి జీవతి॥ 36

శ్లో॥ ఏషా హ్యస్య పరా ప్రీతిః హృది సంపరివర్తతే ।
కదా నామ సుతం ద్రక్ష్యా మ్యభిషిక్త మహం ప్రియమ్॥ 37

అయోధ్యాకాండ-సర్గ-1

దశరథునకు ఈ చింత ఎందులకు? జ్యేష్ఠపుత్రునకు తాను ఎప్పుడు అనుకొన్నచో అప్పుడే పట్టాభిషేకము చేయవచ్చును. ఆయనను కా దనువారు ఎవ రున్నారు? అమాత్యులు ప్రజలు అందఱును రామునిపట్టాభిషేకమునే కోరుచున్నా రని ఆయనకు కూడ తెలియును. అంతయు అనుకూలముగా నుండఁగా "రాముఁడు రా జెట్లగును? నా కోరిక ఎప్పటికి తీఱును?" అని ఆయన ఏల చింతనొందవలె? ఆయన కైకేయిని ఇమ్మని కోరినప్పుడు, ఆయనకు అప్పటికి చాలమంది భార్య లుండుటచే, ఆమెతండ్రి యగు అశ్వపతి ఇచ్చుటకు అంగీకరింప లేదు. అప్పుడు దశరథుఁడు, "నాకు ఇప్పటికి సంతతి లేదు. నీపుత్రికకు కుమారుఁడు కలిగినచో రాజ్యము వానికే ఇత్తును" అని రాజ్యమును శుల్కమునుగా ఏర్పఱచి కైకేయిని పరిగ్రహించెను. కైకేయికి

ఇప్పుడు కుమారుడు కలిగినాడు. అతడు జ్యేష్ఠుడు కాక రెండవ వాడు అయ్యెను. జ్యేష్ఠుడైన రాముడు గుణములచేత శ్రేష్ఠుడై తనకును సకలప్రజలకును అభీష్టుడై యుండెను. రాజ్యశుల్కమున తానిచ్చిన వాగ్దానమును నిలుపుకొనవలయు నన్నచో భరతునకు పట్టాభిషేకము చేయవలె. ఇది తనకును ప్రజలకును అభీష్టము కాదు. తన యభీష్టముప్రకారము రామునకు పట్టాభిషేకమును ప్రకటించినచో అశ్వపతి జనకుడు మొదలగువారిని ఆహ్వానింపవలె. ఆ సభలో రాముని యొక్క జ్యేష్ఠత్వమును గుణశ్రేష్ఠత్వమును ప్రతిపాదించి అశ్వపతి యొక్క అంగీకారమును పొందవలె. అది సాధ్యమా? కన్యాదానమప్పుడే రాజ్యముకొఱకు పట్టుబట్టిన కేకయరాజు ఇప్పుడు మనుమడు కలిగినతరువాత రాజ్యశుల్కమును వదలుకొనునా! పైగా మనుమనికి పదునాఱేండ్లు నిండకముందే అశ్వపతి యుధాజిత్తును పంపి మనుమని తనదగ్గరకు పిలిపించుకొన్నాడు. అక్కడ వారందఱు భరతునకు ఏమి బోధచేయుదురో? భరతుడు సహజముగ రామునకు భక్తుడే. కాని వారిబోధలవలన వానికి కూడ రాజ్యకాంక్ష కలుగునేమో? అదియును గాక తనకు ఇష్టపత్నియై సవతు లందఱపైనను అధికారము చేయుచున్న కైకేయి, కౌసల్య రాజమాత యగుటకు అంగీకరించునా? ఇది యంతయు విని జనకుడు మొదలుగా పెద్ద లందఱును రాజ్యశుల్కవాగ్దానమును నెరవేర్చి సత్యమును కాపాడవలసినదే అని తీర్మానించినచో తనకోరిక ఎట్లు తీఱును? రామునకు పట్టాభిషేకము జరుగకున్నచో తాను బ్రతుకగలడా? ఇన్ని సంశయములతో ఆయన ఆందోళనము నొంది, "నేను బ్రతికియుండగా రామునకు పట్టాభిషేకము జరుగునా" అని చింతింపఁజొచ్చెను.

ఇట్లుండగా దివియందు గ్రహనక్షత్రాదులలో ప్రాతికూల్యము, అంతరిక్షమునందు మహావాతాదులసంచలనము, భూమియందు కంపము

మొదలగునుత్పాతములు ఆయనకు గోచరింపఁజొచ్చెను. తనశరీరము నందు పైకొనుచున్న వృద్ధత్వమును గమనించుచు ఆయుత్పాతముల వలన రాజైన తనకే ప్రాణాపాయము సంభవింపవచ్చు నని ఆయన భయపడెను. అందువలన వెంటనే ఆయన ఒక కార్యసరణిని నిశ్చయించు కొని భూమియందు ప్రధానులైన పృథివీపతులను నానానగరవాస్తవ్యులను జానపదులను పిలిపించి మహాసభను ఏర్పాటుగావించెను. త్వరలో రాఁజాలరని కేకయరాజును జనకుని దశరథుఁడు పిలిపింపలేదు. వారు జరిగిన శుభకార్యమునుగూర్చి తరువాత తెలిసికొందు రని తలంచెను.

శ్లో॥ దివ్యంతరిక్షే భూమౌ చ ఘోర ముత్పాతజం భయమ్।
సంచచక్షే చ మేధావీ శరీరే చాత్మనో జరామ్॥ 43

శ్లో॥ సమానినాయ మేదిన్యాం ప్రధానాన్ పృథివీపతీన్॥ 46

శ్లో॥ న తు కేకయరాజానం జనకం వా నరాధిపః।
త్వరయా చానయామాస పశ్చాత్తౌ శ్రోష్యతః ప్రియమ్॥47

అయోధ్యకాండ–సర్గ. 1

ఇచ్చట, "భూమియందు ప్రధానులైన పృథివీపతులను" అన్నప్పుడు అయోధ్యారాజ్యమునకు సమీపమునందున్న రాజులనని గ్రహింపవలసియున్నది. అట్లు గాక భూమియందు ముఖ్యులైనరాజుల నందఱను పిలిపించె నన్నచో అశ్వపతిని జనకుని పిలిపింపకుండుట అసంగతమగును.

ఆ మహాసభలో దశరథుఁ డిట్లు చెప్పెను. "చాలకాలముగా సకల లోకమునకు హితము నొనరించుచు నా యీశరీరము పాండురచ్ఛత్రఛాయలో వృద్ధత్వము నొందినది. జీర్ణమైన యీ శరీరమునకు నేను విశ్రాంతిని గోరుచున్నాను. నా కుమారుఁడైన రాముఁడు పరపురంజయుఁడు, పరాక్రమమున ఇంద్రునితో సమానుఁడు. ధార్మికులలో

శ్రేష్ఠుఁ డైన వానిని, పుష్యనక్షత్రముతో కూడినచంద్రునివలె, రేపు ఉదయము యౌవరాజ్యమున నియోగింపఁదలఁచుచున్నాను. కుమారుని యందు రాజ్యభారమును ఇప్పుడే ఉంచి భూమికి శ్రేయస్సును కలిగించి నేను క్లేశరహితుఁడ నగుదును. నా యీ యభిప్రాయము చక్కఁగా నున్నచో మీ రందఱును అనుమతింపుఁడు. ఇది నాకు చాల ఇష్టమైనను ఇంతకన్నను హిత మున్నచో మీరును ఆలోచించి నేను ఎట్లు చేయఁ దగునో చెప్పుఁడు. మధ్యస్థు లగువారు పూర్వాపరములు విచారించి చేయునాలోచన మిగుల నభ్యుదయమును కలిగించునదిగా నుండును."

ఆ ప్రసంగమును విని వా రందఱును సంతోషపరవశులై హర్ష ధ్వానములు గావించిరి. అప్పుడు దశరథుఁడు నవ్వుచు ని ట్లనెను. "నేను ధర్మమును తప్పకుండ రాజ్యమును పాలించుచుండఁగా, మీ రందఱును నా కుమారుని యువరాజునుగా చూడవలయు నని ఇంతగా కోరుచున్నా రేమి? నాపరిపాలనము బాగుగా లేదా?" అప్పుడు సభలో ప్రధానులైనవారు శ్రీరామునిగుణగణములను ప్రశంసించుచు నిట్లనిరి. "నీ పరిపాలన చక్కఁగా నున్నది. నీ కుమారుఁడు ఇక్ష్వాకువంశములో ఇప్పటికి పరిపాలించియున్న రాజు లందఱిలో గుణములచేత శ్రేష్ఠుఁడు. ఆతనియందు ప్రజాకళ్యాణజనకములైన గుణములు ఎన్నో కలవు. ఆతఁ డెప్పు డైనను గ్రామముకొఱకో నగరముకొఱకో లక్ష్మణునితో కూడి సంగ్రామమునకు పోయినచో జయింపకుండ తిరిగిరాఁడు. విజేతయై రథముమీఁదనో ఏనుఁగుమీఁదనో తిరిగివచ్చునప్పుడు పౌరులను స్వజనులను వలె "పుత్రభార్యాగ్నిహోత్ర భృత్యశిష్యగణముల యందు మీకు కుశలమా?" అని ఆదరముతో అడుగుచుండును. సాధారణజనులకు ఎవరికైనను కష్టము కలిగినచో రాముఁడు పరితాపము నొందును; అట్లేవారు ఉత్సవములు జరుపుకొనుచున్నప్పుడు తండ్రివలె సంతోషమును పొందుచుండును. అతఁడు సకలవిధముల ధర్మమునే

ఆశ్రయించియుండును. అతఁడు ఎప్పుడును నవ్వుచునే మాటాడును. గాంధర్వవిద్యయందు కూడ సకలప్రపంచమున అతఁడే శ్రేష్ఠుఁడు. ఇట్లు లోకపాలసమానుఁడై యున్న రాముని వసుంధర వల్లభునిగా అభిలషించుచున్నది. మన నగరమున రాష్ట్రమునందును ప్రజలందఱు రాముని యభ్యుదయమును కోరుచు సకలదేవతలను ప్రార్థించుచున్నారు. వారి యీ కోరిక నీప్రసాదముచేత సమృద్ధిగా ఫలించును గాక!"

ఇందు ఉత్తమప్రభుత్వలక్షణము లన్నియు చక్కఁగా వర్ణింపఁబడినవి. ప్రజలయొక్క కష్టమును తనకష్టముగా వారిసంతోషమును తనసంతోషముగా భావింపఁగలుగుట ఉత్తమపాలకునియొక్క లక్షణము. లోకపాలురతో సమానుఁ డగుటవలన, రాముఁడు అయోధ్యారాజ్యమునకే గాక సకలలోకమునకు అభ్యుదయమును కలిగించు ననుట స్పష్టము. లోకపాలకులు కేవలము మనుష్యులనే కాక పశుపక్ష్యాది సకలప్రాణులను ప్రకృతిని సైతము పాలింతురు. వసుంధర రాముని వల్లభునిగా అభిలషించుచున్న దనుమాటలలో కూడ ఈ యభిప్రాయమే వ్యక్తమగుచున్నది.

దశరథుఁడు ఆ ప్రశంసావాక్యములను విని పరమహర్షమునొంది అభిషేకమునకు కావలసిన యేర్పాట్లు చేయుఁడని వసిష్ఠవామదేవులకు చెప్పెను. ఆ మాటలు విన్నంతనే సభలో జయఘోషము మిన్నుముట్టెను. వసిష్ఠుఁడు వెంటనే సంభారములను సమకూర్చుటకై తగిన వారిని నియోగించెను. రాజు సుమంత్రుని పంపి రాముని సభకు పిలిపించెను. రూపముచేత ఉదారగుణముచేత పురుషులదృష్టిని చిత్తమును హరించుచు వచ్చుచున్న కుమారుని ఎంతసేపు చూచినను దశరథుఁడు తృప్తి నొందలేదు. రాముఁడు వచ్చి నమస్కరింపఁగా దశరథుఁడు అతనిని కౌఁగిలించుకొని కూర్చుండుమని యిట్లు చెప్పెను. "నీవు నా జ్యేష్ఠపత్నియందు జ్యేష్ఠుఁడవుగా గుణశ్రేష్ఠుఁడవుగా జన్మించి

తివి. కాపున రేపు నీవు పుష్యనక్షత్రమునందు యౌవరాజ్యమును పొందుము. నీవు గుణవంతుఁడవు. అయినను ప్రేమచేత, కుమారా! నీకు హితమును చెప్పుచున్నాను. ఇంకను వినయశాలివై నిత్యము జితేంద్రియుఁడవై వర్తింపుము." ఈ మాటలు విన్నంతనే రాముని స్నేహితులు పరుగిడిపోయి కౌసల్యకు చెప్పిరి. ఆమె సంతోషపరవశయై వారి కందఱకు గోహిరణ్యరత్నాదికములను కానుక లొసంగెను.

దశరథుఁడు సభను చాలించి రాముఁడు పౌరులు వెడలిపోయిన తరువాత మంత్రులను అమాత్యులను మరల ఇట్లు హెచ్చరించెను. "రేపే పుష్యనక్షత్రము వచ్చును. రేపే నా కుమారునకు అభిషేకము చేయవలయును"

శ్లో॥ శ్వ ఏవ పుష్యో భవితా శ్వోఽభిషేచ్య స్తు మే సుతః॥ 2
అయోధ్యాకాండ - సర్గ - 4

ఇట్లు మరల హెచ్చరింపవలసిన ఆవశ్యకత ఏమున్నది. వ్యవధి లేకుండుటచే వారు ఏర్పాట్లు సరిగా చేయకున్నచో అభిషేక మాగిపోవు నేమో అని ఆయనభయము. అందువలన ఏపరిస్థితియందైనను మఱు నాఁడు అభిషేకము తప్పక జరుగవలసినదే అని, వారు ఎంత శ్రమించి యైనను కావలసినయేర్పాట్లన్నియు తప్పక చేయవలయు నని ఆయన హెచ్చరించినాఁడు.

పిదప దశరథుఁడు తనభవనమునకు పోయి సుమంత్రుని పంపి రాముని మరల పిలిపించెను. రాముని కూర్చుండు మని చెప్పి ఆయన ఇట్లనెను. "కుమారా! నేను ఎన్నో యజ్ఞములు చేసితిని, సకలభోగము లను అనుభవించితిని; అన్నివిధముల కృతార్థుఁడ నైతిని. నీకు అభిషేక మొనర్చుట తప్ప నా కింక కర్తవ్య మేదియును లేదు. నాజన్మనక్షత్రము దారుణగ్రహములైన సూర్యాంగారకరాహువులచేత నిరోధింపఁబడి యున్న దని దైవజ్ఞులు చెప్పుచున్నారు. ఇంకను ఎన్నో దుశ్శకునములు

కనిపించుచున్నవి. ఇట్టి యుత్పాతములు సంభవించినప్పుడు సాధారణముగా రాజునకు మృత్యువు గాని ఘోరమైన యాపద గాని కలుగును. కావున నాకు బుద్ధిభ్రంశము సంభవింపకముందే నీవు అభిషేకమును చేసికొనుము. ప్రాణులయొక్క మతి చంచలము కదా!

నీవు సీతతో కూడ ఉపవాస ముండి రాత్రికి దర్భలపై పరుండవలె. నీమిత్రులు అప్రమత్తులై నిన్ను అన్నివైపులనుండి రక్షింపవలె. ఇట్టికార్యములలో ఎన్నో విఘ్నములు సంభవించుచుండును. అయోధ్య నుండి భరతుఁడు దూరముగా నున్నప్పుడే నీకు అభిషేకము జరుగుటకు సరియైన సమయమని నాయభిప్రాయము. భరతుఁడు సత్పురుషుల పద్ధతియందే యున్నాఁడన్నమాట నిజమే. వాఁడు జ్యేష్ఠానువర్తి, ధర్మాత్ముఁడు, దయాశాలి, జితేంద్రియుఁడు. కాని మనుష్యులచిత్తము లనిత్యమని నా నిశ్చయము. అయినను ధర్మనిష్ఠులైన సత్పురుషుల యొక్క చిత్తము కృతశోభి యగును."

శ్లో॥ న కించిన్మమ కర్తవ్యం తవాన్యత్రాభిషేచనాత్ । 15

శ్లో॥ అవష్టబ్ధం చ మే రామ నక్షత్రం దారుణైర్గ్రహైః।
ఆవేదయన్తి దైవజ్ఞాః సూర్యాంగారకరాహుభిః॥ 18

శ్లో॥ ప్రాయేణ హి నిమిత్తానామీదృశానాం సముద్భవే ।
రాజా హి మృత్యుమాప్నోతి ఘోరాం చాపద మృచ్ఛతి॥ 19

శ్లో॥ తద్యావదేవ మే చేతో న విముంచతి రాఘవ ।
తావదేవాభిషించస్వ; చలా హి ప్రాణినాం మతిః॥ 20

శ్లో॥ సుహృదశ్చాప్రమత్తాస్త్వాం రక్షన్త్వద్య సమంతతః ।
భవన్తి బహువిఘ్నాని కార్యాణ్యేవంవిధాని హి॥ 24

శ్లో॥ విప్రోషిత శ్చ భరతో యావ దేవ పురా దితః।
తావ దే వాభిషేక స్తే ప్రాప్తకాలో మతో మమ॥ 25

శ్లో॥ కామం ఖలు సతాం వృత్తే భ్రాతా తే భరత స్స్థితః।
జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః॥ 26

శ్లో॥ కిం తు చిత్తం మనుష్యాణా మనిత్య మితి మే మతిః।
సతాం తు ధర్మనిత్యానాం కృతశోభి చ రాఘవ॥ 27

అయోధ్యాకాండ - సర్గ - 4

కృతశోభి :- గో. టీక:- యద్యపి, "కామం ఖలు సతాం వృత్తే" ఇత్యాద్యుక్తగుణవిశిష్టతయా సః (భరతః) న శంకాస్పదీభూతః, తథాపి మనుష్యాణాం మనుష్యత్వసాధారణ్యేన శంకితం చిత్త మనిత్యం చంచల మితి మే మతిః, మమ నిశ్చయః .... తు శబ్దః పక్షవ్యావృత్త్యర్థః। ధర్మైకనిరతానాం (చిత్తం) కృతశోభి, కృతేన పరస్పరోపకారేణ శోభతే, న తు భేదం ప్రాప్నోతి।.... అపరే తు ఆహుః। సతాం చిత్తం కృతేన కార్యేణ శోభతే. న తు కరిష్యమాణేన; కృతం కార్య మను మోదతే న తు కరిష్యమాణ మితి భావః ఇతి।

మంత్రులను హెచ్చరించినతరువాత దశరథుఁడు మరల రాముని కూడ హెచ్చరింప నేల? భరతునిగూర్చి ఆయన చెప్పినమాటలు చిత్ర ముగా సాభిప్రాయముగా నున్నవి. "ఈమహోత్సవమునకు భరత శత్రుఘ్నులు వచ్చుటకు అవకాశము లేకపోయెనే" అని పరితపింప వలసినతండ్రి అట్లు మాటాడక, "భరతుఁడు ఈనగరమునకు దూర మందున్నప్పుడే నీపట్టాభిషేకము జరుగుటకు సరియైన సమయము" అని చెప్పుట గమనింపఁదగియున్నది.భరతుఁడు అయోధ్యలో నున్నచో రామునిపట్టాభిషేకము జరుగ దనియే కదా ఆమాట కర్థము."నా పట్టాభి షేకమునకు భరతుఁ డేల ప్రతిబంధక మగు?" నని రాముఁడు ప్రశ్నించు

నేమో యని, అందుకు సమాధానముగా, "భరతుఁడు ధర్మాత్ముఁడు, దయాశాలి జితేంద్రియుఁడును, అయినప్పటికిని మనుష్యులచిత్తవృత్తి చంచలము (అనిత్యమ్) కావున, వానిని కూడ నమ్ముటకు వీలులేదు" అని ఆయన వివరించుచున్నాఁడు. భరతుఁడు సహజముగా ధర్మశీలుఁడే యైనను మేనమామలయింటియందు వారిబోధలవలన వానికి కూడ రాజ్యకాంక్ష కలుగునేమో! సాధారణమానవులు స్వార్థము ప్రబలమైనపుడు ధర్మమున నిలువఁగలరా! దృఢమైన ధర్మశీలము కలవారు కూడ స్వార్థమును సాధించుకొనుటకు అవకాశమున్నప్పుడు దానిని ఉపయోగించుకొనుటకు ప్రలోభమును పొందవచ్చును. రత్నాభరణములున్న పెట్టెను మూతను తెఱచియుంచినచో ధర్మాత్మునకు కూడ మనస్సు చలింపవచ్చును. అట్లుగాక దానిని మూసి తాళమువేసి భద్రము గావించినచో అట్టి ప్రలోభము కలుగుటకు అవకాశమే యుండదు. అట్లే రాజ్యమువిషయమున పట్టాభిషేకము జరుగకున్నచో కొంతహక్కుతో అవకాశమున్నవానికి ధర్మాత్మునకు కూడ దానిని పొందవలయు నను ప్రలోభము కలుగ వచ్చును. అట్లు గాక జ్యేష్ఠునకు తండ్రి మహాసభయందు పెద్దలసమక్షమున పట్టాభిషేకమును గావించె నన్నచో, ఆరాజ్యమును పొందుటయందు తనకు ఏదేని హక్కున్నను తమ్ముఁడు ధర్మాత్ముఁడైనచో, ఇతరులు ప్రేరేపించినను "జరుగవలసిన దేదో జరిగిపోయినది; ఇంక ఇప్పుడు నేను నాహక్కును పైకిఁదెచ్చుకొని పోరాడుట సమంజసము కాదు" అని ప్రలోభము నొందక తనమనస్సును సమాధానపెట్టుకొనును. కావున ధర్మాత్ములచిత్తములు కూడ కృతము చేతనే, అనఁగా జరిగినకార్యముచేతనే (**By the accomplished fact**) శోభించును; అనఁగా సంతోషించును. కాఁబట్టి రామునకు పట్టాభిషేకము జరుగఁబోవుచున్నది అని తెలుపుటకన్న, రామునకు పట్టాభిషేకము జరిగిపోయినది అని భరతునకు తెలియఁజేయుటయే మేలని దశరథుఁడు ఉద్ఘాటించుచున్నాఁడు.

దీనినిబట్టి చూచినచో దశరథుఁడు అవ్యవధిగా సభను ఏర్పాటు చేసి, అందు మఱునాఁడే పట్టాభిషేకము జరుగునట్లుగా ప్రకటించుటలో అశ్వపతి యుధాజిత్తు భరతుఁడు మొదలగువారికి ఈపట్టాభిషేక కార్యము పూర్తియగువఱకును తెలియరాదనియే ఆయనయభిప్రాయ మైనట్లు స్పష్ట మగుచున్నది. సభలో తీర్మానించినను పట్టాభిషేకము నకు మఱునాఁడే ముహూర్తము పెట్టుటకు ప్రబలములైన కారణము లేమియు కన్పింపవు. రాముఁడు దీనిని కోరలేదు. దైవజ్ఞులైన వసిష్ఠాది మహర్షులు కాని అమాత్యులు కాని దీనిని వెంటనే జరుపవలయు నని చెప్పలేదు. భరతశత్రుఘ్నులు అశ్వపతి జనకుఁడు మొదలుగా ముఖ్యులైనవారు వచ్చుటకు పదిరోజులు పట్టవచ్చును. అంతలోపల ఆయన శంకించినట్లుగా ఆయనకు మృత్యువే సంభవించినను, మహాసభలో తీర్మానింపఁబడినట్లుగా, జ్యేష్ఠుఁడైనరామునకే అందఱును జేరి పట్టాభిషేకము చేయుదురు. దశరథుఁడు గతించినతరువాత ఆయన ఎప్పుడో కేకయరాజునకు చేసినకన్యాశుల్క వాగ్దానమును ఎవ్వరును లెక్క పెట్టరు.

దశరథునకు కలిగిన యీ భయమున కంతకు ఆయనయొక్క అపోహయే మూలము. రామునియందు ఆయనకుఁగల ప్రేమకు అవధి లేదు. అతిప్రేమ ఎప్పుడును పాపమునే శంకించును. ఈయతిప్రేమ వలననే ఆయన భరతునిశీలమును గుర్తింపలేకపోయెను. అదియే అనర్థమునకు మూల మయ్యెను.

దశరథుఁ డిట్లు చెప్పుచుండఁగా రాముఁ డేమియు మాటాడలేదు. రాజ్యశుల్కముసంగతి ఆయనకు కూడ తెలియును. ఎల్లరును మఱచి పోయిన యీ విషయమును ఆయనయే చిత్రకూటమునందు భరతునకు తెలిపి, భరతుఁడు రాజగుట సమంజసమే, అని యుద్ఘాటించెను. మఱి యిప్పుడు భరతునిగూర్చి రాముఁడు తండ్రితో ఒక్కమాట యైన అన

లేదు. ఇది సమంజసమా? ధర్మమా? రాముఁ డెందులకు మాటాడ లేదు? రాజ్యశుల్కమునుగూర్చి తండ్రి పొందుచున్నయాందోళనమును రాముఁడు గ్రహించుచునేయున్నాఁడు. అది కేవలము ఆయనకు సంబంధించినసమస్య. ఆయన ఈవిషయమున రామునియొక్క సలహా నడుగ లేదు. ఆయన ఒకకార్యసరణిని నిశ్చయించి దాని కనుకూలముగా వర్తింపు మని రాముని కోరుచున్నాఁడు. రాజ్యశుల్కమును దాఁచుట భరతునిశీలమును శంకించుట సమంజసము కా దని రామునకు తెలియును. కాని ఆయన అడుగకున్నను ఆవిషయములను పైకితెచ్చి చర్చించి, "నీవు చేయుచున్నది తప్పు"అని తండ్రికి బోధించి, ఆయనకు బాధను కలిగించుట రామునకు సమంజసము కాదు. తండ్రి చేసిన నిర్ణయము తప్పో ఒప్పో నిర్ణయించునధికారము కుమారునకు లేదు. ఆజ్ఞానిర్వహణమే పుత్రులకు శిష్యులకు కర్తవ్యము. ఈవిషయమును రాముఁడు తాటకావధసందర్భముననే స్పష్ట మొనరించినాఁడు. "రేపు నీవు పట్టాభిషేకము చేసికొనుము" అని తండ్రియొసంగినయాజ్ఞ యొక్కటియే (Operative Sentence) ఆయనకు కర్తవ్యము. ఆనిర్ణయమునకుముందు తండ్రి గావించినయాలోచనములోని సామంజస్యమును ఔ ననుటకు, కా దనుటకు రామునకు ఏమియు అధికారము లేదు. అందువలన తండ్రిచెప్పుచున్నవిషయముల నన్నింటిని ఊరకయే వినుచుండెను.

తండ్రియొద్ద సెలవు గైకొని రాముఁడు తల్లియొద్దకు పోయెను. అప్పటికి ఈశుభవార్త తెలిసియుండుటచే ఆమె కుమారునియభ్యుదయముకొఱకు దేవమందిరమున పూజ కావించుచుండెను. సీతా సుమిత్రా లక్ష్మణులు కూడ అప్పటికి అచ్చటికి చేరియుండిరి. రామునివలన మరల శుభవార్తను విని కౌసల్య హర్షబాష్పములతో పరవశయై యిట్లనెను. "వత్సా! రామా! చిరంజీవ! నీశత్రువులు హతులైనారు. నీవు

రాజ్యసంపదను పొంది నాయొక్క సుమిత్రయొక్క బంధువులకు సంతోషమును కలిగింపుము."

శ్లో॥ వత్స! రామ! చిరంజీవ; హతా స్తే పరిపంథినః ।
జ్ఞాతీన్ మే త్వం శ్రియా యుక్తః సుమిత్రాయా శ్చ
నందయ॥ 38

అయోధ్యకాండ - సర్గ-5

ఆమె కైకేయిని ప్రస్తావింప లేదు; ఆమెకు కైకేయియందుఁగల వైమనస్యము స్పష్ట మగుచున్నది. "నీశత్రువులు హతులైనారు" అనుమాటచేత ఆమె కూడ కైకేయివర్గమువారు రామునకు శత్రువులే అని భావించుచున్నట్లు వ్యక్త మగుచున్నది.

రాముఁడు నవ్వుచు లక్ష్మణుని జూచి, "నాతో కూడ ఈవసుంధరను నీవు కూడ పాలింపుము. నాకు రెండవహృదయమువంటివాఁడవైన నిన్ను ఈరాజ్యలక్ష్మి చేరినది. లక్ష్మణా! ఇష్టములైన భోగములను రాజ్యఫలములను అనుభవింపుము. జీవితము గాని రాజ్యము గాని నేను నీకొఱకు కోరుచున్నాను."

శ్లో॥ సౌమిత్రే భుంక్ష్వ భోగాం స్త్వ మిష్టాన్ రాజ్యఫలాని చ ।
జీవితం చాపి రాజ్యం చ త్వదర్థ మభికామయే॥ 44

అయోధ్యకాండ-సర్గ-5

రాజ్యము జీవితము కూడ తన కేమియు అక్కఱ లేదని రాముఁ డిందు స్పష్టము చేయుచున్నాఁడు. అసలు రామునకు రాజ్యము కావలయు ననుకోరిక యున్నదా? ఆయనకు అట్టికోరిక లేనే లే దని పెక్కు సందర్భములలో వ్యక్త మైనది. "నీకొఱకు కోరుచున్నాను" అన్నప్పుడు "నాకొఱకు కాదు; నాకేమియు అక్కఱ లేదు" అని చెప్పుటయే తాత్పర్యము. "నీవు" అనఁగా లక్ష్మణుఁడొక్కఁడే కాదు,

లక్ష్మణునివలె తనయందు అనురాగముకలవారందఱకొఱకు అని గ్రహింపవలసియున్నది.

పిదప రాముఁడు స్వగృహమునకు పోయెను. వసిష్ఠమహర్షి వచ్చి సీతారాములకు ఉపవాసదీక్ష నొసంగెను. ఆయన వెడలిపోయిన తరువాత సాయంసమయమున రాముఁడు స్నానమొనర్చి సీతతో కూడ నారాయణుని అర్చించి హవిస్సుయొక్క పాత్రను శీర్షమునందు గైకొని ప్రజ్వలించుచున్నయగ్ని హోత్రమునందు ఆ దేవోత్తమునికొఱకు ఘృతమును సమర్పించెను. ఆహవిస్సుయొక్క శేషమును ప్రసాదముగాఁ గైకొని తనకు ప్రియమును కోరుచు నారాయణుని ధ్యానించుచు ఆ దేవాయతనమునందే కుశాస్తరణమునపై దేహితో కూడ రాముఁడు మౌనముతో శయనించెను; సూర్యోదయమునకు ఒకజాము ముందుగా లేచి గృహాలంకారములు చేయించి సంధ్యాజపము గావించి మధుసూదనుని స్తుతించెను.

తెల్లవాఱినంతనే విప్రులపుణ్యాహవచనఘోషములతో నగరమునందు సందడి పెరిగిపోయెను. పురమంతయు అలంకరింపఁబడెను. భవనములందు ధ్వజములు పతాకలు శోభించెను. (చిహ్నములతో కూడినవి ధ్వజములు; చిహ్నములు లేనివి పతాకలు) చుట్టుపట్లనున్న నగరములనుండి గ్రామములనుండి జనప్రవాహములు వచ్చి అయోధ్యను నింపఁజొచ్చెను.

## 2. వరప్రదానఘట్టము

దశరథుఁడు సభలో "రామపట్టాభిషేకము రేపు జరుగు" నని ప్రకటించినంతనే పౌరులు పురమును అలంకరింపఁజొచ్చిరి. అప్పటికి మధ్యాహ్నమైనది. కౌసల్య దేవతాపూజనము చేయుచు తన్ను అభినందించుచు వచ్చుచున్నవారి కందఱకు ఏవో కానుకలు ఇచ్చి పంపించు

చుండెను. ఆసమయమున కైకేయిదాసి మంథర యాదృచ్ఛికముగా చంద్రునివలె తెల్లగానున్న యంతఃపురప్రాసాదమును అధిరోహించెను. అది అచ్చట నిలిచి కాలక్షేపమునకై నాలుగువైపుల జూడఁ జొచ్చెను. ప్రజలు ప్రహర్షముతో భవనములను అలంకరించుకొనుచుండిరి. నగర మునకు నూతనశోభ కలుగుచుండెను. కౌసల్యయింటికి జనులు గుంపులు గుంపులుగా వచ్చుచు పోవుచు నుండిరి. వారి కేవో కానుకలు లభించు చున్నట్లుండెను. ఇది యంతయు మంథరకు చాల విచిత్రముగా తోఁచెను. ఇంతలో కౌసల్యయొక్క మేడమీఁద తెల్లనిపట్టుచీర ధరించి ప్రహర్షోత్ఫుల్లనయనయై అటు నిటు తిరుగుచున్న యొకదాది మంథ రకు కన్పించెను. "అర్థపరాయణయైన మీకౌసల్య జనులకు విరివిగా ధన మిచ్చుచున్నదే! ఆమెకు అంత సంతోషమునకు ఏమి కారణము కలి గెను? అది సరే! నగరములో జను లందఱు ఒడలు తెలియనిసంతోష ముతో పరువిడుచున్నారేమి?" అని మంథర ఆ దాది నడిగెను. ఆ దాది రామపట్టాభిషేకవార్తను చెప్పి తనపనిమీఁద పోయెను. ఆమాట విని క్రోధముతో మండిపడుచు మంథర గబగబ మేడ దిగివచ్చి కైకేయి యొద్దకు పోయెను.

మంథరవలన రాజకుటుంబమునందు పెద్దవిప్లవము వచ్చి రామాదులశీలవిశేషములు ప్రకాశించుటకు అవకాశ మేర్పడి వారిచరిత్ర ప్రసిద్ధమైనది. అందువలన ఈకథలో శూర్పణఖవలెనే మంథర కూడ కీలకమైన పాత్ర. ఈమెను వాల్మీకి కథలో చాల నిర్విశేషముగ ప్రవేశ పెట్టినాఁడు. ఈమె ఎక్కడనో పుట్టినది; కేకయరాజగృహమున దాసిగా చేరినది; కైకేయివెంట అయోధ్యకు వచ్చినది.

శ్లో॥ జ్ఞాతిదాసీ యతో జాతా కైకేయ్యా స్తు సహోషితా ।
ప్రాసాదం చంద్రసంకాశం ఆరురోహ యదృచ్ఛయా॥ 1

అయోధ్యకాండ - సర్గ-7

ఈమె కైకేయికి దాదియై యుండవచ్చును. అందువలన కాఁబోలు ఈమె, చిన్నపిల్లను తల్లి మందలించునట్లు, కైకేయిపై పెత్తనము కూడ చేయుచుండెను.

మంథర వచ్చునప్పటికి కైక మధ్యాహ్నభోజనానంతరము విశ్రమించియుండెను. పరుండియున్నయామెను చూచి మంథర క్రుద్ధురాలై ధిక్కరింపఁజొచ్చెను. "లే! లెమ్మ! మూఢురాలా! భయము ముంచుకొనివచ్చుచుండఁగా నిద్రపోవుచున్నావా? అపాయములు చుట్టుముట్టుచున్నను నీగతి యేమో నీవు తెలిసికొనలేకున్నావు."

శ్లో॥ ఉత్తిష్ఠ! మూఢే! కిం శేషే భయం త్వా మభివర్తతే ।
ఉపప్లుత మఘౌఘేన కి మాత్మానం న బుద్ధ్యసే॥ 14

అయోధ్యకాండ – సర్గ-7

"ఏమి జరిగినదే? ఎందుల కట్లు కేకలు పెట్టెదవు?" అని కైకయడిగినది. "ఏమున్నది? జరుగవలసినదే జరిగినది. నీసవతికొడుకునకు రేపు పట్టాభిషేక మఁట" అని మంథర ఈసడింపుతో చెప్పినది. రామునకు అభిషేక మని విన్నంతనే కైక మిగుల సంతోషించి, "ఎంత మంచివార్త చెప్పితివే" అని ఆభరణమును కానుకగా నొసంగెను. దానిని తిరస్కరించి మంథర, "రాముఁడు రాజైనచో నీగతి ఏమగును? ఆసంగతిని ఆలోచింప వేమి" అని పలికెను. కైక రాముని ప్రశంసించుచు ఇట్లనెను. "నాకు భరతుఁడు ఎంతగా ఆదరింపఁదగినవాఁడో రాముఁ డంతకన్నను అధికముగా ఆదరింపఁదగినవాఁడు. కౌసల్యకన్నను నన్నే కదా అతఁడు అధికముగా సేవించుచున్నాఁడు. రామునకు రాజ్యము వచ్చినచో భరతునకు కూడ వచ్చినట్లే. రాముఁడు తనవిషయమున నెట్లుండునో సోదరులవిషయమున కూడ అట్లే వర్తించును."

మంథర తనపట్టు వీడక మరల ఇట్లు బోధించెను. "నీవు మూఢురాలవు; అందఱను నమ్ముదువు. కావుననే ఎల్లరును నిన్ను మోసగింపఁగలుగుచున్నారు. రాముఁడు రాజైనచో రాజ్యమునందు భరతునకు ఏమి హక్కు ఉండును? రామునితరువాత ఆతనిసంతతివారే రాజు లగుదురు. భరతునకు వానిపుత్రులకు వారిని సేవించుచుండుటయే తప్ప వేఱు గతియే మున్నది? భరతునివలన ఏమాత్ర మైన నపాయము కలుగు నని తోఁచినచో రాముఁడు తనయధికారమును స్థిరము గావించుకొనుటకై వానిని దేశాంతరమునకో, పరిస్థితులనుబట్టి లోకాంతరమునకో పంపఁగలఁడు. ఆసంగతి అట్లుండఁగా నీగతి ఏమో చెప్పుము. నీవు సౌభాగ్యగర్వముతో కౌసల్యను ఎన్నో పర్యాయములు తిరస్కరించియుంటివి. ఆమె యిప్పుడు రాజమాత యైనచో నీపై అపగను తీర్చుకొనక యుండునా?'' ఈమాటలు విన్నంతనే కైక పూర్తిగా మాఱిపోయెను. ఇది యంతయు తనపై పగఁ దీర్చుకొనుటకు కౌసల్య గావించిన పన్నుగడ యని తలంచుచు కైక క్రోధపరవశురాలై మండిపడుచు నిట్టూర్పులు పుచ్చుచు, "ఈమహాపదను తప్పించుటకు ఉపాయ మేమో నీవే చెప్పుము" అని మంథరను ప్రార్థించెను.

శ్లో॥ దర్పా న్నిరాకృతా పూర్వం త్వయా సౌభాగ్యవత్తయా ।
రామమాతా సపత్నీ తే కథం వైరం న యాపయేత్॥ 37

అయోధ్యకాండ-సర్గ-8

శ్లో॥ ఏవ ముక్తా తు కైకేయీ కోపేన జ్వలితాననా ।
దీర్ఘ ముష్ణం వినిశ్శ్వస్య మంథరా మిద మబ్రవీత్॥ 1

అయోధ్యకాండ-సర్గ-9

మంథర పూర్వవృత్తాంతమును ఇట్లు చెప్పెను. "పూర్వము దండకలో వైజయంతపురమున శంబరాసురుఁ డని ప్రసిద్ధుఁడైన

తిమిధ్వజునితో ఇంద్రునకు యుద్ధము సంభవించెను. అప్పుడు దశరథుఁడు ఇంద్రునకు సహాయుఁడుగా యుద్ధమునకు పోయెను. నీవును ఆయనవెంట వెళ్ళితివి. యుద్ధమునందు దశరథుఁడు క్షతగాత్రుఁడయ్యెను. అప్పుడు నీవు సారథ్యమును గైకొని రథమును యుద్ధరంగమునుండి తప్పించి చల్లనివనప్రదేశమునకు చేర్చి అక్కడ భర్తకు శీతలోపచారములు గావించితివి. ఆయన అచ్చట కొంచెము తేఱుకొనుచుండఁగా రాక్షసులు అచ్చటికి తఱుముకొనుచు వచ్చిరి. యుద్ధము సంభవించుచుండఁగా మరల నీవు భర్తను అక్కడినుండి మఱియొక సురక్షితప్రదేశమునకు చేర్చితివి. ఈవిధముగా భర్తను రెండుపర్యాయములు రక్షించితివి. అప్పుడు ఆయన చాల సంతోషించి నిన్ను రెండు వరములు కోరుకొమ్మనెను. నాకు కావలసినప్పుడు కోరుకొందును లెమ్మని నీవు అంటివి. అప్పటినుండియు ఆవరములు అట్లే యున్నవి. ఈవృత్తాంత మంతయు నీవే నాకు చెప్పితివి. నీవు ఈవిషయమును మఱచినను నేను మఱువలేదు. ఆవరములను ఇప్పుడు ఆయనకు జ్ఞాపకము చేసి భరతుని పట్టాభిషేకమును రామునకు వనవాసమును కోరుకొనుము. రాముఁడు పదునాల్గుసంవత్సరములు వనములో నుండవలె. అప్పటికి ప్రజలు రాముని విస్మరించి భరతునియందు స్థిరమైన స్నేహము కలిగియుందురు. ఇది తప్ప ఇంక నీవు బాగుపడుటకు వేఱొక మార్గము లేదు. కావున నీభర్త వచ్చినప్పుడు అతఁడు చెప్పునట్టి మాయమాటలకు లొంగక ఎట్లైనను అతనిచేత శపథము చేయించి ఈరెండువరములను సంపాదింపుము''.

కైక మంథరయొక్క తెలివికి మిగుల సంతోషించి ప్రశంసించి తాను అలంకారములను తీసివైచి మలినవస్త్రమును ధరించి కోపగృహమున ప్రవేశించి నేలపై పరుండెను.

అమాత్యులను హెచ్చరించి, రామునకు కూడ మరల చెప్పి, ఇంక రేపు పట్టాభిషేకము ఎట్లైనను జరిగితీఱు నని నమ్మకము కుదిరినతరువాత దశరథునకు దిగులు తీఱిపోయెను. రామపట్టాభిషేకము జరిగినట్లే భావించుచు ఆయన పరమహర్షము నొందెను. అప్పటికి సాయంకాల మయ్యెను. ఇంక ఈశుభవార్తను కైకేయికి చెప్పవలయు నని బయలుదేరెను. అప్పుడైనను ఆయన కౌసల్యయొక్క అంతఃపురమునకు పోవలయు నని తలంపలేదు. ఆయన అప్పుడు కైకయంతఃపురమునకు పోక కౌసల్యగృహమునకు పోయినచో కైక తప్పక క్రుద్ధురాలగును. ఆమె ఆయనకు కామసంజీవనౌషధి. ఆమె పెడమొగమైనచో ఆయన భరింపలేఁడు. పట్టాభిషేకమునుగూర్చి తనకు ముందుగా చెప్పలేదని యిప్పటికే ఆమె కోపించియుండును. అందువలన ఎట్లైనను ఆమెను అనునయించి ప్రసన్నురాలినిగా చేసికోవలయు నని ఆయన ఆమెయొద్దకు బయలుదేరెను. తెల్లనిమేఘములచాటున, పైకి వచ్చుచున్నరాహువుతో కూడిన యాకాశమున నిశాకరుఁడు ప్రవేశించి నట్లు దశరథుఁడు ధవళకాంతివిరాజితమై ఉన్నతమై విశాలమైయున్న కైకేయీసౌధమునఁ బ్రవేశించెను. మహార్హమైన శయనమునందు ఆమె కన్పింపలేదు. కామబలసంయుక్తుఁడై రతిని కోరుచున్నయారాజు ఆమె క్రోధాగారమున ఉన్న దని తెలిసికొని అచ్చటికి పోయెను.

శ్లో॥ స కైకేయ్యా గృహం శ్రేష్ఠం ప్రవివేశ మహాయశాః॥ 11

శ్లో॥ పాండురాభ్ర మి వాకాశం రాహుయుక్తం నిశాకరః। 12

శ్లో॥ న దదర్శ ప్రియాం రాజా కైకేయీం శయనోత్తమే।

స కామబలసంయుక్తో రత్యర్థీ మనుజాధిపః॥ 17

అయోధ్యాకాండ-సర్గ-9

గ్రహస్థితి బాగుగా లేదని మరణమో మహాపదయో సంభవింప వచ్చునని మిగుల నిర్వేదముతో కుమారునకు చెప్పినతరువాత కొన్ని గంటలు కూడ గడువకముందే దశరథుఁడు కామబలసంయుక్తుఁడై రతిని కోరుచున్నాఁడన్నచో మనుష్యులపై మన్మథునకుఁ గల ప్రాభవ మెట్టిదో గ్రహింపవచ్చును. ఆసమయమున కొడుకు కోడలు ఉపవాసదీక్షతో కుశాస్తరణమున శయనింపనున్నారు. ఆస్థితిలో వృద్ధ రాజునకు కామావేశము కలుగుచున్నది! రాజులు సహజముగా భోగ పరులై యుందురు. ఒకానొక గొప్పకార్యమును పెద్దప్రయత్నముతో సాధించినప్పుడు మనుష్యునిచిత్తము హర్షప్రఫుల్ల మగును. వర్షము పడినంతనే భూమిలో మొక్కలు బయలుదేరునట్లు హర్షమువలన చిత్తమునందు కామము ప్రకోపించును. సత్త్వపరులయందే ఇది సహజ మైనప్పుడు కామపరాయణులవిషయమున చాలతీవ్రముగ విజృంభించు నని వేఱుగా చెప్ప నక్కఱ లేదు. తరువాత దశరథుఁడు కైకేయిని అనునయించునప్పుడు కూడ ఈచిత్తవృత్తియే వ్యక్త మగుచున్నది.

దశరథుని జూచియు కైక పలుకరింపక పెడ మొగమై దుఃఖింపఁ జొచ్చెను. ఆమెను జూచి దశరథుఁడు మిగుల ఆందోళనము నొంది ఎన్నో విధముల ఇట్లు అనునయించెను. "నేనుండఁగా నీకు ఇంత దుఃఖము ఎందులకు కలిగినది? నీకోరిక ఎట్టిదైనను తీర్తును చెప్పుము. నీక్రోధమునకు ఎవఁడైన గుఱియై యున్నాఁడా? చెప్పుము. వాఁడు అవధ్యుఁడైనను తత్క్షణమే వధింపఁబడును. నీదయకు పాత్రుఁడైన వానిని వధింపఁదగినవాని నైనను విడిపింతును. దరిద్రు నెవనినైన సంపన్నుని చేయు మందువా? లేక ధనాఢ్యు నెవని నైన దరిద్రుని జేయు మందువా? చెప్పుము. నీయభీష్టము తప్పక నెరవేర్తును."

శ్లో॥ కామీ కమలపత్రాక్షీ మువాచ వనితా మిదమ్ । 27

సర్గ - 9

శ్లో॥ అవధ్యో వధ్యతాం కో వా వధ్యః కో వా విముచ్యతామ్ ।
దరిద్రః కో భవ త్వాఢ్యో ద్రవ్యవా న్వా ప్యకించనః॥ 33

సర్గ-10

ఇట్లు పలుకుట దశరథునికామపరవశత్వమునకు తొందఱపాటునకు ప్రబలనిదర్శనము.విశ్వామిత్రునివిషయమున కూడ ఇట్లే ఈయన ముందుగా చాల ఉదారముగ మాటాడి, ఆయన రాముని పంపు మని యడిగినంతనే నిరాకరించినాఁడు. ఇప్పుడు కైకతో ఈయన చేయుచున్న ప్రసంగము కేవలము నీతిదూరము, ధర్మవిరుద్ధము. భార్యయొక్క ప్రీతికొఱకు, రాజే కాదు, సామాన్యపౌరుఁడైనను అవధ్యుఁడైన వానిని సంహరింపవచ్చునా లేక వధ్యుఁడైనవానిని విడిచిపెట్టవచ్చునా? ప్రజాపరిపాలన బాధ్యత కలిగినరాజు ఇట్లు మాటాడవచ్చునా? కైకేయి దశరథుని యీ కామపరవశత్వమును గుర్తించి తనవరములసంగతిని ప్రస్తావించి శపథము చేయు మనెను. ఆమె యింతగా పట్టుపట్టుచున్నప్పుడు ఆవరములు భయంకరము లగునేమో అని ఆయన యూహింపలేదు. ఆయన ఏవేవో ఒట్లు పెట్టుకొనెను. రామునిపై ఒట్టుపెట్టుకొని శపథము చేయు మని ఆమె నిర్బంధించెను. ఆయన తుదకు రామునిపై ఒట్టుపెట్టుకొని, "నీవరములను తప్పక ఒసంగుదు" నని ప్రతిజ్ఞ చేసెను.

శ్లో॥ తం మన్మథశరై ర్విద్ధం కామవేగవశానుగమ్ ।
ఉవాచ పృథివీపాలం కైకేయీ దారుణం వచః॥

సర్గ-11

అప్పుడు కైక దేవతలను సంబోధించి సాక్షులనుగా పేర్కొని పూర్వ వృత్తాంతమును చెప్పి భరతునకు పట్టాభిషేకము, రామునకు

పదునాల్గు సంవత్సరముల వనవాసమును వరములుగా కోరెను. ఆమాటలను విన్నంతనే దశరథుఁడు నిర్విణ్ణుఁ డయ్యెను; పులిని చూచినలేడివలె వణఁకిపోఁజొచ్చెను. అది పరిహాసము కాదు, కల కాదు, కేవలము ప్రత్యక్షసత్య మని నిశ్చయించు కొన్నతరువాత ఆయన క్రుద్ధుఁడై "ఓసీ! దుష్టురాలా! రాముఁడు నీ కేమి యపకారము చేసినాఁడు? ఇంత పాపమునకు నీ వేల పూనుకొంటివి?" అని యనేకవిధముల తిట్టెను. ఆమె ఏమియు మాటాడ లేదు. తరువాత ఆయన ఏడ్చుచు బతిమాలఁ జొచ్చెను. "రాముని చూడకున్నచో నాయందు చైతన్యము నశించును. సూర్యుఁడు లేకుండ లోకము, నీరు లేకుండ పంట నిలువవచ్చు నేమో కాని, రాముఁడు లేకున్నచో నాశరీరమున ప్రాణము నిలువదు. ఇదిగో నీపాదములకు నా తలను చేర్చి మ్రొక్కుచున్నాను. నన్ను అనుగ్రహింపుము. వృద్ధుఁడను జీవితముయొక్క ముగింపునకు వచ్చినవాఁడను. దీనముగా విలపించు చున్నాను. నాయందు నీవు కొంచెమైనను దయఁ జూపుము; నీకు దోసిలి యొగ్గుచున్నాను; నీపాదములకు మ్రొక్కుచున్నాను. రామునకు శరణమగుము. నాకు అధర్మము కలుగకుండునట్లు చేయుము.

శ్లో॥ అపశ్యత స్తు మే రామం నష్టా భవతి చేతనా। 12

శ్లో॥ తిష్ఠేత్ లోకో వినా సూర్యం సస్యం వా సలిలం వినా।
నతు రామం వినా దేహే తిష్ఠేత్తు మమ జీవితమ్॥ 13

శ్లో॥ అపి తే చరణౌ మూర్ధ్నా స్పృశా మ్యేష ప్రసీద మే। 15

శ్లో॥ మమ వృద్ధస్య కైకేయి గతాంతస్య తపస్వినః।
దీనం లాలప్యమానస్య కారుణ్యం కర్తు మర్హసి॥ 34

శ్లో॥ అంజలిం కుర్మి కైకేయి పాదౌ చాపి స్పృశామి తే।
శరణం భవ రామస్య మాధర్మో మా మిహ స్పృశేత్॥ 36

సర్గ - 12

ఆయన ఆమెపాదములపైఁ బడగా ఆమె దూరముగా జరిగెను. ఆయన ఎంతగా బతిమాలుచుండెనో అంతగా ఆమెకు కోపము పెరుగఁ జొచ్చెను. తన్ను తనకుమారుని అణగఁద్రొక్కుటకే దశరథుఁడు రామ పట్టాభిషేకమును ఎవరికి చెప్పకుండ అవ్యవధిగా ఏర్పఱచె నని యామె నిశ్చయించుకొని మిగుల ఘోరముగా "ఇది అధర్మము కానీ ధర్మము కానీ, సత్యము కానీ అసత్యము కానీ—— ఈవిచారణతో నాకు పని లేదు నీవు నాకు వరము లిత్తు నని శపథము చేసితివి. దానికి తిరుగు లేదు. ఏ కారణముచేత నైనను రామునకు అభిషేకము జరుగుట సంభవించినచో నీయెదుటనే నీవు చూచుచుండఁగనే పుష్కలముగా విషమును త్రాగి చచ్చెదను" అని పలికెను.

శ్లో॥ భవ త్వధర్మో ధర్మో వా సత్యం వా యది వానృతమ్।
య త్త్వయా సంశ్రుతం మహ్యం తస్య నాస్తి వ్యతిక్రమః॥46

శ్లో॥ అహం హి విష మద్యైవ పీత్వా బహు తవాగ్రతః।
పశ్యత స్తే మరిష్యామి రామో య ద్యభిషిచ్యతే॥ 47

సర్గ. 12

ఇంక ఆమెను బతిమాలి ప్రయోజనము లే దని నిశ్చయించుకొని దశరథుఁడు దుఃఖపరవశుఁడై విలపింపఁజొచ్చెను. "అయ్యో! ఇది యేమి ఘోరము! తండ్రిని నేను బ్రతికియుండఁగనే నాకొడుకు దిక్కు లేనివాఁ డగుచున్నాఁడు. వానికి ఈ యపాయము ఎట్లు తప్పును? వాఁడు నామాటకు భిన్నముగా రెండవమాట చెప్పనే చెప్పఁడు. అడవికి పొమ్మన్నచో అట్లే అని వాఁడు వెంటనే అంగీకరించును. వనమునకు

పొమ్మన్నప్పుడు వాఁడు ప్రతికూలముగా వర్తించు నేని అది నాకు ఎంతో ప్రియము కాఁగలదు. కాని వాఁ డట్లు చేయఁడు." అని విల పించుచు ఆయన కైకేయివంకఁ జూచి యిట్లనెను. "ఓసీ! దురాత్మురాలా! నీవు కోరిన యీ రామునివనవాసము భరతునకు ఇష్టము కా దను కొందును. ఒకవేళ భరతునకు ఇది ప్రియమే యగుచో నేను చని పోయినతరువాత వాఁడు నాకు ప్రేతకృత్యములు చేయ నక్కఱ లేదు. పురుషోత్తముఁడైన రాముఁడు అడవిపాలై నేను మృత్యువుపాలైన తరువాత విధవరాలవై పుత్రుని పురస్కరించుకొని రాజ్యము చేయు దువు! ఛీ! స్త్రీ లన్ననే శఠాత్మికలు, సదా స్వార్థపరాయణలు. కాదు కాదు; స్త్రీ లందఱనుగూర్చి నే ననుట లేదు; భరతునితల్లి నిగూర్చియే చెప్పుచున్నాను."

శ్లో॥ నాలం ద్వితీయం వచనం పుత్త్రో మాం ప్రతిభాషితుమ్ ।
స వనం ప్రవ్రజే త్యుక్తో, బాఢ మిత్యేవ వక్ష్యతి॥ 85

శ్లో॥ యదిమే రాఘవః కుర్యా ద్వనం గచ్ఛేతి చోదితః ।
ప్రతికూలం, ప్రియం మే స్యాత్; న తు వత్సః కరిష్యతి॥86

శ్లో॥ ప్రియం చేత్ భరత స్యైత ద్రామప్రవ్రాజనం భవేత్।
మా స్మ మే భరతః కార్షీత్ ప్రేతకృత్యం గతాయుషః॥ 92

శ్లో॥ మృతే మయి గతే రామే వనం పురుషపుంగవే।
సేదానీం విధవా రాజ్యం సపుత్రా కారయిష్యసి॥ 93

శ్లో॥ ధి గస్తు యోషితో నామ శఠా స్స్వార్థపరా స్సదా ।
న బ్రవీమి స్త్రియ స్సర్వాః; భరత స్యైవ మాతరమ్॥ 100

## సర్గ. 12

కైక యీవిలాపమును విని, "సత్యవాది నని లోకమున ప్రక టించుకొనుచు నాకు ఇచ్చినవరములను తప్పించుటకు ఏల యింతగా

విలపించుచు నిందింతువు? ఇచ్చినమాటను నిలుపుకొనుము" అని పలికెను. దశరథుఁడు మరల ఆమెను నిందించుచు విలపింపఁజొచ్చెను. ఆయనకు క్రమముగా మతికూడ భ్రమింపఁజొచ్చెను. వా రట్లు ఘర్షణ పడుచుండఁగా సూర్యుఁ డస్తమించెను. రాత్రి వచ్చెను. చంద్రమండలము చేత ఎంతో శోభించుచున్న యా రాత్రి ఆయనకు భాసింపనే లేదు. అట్లే ఆయన వేడిగా నిట్టూర్చుచు ఆకాశమునందు చూపు నిలిపి దీనముగా నిట్లు విలపించెను. "నక్షత్రములచేత భూషితురాలవై యున్న యో రాత్రీ! తెల్లవాఱకుము. దేవీ! నాయందు దయను చూపుము. ఇదిగో నీకు దోసిలియొగ్గుచున్నాను. వద్దులే, వేగముగా వెడలిపొమ్ము. నాకు ఇంత దుఃఖమును కలిగించిన యీ నృశంసురాలిని చూచుచుండుటయైన తప్పును". తెల్లవాఱినచో కైకముఖమును చూడకుండ ఆమెగృహము నుండి తనభవమునకు పోవచ్చు నని ఆయనయభిప్రాయము.

శ్లో॥ తథా విలపత స్తస్య పరిభ్రమితచేతసః ।
అస్త మభ్యాగమ త్సూర్యో రజనీ చాభ్యవ ర్తత॥ 14

శ్లో॥ సా త్రియమా తథా ర్తస్య చంద్రమండలమండితా॥ 15

శ్లో॥ రాజ్ఞో విలపమానస్య న వ్యభ్యాసత శర్వరీ ।
తథైవోష్ణం వినిశ్శ్వస్య వృద్ధో దశరథో నృపః॥ 16

శ్లో॥ విలలా పా ర్తవత్ దుఃఖం గగనాస క్తలోచనః ।
న ప్రభాతం త్వ యేచ్ఛామి నిశే నక్షత్రభూషితే॥ 17

శ్లో॥ క్రియతాం మే దయా భద్రే మయాయం రచితోఽఞ్జలిః ।
అథ వా గమ్యతాం శీఘ్రం నాహ మిచ్ఛామి నిర్ఘృణామ్॥ 18

శ్లో॥ నృశంసాం కైకయీం ద్రష్టుం యత్కృతే వ్యసనం మహత్॥ 19

సర్గ. 13

తరువాత మరల కొంతసేపటికి దశరథుఁడు కైకను బతిమాలఁ జొచ్చెను. ఆమె ఏమియు చలింపలేదు. ఆయన క్రుద్ధుఁడై ఇట్లు శపించెను. "నీవు నాకు భార్య వయ్యును ఘోరశత్రువువలె వర్తించు చున్నావు. అగ్నిసమక్షమున వివాహమునందు మంత్రపూర్వకముగా గైకొన్న నీ పాణిని, నావలన నీయందు కలిగినపుత్రునితో కూడ, వదలివేయుచున్నాను. రాముని యభిషేకముకొఱకు సమకూర్పఁబడిన సంభారములతో మృతుఁడనైన నాకు రాముఁడే ఉదకప్రదానము చేయును గాక! రాముని యభిషేకమును నీవు విఘ్నమొనర్చినచో నీవు నాకు భార్యవు కాదు; భరతుఁడు పుత్రుఁడును కాదు. మీ రిరువురు నాకు ఉదకప్రదానము చేయ నక్కఱ లేదు." ఈవిధముగా ఆమహారాజు విల పించుచుండఁగా చంద్రనక్షత్రమాలినియైన రాత్రి తెల్లవాఱెను.

శ్లో॥ య స్తే మంత్రకృతః పాణి రగ్నౌ పాపే! మయా ధృతః।
తం త్యజామి స్వజం చైవ తవ పుత్రం సహ త్వయా॥ 14

శ్లో॥ రామాభిషేకసంభారై స్తదర్థ ముపకల్పితైః।
రామః కారయితవ్యో మే మృతస్య సలిలక్రియామ్॥ 16

శ్లో॥ సపుత్రయా త్వయా నైవ కర్తవ్యా సలిలక్రియా ।
వ్యాహంతా స్యశుభాచారే యది రామాభిషేచనమ్॥ 17

శ్లో॥ తాం తథా బ్రువత స్తస్య భూమిపస్య మహాత్మనః ।
ప్రభాతా శర్వరీ పుణ్యా చంద్రనక్షత్రమాలినీ॥ 19

## సర్గ. 14

దశరథుఁడు రాత్రిని ప్రార్థించినట్లుగా వాల్మీకి గావించిన వర్ణనము హృదయమును ద్రవింపఁ జేయునదిగా నున్నది. మానవుల సుఖ దుఃఖములతో ప్రకృతిని సంగత మొనర్చి వర్ణించుట మహాకవులే చేయఁగలరు.

తెల్లవాఱుచుండఁగా కైక, "నాకుమారుని రాజ్యాధికారమునందు నిలిపి, రాముని వనేచరుని గావించి, నాకు ఎదురులేనట్లుగా చేసిననే నీవు కృతకృత్యుఁడవు కాఁగలవు" అని దశరథుని గట్టిగా హెచ్చరించెను. దశరథునకు ఇంక కైకతో వాదించుటకు శక్తి లేక, "ధర్మబంధముచేత బద్ధుఁడనై యున్నాను. నాప్రజ్ఞ నశించినది, జ్యేష్ఠపుత్రుఁడు ధార్మికుఁడు ప్రియుఁడు నైనరాముని చూడఁగోరుచున్నాను" అని పలికెను.

శ్లో॥ ధర్మబంధేన బద్ధోఽస్మి నష్టా చ మమ చేతనా ।
జ్యేష్ఠం పుత్రం ప్రియం రామం ద్రష్టు మిచ్ఛామి ధార్మికమ్॥24
సర్గ. 14

దశరథుఁడు "ధర్మబంధముచేత బద్ధుఁడనై యున్నాను" అని కైకకు ఇచ్చినవరములను ఉద్దేశించి నిశ్చయించుకొనుట గమనింపఁదగియున్నది. కాని క్రిందటిదినము నిండుసభలో మహాజనసమక్షమున రామునకు యౌవరాజ్యపట్టాభిషేకము చేయుదు నని చెప్పినమాట ఏమి కావలె? కైకవరములకొఱకై దానిని కాదన్నచో అది అనృతము కాదా? సభలో ఆయన తనయభిప్రాయమును ప్రకటించెను. అప్పుడు సభ్యులు గాని రాముఁడు గాని యౌవరాజ్యమును యాచింపలేదు; దశరథుఁడు వాగ్దానము కూడ చేయలేదు. ఆయనయభిప్రాయమే తమయభిప్రాయమని తాము అదే కోరుచున్నామని వారు కూడ రామపట్టాభిషేకమును ఆమోదించిరి. మఱి కైకేయి కిచ్చినవరములసంగతి యట్టిది కాదు. ఆమెకు వివాహకాలముననే దశరథుఁడు రాజ్యమును ఋణపడియున్నాఁడు; సంగ్రామసమయమున ప్రాణములే ఋణపడియున్నాఁడు. అదియును గాక రామునిపై ఒట్టుపెట్టుకొని, ఆమెకు వరముల నిత్తునని శపథము చేసినాఁడు. ఈ మూఁడుకారణములచేత సభలో సభ్యులతో చెప్పినమాటకన్న కైక కిచ్చినమాట బలవత్తరమైన ధర్మమై ఆయనను బంధించినది.

ఇచ్చినమాటను తప్పించుటకై దశరథుఁడు ఇంతదూరము కైకను నిందించుటలో సామంజస్యము లేదు. వివాహకాలమునందలి శుల్కముచేత; యుద్ధకాలమునందలి వరములచేత; ఇప్పుడిచ్చినమాట చేత దశరథుఁడు వెంటనే అంగీకరించియుండవచ్చును. భరతుని కేకయ రాజును యుధాజిత్తును పిలిపించియుండవచ్చు; అట్లు చేయకుండుట ఆతనిదౌర్బల్యమును వ్యక్త మొనర్చుచున్నది. రామాభిషేకభంగము వలన రామవియోగభావనవలన కలిగిన దుఃఖముతో ఆయన ఏమియు ఆలోచింపలేక పోయెను. ఆయన ధర్మమార్గము నవలంబించి మామ గారిని, బావమఱదిని, భరతుని జనకుని పిలిపించి సకలసామంతరాజుల సమక్షమున ఈవిషయమును చర్చకు పెట్టినచో ప్రజాభిప్రాయమును గమనించి యందఱును రామాభిషేకమునే నిశ్చయించి యుండెడివారు. అప్పుడు మంథరోపదేశము గాని కైకయొక్క దుర్బుద్ధి గాని ఫలించు టకు అవకాశమే యుండెడిది కాదు. దశరథుఁడు ధర్మమును వదలి తనబుద్ధినే అవలంబించి రామునకు ఉపకారము చేయఁబోయి అపకార మునే గావించెను. ఏ సందర్భమునందైనను, ధర్మమే శ్రేయస్కరము కాని, స్వార్థబుద్ధికృతమైన ఉపాయము శ్రేయస్కరము కాదు. భర్తకు ప్రతికూలముగా ఇంత పట్టుపట్టులు కైకయొక్క అధికారకాంక్షకు నిదర్శ నము. ఆ కాంక్షచే ఆమెకు తన కుమారునిస్వభావము కూడ తోఁచలేదు. వైధవ్యమున కైన అంగీకరించినది కాని అధికారకాంక్షను వదలు కొనుటకు అమె ఇష్టపడ లేదు. ఇది కులస్త్రీలకు అత్యంతము అను చితము. ఇది యుత్కటమైన పాప మగుటచే భరతునియొక్క తిర స్కార రూపమున వెంటనే యామెకు ఆపాపఫలము అనుభవమునకు వచ్చినది. వైధవ్యము, లోకనింద, పుత్రతిరస్కారముతోపాటు ఆమె శాశ్వతమగు అపకీర్తిని కూడ పొందినది.

## 3. పితృవాక్యపాలన ఘట్టము

వసిష్ఠుఁడు సంభారములతో ఋషులతో, ఆశ్రమమునుండి వచ్చి రాచనగరు చేరి రాజునొద్దకు సుమంత్రుని పంపెను. సుమంత్రునిస్తోత్ర పాఠము విని రాజు "నీమాటలచేత నీవు నామర్మములను భేదించు చున్నావు" అని పలికెను. ఆమాట విని సుమంత్రుఁడు వెనుకకు తగ్గెను. కైక; "రాజునకు రామునియొక్క యభ్యుదయమునుగూర్చి భావించుట వలన కలిగినహర్షముచేత రాత్రి యంతయు నిద్ర లేదు. పోయి రాముని పిలుచుకొని రమ్ము" అని సుమంత్రునితో చెప్పెను. "అమ్మా! రా జేమియు చెప్ప లేదు. ఆయనమాట లేకుండ నే నెట్లు పోవుదును" అని సుమంత్రుఁ డనెను. దశరథుఁడు కూడ, "రామునిఁ జూడఁగోరు చున్నాను" అని చెప్పినతరువాత సుమంత్రుఁడు అక్కడనుండి బయలు దేరెను. అతనిని ద్వారమునందు సామంతరాజులు. "మారాకను మహా రాజునకు ఎవరు నివేదింతురు." అని యడిగిరి. సుమంత్రుఁడు మరల లోనికి పోయి తెరవెలుపల నిలిచి రాజును స్తుతించి, "మహారాజా! మేల్కొనుము. బ్రాహ్మణులు బలాధిపతులు సామంతరాజులు వచ్చి నీ దర్శనమును కోరుచున్నారు" అని పలికెను. రాజు కోపముతో, "రాముని తీసికొని ర మ్మని నేను చెప్పఁగా, నాయాజ్ఞ నేల జరుపలేదు? నేను నిద్రించుట లేదు. వెంటనే రాముఁ నిక్కడికి తీసికొని రమ్ము" అని పలికెను.

శ్లో॥ రామ మానయ సూతేతి యద స్యభిహితో మయా ।
కి మిదం కారణం యేన మమాజ్ఞా ప్రతివాహ్యతే ।
న చైవ సంప్రసుప్తోఽహ మాన యే హాశు రాఘవమ్॥ 26
సర్గ. 15

సుమంత్రుఁడు రామునియొద్దకు పోయి, "కైకేయియొద్దనున్న మీ తండ్రి నిన్ను చూడఁగోరుచున్నాఁడు. అచ్చటికి త్వరగా రమ్ము"

అని చెప్పెను. ఆమాట విన్నంతనే సీత కీడును శంకింపఁజొచ్చెను. తనయభిషేకమును గూర్చియే మాతాపితరులు ఏదో విషయమును చర్చించుచు తన్ను పిలిపించుచున్నా రని రాముఁడు సీతకు నచ్చఁజెప్పి బయలుదేఱెను. అయినను సీతకు సంశయనివృత్తి కాలేదు. అందువలన ఆమె ఆపన్నివారణకై రామునకు మంగళాశాసనము కావించుచు సాగ నంపెను. సుమంత్రునిమాట విన్నంతనే సీత కైకనుగూర్చి వెంటనే ఆలోచించియుండును. అంత మహోత్సవము జరుగుచున్నప్పుడు తన కుమారుని పిలిపింపకుండుటను కైక సహించునా? అసలు తన కోడలు రాణి కాకుండ కౌసల్యకోడలు రాణి యగుటను ఆమె భరించునా? ఈ విధముగా సీత యూహించి యుండవచ్చును. కాని రాముఁడు ఎవరిని శంకింపలేదు. దోషము ప్రత్యక్షమగు వఱకును ఎవరినిగూర్చి యైనను తప్పుగా తలంపకుండుట రాముని యౌదార్యమునకు ఒక లక్షణము.

అలంకృతుఁడైన రాముఁడు లక్ష్మణునితో కూడ రథము నధిరోహించి బయలుదేరెను దారిపొడవునను పౌరులు స్త్రీలు గుంపులు గుంపులుగా చేరి రాముని చూచుచు ప్రశంసింపఁజొచ్చిరి. రాముఁడు దృష్టిపథమును అతిక్రమించి పోయినను ఆపురుషపుంగవునుండి దృష్టిని గాని మనస్సును గాని ఎవరును మరలించుకొనలేకుండిరి. ఎవఁడు రాముని చూడలేదో, ఎవనిని రాముఁడు చూడలేదో వాఁడు లోకము నందు నిందితుఁ డగుచున్నాఁడు; ఇతరులు నిందించుట కాదు; వాని మనస్సే వానిని నిందించును.

శ్లో॥ న హి తస్మా న్మనః కశ్చి చ్చక్షుషీ వా నరోత్తమాత్।
నర శ్శక్నో త్యపాక్రష్టు మతిక్రాంతేఽపి రాఘవే॥ 13

శ్లో॥ య శ్చ రామం న పశ్యే త్తు యం చ రామో న పశ్యతి।
నిందిత స్స వసే ల్లోకే స్వాత్మా ప్యేనం విగర్హతే॥ 14

సర్గ. 17

ప్రజ లందఱు రాముని ఎంత ప్రేమించుచున్నారో, ఆయన రూపము ఎంత మనోహరమో ఈవర్ణనముచేత వాల్మీకి అద్భుతముగా వ్యక్త మొనర్చినాఁడు. ఆ శ్రీరామచంద్రునిసౌందర్యము ఎట్టిదో వాల్మీకిరచనాసౌందర్యము కూడ అట్టిదే.

రాముఁడు లక్ష్మణునితో కైకేయియంతఃపురములోనికి పోయి తండ్రికి తల్లికి నమస్కరించెను. దశరథుఁడు "రామా!" అని కన్నుల నుండి అశ్రువులు జాఱుచుండగా కుమారుని చూచుటకుఁ గాని మాటాడుటకుఁ గాని అశక్తుఁ డయ్యెను. తండ్రియొక్క రూపము భయమును కలిగించుచు అపూర్వముగ నుండుటఁ జూచి రాముఁడు చీఁకటిలో పామును త్రొక్కినట్లుగా ఉలికిపడెను. "తండ్రి యిట్లేల యున్నాఁడు? కుపితుఁడైనను నన్ను చూచినంతనే ప్రసన్నుఁ డగునే; ఏ మైనది?" అని రాముఁడు కలఁత నొందుచు కైకను చూచి "అమ్మా! నే నే మైన తప్పు చేసితినా ? అది యేమో చెప్పుము. ఎట్లైనను నీవే ఈయన నాయందు ప్రసన్నుఁడగునట్లు చేయుము. లేదా ఈయనకే మైన బాధ కలిగినదా? భరతశత్రుఘ్నులనుండి వార్త ఏమేని వచ్చినదా? అంతఃపురములో ఎవరికైన అశుభము కలిగినదా? ఏ మైనను నే నుండఁగా తండ్రికి దుఃఖ మేమి? తండ్రిని సంతోషపెట్టకుండ, ఆయన మాటను జరుపకుండ ఆయనకు కోపమును కలిగించుచు క్షణమైనను నేను జీవింప నుత్సహింపను. ఎవనిమూలమున మానవుఁడు తనశరీరమును బుద్ధిని పొందుచున్నాఁడో అట్టిదేవుఁడు తండ్రిరూపమున ప్రత్యక్షమైయుండఁగా ఆ దేవునియెడ భక్తితో నెవఁడు వర్తింపకుండును?" అని పలికెను.

శ్లో॥ అతోషయన్ మహారాజ మకుర్వ న్వా పితు ర్వచః।
ముహూర్త మపి నేచ్ఛేయం జీవితుం కుపితే నృపే॥ 15

శ్లో॥ యతో మూలం నరః పశ్యే త్ప్రాదుర్భావ మిహాత్మనః।
కథం తస్మిన్ న వర్తేత ప్రత్యక్షే సతి దైవతే॥ 16

## సర్గ-18

"మాతృదేవో భవ" అను మొదలగు వాక్యములలో వేదముచేత పూజార్హులుగా పేర్కొనఁబడిన తల్లి తండ్రి ఆచార్యుఁడు అతిథి అను వారు ప్రతిమానవునకు ప్రత్యక్షదేవతలు. వీరిలో కూడ ఎవరివలన మనకు శరీరములు కలిగినవో అట్టి తల్లిదండ్రులు పరమపూజనీయులు. నారాయణవల్లి మొదలగువానిలో ప్రతిపాదింపఁబడిన విష్ణువు మొదలగువారు పరోక్షదేవతలు. శిక్షావల్లిలో ధర్మానుశాసనమునందు ముందుగా "దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్" అని చెప్పిన తరువాత "మాతృదేవో భవ" అను మొదలగు విధివాక్యములు చెప్పఁబడియున్నవి. యజ్ఞాదికములు దేవకార్యములు. శ్రాద్ధాదికములు పిత్రా కార్యములు. వీనిని సరియైన సమయమునందు అనుష్ఠింపకుండుటయే ప్రమాదము. కావున వీనిని ఆయాకాలములో మఱపు లేకుండ అనుష్ఠింపవలె. దేవతలవిషయమున పితరులవిషయమున కార్యములసంగతి మాత్రమే హెచ్చరింపఁబడినది. తల్లిదండ్రులవిషయమున వారు దేవత లనియే విధింపఁబడినది. ఈ రెండింటికిని భేదము గ్రహింపవలసియున్నది. పుత్రికను అత్తవారింటికి పంపునప్పుడు "అమ్మా! నీవు అత్తగారు చెప్పినపనులు మామగారు చెప్పినపనులు మొదలగువానియందు ఏమఱుపాటు లేక చేయుచుండుము. భర్త యన్ననో నీకు దేవుఁడే" అని యుపదేశింతురు. అత్తగారికి మామగారికి కొన్ని సమయములలో కొన్ని సేవలను చేసినచో కోడలికి ఆ బాధ్యత అంతటితో తీఱిపోవును. భర్త విషయము అట్టిది కాదు. ఆయన ఎప్పుడు ఏవిషయమును చెప్పినను, తక్కినకార్యములను ఆవలకునెట్టి, వెంటనే చేయవలయును. పతిసేవ భార్యకు ప్రథమకర్తవ్యము **(First Duty)**;

తక్కిన విధు లన్నియు అనంతరకర్తవ్యములు (Secondary Duties). మహాభారతములో అరణ్యపర్వమునందు కౌశికునికథలో ఒక పతివ్రత అతిథియైన కౌశికుని లెక్కపెట్టక ముందుగా భర్తసేవను గావించి తరువాత కౌశికునకు భిక్షమును పెట్టెను. అట్లే ధర్మవ్యాధుఁడు తల్లిదండ్రులను ముందు సేవించి తరువాత భూదేవుఁడైన కౌశికునిపనిని నెఱవేర్చెను. కావున పుత్రునకు తల్లిదండ్రులసేవ ప్రథమకర్తవ్యము; తక్కిన యజ్ఞాదికార్యములు అనంతరకర్తవ్యము లగును. "తండ్రిని సంతోషపెట్టకుండ, ఆయన చెప్పినమాటను జరుపకుండ క్షణమైనను జీవింప నుత్సహింప" నని రాముఁడు చెప్పుటవలన పురుషునకు మాతాపితృసేవ ప్రథమకర్తవ్య మని, యజ్ఞములు గురుసేవ అతిథిసేవ ప్రజాసేవ మొదలగునవి యన్నియు అనంతరకృత్యములు (Secondary Duties) అనియు స్పష్టముగా గ్రహింపవలసి యున్నది.

రాముఁ డిట్లు చెప్పినతరువాత కైక సిగ్గును పూర్తిగా వదలి తనకు హిత మనుకొనుచున్న స్వార్థమును ఇట్లు ప్రగల్భముగా వచించెను.

శ్లో॥ ఏవ ముక్తా తు కైకేయీ రాఘవేణ మహాత్మనా।
ఉవా చేదం సునిర్లజ్జా ధృష్ట మాత్మహితం వచః॥ 19

సర్గ-18

"ఆయనకు కోపము లేదు. బాధయును లేదు. ఆయన మానసికముగా వ్యథను పొందుచున్నాఁడు. నాకు వరము లొసంగి ప్రాకృతునివలె పశ్చాత్తాపపడుచున్నాఁడు. అప్రియము లగు నని నీకు ఆ వరములను గూర్చి చెప్పలేకున్నాఁడు. ఆయనమాటను నీవు తప్పక నెఱవేర్చువాఁడ వగుచో నేనే చెప్పెదను." రాముఁడు ఆమాటలకు చాల వ్యథనొంది ఇట్లనెను. "అహో! ఛీ! ఏమమ్మా యిది! నీవు నన్నుగూర్చి

యిట్లు అనఁదగవు. నాస్వభావము నెఱుంగవా! తండ్రి ఒకమాట చెప్పి నచో అగ్నియందైనను దుముకుదును కదా! ఆయనకు ఏది అభి కాంక్షితమో ఆమాటను చెప్పుము; చేయుదును; ప్రతిజ్ఞ కూడ చేయు చున్నాను. రాముఁడు రెండుసార్లు చెప్పఁడు"

శ్లో॥ అహో! ధిక్! నార్హసే దేవి వక్తుం మా మీదృశం వచః।
అహం హి వచనా ద్రాజ్ఞః పతేయ మపి పావకే॥ 28

శ్లో॥ త ద్బ్రూహి వచనం దేవి రాజ్ఞో య దభికాంక్షితమ్।
కరిష్యే; ప్రతిజానే చ; రామో ద్వి ర్నాభిభాషతే॥ 30

తి. టీక:- రామో ద్వి రితి:— య దుక్తం త దుక్త మేవ; త ద్విరుద్ధం పున ర్న వదతి ఇత్యర్థః

"రాముఁడు రెండుసార్లు చెప్పఁడు" (రామో ద్వి ర్నాభిభాషతే) అనుమాటకు ఏమి యర్థము? దీనిని రెండువిధముల గ్రహింపవచ్చును. ఇతరులు సాయము కోరినపుడు కొందఱు మొదట ఉదారముగా "దాని కేమున్నది! తప్పక అట్లే చేయుదును" అని చెప్పి వెంటనే మరల ఆలోచించి "అంత కాదు గాని ఏదో కొంత చేయుదును లె" మ్మని మొదటిమాటకు భిన్నముగా రెండవసారి చెప్పుచుందురు. దశరథుఁడు విశ్వామిత్రునకు కైకకును చెప్పినమాటలే యిందులకు మంచి నిదర్శ నము. రాముఁడు ఆరీతిగా రెండు విధములుగా రెండుసార్లు చెప్పఁడు. ఇది ఆవాక్యమునకు మొదటియర్థము.

కొందఱు ఒకపని చేయవలసివచ్చినప్పుడు" సరే! నేను ఈ పనిని చేయుదును" అని చెప్పి మరల కొంతసేపైన తరువాత ఎదుటి వానికి నమ్మకము కలిగించుట కొఱకై, "నీవు ఏమియు సంశయింప వలదు. నేను తప్పక చేయుదును" అని చెప్పుచుందురు. మఱికొందఱు

ఒట్లుపెట్టుకొని శపథముల చేయుచుందురు. కాని సత్యవ్రతపరాయణులు ఏవిషయము నైనను ముందుగా చక్కగా ఆలోచించి మితముగా మాటాడుదురు. వారు ఏదేని ఒకమాటను చెప్పినచో దానిని తప్పక నిర్వహింతురు. అందువలన తమమాటలలో తొందఱపాటున తాము నిర్వహింపలేనిదానిని చెప్పుట దొరలునేమో అని జాగరూకతతో తాము సత్యముగా నిర్వహింపగలిగినదానినే మితముగా మాటాడు చుందురు (సత్యాయ మితభాషిణామ్). ఇట్టివారు ఒకసారి ఒకమాటను చెప్పినచో అది జరిగినట్లే. ఇంక రెండవసారి చెప్పవలసినపనిలేదు. ఒకమాటను ఒకసారి మనము చెప్పినతరువాత మరల ఆమాటనే రెండవసారి చెప్పినచో మొదటిసారి చెప్పినదానికి విలువ ఏమున్నది? అందువలన మహాత్ములు ఒకవాక్యమును రెండుసార్లు చెప్పరు.

రాముఁ డిట్లు చెప్పినతరువాత కైక తనవరములను చెప్పెను. రాముఁ డా వరములను విని, అవి లోకదృష్టిలో చావువార్తలవంటివే యైనను, ఏమియు వ్యథ నొందక, ఆమెతో ఇట్లనెను. "సరే! తండ్రి యొక్క ప్రతిజ్ఞను పాలించుచు జటాచీరధరుఁడనై వనములందు నివ సించుటకు పోవుదును. కాని భరతునియొక్క అభిషేచనమునుగూర్చి ఆయన నాతో ఒక్కమాట యైన ఏల చెప్ప లే దన్నవిషయము నా హృదయమును దహించుచున్నది. ఆయన నన్ను ప్రచోదనము చేయ నక్కఱ లేదు. ఆయన తనయభిప్రాయమును సూచించినచో చాలును. ఆయనప్రీతికొఱకు నేను సంతోషముతో సంపదలను రాజ్యమును, ప్రాణములనే కాదు, సీత నైనను భరతునకు ఇచ్చియుందును. ఇంక నీప్రియముకొఱకు తండ్రిగావించిన ప్రతిజ్ఞను నిర్వహింతు నని చెప్ప వలసిన దే మున్నది?"

శ్లో॥ త దప్రియ మమిత్రఘ్నో వచనం మరణోపమమ్ ।
శ్రుత్వా న వివ్యధే రామః, కైకేయీం చేద మబ్రవీత్॥ 1

శ్లో॥ ఏవ మస్తు; గమిష్యామి వనం వస్తు మహం త్వితః।
జటాచీరధరో రాజ్ఞః ప్రతిజ్ఞా మనుపాలయన్॥ 2

శ్లో॥ అలీకం మానసం త్వేకం హృదయం దహ తీవ మే।
స్వయం య న్నాహ మాం రాజా భరత స్యాభిషేచనమ్॥ 6

శ్లో॥ అహం హి సీతాం రాజ్యం చ ప్రాణా నిష్టాన్ ధనాని చ।
హృష్టో భ్రాత్రే స్వయం దద్యామ్ భరతా యాప్రచోదితః॥ 7

శ్లో॥ కిం పున ర్మనుజేంద్రేణ స్వయం పిత్రా ప్రచోదితః।
తవ చ ప్రియకామార్థం ప్రతిజ్ఞా మనుపాలయన్॥ 8

సర్గ. 19

తి. టీక:- మరణోపమమ్ లోకదృష్ట్యా

గో. టీక:- సీతామ్ - ధనుర్భంగకాలే ఇత్యర్థః।

రాముఁడు సీత నైనను భరతునకు ఇచ్చియుందు నని చెప్పుట యేమి? ధనుర్భంగము జరిగినతరువాత వివాహమునకు పూర్వమే దశరథుఁడు, ఏకారణముచేత నైనను "సీతను భరతునకు ఇమ్ము" అని చెప్పియున్నచో అట్లే ఇచ్చియుందు నని రామునియభిప్రాయము.

ఆమాటలు విని కైక సంతోషించెను. అప్పుడు రాముఁడు, "మాతులగృహమునుండి భరతుని గొనివచ్చుటకై శీఘ్రజవము గల గుఱ్ఱములపై దూతలను రాజాజ్ఞతో పంపవలె" అనెను. భరతునకు పట్టాభిషేకము చేయవలయు ననునిర్ణయము జరిగినతరువాత ఇంక అతఁడు దూరదేశమం దుండుట తగదు. పట్టాభిషేకమును ప్రకటించిన తరువాత తనకుఁ గాకున్నను, భరతున కైనను వెంటనే పట్టాభిషేకము చేసినచో, మహోత్సవమునకై కుతూహలముతో కూడియున్న పౌర

లకు సామంతులకు కొంత తృప్తి కలుగు నని రామునియభిప్రాయము. కైక అట్లు గ్రహింపలేదు. భరతుఁడు వచ్చువఱకు రాముఁడు అయోధ్య లోనే యున్నచో, ఆతనియందు అమితమైన ప్రీతిని గలిగియున్న ప్రజలకు ఆతనియందు సానుభూతి భరతునియందు వైమనస్యము పెరుగుట సహజము. భరతునకు కూడ ప్రజలయావేశమును తండ్రిదుఃఖమును చూచినతరువాత రాజ్యమునందు నిర్ఘాశ ఏర్పడవచ్చును. రాముని ముందుగా అడవికి పంపినచో దశరథునకు ప్రజలకు ఆవేశము తగ్గును. అప్పుడు నెమ్మదిగా భరతుఁడు వచ్చినచో, ఆతఁడును రాజకుమారుఁడే రాజ్యమునకు వారసుఁడే, అని ఆతనిపట్టాభిషేకమునకు ఎల్లరును సమ్మతింతురు. భరతుఁడు దూరదేశమం దున్నప్పుడే రామునిపట్టాభిషేకమునకు తగినసమయ మని దశరథుఁడు ఎట్లు తలంచెనో, కైకేయి కూడ అట్లే, రాముఁడు అయోధ్యకు దూరమైననే తప్ప భరతునిపట్టాభిషేకమునకు సరియైన సమయము ఏర్పడ దని నిశ్చయించెను. ఇరువురకును రాజనీతి సమానమే.

అందువలన కైక ఇట్లనెను. "సరే! అట్లే చేయుదము. వడిగల గుఱ్ఱములపై మాతులగృహమునుండి భరతుని తీసికొనివచ్చుటకు దూతలు పోఁగలరు. దాని కేమి? కాని వానివిషయమున ఉత్సుకత్వముతో నీవు ఇచ్చట ఆలస్యము చేయుట తగదు. ఇక్కడనుండి వెంటనే నీవు వనమునకు పోవలె. ఈవిపర్యయమునకు ఈయన సిగ్గుపడుచున్నాఁడు. కావున ఈయన నీకు స్వయముగా చెప్ప లే దని సంశయింపకుము. ఇది ముఖ్య విషయము కాదు. ఎట్లైనను ఈక్షణముననే ఈయన నాకు ఇచ్చిన మాటను నెఱవేర్చి ఈయనకు కలిగినదుఃఖమును తొలఁగింపుము. నీవు అతిత్వరతో అడవికి బయలుదేరవలయును. అంతవఱకును ఈయన భోజనము చేయఁడు; స్నానము కూడ చేయఁడు."

శ్లో॥ ఏవం భవతు; యాస్యన్తి దూతాః శీఘ్రజవైః హయైః।
భరతం మాతులకులా దుపావర్తయితుం నరాః॥ 13

శ్లో॥ తవ త్వహం క్షమం మన్యే నోత్సుకస్య విలంబనమ్।
రామ తస్మా దిత శ్శీఘ్రం వనం త్వం గన్తు మర్హసి॥ 14

శ్లో॥ వ్రీడాన్వితః స్వయం యచ్చ నృప స్త్వాం నాభిభాషతే।
నైతత్ కించి న్నరశ్రేష్ఠ మన్యు రేషోఽపనీయతామ్॥ 15

శ్లో॥ యావ త్త్వం న వనం యాతః పురా దస్మా దతిత్వరన్।
పితా తావ న్న తే రామ స్నాస్యతే భోక్ష్యతేఽపి వా॥ 16

సర్గ. 19

ఈమాటలు దశరథునకు అమితబాధను కలిగించెను. ఇట్లు మాటాడుచున్నకైకపై ఆయనకు ఎంతకోపమో వచ్చియుండును. అయినను సత్యవచనముచే బద్ధుఁడై ఆయన ఏమియు చేయలేకుండెను. అందువలన ఆకోపము వెంటనే మహాదుఃఖముగా పరిణమించెను. అప్పటివఱకును తాను ఏమియు మాటాడలేకున్నను వారిప్రసంగములను వినుచున్నదశరథుఁడు, పొంగుచున్న దుఃఖావేశముతో "అయ్యో! ఛీ! ఎంత కష్టము!" అని పలుకుచు నిట్టూర్చుచు లేచి కూర్చుండుటకు ప్రయత్నించుచు మూర్ఛిల్లి మంచముమీఁద వెనుకకు పడిపోయెను. రాముఁడు ఆయనదగ్గఱకు పోయి శీతలోపచారములు గావించి తేఱుకొనునట్లు చేసెను.

శ్లో॥ ధి క్కష్ట మితి నిశ్శ్వస్య రాజా శోకపరిప్లుతః।
మూర్ఛితో న్యపతత్ తస్మిన్ పర్యంకే హేమభూషితే॥ 17

సర్గ. 19

ఏనుఁగునకు అంకుశముయొక్క పోటులవలె కైకమాటలు రామునకు బాధను అతిత్వరను కలిగించెను. "తండ్రిమాటకొఱకు అగ్నియం దైనను దుముకుదు" నని తాను ఎంత దృఢముగా చెప్పినను ఆమె తన్ను నమ్ముట లేదని రామునకు బాధ కలిగెను. అయినను ఆయన ఆవ్యథను ప్రక్కకు నెట్టి కైకేయిని చూచుచు నిట్లనెను. "నేను అర్థపరుఁడను కానమ్మా! ఏదో సామాన్యముగా ఈలోకములో ఉండఁ దలఁచుకొనియున్నాను. కేవలమైన ధర్మమునందు నిలిచియున్న నన్ను ఋషులతో సమానునిగా నెఱుంగుము. తండ్రిగారు నాతో చెప్పకున్నను నీవచనము ననుసరించియే నిజనమైన వనమునందు పదునాల్గు సంవత్సరము లుందును. అమ్మా! నీవు నాయందు కొంచె మైనను గుణమును గుర్తింపలేదు కదా! నీవు నన్ను శాసింపఁదగినదానవే కదా! నీవు నన్ను ఈవిషయమున ఆజ్ఞాపింపవలసియుండఁగా, మధ్యలో తండ్రిగారితో నేల చెప్పితివి? ఏమైన నేమి! మాఅమ్మను సీతను అనునయించి వెంటనే బయలుదేరెదను."

శ్లో॥ త దప్రియ మనార్యాయా వచనం దారుణోదయమ్ ।
శ్రుత్వా గతవ్యథో రామః కైకేయీం వాక్య మబ్రవీత్॥ 19

శ్లో॥ నాహ మర్థపరో దేవి లోక మావస్తు ముత్సహే ।
విద్ధి మాం ఋషిభి స్తుల్యం కేవలం ధర్మ మాస్థితమ్॥ 20

శ్లో॥ అనుక్తో ఒప్యత్ర భవతా, భవత్యా వచనా దహమ్ ।
వనే వత్స్యామి విజనే వర్షా ణీహ చతుర్దశ॥ 23

శ్లో॥ న నూనం మయి కైకేయి కించి దాశంససే గుణమ్ ।
య ద్రాజాన మవోచ స్త్వం మమేశ్వరతరా సతీ॥ 24

సర్గ. 19

తి. టీక:- లోక మావస్తుం - లోకే వస్తుం నోత్సహే।
అర్థపరో ధనపరః। విమలం ధర్మ మాస్థితం-తత్త్వజ్ఞాన
రూపం ధర్మం ఆశ్రితమ్। ఋషయోఽత్ర తత్త్వజ్ఞాః।
ఏతేన స్వస్య సుఖదుఃఖయోః సమతా నివృత్తిమా
ర్గస్థతా చ స్వాభావికీతి ధ్వనితమ్।

రాముని యీవాక్యములు మహార్థగర్భితములై యున్నవి. రామునిమహత్త్వమునకు మూలమైన శీలము ఈవాక్యములలో అమోఘముగా వ్యక్తమగుచున్నది. ఏకాలమునందైనను, "నేను అర్థపరుఁడను కాను" అని చెప్పఁగలిగినవారు, ఋషులలో తప్ప, లోకవ్యవహారమున రాజులుగా మంత్రులుగా వ్యవహరించుచుండు సమాజనాయకులలో చాలమంది యుండరు. ధర్మకామములకు భిన్నమైనదంతయు అర్థమే. సంపదలు రాజ్యము అధికారము మొదలైనవన్నియు అర్థములోనియంశములే. వీనిని తీవ్రముగా కోరువారు ధర్మభంగమును లెక్కింపరు. తమచర్యలచే ఇతరులకు కలుగుదుఃఖమును కనులారఁ జూచుచున్నను వారికి దయ కలుగదు. వారు పాపమునకు వెఱవరు పాపకర్మలకు ఫలముగా ఈలోకమునందు, పరలోకమునందు, జన్మాంతరములందును కలుగఁబోవు ఘోరపరిణామములను వారు అనుకొననే యనుకొనరు. ఇట్టియర్థపరులు, ఒకప్పుడు ధార్మికులుగ కన్పించుచున్నను, నాస్తికులవలెనే వ్యవహరింతురు. ఇందులకు ప్రత్యక్షదృష్టాంతము కైకేయియే. దశరథుఁడు రామునకు పితృదేవుఁడైనచో ఆమెకు పతిదేవుఁడు. ఆయనమాటకొఱకై రాముఁడు అగ్నియందైనను దుముకుదు నని చెప్పుచుండఁగా, భర్త నిప్పులలో పడినట్లుగా ఎంత పరితపించుచున్నను కైక రవంతయైనను దాక్షిణ్యము వహించుట లేదు. భర్త ఏమైనను సరే, కొడుకును రాజును చేసి తాను రాజమాతగా పెత్తనము చేయవలసినదే అని ఆమె దీక్ష వహించెను. ఇంతకన్నను

అర్థపరత్వ మే మున్నది? ఇంత అర్థపరత్వముయొక్క ఆవేశమును పొందియున్నయామె రామునియొక్క మహత్త్వమును గుర్తింప లేక ఆయన చెప్పినమాటను వెంటనే జరుపు ననునమ్మకము లేక, ఆయనను తొందఱపెట్టఁజొచ్చెను. అందువలననే ఆయన, ఆమెవలెఁ గాని లోకములో రాజ్యమును సహజముగా అభిలషించుచుండు సాధారణ రాజకుమారులవలెఁ గాని, తాను అర్థపరుఁడను గా నని స్పష్టము చేయవలసి వచ్చెను.

అట్లే ఆయన తరువాతివాక్యమున జీవితలక్ష్యమునందు సాత్త్వికులకు రాజసులకుఁ గలభేదమును స్పష్ట మొనర్చినాఁడు. అర్థపరాయణులైన రాజసులు, ఎప్పుడును ఏదో విధముగ సంపదలను పదవులను సంపాదించుకొనుచు ఇతరులపై పెత్తనము చేయుచుండుటయే పరమ లక్ష్యముగా బ్రతుకుచుందురు. పెత్తనము లేని బ్రతుకు వారిదృష్టిలో వ్యర్థము. వారు ఇతరులను గుప్పిటిలో నుంచుకొని ప్రపంచ మంతయు తమకు సొంత మైనట్లే వ్యవహరించుచుందురు. సాత్త్వికులదృష్టి ఇందులకు కేవలము విరుద్ధముగా నుండును. దైవికముగా నేది లభించునో, ధర్మముచేత ఏది సంపాదించుటకు సాధ్య మగునో, అంత మాత్రముచేతనే వారు సంతుష్టు లగుచుందురు. సంపదలకొఱకు, పదవుల కొఱకు అధికారములకొఱకు వారు ప్రాకులాడరు. వారు సాధ్యమై నంత వఱకు లోకవ్యవహారమునకు దూరముగ నుండి ప్రశాంతముగ జీవించుటకే యత్నింతురు. వారు ప్రతివిషయము తమకే కావలయు నని తాపత్రయపడక యథాలాభసంతుష్టులై ఏదో విధముగ ధర్మమార్గమున జీవితమును కొనసాగించుచుందురు. ఈయభిప్రాయమును రాముఁడు, "లోక మావస్తు ముత్సహే," అను మూఁడుమాటలలో వ్యక్తము చేసినాఁడు.

"ఆవస్తుమ్" అనుపదమునకు రెండువిధములుగా అర్థము చెప్ప వచ్చును. "ఆసమంతాత్ వస్తుమ్ - ఆవస్తుమ్" అని అర్థము చెప్పి నప్పుడు, ప్రపంచములోని అన్నిసుఖవిషయములు తమకే కావలయు నని జీవించుట దానికి తాత్పర్య మగును. ఈయర్థమును చెప్పు నప్పుడు "అహం అర్థపరః న అస్మి; అహం లోకం ఆవస్తుం చ న ఉత్సహే" అని నిషేధాత్మకమైన "న"కారమును "ఉత్సహే" అనుక్రియతో కూడ అన్వయింపవలె. అప్పుడు, "నేను అర్థపరుఁడను కాను; ప్రపంచమున అంతయు నాకే కావలయు నని జీవించుటకు కూడ నేను ఉత్సహించుట లేదు" అని తాత్పర్యమును గ్రహింపవలసి యుండును.

అట్లు కాక "ఆవస్తుమ్" అను పదమునకు "ఈషద్ వస్తుమ్" అనునర్థమును చెప్పినప్పుడు. యథాలాభసంతుష్టితో ఈలోకమున ఎట్లో జీవయాత్రను కొనసాగించుకొనఁదలఁచుట దానికి తాత్పర్య మగును. ఈయర్థమున నిషేధాత్మకమైన "న"కారమును "ఉత్సహే" అనుక్రియతో అన్వయింప నక్కఱ లేదు.

అర్థపరత్వము లేకుండుటకు యథాలాభసంతుష్టి కారణము అది దృఢముగా నుండుటకు ఋషులతో సమానత్వము హేతువు. అది కేవల ధర్మమునందే నిలిచియుండుటవలన కలుగుచున్నది. ఫలాభిలాషతో ఆచరింపఁబడునది ఫలసాధనధర్మము. "ఇది నాకు శాస్త్రవిహితమైన ధర్మము: ఫల మున్నను లేకున్నను లేదా దుఃఖమే కలిగినను, నాకు ఇది కర్తవ్యము; కావున చేయుదును" అనుదృష్టితో ఆచరింపఁబడునది కేవలధర్మము. లోకములో అనేకులు సంపదలు పదవులు కీర్తి మొదలగుఫలములను ఆశించి ధర్మమును ఆచరించుచుందురు. ఋషులు ఫలముపై దృష్టి నిడక కేవలము ధర్మవృద్ధికొఱకే ధర్మమును ఆచరింతురు. రాముఁడు కూడ ధర్మముకొఱకే ధర్మమును ఆచరించు

చున్నాఁడు,ఫలాపేక్షతో కాదు. అందువలన ఆయన ఋషులతో సమానుఁడయ్యెను. తండ్రిని సేవించుట కుమారునకు ధర్మము. కావున రాముఁడు దశరథుని సేవించుచుండెను. అందువలన పట్టాభిషేకము చేయుదు నని తండ్రి చెప్పినప్పుడు ఆయనయందు రామునకు ఎట్టిభక్తి యుండెనో అట్టిభక్తియే అరణ్యమునకు పొమ్మని చెప్పినప్పుడు కూడ ఉన్నదను విషయమును రాముఁడు కైకకు స్పష్టము చేయుచున్నాఁడు. కేవలమైన యీధర్మదృష్టితోనే రాముఁడు పైవిషయమును కూడ ఉద్ఘాటించుచున్నాఁడు. కుమారుని ఆదేశించుటకు తండ్రికి వలెనే తల్లికి కూడ అధికార మున్నది. కావున కైకయే స్వయముగా కోరియున్నను తాను వనమునకు పోవుదు నని రాముఁడు విశద మొనర్చినాఁడు. తాను కేవలమైన ధర్మమునే అవలంబించియున్నకారణముచేతనే రాజ్యమునకు మాఱుగా వనవాసము ప్రాప్తించినను తల్లిదండ్రులయందు తనకుఁగల గౌరవము రవ్వంతయు తగ్గ లేదని రాముఁడు వ్యక్త మొనర్చినాఁడు. కైక తన్ను శాసించి పని జరుపుకొనక అనవసరముగా మధ్యలో తండ్రికి వ్యథను కలిగించుచున్న దనియే ఆయన బాధపడెను.

"నేను ఋషులతో సమానుఁడను" అని రాముఁడు తన్నుగూర్చి చెప్పుకొనుట ఆత్మప్రశంస కాదా? కాదు. తనవిషయమున కైకకుఁగల భయసంకోచములను సంశయమును నివారించుటకొఱకే ఆయన తన స్వభావమును ఇట్లు వివరించెను. కావున ఇందు దోషములేదు.

ఈప్రసంగమునందు రామునివర్తనమున ప్రస్ఫుట మగుచున్న కర్మయోగలక్షణమును కూడ మనము గ్రహింపవలసియున్నది. ఫలాభిలాషతో శాస్త్రవిహితములైన ధర్మకర్మములను యథావిధిగా ఆచరించుట కర్మానుష్ఠాన మగును. అట్టివాఁడు కర్మఠుఁడు. తనకు శాస్త్రముచేత విహితములైనధర్మములను ఫలాపేక్ష లేకుండ యథావిధిగ నిర్వ

హించుట కర్మయోగము. అట్టివాఁడు కర్మయోగి. జీవితములో శుభము కాని అశుభము కాని పతనము కాని అభ్యుదయము కాని, ఏది సంభవించినను, పూర్వకర్మఫలముగానే సంభవించు నని అతఁడు నిశ్చితముగా నెఱుంగును. అందువలన అతఁడు ఏయభ్యుదయమును కోరఁడు. కావున అతనికి ఏవిషయమునను సంకల్పము ఉండదు. సంకల్పము లేనప్పుడు అతఁడు చేయుచున్నకార్యమునకు ఫలముగా పుణ్యము గాని పాపము గాని ఏదియును పుట్టదు. అందువలన అతఁడు ఎంత మహాకార్యమును నిర్వహించుచున్నట్లుగా ఇతరులకు కన్పించుచున్నను అతఁడు తనదృష్టిలో ఏమియు చేయనివాఁడే యగును. తాటకాసంహారమును గాని యజ్ఞరక్షణమును గాని రాముఁడు సంకల్పింప లేదు. విశ్వామిత్రునియాజ్ఞపై విశ్వామిత్రునికొఱకే రాముఁడు వానిని నిర్వహించినాఁడు. తండ్రివచనము ననుసరించి గురువుయొక్క ఆజ్ఞను నిర్వహించుట రామునకు శాస్త్రవిహితమైన ధర్మము. ఆకార్యనిర్వహణమున ఆయనకు ఫలాభిసంధి కాని సంకల్పము గాని లేకపోవుటచే స్త్రీవధము వలన కలుగు పాపము గాని యజ్ఞరక్షణమువలన కలుగు పుణ్యము గాని ఆయనకు ప్రాప్తింపవు. అనఁగా ఆకర్మలు పునర్జన్మమునకు కారణములు కాఁజాలవు. అందువలన అట్టిమహాకార్యములను నిర్వహించినను ఆయన ఏకర్మయు చేయనివాఁడుగనే యుండెను. ఈవిషయముననే శ్రీకృష్ణభగవానుఁడు అర్జునునకు ఇట్లు వివరించెను. "కర్మఫలమునందు అభిలాషను వీడి, ఎల్లప్పుడును కలిగినదానితో తృప్తి నొందుచు కామ్యములైన భోగములకొఱకు యజ్ఞాదిసాధనములను ఆశ్రయింపక, దైవికముగా వచ్చిపడుచున్న సంఘటనములయందు శాస్త్రవిధి ననుసరించి కర్తవ్యమును నిశ్చయించుకొని అందు ప్రవర్తించువాఁడు ఏమియును చేయనివాఁడే యగును."

శ్లో॥ త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః।
కర్మ ణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః॥ 20

భగవద్గీత - అధ్యాయ-4

రాముఁడు కైకతో నిట్లు చెప్పుచుండఁగా దశరథుఁడు మాటాడ లేక పెద్దగా విలపించుచు మూర్ఛిల్లెను. రాముఁడు లక్ష్మణునితో కూడ తండ్రికి తల్లికి ప్రదక్షిణము గావించి అంతఃపురమునుండి వెలువడి స్నేహితులను చూచెను. లక్ష్మణుఁడు కనుల నీరు నిండుచుండఁగా పరమక్రుద్ధుఁడై రాముని వెంట బయలుదేరెను. దారిలో అభిషేకము కొఱకు సమకూర్పఁబడిన తీర్థములు అలంకారములు మొదలగు ద్రవ్యములు కన్పింపఁగా రాముఁడు మెల్లగా వానికి ప్రదక్షిణము గావించి వానిని అపేక్షతో చూచుచు ముందునకు పోయెను. రాత్రివలన లోక మనోహరుఁడైన చంద్రునకు ఎట్లు కాంతి తగ్గదో, అట్లే రాజ్యభ్రంశము వలన రామునకు కూడ కాంతి ఏమియును తగ్గలేదు. రాజ్యమును వదలి వనమునకు పోవుచున్న ఆయనయందు, సర్వలోకమును అతిక్రమించిన వానియందు వలె, చిత్తవికృతి కొంచెము కూడ కన్పింపలేదు.

ఆయన కైకేయిభవనమునుండి వెలువడినంతనే భటులు ఛత్ర చామరములను రథమును గొనితెచ్చిరి. వనమునకు పోవుటకై నిశ్చయించి కైకకు మాట ఇచ్చియుండుటచే ఆక్షణమునుండి ఆయన వానప్రస్థునియొక్క ధర్మములను అనుసరింపఁజొచ్చెను. వానప్రస్థులు వన సంభవములైన పదార్థములను మాత్రమే ఉపయోగింపవలెఁ గాని రాజ యోగ్యములు నాగరకములునైన వస్తువులను ఉపయోగించుకొన రాదు. అందువలన ఆయన ఛత్రచామరాదులను రథమును నిరాకరించి,చుట్టును చేరుచున్న స్నేహితులను పౌరులను వీడ్కొని కాలినడకతో తల్లి

యింటికి బయలుదేరెను. ఆయన దుఃఖమును మనస్సునందే నిలుపుకొని ఇంద్రియములను నిగ్రహించి, ధైర్యము నవలంబించి, తల్లికి అప్రియ మును చెప్పక తప్ప దని తలంచుచు ఆమెయింటిలోనికి పోయెను.

శ్లో॥ స రామః పితరం కృత్వా కైకేయీం చ ప్రదక్షిణమ్ ।
నిష్క్రమ్యాంతఃపురా త్తస్మాత్స్వందదర్శసుహృజ్జనమ్॥ 29

శ్లో॥ తం బాష్పపరిపూర్ణాక్షః పృష్ఠతోఽనుజగామ హ ।
లక్ష్మణః పరమక్రుద్ధః సుమిత్రానందవర్ధనః॥ 30

శ్లో॥ ఆభిషేచనికం భాండం కృత్వా రామః ప్రదక్షిణమ్ ।
శనై ర్జగామ సాపేక్షో దృష్టిం తత్రావిచాలయన్॥ 31

తి. టీక. :- సాపేక్షః వనం ప్రతి ఇతి శేషః ।

గో. టీక :- సాపేక్షః భరతస్య అనేన అభిషేకోఽస్తు
ఇతి ప్రార్థనా సహితః

శ్లో॥ న చాస్య మహతీం లక్ష్మీం రాజ్యనాశోఽపకర్షతి ।
లోకకాన్తస్య కాన్తత్వాత్ శీతరశ్మే రివ క్షపా॥ 32

తి. టీక :- కాన్తత్వాత్ - అవినాశికాంతియుక్తత్వాత్

శ్లో॥ న వనం గన్తుకామస్య త్యజత శ్చ వసుంధరామ్ ।
సర్వలోకాతిగ స్యేవ లక్ష్యతే చిత్తవిక్రియా॥ 33

తి. టీక :- సర్వలోకాతిగ స్యేవ - జీవన్ముక్త స్యేవ

గో. టీక :- తుల్యమానావమానస్య పరమయోగీశ్వరస్య.

శ్లో॥ ప్రతిషిద్ధ్య శుభం ఛత్రం వ్యజనే చ స్వలంకృతే।
విసర్జయిత్వా స్వజనం రథం పౌరాం స్తథా జనాన్॥ 34

శ్లో॥ ధారయన్ మనసా దుఃఖ మింద్రియాణి నిగృహ్య చ।
ప్రవివే శాత్మవాన్ వేశ్మ మాతు రప్రియశంసివాన్॥ 35

గో. టీక :— దుఃఖ శబ్దేన సుహృజ్జనదుఃఖదర్శనజం దుఃఖ ముచ్యతే।

## సర్గ. 19

"రాముఁడు అభిషేకద్రవ్యములను అపేక్షతో చూచుచు ముందుకు పోయెను" అన్నప్పుడు రామునకు కలిగిన "అపేక్ష" యేమి? తెలుఁగులో "అపేక్ష"కు ప్రేమ, కోరిక అనునర్థములే రూఢిగ నున్నవి.కాని సంస్కృతమున దీనికి గౌరవము సాదృశ్యసంబంధము అనునర్థములు కలవు. అవి మంగళద్రవ్యములు కావున రాముఁడు వానిని గౌరవముతో చూచె ననుట సామాన్యార్థము. అట్లే "ఈద్రవ్యములు భరతున కైనను ఉపయోగపడుఁ గాక" అని కూడ రాముఁడు భావించియుండవచ్చును. సాదృశ్యార్థము సంస్కృతమున మిగుల ప్రసిద్ధము. ఒక యుదాహరణమును చూడుఁడు. "ప్రబంధములు సాధారణముగా సుబోధములు కావు. కాని ఆముక్తమాల్యదాపేక్షతో **(With reference to; In comparison with)**మనుచరిత్ర చాల సుబోధ మని చెప్పవలసియున్నది." ఈసాదృశ్యార్థమే పై సందర్భమున చాల సమంజసము. రామునిదృష్టిలో రెండుసన్నివేశములు ప్రబలములై యున్నవి. తండ్రియొక్క దుర్దశను చూచి వెలుపలికి వచ్చినంతనే ఆయనకు అభిషేకద్రవ్యములు కన్పించినవి. వానిని చూడఁగానే, "ఈయభిషేకద్రవ్యములతో పొందఁదగిన రాజ్యముకొఱకే గదా కైకేయికి అంత ఆవేశము మాతండ్రికి

అంత ఆవేదన కలిగినవి! ఆమహావ్యథాపేక్షతో చూచినచో ఈయభిషేక ద్రవ్యములతో లభించు ఆరాజ్యమునకు విలువ ఎంత? ఇవి లోకమున ఎంతమందియొక్క మనస్సులను కలుషిత మొనర్చుచు ఎంత యావేద నను కలిగించుచున్నవో గదా!" అని ఆయన అనుకొనియుండును నిష్కాముఁడైనవానికి ఇట్టియపేక్షాదృష్టి సహజము. ఇట్లు ఆలోచించుచు ఆయన వానివంక కొంచెముసేపు పరికించుచుండె నన్నమాట.

"సర్వలోకమును అతిక్రమించినవానికి వలె (సర్వలోకాతిగ స్యేవ) ఆయనకు చిత్తవికృతి కలుగలేదు" అన్నప్పుడు సర్వలోకము నతిక్రమించుట అనుమాటకు ఏ మర్థము? మనచేత భావింపఁబడుచున్న యీలోకము పరలోకములు కలసినమొత్తము సర్వలోకము. ఇందు భోగ్యములు ఉపకరణములు సాధనములైన కర్మలు అని పదార్థము లన్నియు మూఁడువిధములుగా నుండును. ఉపకరణములను కూర్చు కొని కర్మముల నిర్వహించుచు తత్ఫలముగా భోగ్యములను సంపా దించుకొనుచుండుటయే లోకవ్యవహారము. ఈలోకమున సంపదనో పదవినో కోరువాఁడు దానికి కావలసిన వ్యవహారమునందు నిమగ్నుఁ డగును. అట్లే పరలోకమున స్వర్గభోగమును కోరువాఁడు దానికి కావ లసిన యజ్ఞయాగాదికర్మలయందు నిమగ్నుఁ డగును. ఇట్లు కొందఱు లౌకికవ్యవహారమునకో వైదికవ్యవహారమునకో లోఁబడియుందురు. సర్వలోకమును బ్రహ్మమాత్రముగ చూచువారికి ఏలోకమునందును కోరఁదగినది ఏదియు నుండదు. కావున వారు లౌకికవైదికవ్యవహార మూలములైన వర్ణాశ్రమాదిధర్మములను వేనిని పాటింపరు. లోకుల దృష్టిలో వారు సర్వలోకమును అతిక్రమించినవారుగా నుందురు. వీరినే అవధూత లనుచున్నాము. వీరికి ఏసంఘటనమునందును చిత్తవికృతి యుండదు. వీరికివలెనే రామునకు కూడ కావలసినది ఏదియు లేకపోవు టచే చిత్తవికృతి కలుగ లేదు.

"సర్వలోకమును అతిక్రమించినవానికి వలె"అని ఉపమానమును చెప్పుట ఎందులకు; సర్వలోకాతిగుఁడు కావున రామునకు చిత్తవికృతి కలుగ లేదు" అని ఏల చెప్పరాదు? అవధూతలవలె రాముఁడు చిత్త వికారరహితుఁడుగా నున్నను వారివలె వర్ణాశ్రమాదిధర్మములను వదలు కొన లేదు. అందువలన ఆయన లోకవ్యవహారమునందు ఉన్నను అవ ధూతలవలె సమచిత్తమును కలిగియున్నాఁ డని చెప్పఁబడినది.

రాముఁడు, "దుఃఖమును మనస్సులోనే నిలుపుకొని ఇంద్రియ ములను నిగ్రహించి" తల్లియొద్దకు పోయె నని చెప్పఁబడియున్నది. అనఁగా రామునకు కూడ దుఃఖము కలిగె ననుట స్పష్టము. ఆయనకు కూడ దుఃఖము కలిగె నన్నచో ఇంక మహాయోగి జ్ఞానియునై నందులకు ఫల మే మున్నది? మహాయోగులు కూడ దుఃఖింతురా? జనులయొక్క దుఃఖమును చూచినప్పుడు రాముఁడు మిగుల దుఃఖమును పొందు నని వారియుత్సవములందు తండ్రివలె సంతోషించు నని ఇంతకు ముందే చెప్పఁబడియున్నది.

శ్లో॥ వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః॥ 40
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి। 41

అయినచో మహాయోగులకు సామాన్యమానవులకును భేద మే మున్నది? ఈవిషయమును ఇట్లు గ్రహింపవలసి యున్నది. సుఖ దుఃఖానుభవము సకలజీవులకు సామాన్యలక్షణము. జీవులలో మానవులు శ్రేష్ఠులు. మానవులలో మహాయోగులు ఉత్తములు. వారు అందఱును వ్యవహారరహితులై యుండరు. అనేకులు మహాభక్తులు మహాయోగు లయ్యును సంసారధర్మములను చక్కఁగా నిర్వర్తించుచుందురు. ప్రహ్లాదునిదృష్టాంతమును గ్రహింపవచ్చును. జగత్తునుగూర్చి ఆయన దృష్టి ఎట్టిదో చూడుఁడు.

కం॥ హరిమయము విశ్వ మంతయు;
హరి విశ్వమయుండు; సందియము పని లే; దా
హరిమయము కాని ద్రవ్యము
పరమాణువు లేదు లోకపావన వింటే॥

ఇట్లు జగత్తును హరిమయముగా చూచుచున్న ప్రహ్లాదుఁడు కూడ గృహస్థుఁడై పుత్రులను పొంది రాజ్యమును కూడ పాలించెను. ఆయన పుత్రుఁడే విరోచనుఁడు. విరోచనునికొడుకు బలిచక్రవర్తి. ఇట్లు సంసారధర్మములను నిర్వర్తించుచున్న మహాయోగులకు సుఖదుఃఖానుభవస్పందనము ఉండదు అని చెప్పుటకు వీలులేదు. కాని రాగద్వేషముల వలన సామాన్యమానవులకు కలుగు సుఖదుఃఖముల గాఢత (**Strong feeling**) వారికి ఉండదు. సుఖమో దుఃఖమో కలిగినప్పుడు సామాన్యులు దానికి కారకులుగా కన్పించువారియందు రాగద్వేషములను పెంచుకొనుచుందురు. సర్వము దైవికముగా సంభవించుచున్న దని దృఢముగా గ్రహించిన మహాభక్తులు గాని మహాయోగులు గాని ఆ విధముగ రాగద్వేషములను పెంచుకొనరు. మహాయోగులచిత్తవృత్తి బాలురచిత్తవృత్తివలె నుండును.చిన్నపిల్లలు ఆడుకొనుచు ఆనందించుచు మఱుక్షణమే తగవు లాడుకొని విడిపోవుచుందురు; మరల వెంటనే జరిగినదానిని మఱచిపోయి ఆడుకొనుచుందురు. వారిచిత్తవృత్తిలో ఏయనుభూతియు గాఢముగా స్థిరముగా నిలువదు. ఏభావమునకును వారిచిత్తమునందు అనువృత్తి (**Continuation**) యుండదు. అందు వలన వారిమనస్సు ఎప్పటి కప్పుడు నిర్మలముగా నుండును. మహాయోగులవ్యవహారము కూడ ఇట్టిదే.

జనులయొక్క దుఃఖమును చూచి రాముఁడు కూడ దుఃఖించు ననఁగా వారికి ఎంత గాఢమైన దుఃఖము కలుగుచున్నదో అట్టిదుఃఖమే

ఆయనకును కలుగు నని చెప్పుటకు వీలులేదు. వారిదుఃఖమును చూచు చున్నప్పుడు ఆయనమనస్సునందు కూడ ఒకచిన్నదుఃఖతరంగము లేచి ముఖమునందు విన్నబాటు కలిగి, కనులయందు అశ్రువులు నిండ వచ్చును. నిండుకుండ తొణఁకినచో వెలుపలికి చిందిపడునీటిబిందువు లెట్టివో ఆయనయశ్రువులు అట్టివి. కాని చిల్లిపడినకుండలోనుండి నీరు నిరంతరముగా స్రవించుట ఎట్టిదో జనులదుఃఖము అట్టిది. కావున రెంటికిని పోలికయే లేదు. ఒకచోట ఇట్లు దుఃఖస్పందమును పొందిన రాముఁడు మఱియొకచోట ఉత్సవమును చూచుట సంభవించినచో వెనుకటిదానిని వెంటనే వదలి సంతోషభావమును పొందును. ఇంటికి చేరునప్పటికి ఈరెండును ఉండవు. అందువలన ఆయనమనస్సు ఎప్పు డును ప్రసన్నముగనే యుండును.

ఇప్పుడు రామునకు రెండుకారణములవలన దుఃఖము కలిగినది. తనకు మేలును జేయఁగోరి తండ్రి యింత దుస్థితి నొందెను గదా అన్నది మొదటికారణము. తనపై ఎన్నో ఆశలు పెంచుకొనియున్న తల్లికి ఈవార్తవలన ఎంత ఘోరమైన నిరాశాదుఃఖము కలుగునో యన్నది రెండవకారణము. ఆయన తన్నుగూర్చి ఆలోచించుటయే లేదు. తల్లిదండ్రులదుస్థితినిగూర్చియే ఆలోచించుచున్నాఁడు. లోకుల దుఃఖ మును చూచినప్పుడే ఎంతో సహానుభూతిని పొందువాఁడు తల్లిదండ్రుల దుఃఖమునకు స్పందింపకుండునా? కాని యీదుఃఖస్పందనమునకు కౌసల్యాదశరథులదుఃఖతీవ్రతకును సంబంధము లేదు. అయోధ్యను దాటి గంగను చేరునప్పటికే రాముఁడు ఈదుఃఖమును తొలఁగించు కొనెను. కౌసల్యాదశరథులు ఎన్నిరోజులు గడచినను ఆశోకవేగమును

నిగ్రహింపలేకపోయిరి. రాముఁడు సుఖదుఃఖములను నిగ్రహించుకొనఁ గలిగి యుండఁగా, అవి కౌసల్యాదశరథులను నిగ్రహించెను. సుఖదుఃఖములయొక్క కామక్రోధములయొక్క వేగమునకు లోఁబడకుండుటయే యోగాభ్యాసమునకు ఫలము. శ్రీకృష్ణుఁడు దీనిని ఇట్లు నిరూపించెను. "శరీరమును వీడుటకు ముందే ఇచ్చటనే ఎవఁడు కామక్రోధోద్భవమైన వేగమును సహింపఁగలిగియున్నాఁడో వాఁడే యోగి, వాఁడే సుఖి."

శ్లో॥ శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ఛరీరవిమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్తస్స సుఖీ నరః॥ 23

భగవద్గీత – అధ్యా-5

రాముఁడు "దుఃఖమును మనస్సునందే నిలుపుకొని ఇంద్రియములను నిగ్రహించుకొని" (ధారయన్ మనసా దుఃఖ మింద్రియాణి నిగృహ్య చ) తల్లియొద్దకుపోయె నని చెప్పఁబడియున్నది. దీనివలన ఆయన తనమనస్సులో బయలుదేరిన దుఃఖతరంగమును చూచి దానిని అక్కడే నిలిపి దానియొక్క ప్రభావము ముఖమునందు చూపులందు వాక్కునందును ప్రసరింపకుండునట్లు చేసె ననుట స్పష్టము. ఈవిధముగా ఆయన తనయందు రవ్వంతయు దైన్యము స్ఫురింపకుండునట్లు చేసి ఔదాసీన్యము నవలంబించెను. ఆశాభంగమువలన తనవియోగమువలన కౌసల్యకు దుఃఖము తప్పదు. ఇప్పుడు తాను ఆమెకు చేయఁగలిగిన దే మున్నది? ఆ దుఃఖములను సహించుటకు కావలసినధైర్యమును కొంతవఱకైనను ఈయఁ గల్గుటయే తాను తల్లికి చేయఁగలిగిన సాయము. తాను ధీరుఁడై యుండిననే తప్ప ఆమెకు కొంచెమైనను

ధైర్యమును కలిగింపఁజాలఁడు. తానే దుఃఖము నొందినచో ఆమె కుప్ప కూలిపోవుట తథ్యము. అందువలన రాముఁడు తనమనస్సులో బయలు దేరిన దుఃఖతరంగమును పైకి రాకుండ అచ్చటనే అణఁచివేసెను. దొంగలు వచ్చి దోఁచుకొనిపోయిన తరువాత నిద్రనుండి మేల్కొని పరితపించు వారివలె సామాన్యులు కామక్రోధాదిభావములు తమ్ము ఆక్రమించుచున్నప్పుడు వానిని గుర్తింపఁజాలరు. మనస్సునందు బయలుదేరుచుండు వృత్తులను (Thoughts and feelings) ఎప్పటి కప్పుడు గుర్తించుటను అభ్యసించినయోగులే, అవి పుట్టినంతనే వానిని గమనించి అవి దుష్టములైనచో వెంటనే నిగ్రహింపఁగల్గుదురు. రాముఁడు మహాయోగి కావుననే దశరథునివలె దుఃఖవేగమునకు, లక్ష్మ ణునివలె క్రోధవేగమునకు లోఁబడక ధైర్యముతో నిలువఁగలిగెను.

తాత్కాలికముగా కొలఁదిగా నైన ఇట్లు సుఖదుఃఖములకు స్పందించుచుండుట (Throbing) విష్ణుదేవుఁడు రాముఁడుగా అవత రించి పొందిన మనుష్యత్వమును నిరూపించుచున్న యొక లక్షణము.

రామునిజీవితమునందు ఇది ఎంత ప్రముఖమైన ఘట్టమో భాగ వతములోని యొక సన్నివేశమున నుజ్జ్వలముగా వ్యక్తమగుచున్నది. ఒకప్పుడు వసుదేవుఁడు నారదమహర్షిని, "ఈసంసారమునుండి ఎట్లు ముక్తుల మగుదుము?" అని యడిగెను. ఆయన అందులకు సమాధాన ముగా నిమికి ఋషభునిపుత్రులకును జరిగినసంవాదమును చెప్పెను. "ఏయుగమునందు భగవంతుఁ డెట్లు అర్చింపఁబడునో చెప్పఁడు" అని నిమి వారిని ప్రశ్నించెను. వారిలో కరభాజనుఁడు కృతత్రేతాద్వాపరముల

విషయమును చెప్పి కలియుగమునందు అర్చింపవలసినదేవునిగూర్చి యిట్లు చెప్పెను.

"కలియుగమున సుమతులు నల్లనివర్ణము కలవానిని, ఉజ్జ్వల మైనకాంతిగలవానిని, సాంగోపాంగములైన యస్త్రములయొక్క దేవతలచేత సేవింపఁబడుచున్నవానిని, సంకీర్తనప్రాయములైన యజ్ఞములచేత పూజించుచుందురు; ఆమహాపురుషుని ఇట్లు స్తుతించుచుందురు.

"ఓ మహాపురుషా! పరిభవములను పరిహరించునది, అభీష్టములను ప్రసాదించునది, తీర్థములకు ఆస్పదమైనది, శివునిచే బ్రహ్మచే నుతింపఁబడినది, అందఱకు శరణ్యమైనది, భృత్యులయొక్క ఆర్తిని పోఁగొట్టునది, ప్రణతులైన లోకపాలకులను సంసారసాగరమునుండి తరింపఁజేయుటకు తెప్పవంటిది, ఎల్లరును ధ్యానింపఁదగినదియు నైన నీ చరణారవిందమునకు నమస్కరించుచున్నాను.

ఓధార్మికశ్రేష్ఠ! మహాపురుష! తండ్రియొక్క మాటను నిలుపుటకొఱకు, త్యజించుటకు సులభముకానిదానిని దేవతలు నైతము కోరఁదగినరాజ్యలక్ష్మిని త్యజించి అరణ్యమునకు నడచినట్టిది, ప్రియురాలి యభీష్టము కొఱకు మాయామృగమువెంట పరువెత్తినదియు నైన నీ చరణారవిందమునకు నమస్కరించుచున్నాను."

కరభాజనుఁడు మఱియు నిట్లనెను. "కలియుగమునందు సంకీర్తనముచేతనే ఎల్లరును సకలాభీష్టములను పొందఁగల్గుదురు. కావున సకలశాస్త్రములసారమును గ్రహించినవారు గుణజ్ఞులును అయిన యార్యులు కలిని గౌరవించుచున్నారు."

శ్లో॥ కృష్ణవర్ణం త్విషాకృష్ణం సాంగోపాంగాస్త్రపార్షదమ్ ।
యజ్ఞైస్సంకీర్తనప్రాయైః యజన్తి హి సుమేధసః॥ 32

శ్లో॥ ధ్యేయం సదా పరిభవఘ్న మభీష్టదోహం
తీర్థాస్పదం శివవిరించినుతం శరణ్యమ్ ।
భృత్యార్తిహం ప్రణతపాలభవాబ్ధిపోతం
వందే మహాపురుష! తే చరణారవిన్దమ్॥ 33

శ్లో॥ త్యక్త్వా సుదుస్త్యజ సురేప్సితరాజ్యలక్ష్మీం
ధర్మిష్ఠ! ఆర్యవచనా ద్య దగా దరణ్యమ్ ।
మాయామృగం దయిత యేప్సిత మన్వధావత్
వందే మహాపురుష! తే చరణారవిన్దమ్॥ 34

శ్లో॥ కలిం సభాజయ న్త్యార్యా గుణజ్ఞా స్సారభాగినః ।
యత్ర సంకీర్తనే నైవ సర్వ్వ స్స్వార్థోఽభిలభ్యతే॥ 36

భాగవతము - ఏకాదశస్కంధము - అధ్యాయము -5

ఈయుపదేశమువలన కలియుగమునందు భగవంతుని శ్రీరామచంద్రునిరూపముననే పూజింపవలయు నని, ఆయనయొక్క నామ సంకీర్తనాదులు యజ్ఞముతో సమాన మని, ఆమహాపురుషుని స్తుతించునపుడు రాజ్యపరిత్యాగఘట్టమున వ్యక్తమగుచున్న యాయనయొక్క ధర్మనిష్ఠను ప్రధానముగా ధ్యానింప వలయు నని స్పష్ట మగుచున్నది.

గద్యము:- ఆపస్తంబసూత్ర కౌండిన్యసగోత్ర పోలూరి వేంకట నరసాంబా వేంకటనారాయణామాత్యపుత్ర హనుమజ్జానకీరామశర్మప్రణీతంబైన శ్రీరామాయణతరంగిణియందు ఆఱవదియైన ప్రత్యక్షదేవతాతీర్థము సమాప్తము.

# తప్పొప్పుల పట్టిక

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 10 | 13 | పోరాడుచుండుసు | పోరాడుచుండును |
| 11 | 19 | అనంగతము | అసంగతము |
| 14 | 1 | నిల్పైనను | నిట్లనెను |
| 16 | 1 | యాశ్రమముసకు | యాశ్రమమునకు |
| | L. L. | పూజ | పూజ |
| 21 | 10 | ఋశ్యశృంగుని | ఋష్యశృంగుని |
| | 11 | జరుగు | జరుగు |
| 22 | 16 | కుండములతో | కుండలములతో |
| | 19 | చున్నారే | చున్నాడే |
| 24 | 7 | జూచియే | జూచియే |
| | 8 | నహాజము | సహాజము |
| 27 | 13 | పంచసూచనములు | పంచసూనములు |
| 28 | 2 | నవశ్యమున్ | నవశ్యమున్ |
| 32 | 1 | త్రిస్నియః | స్త్రియః |
| 34 | 20 | వుట్టింప | పుట్టింప |
| 39 | 1 3 | నారాయణ | వేంకటనారాయణ |
| 45 | 17 | బండువు | బంధువు |
| 50 | 21 | సహరించుట | సంహరించుట |
| 52 | 1 శ్లో | నహి | సహితే |
| 54 | 11 | శ్రీరామునికు | శ్రీరామునకు |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| | L. L. | ధర్మాభ్యాసము | ధర్మాభాసము |
| 55 | 19 | అర్జవము | ఆర్జవము |
| 59 | 12 | స్త్రీవ | స్త్రీ |
| 62 | 24 | నిర్వచారముగ | నిర్వ్యతిచారముగ |
| | L. L. | పానిని | వానిని |
| 63 | 2 | వ్రభుత్వ | ప్రభుత్వ |
| 64 | 16 | తెల్లవారిన | తెల్లవాఱిన |
| | L. L. | మహాదీర్యావీప్తి | మహావీర్యా దీప్తి |
| 65 | 14 | గ్రహింము | గ్రహింపుము |
| | 16 | ఆయవస్త్రముల | ఆయస్త్రముల |
| 66 | 5 | నర్వసంగ్రహణం | సర్వసంగ్రహణం |
| | 13 | ఇట్ల | ఇట్లు |
| | 18 | చేయుచుండును | చేయుచుందురు |
| | 21 | కావించును | కావింతురు |
| | 23 | కాపు | కాపు, |
| 77 | 8 | అయనను | ఆయనను. |
| | 9 | తరవాత | తరువాత |
| 81 | L. L. | స్వధర్వేణ | స్వధర్మేణ |
| 82 | 14 | దుర్లము | దుర్లభము |
| 88 | 24 | నగరునకు | సగరునకు |
| 92 | 1 | తచ్ఛుత్వా | తచ్ఛ్రుత్వా |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 93 | 8 | పంచా. ం | పంచాంగము |
| 95 | 5 | బిందుసరః | బిందుసరః |
| 98 | 14 | యీా సముద్ర | యీానసముద్ర |
| 99 | 3 | దేవతానాం | దేవానాం |
| 108 | 10 | శీర్షిక-విశ్వామిత్ర చరిత్ర ఘట్టము | |
| | 11 | చతురంగ | చతురంగ |
| 114 | 7 | జిములయ్యె | జితములయ్యె |
| 118 | 16 | శత్రుపులను | శత్రువులను |
| 121 | 2 | నియమ ఒద్ధుడై | నియమబద్ధుడై |
| 126 | 2 | బ్రహర్షిత్వము | బ్రహ్మర్షిత్వము |
| 131 | 22 | చూవు | చూపు |
| 143 | 1 | అందువననే | అందువలననే |
| 153 | 9 | Uinity | Unity |
| 159 | 7 | అగస్త్వుడు | అగస్త్యుడు |
| | 15 | మననేన | మనసేన |
| 160 | 11 | మాతాపిరులను | మాతాపితరులను |
| 194 | 17 | పట్టు పట్టులు | పట్టు పట్టుట |
| 196 | 28 | నవశ్వేత్తు | నపశ్యేత్తు |
| 198 | 1 | నరః వశ్వే | నరః పశ్యే |
| | 12 | తృద్ధాదికము | శ్రాద్ధాదికము |
| | | పిత్రాకార్యము | పితృకార్యము |
| 205 | 9 | నిజనమైన | విజనమైన |
| 221 | 7 | సుదుస్త్వజ | సుదుస్త్యజ |

Acc. No. 25069
294.592 HAN. P-2
6-15-00

శ్రీరామకృష్ణప్రభ నవంబరు 1983 - పుట 425

# శ్రీరామాయణతరంగిణి : గ్రంథపరిచయము

---

వాల్మీకిమహర్షికవి హృదయాన్ని పాఠకలోకానికి అందించాలనే శ్రీపోలూరి హనుమజ్జానకీరామశర్మగారికృషి సఫలీకృతమైన దని నిస్సంశయముగా చెప్పవచ్చును. 26-10-74 నుండి 14-12-75 తేదీ మధ్యకాలంలో నెల్లూరులో శ్రీశర్మగారు ఇచ్చిన 51 ఉపన్యాసముల ద్వారా వాల్మీకిఅభిప్రాయాలను సహేతుకముగా వివరించి అందరిఅభిమానాన్ని చూరగొన్నారు. అందలి 12 ఉపన్యాసములలోని సారాంశమును "వాల్మీకితీర్థము" రూపమున శ్రీరామాయణతరంగిణి ప్రథమ సంపుటముగా వెలువరించటం జరిగింది.

శ్రీరాముని ప్రవర్తనమునకు కామసంకల్పములు గాని, రాగద్వేషములు గాని కారణాలు కావని నిరూపించి ఆయన స్థితప్రజ్ఞుడయిన మహాయోగిగా శ్రీరామునిపాత్రను వర్ణించారు శ్రీశర్మగారు; సీతకై రాముని విలాపము దాక్షిణ్యజనితమే గాని కామాసక్తత కాదని చక్కగా నిరూపించారు. శ్రీరామాయణము చదువుచున్నప్పుడు మనకు కలిగే సందేహాల నన్నింటిని శ్రీశర్మగారు సముచితరీతిలో నివృత్తి చేసారు.

తెలుగుదనం తొణికిసలాడే నుడికారపు సొంపుతో సాగినవీరి రచన తెలుగుపాఠకహృదయాలను దోచుకుంటుం దనడంలో ఎట్టి సందేహమూ లేదు. సంస్కృతశ్లోకాలను తెనిగించడము ఒకకళ. అట్టి కళలో రచయిత సిద్ధహస్తులని నిరూపించుకున్నారు. ఈగ్రంథమున శ్రీశర్మగారిశైలి అత్యంతము మనోజ్ఞము, సరళమునై నిర్దుష్టముగా సాగింది. ముచ్చటైన ఆకృతి, చక్కని ముఖచిత్రంగల 182 పేజీల ఈ పుస్తకము వెల కేవలము 12 రూపాయలు మాత్రమే.

డి. వి. బ్రహ్మాజీ